ఈనాడు

విజయవాడ 27-7-2025 ఆదివారం సిటీ సంపుటి 51 . సంచిక 348
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00 పేజీలు 18+28
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

నకిలీ పత్రాలతో పెద్దిరెడ్డి భూకబ్జా

రూ.100 కోట్ల విలువైన 27.70 ఎకరాలు ఆక్రమణ

మాజీ సైనికులకు ఇచ్చిన డీకేటీ పట్టాలంటూ ఫోర్జరీ పత్రాల సృష్టి

భార్య పేరిట వాటి రిజిస్ట్రేషన్ ● రెవెన్యూ రికార్డులన్నీ తారుమారు

తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్లను గుప్పిట పెట్టుకుని తతంగం

గత నెల 28న ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు

తహసీల్దార్, ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు, 8 మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం సిద్ధం



ఈనాడు - అమరావతి

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. వైకాపా హయాంలో నంబర్ 2గా అపరిమిత అధికారాలు చలాయించిన ఆయన అక్రమాల్లోనూ అదే స్థాయిలో చెలరేగిపోయారు. ప్రభుత్వ, అటవీ, మఠం, చెరువు భూములు.. కనబడినదల్లా భోంచేసేశారు. వ్యవస్థల్ని, అధికారుల్ని శాసిస్తూ రూ.వందల కోట్ల విలువైన భూముల్ని ఆక్రమించేశారు. అటవీ భూముల్ని మింగేసి ఎస్టేట్లు, మఠం భూముల్ని కొట్టేసి విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నారు. ఆ కోవలోనే తిరుపతి విమానాశ్రయానికి అత్యంత సమీపంలో పెద్దిరెడ్డి చేసిన మరో భారీ భూకుంభకోణం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఏకంగా రూ.100 కోట్లకు పైగా విలువైన 27.70 ఎకరాల ప్రభుత్వ భూమిని తన భార్య స్వర్ణలత పేరుమీద పెద్దిరెడ్డి రిజిస్ట్రేషన్ చేయించేశారు. ఆరుగురు మాజీ సైనికులకు 2004-08 మధ్య ప్రభుత్వం ఆ భూముల్ని ఎసైన్ చేసినట్టు నకిలీ పత్రాలు సృష్టించారు. వారి నుంచి ఆ భూములు కొన్నట్టుగా చూపించారు. వాటిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకునేందుకు భూ వినియోగ మార్పిడి కూడా చేయించేశారు. ఆ భూములు తనవేనని.. వాటి విలువ రూ.5.25 కోట్లని 2024 ఎన్నికల అఫిడవిట్‌లో పెద్దిరెడ్డి పేర్కొనడం ఆయన తెంపరితనానికి పరాకాష్ఠ. ఆ భూముల్ని మాజీ సైనికులకు ఎసైన్ చేసినట్టుగా నకిలీ పత్రాలు సృష్టించారని రాష్ట్ర ఫోరెన్సిక్ ప్రయోగశాల (ఏపీఎఫ్ఎస్ఎల్) నిర్ధారించింది. దీంతో పెద్దిరెడ్డి ఆక్రమించుకున్న భూమిలో 15.10 ఎకరాల్ని జిల్లా యంత్రాంగం ఇప్పటికే స్వాధీనం చేసుకుంది. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండటం వంటి కారణాలతో మిగతా భూమి స్వాధీనం కోసం వేచిచూస్తోంది. ఈ కుట్రలో పెద్దిరెడ్డికి సహకరించిన ఒక తహసీల్దార్, ఇద్దరు

(మిగతా 3లో)

పరోక్షంగానైనా.. పరమాత్ముడి సేవలో..!





శ్రీనివాసరావు ఉద్యోగరీత్యా విజయవాడలో ఉంటున్నారు. తన పెళ్లిరోజు సందర్భంగా సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యకల్యాణం చేయించుకోవాలనుకున్నారు. సెలవు దొరక్కపోవడంతో సింహాచలం వెళ్లే పరిస్థితి లేదు. అయినాసరే ఆయన అదే ఆలయంలో ఆరోజు నిత్యకల్యాణం చేయించుకున్నారు.

హైదరాబాద్‌లోని బాలచంద్ర భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు హాజరై తలంబ్రాలు తెచ్చుకోవాలనుకున్నారు. కానీ ఆరోజు వెళ్లేందుకు వీలుకాలేదు. అయినా సరే ముత్యాల తలంబ్రాలు ఇంటికి వచ్చేశాయి.

...ఇదంతా మన దేవాలయాల్లో ఉన్న పరోక్ష సేవలతో సాధ్యమైంది.

ఆలయానికి వెళ్లే అవకాశం లేనివాళ్లు.. వేరే జిల్లాలోనో, రాష్ట్రాల్లోనో, విదేశాల్లోనో ఉంటున్నవాళ్లు ప్రధాన, ముఖ్య ఆలయాల్లో వివిధ పూజలు,

(మిగతా 3లో)

భారతి సిమెంట్స్‌లో సిట్ సోదాలు

- హైదరాబాద్‌లో ఆ సంస్థ కార్యాలయం, డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ ఛాంబర్, నివాసంలోనూ తనిఖీలు
- రాజ్ కెసిరెడ్డి బినామీ కంపెనీ, బూనేటి చాణక్య రెస్టారెంట్‌ల్లోనూ..
- పలు పత్రాల స్వాధీనం



హైదరాబాద్‌లోని భారతి సిమెంట్స్ కార్యాలయం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో సిట్ దూకుడు పెంచింది. వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబానికి చెందిన హైదరాబాద్‌లోని భారతి సిమెంట్స్ కార్యాలయంలో శనివారం సోదాలు నిర్వహించింది. ఇదే కార్యాలయంలో ఆ సంస్థ పూర్తి కాలపు డైరెక్టర్, మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన గోవిందప్ప బాలాజీ ఛాంబర్‌లోనూ, బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలోనూ సిట్ బృందాలు తనిఖీలు చేపట్టి పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నాయి. మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి వసూలు చేసిన ముడుపుల సొమ్మును ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి.. సహ నిందితులైన వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి (ఏ4), వి.విజయసాయిరెడ్డి (ఏ5)లతో పాటు గోవిందప్ప బాలాజీ (ఏ33)కి అందజేసేవారని, వారు ఆ సొత్తును ఎప్పటికప్పుడు నాటి ముఖ్యమంత్రి జగన్‌కు చేర్చేవారని సిట్ ఇప్పటికే ప్రాథమిక అభియోగపత్రంలో వెల్లడించింది. మద్యం ముడుపుల సొమ్మును డొల్ల కంపెనీల్లోకి రూటింగ్ చేశారని, బెంగళూరు కేంద్రంగా స్థిరాస్తి రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టించారని గోవిందప్ప బాలాజీపై అభియోగాలున్నాయి. మద్యం ముఠా సభ్యులతో ఆయన హైదరాబాద్‌లో పలుమార్లు సమావేశమైనట్లు సిట్ ఇప్పటికే సాంకేతిక ఆధారాలు

(మిగతా 3లో)



గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకరణ అనంతరం ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేలతో అశోక్ గజపతిరాజు

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు ప్రమాణం

అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

హాజరైన తెదేపా, భాజపా నేతలు

మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు ప్రయాణం

5 రకాల బస్సుల్లో ఆగస్టు 15 నుంచి అమలు

మంత్రి అచ్చెన్నాయుడు

లోపలి పేజీల్లో »

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డీఎస్పీల మృతి





మృతి చెందిన డీఎస్పీలు శాంతారావు, చక్రధరరావు

వాహనం మారినా వదలని మృత్యువు

విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా యాదాద్రి జిల్లా కైతాపురం వద్ద ఘటన

అదనపు ఎస్పీ, హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

డివైడర్‌ను ఢీకొట్టి అవతలి వైపు రోడ్డుపై పడ్డ స్కార్పియో

అదే సమయంలో వేగంగా వచ్చి ఢీకొన్న లారీ

3లో



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏఎస్పీ ప్రసాద్

విద్యార్థినిపై కత్తితో ప్రేమోన్మాది దాడి

● యువతి తండ్రి కళ్లెదుటే ఘాతుకం

అరక్కోణం, న్యూస్‌టుడే: తనను ప్రేమించలేదన్న కక్షతో యువతిపై ప్రేమోన్మాది కత్తితో దాడి చేసిన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రాణిపేట జిల్లా ఆర్కాడు తాలూకా కలవై సమీపంలోని మేల్ నత్తపాక్కం గ్రామానికి చెందిన కృతిక (19) విలాపాక్కంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మూడో ఏడాది చదువుతోంది. అగరం గ్రామానికి చెందిన కవియరసు (21) తనను ప్రేమించాలంటూ మూడేళ్లుగా ఆ యువతి వెంట పడుతున్నాడు. కృతిక శుక్రవారం సాయంత్రం అతనంటే ఇష్టం లేదని చెప్పింది. దీంతో ఆగ్రహించిన కవియరసు కత్తితో కళాశాల బస్టాప్ వద్దకు చేరుకున్నాడు. తండ్రి జయవేలుతో కలిసి యువతి ఆ బస్టాపు వద్దకు వచ్చింది. వెంటనే కవియరసు తండ్రి కళ్లెదుటే ఆమెపై కత్తితో దాడిచేసి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు శనివారం తెల్లవారుజామున నిందితుడి ఆచూకీ గుర్తించి, అరెస్టు చేశారు.

రైతులకు యూరియా అందించాలి: ఏపీ రైతు సంఘం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతున్నందున రైతులకు అవసరమైన యూరియా సహా ఇతర కాంప్లెక్స్ ఎరువులను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ కోరారు. “రాష్ట్రంలో యూరియా, ఇతర ఎరువుల కొరత ఉండటంతో దాన్ని సాకుగా చేసుకొని ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జులై నెల అవసరాలకు 1.3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు కేంద్రం అనుమతించినా.. ఇప్పటికి వరకు సుమారు 50వేల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి చేరినట్లు తెలిసింది” అని రైతు సంఘం వివరించింది.

ఇసుక నుంచి పిండుకుంది... రూ.1,860 కోట్లు

● జగన్ జమానాలో అక్రమ తవ్వకాలతో దోపిడీ

● అనుమతి లేని చోట 2,611 హెక్టార్లలో తోడేశారు

● 3.91 కోట్ల మెట్రిక్ టన్నులు తరలించారు

● ఏపీశాక్ సాయంతో లెక్క తేల్చిన గనులశాఖ



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో ప్రణాళిక ప్రకారం మద్యం కుంభకోణం ఎలా సాగిందో.. అదే స్థాయిలో వ్యూహాత్మకంగా జరిగిన మరో దందా ఇసుక తవ్వకం. రూ.1,860 కోట్లను అక్రమ తవ్వకాల్లో దోచేశారు. తొలుత ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు, విక్రయాలను చేయించి.. అది విఫలమైందంటూ గుత్తేదారు సంస్థకు వ్యాపారం కట్టబెట్టారు. తర్వాత వైకాపా పెద్దలే నేరుగా రంగప్రవేశం చేసి, జిల్లాల వారీగా సిండికేట్లు పెట్టి నదులను ఊడ్చేశారు. ప్రతినెలా రూ.కోట్లలో ‘ముఖ్య నేత’కు చేర్చేశారు. ఇసుక దోపిడీపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఎంతమేర తవ్వకాలు జరిగాయో తేల్చాలని ఆదేశించింది. ఆ అక్రమాల లెక్కలను నిగ్గుతేల్చేందుకు గనులశాఖ అధికారులు.. ఏపీ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(ఏపీశాక్) సాయం తీసుకున్నారు. ఇప్పటివరకు 3,91,73,400 మెట్రిక్ టన్నుల ఇసుకను అనుమతుల్లేని రీచ్‌ల నుంచి తవ్వి తరలించినట్లు బయటపడింది. అప్పట్లో టన్ను ఇసుకను రూ.475కు విక్రయించారు. ఆ లెక్కన దోపిడీ విలువ రూ.1,860 కోట్లు.

సాంకేతిక ఆధారాలతో పరిశీలన

రాష్ట్రవ్యాప్తంగా 2021 మే నుంచి 2024 మే వరకు ఎన్ని రీచ్‌లకు అనుమతులిచ్చారనే వివరాలను ఏపీశాక్‌కు గనులశాఖ అందించింది. ఇవి కాకుండా అక్రమ తవ్వకాలు భారీగానే ఉన్నట్లు ఏపీశాక్ గుర్తించింది.. ఆయా సంవత్సరాల్లో నెలల వారీగా శాటిలైట్ ఇమేజెస్ తీసి, జీడీ స్టీరియో డేటా, 2డీ గూగుల్ ఎర్త్‌ప్రో ఇమేజ్‌లన్నీ పరిశీలించింది. ఆ ప్రాంతాల్లో గతంలో ఎలా ఉంది? తవ్వకాలు జరిపిన మూడేళ్లలో ఏం జరిగిందో చూసింది. పెద్దఎత్తున ఇసుక తవ్వినట్లు బయటపడింది. ఆ వివరాలను గనులశాఖకు అందించింది.

అన్ని చోట్లా అదేతీరు...

● రాష్ట్రంలోని 19 జిల్లాల్లో అక్రమ తవ్వకాలు సాగాయి.

● అన్ని నదుల్లో 709 చోట్ల దందాకు పాల్పడ్డారు.

● 2,611 హెక్టార్లలో అనుమతుల్లేకుండా తవ్వేశారు.

● అత్యధికంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 21 చోట్ల 54.73 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను ఊడ్చేశారు.

● వైఎస్సార్ కడప జిల్లాలో 69 చోట్ల 47.37 లక్షల మెట్రిక్ టన్నుల్ని తవ్వి, సొమ్ము చేసుకున్నారు.

● గుంటూరు జిల్లాలో 69 చోట్ల తవ్వేసి.. 44.77 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తరలించారు.

● నెల్లూరు జిల్లాలో 34.16 లక్షలు, ఎన్టీఆర్ జిల్లాలో 33.97 లక్షలు, కృష్ణా జిల్లాలో 33.97 లక్షలు, శ్రీకాకుళం జిల్లాలో 22.70 లక్షల మెట్రిక్ టన్నుల మేర దోపిడీ సాగింది.

గుత్తేదార్లకు తాఖీదులు.. ఆపై జరిమానాలు.

ఏపీశాక్ నివేదిక ఆధారంగా జిల్లాల వారీగా ఇసుక గుత్తేదారులకు గనుల శాఖ అధికారులు తాఖీదులిచ్చి వివరణ కోరుతున్నారు. ఆ తర్వాత జరిమానా విధిస్తూ డిమాండ్ నోటీసులివ్వనున్నారు. కొంతకాలం కిందట 13 చోట్ల గుత్తేదారు సంస్థలపై కేసులు నమోదయ్యాయి. ఇప్పుడు మరికొన్ని చోట్ల ఫిర్యాదులు అందుతున్నాయి. ఏపీశాక్ సాయంతో సిద్ధంచేసిన నివేదికను గనులశాఖ అధికారులు వచ్చేనెల మొదటి వారంలో సుప్రీంకోర్టుకు సమర్పించనున్నారు. పూర్తిస్థాయి నివేదికను అందించేందుకు మరికొంత సమయం కోరనున్నట్లు తెలుస్తోంది.

‘ముఖ్య నేత’ కనుసన్నల్లో...

● వైకాపా ప్రభుత్వంలో 2019 సెప్టెంబరు నుంచి 2021 మే వరకు ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) ఇసుక వ్యాపారం చేసింది.

● ఇలాగైతే తమకు ప్రయోజనం ఉండదని భావించిన ప్రభుత్వ పెద్దలు.. ప్లాన్ మార్చారు. ‘ముఖ్య నేత’ వ్యూహం ప్రకారం ఇసుకపై మంత్రుల కమిటీని నియమించారు.

● ఏపీఎండీసీ ఇసుక తవ్వకాలు, విక్రయాల్లో విఫలమవుతోందని, కేంద్ర సంస్థకు కానీ, ప్రైవేటు సంస్థకు కానీ ఇసుక వ్యాపారాన్ని అప్పగించాలని మంత్రుల కమిటీ ద్వారా సిఫారసు చేయించారు.

● రాష్ట్రమంతా మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారు. ఉత్తరాదికి చెందిన జేపీ సంస్థకు టెండర్లు కట్టబెట్టి 2021 మేలో ఇసుక వ్యాపారాన్ని అప్పగించారు.

● టెండర్ల సమయంలో తమిళనాడుకు చెందిన ఇసుక వ్యాపారి టర్న్‌కీ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థను ఏర్పాటు చేయగా.. దానిని ఉపగుత్తేదారుగా రంగంలోకి దించారు.

● 2021 మే నుంచి 2022 ఆగస్టు వరకు ఆ సంస్థ ఇసుక తవ్వకాలు, విక్రయాలు చేసింది.

● 2022 ఆగస్టులో టర్న్‌కీ సంస్థను వెళ్లగొట్టి, వైకాపా నేతలే ఇసుక వ్యాపారం ఆరంభించారు.

● జిల్లాల వారీగా ఎవరు ఎక్కువ సొమ్ము చెల్లిస్తే.. వాళ్లకు వ్యాపారం అప్పగించారు. ఇలా జిల్లాకో సిండికేట్ ఏర్పాటైంది.

● వీరంతా ఇష్టానుసారం తవ్వి దోపిడీకి పాల్పడ్డారు. ఎవరైనా ప్రశ్నిస్తే అప్పటి సీఎం కార్యాలయ అధికారులే నేరుగా జోక్యం చేసుకునేవారు.

● 2021 నుంచి 2024 వరకు ఎంత మేర తవ్వారనే లెక్కలు లేవు.

● డిజిటల్ చెల్లింపులను స్వీకరించకుండా నగదు తీసుకొని ఇసుకను లోడ్ చేసేవారు.

● ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం తీసేసి.. మాన్యువల్‌గా బిల్లులిచ్చారు.

● అక్రమ తవ్వకాలపై దండా నాగేంద్రకుమార్ అనే వ్యక్తి వరుస ఫిర్యాదులతో జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ), సుప్రీంకోర్టుల్లో కేసులు నమోదయ్యాయి.

● అప్పటి గనులశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి... కలెక్టర్ల చేత రీచ్‌ల్లో మొక్కుబడి తనిఖీలు చేయించారు. అక్రమ తవ్వకాల్లేవంటూ నివేదికలు తయారుచేయించి ఎన్‌జీటీ, సుప్రీంకోర్టులకు ఇచ్చారు.

● కూటమి ప్రభుత్వం వచ్చాక.. నాటి ఇసుక దోపిడీపై విచారణ చేయించడంతో వాస్తవాలు బయటపడుతున్నాయి.

గోదావరిలో వరద ఉద్ధృతి

పి.గన్నవరం, దేవీపట్నం, వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: గోదావరిలో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయలు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడుమూడిలంక, జి.పెదపూడిలంక, పశ్చిమగోదావరి జిల్లా ఆనగార్లంక, పెదమల్లంక, మర్రిమూల, అయోధ్యలంక గ్రామాల ప్రజలు మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని ధవళేశ్వరం బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం ఆరు గంటలకు 4,36,328 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు.

● అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో గోదావరి ఒడ్డున ఉన్న గండిపోశమ్మ అమ్మవారి ఆలయం శనివారం సాయంత్రానికి పూర్తిగా నీట మునిగి గోపురం ఒక్కటే కనిపిస్తోంది. వరద పెరగడంతో సమీపంలోని ఇళ్లు, దుకాణాలు నీటమునిగాయి. పోశమ్మ గండి వద్ద రహదారిపై నీరు చేరడంతో దండంగి వైపు రాకపోకలు నిలిచిపోయాయి. సీతపల్లి వాగుకు వరద పోటెత్తడంతో దామనపల్లి పరసర గ్రామాల నుంచి ఇందుకూరుపేట వైపు రాకపోకలు స్తంభించాయి. పోలవరం ఎగువ కాఫర్ డ్యాం వద్ద గోదావరి పరవళ్లుతొక్కుతోంది. పి.గొందూరు, నాగలపల్లి గ్రామాల మధ్య రహదారిపైకి వరద చేరింది.

● గోదావరి వరద క్రమేపీ పెరుగుతుండడంతో ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని బోళ్లపల్లి-యడవల్లి గ్రామాల మధ్య ఎద్దువాగు వంతెన నీట మునిగింది. దీంతో శనివారం ఉదయం నుంచి 16 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



అల్లూరి సీతారామరాజు జిల్లా పోశమ్మగండిలో నీటమునిగిన ఇళ్లు, దుకాణాలు

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద



శ్రీశైలం జలాశయం గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి స్పిల్ వే ద్వారా 53,764 క్యూసెక్కులు, కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాలల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 66,244 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,02,034 క్యూసెక్కుల నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 882.40 అడుగులు, నీటినిల్వ 201.1205 టీఎంసీలుగా నమోదైంది.

నకిలీ పత్రాలతో పెద్దిరెడ్డి భూకబ్జా

(మొదటి పేజీ తరువాయి)

సబ్‌రిజిస్ట్రార్లు సహా 11 మంది అధికారులపై అభియోగాలు నమోదు చేసింది. రెవెన్యూ రికార్డుల తారుమారు, ఫోర్జరీపై ఏర్పేడు తహసీల్దార్ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గత నెల 28న కేసు నమోదైంది.

పెద్దిరెడ్డి మార్కు కబ్జా

ఏర్పేడు మండలం వికృతమాల గ్రామ పరిధిలోని 524/1, 533, 534, 535, 536/1, 537, 537/1 సర్వే నంబర్లలో 27.70 ఎకరాల భూమిని 2004, 2006, 2007, 2008 సంవత్సరాల్లో ఆరుగురు మాజీ సైనికులకు ప్రభుత్వం ఎసైన్ చేసినట్టుగా నకిలీ పత్రాలు సృష్టించారు. కానీ 2022 వరకు అవి వెబ్‌ల్యాండ్‌లో నమోదే కాలేదు. 2022 మార్చి 29న ఆ సర్వే నంబర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. రెండు రోజులకే మార్చి 31న రిజిస్ట్రేషన్ కోసం తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. ఏప్రిల్ 30న రిజిస్ట్రేషన్, సెప్టెంబరు 22న మ్యుటేషన్ చేసేశారు.

తహసీల్దార్‌కు లేఖ.. ఆయన క్లియరెన్స్, రిజిస్ట్రేషన్.. కొన్ని గంటల్లోనే..!

అప్పట్లో పెద్దిరెడ్డి అడుగులకు మడుగులొత్తిన అధికారులు ఆయన హుకుం జారీచేసిందే తడవుగా రాకెట్ వేగంతో స్పందించారు. ఆ భూములపై ఏమైనా అభ్యంతరాలున్నాయేమో చెప్పాలంటూ తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ ఏప్రిల్ 30న ఏర్పేడు తహసీల్దార్‌కు లేఖ రాశారు. అభ్యంతరాలేమీ లేవంటూ.. క్షణం కూడా ఆలస్యం చేయకుండా తహసీల్దార్ ప్రత్యుత్తరమిచ్చారు. ఆ భూముల్ని పెద్దిరెడ్డి భార్య పేరిట అదేరోజు సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసేశారు. సాధారణ ప్రజలను రోజులు, నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పించుకునే అధికారులు పెద్దిరెడ్డికి సాగిలపడి కొన్ని గంటల్లోనే ఈ ప్రక్రియంతా పూర్తి చేసేశారు.

అధికారులపై అభియోగాలు.. ఫోర్జరీ పత్రాల సృష్టిపై కేసు

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ కుట్రలో పాత్రధారులైన ఒక తహసీల్దార్, ముగ్గురు మండల సర్వేయర్లు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు వీఆర్వోలు, ఒక విలేజ్ సర్వేయర్, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, ఒక సీనియర్ అసిస్టెంట్‌పై అభియోగాలు నమోదు చేస్తూ 2025 మార్చి 6న ప్రభుత్వం ఛార్జ్ మెమోలు జారీ చేసింది. వారిపై త్వరలో క్రమశిక్షణ చర్యలు చేపట్టనుంది. ఈ కుట్రపై ఏర్పేడు తహసీల్దార్ ఫిర్యాదు మేరకు జూన్ 28న ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ డీకేటీ పట్టాలు పుట్టించారని, గ్రామ రికార్డులు, మ్యాప్‌లకు సంబంధించి అసలు సర్వే నంబరు 19లో ఆ సర్వే నంబర్లేవీ లేవని, అవి నకిలీ పత్రాలని ఫోరెన్సిక్ ప్రయోగశాల కూడా నిర్ధారించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిబంధనల్ని నేలరాసేశారు

- మాజీ సైనికోద్యోగులకు ప్రభుత్వం భూమి కేటాయించాలంటే జిల్లా సైనిక సంక్షేమ అధికారి ద్వారానే దరఖాస్తు వెళ్లాలి. ఈ భూములకు సంబంధించి అలా దరఖాస్తు వెళ్లిన దాఖలాల్లేవు.
- 1963 నాటి జీవో నం.743 ప్రకారం.. మాజీ సైనికులకు భూములు కేటాయించేటప్పుడు వారి సర్వీసు రికార్డులు, ఐడీ కార్డులు, పింఛను వివరాలు, డిశ్చార్జ్ రికార్డు వంటివన్నీ ఎసైన్‌మెంట్ ఫైల్స్‌లో పొందుపరచాలి. ఇక్కడ అవేమీ అందుబాటులో లేవు.
- మాజీ సైనికుల ఉపాధి కోసం ప్రభుత్వం కేటాయించిన భూముల్ని పదేళ్ల తర్వాత మాత్రమే వారు విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. అప్పుడు కూడా జిల్లా కలెక్టర్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) తీసుకోవాలి. అలాంటి భూములపై ఉత్తర, ప్రత్యుత్తరాలు, వివరణలు జిల్లా రిజిస్ట్రార్, కలెక్టర్ స్థాయిలో జరుగుతాయి.
- సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్లు వారికి లేని అధికారాల్ని చేతుల్లోకి తీసేసుకుని, నకిలీ పత్రాల్ని రిజిస్ట్రేషన్ చేసేశారు. నేరపూరిత కుట్రలో భాగస్వాములయ్యారు.

నకిలీ పత్రాలని నిగ్గు తేల్చారిలా..

మాజీ సైనికులకు ప్రభుత్వం భూములు ఎసైన్ చేసినట్టుగా చెబుతున్న పత్రాలు నకిలీవని, రెవెన్యూ రికార్డుల్నీ తారుమారు చేశారని జిల్లా యంత్రాంగం నిర్ధారించింది. ఆ పత్రాల్ని ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలకు పంపగా నకిలీవని ల్యాబ్ నిర్ధారించింది.

- మాజీ సైనికులకు ఇచ్చినట్టుగా చెబుతున్న డీ పట్టాలకు సంబంధించి ఒకే అధికారి, ఒకే రోజు జారీ చేసినట్టుగా ఉన్న పత్రాల్లోని సంతకాల్లో తేడా ఉంది.
- వికృతమాల గ్రామంలోని 19వ నంబరు బ్లాక్‌ను సబ్‌డివిజన్ చేసి.. 524/1, 533, 534, 535, 536/1, 537, 537/1 సర్వే నంబర్లను ఏర్పాటు చేయలేదు. 19వ బ్లాక్ నుంచి విభజించి కేటాయించిన సర్వే నంబర్ 505 మాత్రమే.
- మాజీ సైనికులకు కేటాయించినట్లుగా చెబుతున్న సర్వే నంబర్లు అడంగల్‌లో వేరే ఇంక్‌తో రాసినట్టుగా ఉంది. 2022 వరకు ఆ సర్వే నంబర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయకపోవడాన్ని బట్టి అడంగల్‌ను తారుమారు చేశారని జిల్లా యంత్రాంగం నిర్ధారణకు వచ్చింది.
- ఆర్ఓఆర్-1బి రిజిస్టర్‌లో.. మాజీ సైనికులకు కేటాయించినట్లు చెబుతున్న సర్వే నంబర్లకు సంబంధించిన పేజీలు కొత్తగా జతచేసినట్టు కనిపించడం అనుమానాలకు తావిస్తోంది. ఆ రిజిస్టర్‌లోని ఇతర పత్రాలతో పోల్చితే వాటి రంగు, నాణ్యత వేరుగా ఉన్నాయి. వాటికి ముందున్న ఖాతా నంబర్లలోని సంతకాల్ని... ఈ పత్రాల్లో ఫోర్జరీ చేసినట్టుగా తెలుస్తోంది.
- రిజిస్ట్రేషన్ చట్టంలోని 22(ఎ) నుంచి ఇ వరకు ఉన్న సెక్షన్ల ప్రకారం నిషేధిత భూముల జాబితాను ప్రభుత్వం 2017లో అన్ని జిల్లాల రిజిస్ట్రార్లకు పంపింది. దానిలో సర్వే నంబరు 524 ప్రస్తావన తప్ప, మిగతా సర్వే నంబర్ల గురించిన వివరాల్లేవు. 524కి సంబంధించి కూడా టి.జయమ్మ అన్న పేరుతో ఉందే తప్ప... పెద్దిరెడ్డి ముఠా క్లెయిమ్ చేస్తున్నట్టుగా డి.సుబ్రహ్మణ్యం అన్న పేరు లేదు. కాబట్టి 2017-18కి ముందు ఆ సర్వే నంబర్లు లేనేలేవని జిల్లా యంత్రాంగం నిర్ధారణకు వచ్చింది.

కోర్టుకెళ్లిన పెద్దిరెడ్డి

పెద్దిరెడ్డి భార్య స్వర్ణలత పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమిలో 15.10 ఎకరాల్ని జిల్లా యంత్రాంగం స్వాధీనం చేసుకుని, బోర్డులు ఏర్పాటుచేసింది. దానిపై స్వర్ణలత హైకోర్టులో మూడు రిట్ పిటిషన్లు దాఖలుచేశారు. విచారించిన కోర్టు యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది. ఆ భూమిలో 12.60 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఉట్టి జయరామయ్య, కె.రెడ్డెమ్మ కూడా కోర్టులో పిటిషన్లు వేశారు.

- 524/1లో తనకు 2.25 ఎకరాల్ని ప్రభుత్వం ఎసైన్ చేసిందని డి.సుబ్రహ్మణ్యం చెబుతున్న భూముల్ని 2022 మార్చి 29న నిషిద్ధ జాబితా నుంచి తొలగిస్తూ అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ భూములకు సంబంధించిన డీకేటీ ఫైల్స్ అందుబాటులో లేవు. ప్రభుత్వం 2017లో జిల్లా రిజిస్ట్రార్లకు పంపిన నిషిద్ధ భూముల జాబితాలో 524/1 సర్వే నంబరుకు సంబంధించి టి.జయమ్మ పేరు ఉంది. దీని వెనుక ఉన్న మతలబేంటి? అప్పటి జిల్లా కలెక్టర్ ఏ ప్రాతిపదికన నిషిద్ధ జాబితా నుంచి తొలగించారన్న అంశంపైనా దర్యాప్తు జరుగుతోంది.

భారతి సిమెంట్స్‌లో సిట్ సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

సేకరించింది. ఈ సోదాల్లో సొమ్ము ఎక్కడెక్కడి నుంచి ఎలా తరలించారు? భారతి సిమెంట్స్‌లోకి అవి మళ్లాయా తదితర అంశాలపై వివరాలు సేకరించేందుకు దుబ, ఎవరెవరితో, ఎప్పుడెప్పుడు భేటీలు జరిగాయో తేల్చేందుకు సిట్ ఈ సోదాలు జరిపింది. కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లోని సీసీ టీవీ ఫుటేజీను స్వాధీనం చేసుకుంది.



సోదాలు నిర్వహించిన రిసోర్స్ వన్ ఐటీ సొల్యూషన్స్ కార్యాలయం ఉన్న భవనం

- రాజ్ కెసిరెడ్డి భార్య సోదరి పైరెడ్డి మేఘన ప్రియదర్శిని రెడ్డి ఎండీగా, ఆమె తల్లి పైరెడ్డి సుజాతరెడ్డి డైరెక్టర్‌గా ఉన్న రిసోర్స్ వన్ ఐటీ సొల్యూషన్స్ కార్యాలయంలో, మద్యం కుంభకోణం నిందితుడు బూనేటి చాణక్య (ఏ8) యజమానిగా ఉన్న టీ గ్రిల్స్ రెస్టారెంట్ కార్యాలయంలోనూ సిట్ బృందాలు సోదాలు చేశాయి. 2019 నుంచి 2024 మధ్య వీటిల్లో ఈ సంస్థల సంబంధించిన ఆర్థిక లావాదేవీల వివరాలు, పత్రాలను స్వాధీనం చేసుకున్నాయి. వాటన్నింటినీ విశ్లేషించి, మద్యం కుంభకోణం ద్వారా సమకూరిన నల్లధనాన్ని చలామణిలోకి తెచ్చేందుకు ఈ కంపెనీ కేంద్రంగా లావాదేవీలు జరిగాయని సిట్ అనుమానిస్తోంది.

తనిఖీలు ఎక్కడంటే..

1. భారతి సిమెంట్స్ కార్యాలయం, గోవిందప్ప బాలాజీ కార్యాలయం: బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10, హైదరాబాద్
2. గోవిందప్ప బాలాజీ నివాసం, బుర్రి రెసిడెన్సీ, రోడ్డు నంబర్ 11, సిటీ సెంటర్, బంజారాహిల్స్, హైదరాబాద్
3. రిసోర్స్ వన్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నంబర్ 26, 27, ఖాజాగూడ- నానక్‌రామ్‌గూడ రోడ్డు, ప్రశాంత్ హిల్స్, మణికొండ, హైదరాబాద్
4. టీ గ్రిల్స్ రెస్టారెంట్, హైదరాబాద్.

ఏనుగుల దాడిలో రైతు దుర్మరణం

సోమల, న్యూస్‌టుడే: ఏనుగుల దాడిలో రైతు దుర్మరణం చెందిన ఘటన చిత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. సోమల మండలం కొత్తూరుకు చెందిన రామకృష్ణంరాజు (45) శనివారం తన పొలం వద్దకు వెళ్లి చీకటి పడినా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు కంగారు పడి పొలం వద్ద చూడగా ఆయన రక్తపు మడుగులో ఉండటాన్ని గుర్తించారు. సమీపంలో ఉన్న అడవుల నుంచి ఏనుగులు వచ్చి తొక్కడంతో మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య రాధిక, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.




రామకృష్ణంరాజు

పరోక్షంగానైనా.. పరమాత్ముడి సేవలో..!

(మొదటి పేజీ తరువాయి)

వ్రతాలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు, కల్యాణాలు వంటివి చేయించుకునేందుకు వీలవుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని దేవాదాయశాఖలు ఈ అవకాశం కల్పిస్తున్నాయి.



ఏం చేయాలంటే...

- ఏపీ దేవాదాయశాఖకు చెందిన అధికారిక వెబ్‌సైట్ https://aptemples.ap.gov.in ద్వారా 'సేవలు పొందొచ్చు.
- ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లాక 'సేవ అండ్ దర్శనం' అనే ఆప్షన్ ఉంటుంది. దాన్ని క్లిక్ చేస్తే ప్రత్యక్ష, పరోక్ష సేవ బుకింగ్‌కు ఆప్షన్ వస్తుంది. అందులో పరోక్ష సేవ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి.
- ఆ తర్వాత పరోక్ష సేవలు అందుబాటులో ఉన్న ఆలయాల వివరాలు వస్తాయి.
- ఆలయాన్ని ఎంపిక చేసుకుంటే, అక్కడ పరోక్ష సేవ కింద లభించే పూజలు, సేవలు, కల్యాణాలు, అర్చనలు కనిపిస్తాయి. వాటికి ఎంత చెల్లించానేది కూడా చూపిస్తుంది.
- సంబంధిత 'సేవను ఎంపిక చేశాక.. తేదీ, పూజ చేయించుకునేవారి పేర్లు, గోత్రాలు, చిరునామా, ఫోన్ నంబరు తదితర వివరాలు నింపాలి. చివర్లో ఆ పూజకు నిర్దేశిత ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి.
- ఇలా బుకింగ్ జరిగిన పరోక్ష సేవలను.. ఆయా ఆలయాల్లో సంబంధిత తేదీల్లో వారి పేరిట చేస్తారు. ఆయా అర్చకులు, పూజలు తదితరాలు చేస్తున్నప్పుడు పరోక్ష సేవ బుక్ చేసుకున్నవారి గోత్ర, నామాలు చదువుతారు.
- కొన్ని ఆలయాలు ఆయా పూజలను యూట్యూబ్ ఛానల్ ద్వారా లైవ్‌లో చూసేందుకు కూడా అవకాశం కల్పిస్తున్నాయి.

చాలా ఆలయాల్లో...

ఏపీలోని ప్రధాన ఆలయాలైన శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి, విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి, కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి, శ్రీకాళహస్తీశ్వరాలయం, ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి, అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి, సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలతో పాటు.. అంతర్వేది, చినకాకాని, మోపిదేవి, వాడపల్లి, అయినవిల్లి, విశాఖ కనకమహాలక్ష్మి, కసాపురం ఆంజనేయస్వామి వంటి మరో 20 ముఖ్య ఆలయాల్లో కూడా సేవలు అందుబాటులో ఉన్నాయి.

తెలంగాణలో..

- తెలంగాణలో మీ-సేవతో పాటు, దేవాదాయశాఖ ఆయా ఆలయాల వెబ్‌సైట్ల ద్వారా పలు రకాల సేవలు పొందొచ్చు. తపాలశాఖ ద్వారా కూడా ఈ అవకాశం ఉంది.
- యాదగిరిగుట్టలో https://yadagiriguttatemple.telangana.gov.in/ ద్వారా శాశ్వత సహస్రనామార్చన, అభిషేకం, కల్యాణాల్లో పరోక్షంగా పాల్గొనే అవకాశం ఉంది.
- భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో విరాళాలకు ఈ-హుండీ, అన్నదానానికి ఈ-డొనేషన్లతో పాటు అభిషేకం, అర్చన వంటి సేవల్లో పరోక్షంగా పాల్గొనవచ్చు. /https:/bhadradritemple.telangana.gov.in/ వెబ్‌సైట్‌లో వివరాలుంటాయి. భద్రాచలం ఆలయ కల్యాణ తలంబ్రాలను ఇంటికే తెప్పించుకునే అవకాశాన్ని అటు ఆర్టీసీతో పాటు ఇటు తపాలశాఖ కల్పిస్తోంది. ఆర్టీసీ సిబ్బంది, ఏజెంట్ల వద్ద లేదా పోస్టాఫీసులో బుక్ చేసుకుంటే సరిపోతుంది.
- బాసర సరస్వతి, వేములవాడ రాజన్న, వరంగల్ భద్రకాళీ, హైదరాబాద్ పెద్దమ్మగుడి, కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లోనూ పరోక్షంగా సేవలలో పాల్గొనే అవకాశం ఉంది.

-ఈనాడు, అమరావతి, హైదరాబాద్

కర్నూలు జీజీహెచ్‌లో రూ.14.15 కోట్లతో విశ్రాంతి భవనం

ఈనాడు, అమరావతి: కర్నూలు జీజీహెచ్‌లో రోగుల సహాయకుల కోసం రూ.14.15 కోట్లతో విశ్రాంతి భవనం నిర్మించనున్నారు. 'విశ్రామ్ సదన్' పేరుతో నిర్మించే ఈ భవనానికి అయ్యే ఖర్చును భరించడానికి సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేసే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పీజీసీఐ) ముందుకొచ్చింది. ఈ ప్రతిపాదనను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆమోదించారు. 150 పడకల సామర్థ్యం ఉండే ఈ భవనంలో కార్యాలయం, రిక్రియేషన్ వసతులు, పంప్ హౌస్, రక్షిత నీటి పథకం, జనరేటర్, సౌర ఫలకాలు అందుబాటులోకి తెస్తారు. కర్నూలు ఆసుపత్రిలో సహాయకుల కోసం ప్రస్తుతం ఉన్న మూడు షెడ్లలో కనీస సౌకర్యాలు లేవని ఫిర్యాదులు రావడంతో సీఎస్ఆర్ కింద ఎకరం స్థలంలో ఈ భవనం నిర్మించాలని నిర్ణయించారు.

గ్రహం అనుగ్రహం

27-7-2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం

తదియ: రా. 11-25 తదుపరి చవితి

మఖ: సా. 6-02 తదుపరి పుబ్బ

వర్జ్యం: ఉ. 5-46 నుంచి 7-24 వరకు తిరిగి రా. 2-22 నుంచి 4-03 వరకు

అమృత ఘడియలు: సా. 3-35 నుంచి 5-13 వరకు

దుర్ముహూర్తం: సా. 4-49 నుంచి 5-40 వరకు


రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు

సూర్యోదయం: ఉ.5.40; సూర్యాస్తమయం: సా.6.32

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	34.8	27.9
తిరుపతి	34.4	24.1
కడప	33.0	26.0
ఒంగోలు	32.9	27.0
తాడేపల్లిగూడెం	32.6	26.0
నరసాపురం	31.8	24.5
అనంతపురం	31.7	23.3
రాజమహేంద్రవరం	31.5	24.5
విశాఖపట్నం	31.4	26.0
శ్రీకాకుళం	31.0	27.0
గుంటూరు	31.0	26.0
విజయనగరం	31.0	25.0
కర్నూలు	30.5	25.1
విజయవాడ	30.5	24.8
నల్గొండ	28.0	22.4
ఆదిలాబాద్	27.3	23.2
సూర్యాపేట	26.0	25.0
హైదరాబాద్	24.9	22.1
నిజామాబాద్	24.8	23.2
మెదక్	24.6	19.8

ఇదీ సంగతి!



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డీఎస్పీల మృతి

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీసు ఉన్నతాధికారులు ప్రయాణిస్తున్న వాహనం అకస్మాత్తుగా బ్రేక్‌డౌన్ అయ్యింది. డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం జరగకుండా బయటపడ్డారు. మరో వాహనం తెప్పించుకొని తిరిగి ప్రయాణం మొదలుపెట్టగా మళ్లీ ఎదురొచ్చిన మృత్యువును ఈసారి తప్పించుకోలేకపోయారు. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కైతాపురం వద్ద శనివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఏపీకి చెందిన ఇద్దరు డీఎస్పీలు మృతిచెందగా మరో అదనపు ఎస్పీ, ఓ హెడ్‌కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం, వీవీఐపీ సెక్యూరిటీ వింగ్‌లో పనిచేస్తున్న ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ కేడీఎంవీఆర్ ప్రసాద్(56), ఇంటెలిజెన్స్ డీఎస్పీలు జల్లు శాంతారావు(56), మాకా చక్రధరరావు(52) శుక్రవారం రాత్రి 9:30 గంటల సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు విధుల్లో భాగంగా పోలీసు శాఖకు చెందిన వాహనంలో బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో కొర్లపహాడ్ టోల్‌ప్లాజా సమీపంలోకి చేరుకోగానే వీరి వాహనం బ్రేక్‌డౌన్ అయ్యింది. హైదరాబాద్‌లోని ఏపీ పోలీస్ ఇంటెలిజెన్స్ కార్యాలయానికి సమాచారమివ్వగా.. అక్కడి నుంచి హెడ్‌కానిస్టేబుల్ రెడ్డిచర్ల నర్సింహరాజు(54) మరో వాహనం తీసుకొచ్చారు. దాంట్లో ముగ్గురు ఉన్నతాధికారులను ఎక్కించుకొని హైదరాబాద్‌కు బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున 4:45 నిమిషాలకు కైతాపురం వద్దకు రాగానే ముందున్న వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో డ్రైవర్ నర్సింహరాజు దాన్ని తప్పించబోయి డివైడర్‌ను బలంగా ఢీకొట్టారు. దీంతో వాహనం ఎగిరి అవతలి వైపు విజయవాడ మార్గంలో పడింది. అదే సమయంలో విజయవాడ వైపు వెళ్తున్న సిమెంటు లారీ ఈ వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో శాంతారావు, చక్రధరరావు అక్కడికక్కడే మృతిచెందారు. ప్రసాద్, నర్సింహరాజు తీవ్రంగా గాయపడగా మొదట చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి, అనంతరం హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. శాంతారావు కుమారుడు బాలగంగాధర్ తిలక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

చక్రధరరావు పాలకొల్లు వాసి

పాలకొల్లు, పోలాకి, న్యూస్‌టుడే: ప్రమాదంలో మృతి చెందిన డీఎస్పీల్లో ఒకరైన మేకా చక్రధరరావు స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు. 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్‌లో ఎస్సైగా పోలీసు శాఖలో చేరి.. క్రమశిక్షణగా పని చేస్తూ డీఎస్పీ స్థాయికి చేరారు. ప్రస్తుతం విజయవాడలోని భద్రతా విభాగంలో పనిచేస్తున్నారు. చక్రధరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకు

డీఎస్పీ జల్లు శాంతారావు(56)ది శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం డోల గ్రామం. పోలాకి, నరసన్నపేటలో చదివారు. శాంతారావుకు పోలీస్ శాఖలో చేరాలనే లక్ష్యం తొలి నుంచి ఉండేదని మిత్రులు గుర్తు చేసుకున్నారు. ఆయన 1992లో ఏపీఎస్పీలో కానిస్టేబుల్‌గా చేరారు. 1996లో ఎస్సై పరీక్ష రాసి విజయం సాధించి, కొండాపూర్‌లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు తిలక్ హైదరాబాద్‌లో ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. కొద్ది నెలల కిందట కుమారుడి వివాహం చేశారు. రెండో కుమారుడు శ్రీరామ్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

- అదనపు ఎస్పీ ప్రసాద్ స్వస్థలం రాజమహేంద్రవరం, డ్రైవర్ నర్సింహరాజుది అన్నమయ్య జిల్లా రాజంపేట. వీరు హైదరాబాద్‌లోని ఏపీ పోలీస్ ఇంటెలిజెన్స్ కార్యాలయంలో పని చేస్తుండటంతో ఇక్కడే కుటుంబంతో నివాసం ఉంటున్నారు.

చంద్రబాబు, పవన్ విచారం

ఈనాడు, అమరావతి: రోడ్డు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన డీఎస్పీలు చక్రధరరావు, శాంతారావు మృతి చెందిన ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. డీఎస్పీలు మృతిచెందడం బాధాకరమని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇద్దరు డీఎస్పీల మృతిపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ సీఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

డీఎస్పీల మృతి బాధాకరం: హోం మంత్రి అనిత

భవానీపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో డీఎస్పీలు చనిపోవడం బాధాకరమని హోం మంత్రి అనిత అన్నారు. చక్రధరరావు, శాంతారావు మృతదేహాలను రోడ్డు మార్గంలో విజయవాడ మీదుగా వారి స్వస్థలాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ వద్దకు రాగానే.. హోంమంత్రి అనిత, పోలీసు ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చిన హోంమంత్రి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



చక్రధరరావు, శాంతారావు మృతదేహాల వద్ద నివాళులు అర్పిస్తున్న హోం మంత్రి అనిత, డీసీపీ సరిత, పోలీసు అధికారులు, సిబ్బంది

తిరుమలలో చిరుత కలకలం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో బాలాజీనగర్, తితిదే బ్యాటరీ స్టేషన్ ప్రాంతాల్లో శనివారం రాత్రి చిరుతపులి సంచారం కలకలం సృష్టించింది. అటుగా వెళ్తున్న వాహనదారులు భయాందోళనలకు గురయ్యారు. కొంతసేపటికి చిరుత అడవిలోకి వెళ్లిపోయినట్లు తితిదే డీవైఆర్వో తెలిపారు.

ఈనాడు
బలికోరుతున్న ప్రేమలు

శ్రీవారి వక్షస్థలంపై అలరారే కస్తూరి- అలమేల్మంగ లేత పెదవులపై మెరిసినట్లు తోచింది అన్నమయ్యకు. 'భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుకదా!' అనుకున్నాడు. 'పెరుగు బాగుంటే మరో రెండు ముద్దలు కలుపుకొంటారుగాని, ఇలా చిక్కగా బుగ్గలకు పులుముకుంటారా!' అని ఆట పట్టించింది ఆడపడుచు. 'ఆయన పెరుగన్నం సరిగా తినలేదు వొదినా అందుకని...' సిగ్గుపడుతూ నసిగింది మునిమాణిక్యంగారి కాంతం. 'ముసురేసిందంటే పైన- నసి చెడినట్టుంటది లోన' అని గోముగా గొణిగింది నండూరివారి నాయిక. ఎంతటి మధుర మనోజ్ఞ ముగ్ధ సుకుమార శృంగార భావనలవి! ఎలాంటి అనురాగ దీవెనలవి! ఇప్పుడేవి? ప్రేమ తన లాలిత్యాన్ని కోల్పోయింది. గట్లు తెగిన దాహాలు, గడపలు దాటిన మోహాలు కూడబలుక్కుని ప్రేమను మోసం చేస్తున్నాయి. కట్టుబాట్లను కొట్టి పారేస్తున్నాయి. ప్రేమకూ కామానికీ మధ్య లక్ష్మణగీతను చెరిపేస్తున్నాయి. ప్రేమకు అర్థాన్నే మార్చేస్తున్నాయి. 'గజానికో గాంధారి కొడుకు- ఈ గాంధీగారి దేశంలో' అన్న తిలక్ పలుకును- అతడు, 'ఉప్పే ఉప్పదనాన్ని కోల్పోతే దాన్ని ఉప్పగా చేయడం ఎలా?' అంటున్న హోలీబైబిల్ ఆవేదనను- ఆమె... నిరూపిస్తున్నారు. ఇద్దరూ కలిసి మహిమాన్వితమైన ప్రేమను అవమానిస్తున్నారు.

మనసు తనకంటూ ఆశించే ప్రత్యేక గుర్తింపు పేరే ప్రేమ! ఉన్నచోట దొరక్కపోతే దొరికేచోట దానికోసం వెతుకులాడటం మనసు స్వభావం. అమ్మానాన్నల నుంచి దక్కకపోతే- బయట, భార్యాభర్తల మధ్య లోపిస్తే పరాయి వ్యక్తుల దగ్గర- ఆ తరహా ప్రత్యేక గుర్తింపు కోసం మనసు తహతహలాడుతుంది. ఆధునిక కాలంలో యువతీ యువకులనూ, దంపతులనూ వేధిస్తోంది ఒక్కటే- దాని పేరు ప్రేమరాహిత్యం! ఆ దుస్థితి ఎలాంటిదంటే- గాలివాన కారణంగా జనంతో కిక్కిరిసిన పూరిగుడిసె లాంటిది. ఊపిరాడక బయటపడాలని లోపలివారు, తడిసిపోతున్నాం, లోపలికి చొరబడాలని బయటవారు పడే ఆరాటం లాంటిది. వర్షం ఆగిపోవడం ఒక్కటే దానికి పరిష్కారం. 'నా తండ్రి గురించి గుర్తున్నదల్లా నన్ను చావగొట్టడమే! కొట్టి కొట్టీ ఆయాసంతో ఆపేవాడు. మా నాన్నే లేకుంటే- ఈ ప్రపంచం ఎంతో అందమైనదే' అని చలం ఆత్మకథలో రాసుకున్నారు. ఆఖరికి రమణమహర్షి చెంత దొరికింది చలానికి పరిష్కారం. మరి దొరకనివారి సంగతి?

'యతిగీతము'లో వివేకానంద స్వామి అంటారు- 'స్వేచ్ఛను ఎక్కడ వెతుకుతావు? నిన్ను ఈడ్చుకుపోతున్న పలుపు తాడును గట్టిగా పట్టుకున్నది నీ హస్తమే! దాన్ని విడిచిపెట్టడం నేర్చుకో' అని! ఈ ఆధ్యాత్మిక పరిష్కారం అందరికీ నచ్చదు. దాంతో ప్రేమరాహిత్యానికి చెందిన నిస్పృహ- హింసను ఆశ్రయిస్తుంది. దాన్నుంచి కాపాడేది- చక్కని కుటుంబ వ్యవస్థ. ప్రేమ పూరితమైన పెంపకం- పరిష్కార మార్గాలు తెలిసిన మనసును రూపొందిస్తుంది. మొదట్లో చెప్పుకొన్న మనోజ్ఞ భావాలకు మనసు కొలువవుతుంది, నెలవవుతుంది. అలా ప్రేమ ప్రేమగా ఉండిపోతే ఊపిరిపోస్తుంది. శూర్పణఖ మనసులో మాదిరి కామమై లోభమై మోహమై కడకు ఉన్మాద స్థితికి చేరితే ఉసురుతీస్తుంది. ఈమధ్య పెరిగిపోతున్న హింసాత్మక ప్రవృత్తి నిజానికొక ప్రమాదకరమైన సామాజిక రుగ్మత. సామాజిక మాధ్యమాల పుణ్యమా అని అది అంటువ్యాధిలా వ్యాపిస్తోంది. జీవితాన్ని జైలు పాల్జేసుకోవడం తప్ప దానివల్ల బావుకునేదేమీ ఉండదు!




నన్ను నేను ఆటగాడిగా కన్నా కళాకారుడిగా భావిస్తాను. అప్పుడే నేను స్వేచ్ఛగా ఎలాంటి ఒత్తిళ్లూ లేకుండా ఆడగలుగుతాను. ఆటని గెలవడానికే కాదు, ఆస్వాదించడానికి ఎక్కువ ఆడుతాను. అప్పుడే ఇంకా ఇంకా బాగా ఆడాలనిపిస్తుంది.

– పంకజ్ అడ్వాణీ, బిలియర్డ్స్ క్రీడాకారుడు

ఆత్మజ్ఞాన నిధి

మనిషి శరీరం రథం అనుకుంటే జీవాత్మ రథికుడు. బుద్ధి సారథి. మనసు పగ్గాలు, ఇంద్రియాలు రథాన్ని నడిపే గుర్రాలు. విషయాలు అవి నడిచే మార్గాలు... అని తెలుసుకోమంటుంది కఠోపనిషత్తులోని ప్రథమాధ్యాయం. ఆత్మ, శరీరం, బుద్ధి, మనసు, ఇంద్రియాల మధ్య సంబంధాన్ని రథాన్ని ఉపమానంగా చేసుకుని నచికేతుడికి చెప్పాడు యమధర్మరాజు. ఆత్మజ్ఞానానికి సంబంధించి ముఖ్యమైనదిగా కఠోపనిషత్తు గురించి చెబుతారు. ఇందులో రెండు అధ్యాయాలు, ప్రతి అధ్యాయం మూడు భాగాలతో మొత్తం 120 శ్లోకాలు ఉంటాయి. ఇది కృష్ణ యజుర్వేదానికి చెందిన ముఖ్యమైన ఉపనిషత్తు. దీంట్లోనే యమధర్మరాజుకు నచికేతుడికీ మధ్య నడిచిన సంభాషణ కనిపిస్తుంది.


నచికేతుడు వాజశ్రవుడి(ఉద్దాలకుడు) కుమారుడు. ఒకసారి వాజశ్రవుడు యజ్ఞం చేసిన అనంతరం ఏమాత్రం పాలివ్వలేని ముసలి గోవులను దానమిస్తాడు. అది చూసిన నచికేతుడు తనను కూడా ఎవరికైనా దానమిస్తే వారికి తాను ఉపయోగపడవచ్చని అనుకుంటాడు. తండ్రి దగ్గరికి వెళ్లి 'నన్నెవరికి ఇస్తావు' అని అడుగుతాడు. అతడు సమాధానం చెప్పకపోతే రెట్టించి అడగడంతో విసిగిపోయిన వాజశ్రవుడు కోపంతో 'నిన్ను యముడికి దానం చేశాను వెళ్లు' అంటాడు. తండ్రి మాట జవదాటని నచికేతుడు యమపురికి వెళ్తాడు. అక్కడ యమధర్మరాజు లేకపోవడంతో ఆయనకోసం మూడు రాత్రులు నిరాహారంతో ఎదురుచూస్తాడు. తిరిగొచ్చిన యమధర్మరాజు తన ఇంటి ముందున్న నచికేతుణ్ని చూసి మూడు రాత్రులు ఉపవాసమున్నాడని తెలుసుకుని మూడు వరాలు కోరుకోమంటాడు. తండ్రి కోపం తగ్గి, తిరిగి తనను ఆదరించాలని మొదటి వరం కోరతాడు నచికేతుడు. రెండో వరంగా యజ్ఞానికి మూలాధారమైన అగ్ని గురించి, మూడో వరంగా మృత్యువు తదనంతరం జరిగే ఆత్మగమ్యపు జ్ఞానాన్ని కోరతాడు. మొదటి రెండు వరాలు అడిగిన వెంటనే ఇచ్చిన యముడు మూడోదైన ఆత్మను గురించి తెలుసుకోవడం కష్టమని, దానికి బదులు భోగభాగ్యాలను, అష్టైశ్వర్యాలను ఇస్తానంటాడు. పట్టు వదలని నచికేతుడి కోరికను మన్నించి వివరిస్తాడు ఆత్మజ్ఞానాన్ని బోధిస్తాడు యమధర్మరాజు. వారిద్దరి మధ్య జరిగిన తత్వజ్ఞాన సంవాదమే కఠోపనిషత్తు.



అంతర్యామి

నచికేతుడి వృత్తాంతం తిక్కన మహాభారతంలోని అనుశాసనిక పర్వం ద్వితీయాశ్వాసంలోనూ ఉంది. భీష్ముడు ధర్మరాజుకు గోదాన ప్రభావం గురించి చెప్పేటపుడు వస్తుంది. వాజశ్రవుడు(ఉద్దాలకుడు) ఒకసారి నదీతీరంలో స్నానం చేసి దర్భలు, పాత్రలు మర్చిపోయి వాటిని తీసుకురమ్మని నచికేతుడిని పంపుతాడు. అవి నదిలో కొట్టుకుపోవడం వల్ల ఖాళీ చేతులతో వచ్చిన కొడుకును యమలోకం పొమ్మని శపిస్తాడు వాజశ్రవుడు. నచికేతుడు వెంటనే మరణించడంతో- ఆతడిని తండ్రి మేల్కొంటాడు. రాత్రంతా కుమారుడి దగ్గర ఉండి విలపిస్తాడు. మరునాడు ఉదయమే నచికేతుడు లేచి తనకు యమధర్మరాజు పుణ్యలోకాలను చూపించాడని చెప్పి తండ్రిని ఆనందపరుస్తాడు.


– శేషచంద్ర



విస్మయభరితం.. విశ్వరూపం!

అనంత విశ్వం.. ఇప్పుడో విస్తృత చిత్రంగా కళ్లెదుట నిలిచింది! జేమ్స్ వెబ్ టెలిస్కోప్‌తో రూపొందించిన కాస్మోస్-వెబ్ మ్యాప్ ద్వారా ఎనిమిది లక్షల గెలాక్సీలు, 13.5 బిలియన్ సంవత్సరాల చరిత్ర మన ముంగిటకొచ్చింది. ఇది కేవలం టెక్నాలజీ విజయమే కాదు, మన జిజ్ఞాసకు ఆకాశం కూడా హద్దు కాదని చాటి చెప్పిన మైలురాయి!

మనిషికి మొదటి నుంచీ ఆకాశంపై ఎనలేని ఆసక్తి. నక్షత్రాలు, గ్రహాలు, గెలాక్సీలపై అలుపెరుగని అన్వేషణ సాగిస్తున్నాడు. విశ్వం విస్తృతిని, నిర్మాణాలను అర్థం చేసుకోవడం చాలా సంక్లిష్టమైన విషయం. మనం చూస్తున్న నక్షత్రాలు, గెలాక్సీలు ఎంత దూరంలో ఉన్నాయి? అవి ఎప్పుడెప్పుడు ఏర్పడ్డాయో తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు శతాబ్దాలుగా పరిశోధనలు సాగిస్తున్నారు. ఇందులో టెలిస్కోపులే అత్యంత ముఖ్యమైన సాధనాలు. హబుల్ వంటి అంతరిక్ష టెలిస్కోపు ద్వారా విశ్వంలోని వేలాది గెలాక్సీలను పరిశీలించగలిగాం. వాటి చిత్రాలు, డేటా ఆధారంగా విశ్వపరిణామంపై కొంత అవగాహన ఏర్పడింది. అయితే, విశ్వ ప్రారంభ దశలు, అత్యంత దూరంలోని గెలాక్సీల నిర్మాణం వంటి అంశాలపై జవాబులు లేని ప్రశ్నలెన్నో ఉన్నాయి. వాటి గుట్టు విప్పడానికి మరింత శక్తిమంతమైన ఉపకరణాల అవసరం ఉంది. అందుకు జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ తోడ్పడింది.



చారిత్రక ఘట్టం

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) 1990లో హబుల్ స్పేస్ టెలిస్కోప్‌ను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపింది. హబుల్ ద్వారా శాస్త్రవేత్తలు గెలాక్సీల రూపకల్పన, నెబ్యులా నిర్మాణం, బిగ్‌బ్యాంగ్ తరవాత విశ్వ విస్తరణ రేటు వంటి అంశాలపై కీలకమైన సమాచారం పొందగలిగారు. ఇది ఖగోళశాస్త్రంలో అనేక విప్లవాత్మక ఆవిష్కరణలకు దోహదపడింది. హబుల్ ప్రధానంగా మనం కంటితో చూడగలిగే దృశ్య కాంతిని, మనం చూడలేని అతినీలలోహిత కాంతిని (380-750 నానోమీటర్ల తరంగ దైర్ఘ్యం) మాత్రమే పరిశీలించగలదు. అయితే, విశ్వం ప్రారంభంలో ఏర్పడిన గెలాక్సీల నుంచి... చాలాదూరం నుంచి కాంతి వస్తుంది. కానీ, మన విశ్వం నిరంతరం విస్తరిస్తుండటంతో, ఆ సుదూరాల నుంచి వచ్చే కాంతి పరారుణ కాంతిగా (750 నానోమీటర్ల నుంచి మిల్లీమీటర్ వరకూ) మారిపోతుంది. అందువల్ల హబుల్ వాటిని గుర్తించలేకపోయింది. ఆ లోటును భర్తీ చేసేందుకు 2021లో జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్‌ను ప్రయోగించారు. ఇది పరారుణ కాంతిని చూడగలదు. దీనివల్ల గత కొన్నేళ్లలో ఎన్నో అద్భుతమైన ఆవిష్కరణలు జరిగాయి.

అంతర్జాతీయ ఖగోళ శాస్త్రవేత్తల బృందం 2025 జూన్ 5న జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ ద్వారా రూపొందించిన కాస్మోస్-వెబ్ అనే విశ్వపటాన్ని అధికారికంగా విడుదల చేసింది. ఇది అతిపెద్దదైన, అత్యంత సమగ్రమైన ఖగోళ మ్యాప్‌గా గుర్తింపు పొందింది. విశ్వం చరిత్రలో 13.5 బిలియన్ సంవత్సరాల సమాచారాన్ని ఇది అందిస్తుంది. ఈ విశ్వపటాన్ని కాస్మోస్ (కాస్మిక్ ఎవల్యూషన్ సర్వే) అనే పరిశోధన ప్రాజెక్ట్‌లో భాగంగా రూపొందించారు. విశ్వాంతరాళాల దృశ్యాలను అత్యాధునిక కెమెరా ఉపకరణాలతో చిత్రీకరించారు. దాదాపు 10వేలకు పైగా చిత్రాలు తీసి, ప్రత్యేక సాంకేతిక ప్రక్రియలతో ప్రాసెస్ చేసి ఈ పటాన్ని రూపొందించారు. ఈ విశ్వ చిత్రంలో గెలాక్సీల ఏర్పాట్లు, వాటి పరస్పర దూరాలు, డార్క్‌మ్యాటర్ ప్రభావాలు స్పష్టంగా కనిపించాయి. ఇది కేవలం చిత్రరూపంగానే కాకుండా, విశ్వ నిర్మాణాన్ని అధ్యయనం చేయడానికి తోడ్పడింది. ఈ ప్రాజెక్టు శాస్త్రవేత్తలకు విశ్వ ఆవిర్భావ దశలపై, గెలాక్సీల పురోగతిపై, విశ్వం నిర్మాణంపై లోతైన అవగాహనను అందించింది. ఖగోళశాస్త్రంలో నూతన అధ్యాయానికి నాంది పలికింది.

కాస్మోస్-వెబ్ పటం విశ్వ పరిశోధన చరిత్రలో చారిత్రక ఘట్టం. ఇది హబుల్ టెలిస్కోప్ తీసిన చిత్రంలో కనిపించిన గెలాక్సీలకంటే దాదాపు ఎనభై రెట్లు ఎక్కువ గెలాక్సీలతో విశ్వాన్ని విస్తృతరీతిలో మన ముందుంచుతోంది. హబుల్ చిత్రం దాదాపు 10వేల గెలాక్సీలను చూపించగా, తాజా పటంలో ఎనిమిది లక్షల గెలాక్సీలు ప్రత్యక్షమయ్యాయి. ఈ మ్యాప్ ద్వారా మనం గెలాక్సీల స్వభావాలనే కాకుండా, అవి క్లస్టర్లుగా ఎలా ఏర్పడుతున్నాయో, మధ్యలోని ఖాళీలు ఎలా ఉంటాయో గమనించడం సాధ్యమవుతోంది. వీటి ఆధారంగా విశ్వ నిర్మాణం, గెలాక్సీల మధ్య ఆకర్షణ, డార్క్ మ్యాటర్ ప్రభావం వంటి అంశాలపై శాస్త్రవేత్తలు కీలక అన్వేషణలు సాగిస్తున్నారు. విశ్వం ప్రారంభ దశలో ఊహించినదాని కంటే గెలాక్సీలు ఎక్కువగా ఉండటం, చిన్న గెలాక్సీలు వేగంగా అభివృద్ధి చెందడం ఈ చిత్రాల ద్వారా తెలుస్తోంది. ఇవి కొన్ని వందల మిలియన్ల సంవత్సరాల్లోనే పెద్ద గెలాక్సీలుగా మారిపోయాయి. ఈ అభివృద్ధి గమనంలో అత్యధిక ద్రవ్యరాశిగల కృష్ణ బిలాలు ఎలా ఏర్పడుతున్నాయో శాస్త్రవేత్తలు ధ్రువీకరిస్తున్నారు. గెలాక్సీలు ఎక్కడ ఎక్కువగా ఏర్పడుతున్నాయో చూసినప్పుడు, అక్కడ డార్క్‌మ్యాటర్ సాంద్రత అధికంగా ఉందని గుర్తిస్తున్నారు. ఈ పరిశీలనలు విశ్వ నిర్మాణ సిద్ధాంతాలపై సరికొత్త ప్రశ్నలను రేపుతున్నాయి. కాస్మోస్-వెబ్ విశ్వపటం తయారీకి ఎంతోమంది ప్రపంచ ప్రముఖ శాస్త్రవేత్తలు కృషి చేశారు. వందలాది ఖగోళ శాస్త్రవేత్తలు జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ ద్వారా సేకరించిన డేటాను విశ్లేషించారు.

విజ్ఞానం అందరికీ...


కాస్మోస్-వెబ్ ప్రాజెక్టు డేటా ప్రజలకు, విద్యార్థులకు, పరిశోధకులకు ఉచితంగా అందుబాటులో ఉంది. ఇందులోని లక్షలాది గెలాక్సీల చిత్రాలు, వర్ణపటాల డేటాతో 'కాస్మోస్2025' అనే గెలాక్సీ క్యాటలాగ్ అంతర్జాలంలో ఉంది. ఆసక్తి ఉన్నవారెవరైనా ఈ విశ్వచిత్రాన్ని పరిశీలించవచ్చు. ఇది భవిష్యత్తు పరిశోధనలకు అపారమైన వనరుగా ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. విశ్వం చరిత్రను ఈ పటం మన కళ్లెదుట నిలుపుతోంది. విశ్వం ప్రారంభ దశల నుంచి నేటి గెలాక్సీల పరిణామం దాకా సమగ్ర చిత్రాన్ని ఆవిష్కరిస్తోంది. ఈ పరిశోధన ఇంతటితో ఆగదు. భవిష్యత్తులో మరిన్ని గెలాక్సీలు, మరింత లోతైన రహస్యాలు వెలుగుచూడవచ్చు. విశ్వం తన రహస్యాలను చెప్పాలనుకుంటోంది. అర్థం చేసుకునేందుకు మనమూ సిద్ధంగా ఉండాల్సిందే!



డాక్టర్ మంగళంపల్లి కిరణ్
అసోసియేట్ ప్రొఫెసర్, నానో శాస్త్ర పరిశోధకులు
ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ, అమరావతి

శతకోటి అపాయాలకు అనంతకోటి ఉపాయాలని సామెత. మారుతున్న సమాజం ఎప్పటికప్పుడు కొత్త కొత్త సమస్యలను ముందుకు తెస్తూనే ఉంది. తగిన పరిష్కారాలను కనుక్కొంటూనే ఉంది. అలాంటిదే ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న 'ఒంటరితనం'. అధిక జనాభా వల్ల మన దగ్గర ఇంకా దీన్ని సమస్యగా చూడటంలేదు కానీ పాశ్చాత్య దేశాల్లో ఇది చాలా పెద్ద సమస్యే. అక్కడి ప్రభుత్వాలు కూడా దాన్ని గుర్తించి చర్యలు తీసుకుంటున్నాయి. జపాన్, బ్రిటన్ లాంటి దేశాలు ప్రత్యేక మంత్రిత్వ శాఖలను ఏర్పాటుచేశాయి. 'లోన్లీనెస్ మినిస్టర్లు' గత కొన్నేళ్లుగా ఆయా దేశాల్లో ఒంటరితనం సమస్యను అధిగమించేందుకు విధానాల రూపకల్పనలో, ప్రత్యేక పథకాల అమలులో బిజీగా ఉన్నారు.

కలుసుకుందాం రండి



సామాజిక అనుబంధాలకు గొడ్డలిపెట్టుగా మారిన ఒంటరితనం ప్రజారోగ్యానికి హానికరమవుతోంది. యువత స్మార్ట్‌ఫోన్లు, తెరల్లో బందీలై తమకు తాము ఒంటరితనాన్ని నిర్దేశించుకుంటోంది. మరోపక్క పలకరించేవాళ్లు లేక పెద్దలు రోజుల తరబడి ఒంటరిగా గడుపుతూ కుంగుబాటుకు లోనవుతున్నారు. ఈ పరిస్థితి మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలనే కాక ఆత్మహత్యల్నీ పెంచుతోంది. అమెరికా అయితే దీన్ని నిశ్శబ్దంగా వ్యాపిస్తున్న అంటువ్యాధిగా పేర్కొంటోంది. సమస్య తీవ్రతను అర్థం చేసుకుంటున్న స్థానిక ప్రభుత్వాలు ఎక్కడికక్కడ టాస్క్‌ఫోర్స్‌లను నియమిస్తున్నాయి. యువ వాలంటీర్ల బృందాలు ఇంటింటికీ తిరిగి ఒంటరులను గుర్తించి, బయటికి వచ్చి ఇతరులతో స్నేహం చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నాయి. ప్రతి ఆస్పత్రిలోనూ ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నాయి. ఇవన్నీ చూసిన ఒక రచయిత తనదైన పద్ధతిలో ఈ సమస్యకు పరిష్కారం చూపారు. 'మీట్ మి ఎట్ ద లైబ్రరీ' పుస్తకం రాసిన షమైఖేల్ హాల్మాన్ గ్రంథాలయాధికారి. 'పనిచేసేచోట మన స్థాయి వారితోనే రోజు మొత్తమ్మీద నాలుగు మాటలు మాట్లాడతామేమో. అంతేకానీ వేర్వేరు వర్గాలకు చెందిన, భిన్నాభిప్రాయాలు కల వ్యక్తులతో ఆలోచనలు పంచుకునే అవకాశమే మనకు లభించడం లేదు. 'నేనూ నా కుటుంబం' అన్న పరిధిని దాటి సామాజిక అంశాల గురించి చర్చించుకునే వేదికలే కరవయ్యాయి. ఆ పని చేసేందుకు పబ్లిక్ లైబ్రరీని మించిన చోటేముంటుంది. ఒకప్పుడు నల్లజాతి విద్యార్థులు వచ్చినందుకు అరెస్టు చేయించిన లైబ్రరీకే నేను అధికారిని కాగలిగాను, సమాజంలో సానుకూల మార్పు తేవడానికి లైబ్రరీనే అద్భుతమైన వేదిక అనడానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఇంకేం కావాలి' అని ఆయన ప్రశ్నిస్తున్నారు.

ఎవరికి వారే ఒంటరి ద్వీపాలుగా మారిన మనుషుల మధ్య పుస్తకాల ద్వారా వంతెనలు నిర్మించాలన్నది రచయిత ఆకాంక్ష. వర్ణ, వర్గ, వయో భేదాల్లాంటివి ఏవీ లేకుండా అందరూ లైబ్రరీల్లో కలుసుకుని సందడి చేయాలని, సమాజాన్ని మరమ్మతు చేయాలని ఆయన ఆశిస్తున్నారు. లైబ్రేరియన్‌గా తన అనుభవాన్ని, పలువురి ఇంటర్వ్యూల ఆధారంగా చేసిన అధ్యయనాన్ని ఇందులో ఆసక్తికరంగా వివరించారు. సామాజిక అనుబంధాలు వ్యక్తిగత ఆరోగ్యంపై చూపే ప్రభావాన్ని విశదీకరించారు. నెగెటివ్ ఆలోచనలను పెంచే ఒంటరితనం నుంచి బయటపడటానికి కాణీ ఖర్చులేకుండా తోడ్పడగల శక్తి గ్రంథాలయాలకు ఉందని ఉదాహరణలతో చెప్పారు. గ్రంథాలయాలు జాతి సంపద. వాటిని సద్వినియోగం చేసుకోవాలంటున్న ఈ పుస్తకం పాఠకులను ఆలోచింపజేస్తుంది.

– మిహిర

సంపన్న రాజ్యాలదే పాపం!

పారిశ్రామికీకరణ, శిలాజ ఇంధనాల వాడకంతో వాతావరణంలోకి కార్బన్ డయాక్సైడ్ (సీవో2) పెద్దమొత్తంలో విడుదల అవుతోంది. 2023లో ప్రపంచ సగటు తలసరి ఉద్గారాలు 4.7 టన్నులు. అల్పాదాయ దేశాల్లో అవి 0.3 టన్నులైతే, దిగువ మధ్యాదాయ దేశాల్లో 1.6 టన్నులు, ఎగువ మధ్యాదాయ దేశాల్లో 6.1 టన్నులు. అధికాదాయ దేశాల్లో 10 టన్నులు. దీన్నిబట్టి సీవో2 అధికంగా సంపన్న రాజ్యాల నుంచే వెలువడుతున్నట్లు తెలుస్తుంది. 2023లో ఆయా దేశాల్లో తలసరి సీవో2 ఉద్గారాల పరిమాణం...
(టన్నుల్లో)

అమెరికా	14.3
మంగోలియా	13.7
రష్యా	12.5
సింగపూర్	8.5
చైనా	8.4
జపాన్	8
జర్మనీ	7.1
నార్వే	7
ఇండియా	2.1

(ఆధారం: గ్లోబల్ కార్బన్ బడ్జెట్-2024)

అంతర్జాలంలో అశ్లీల వరద

గతి చెడినా మతి చెడకూడదన్నది సామెత. కష్టాలెన్ని ఎదురైనా మంచి బుద్ధిని కోల్పోకూడదన్నది దాని అంతరార్థం. మనసులో చక్కటి ఆలోచనలు, మాటల్లో చేతల్లో సంస్కారం ఉంటే- మనిషి పురోగతికి అవే నిచ్చెనమెట్లు అవుతాయి. అలాకాకుండా రోత కోరికల బురదతో బుర్రంతా నిండిపోతే, ఆ పశువాంఛలతో ప్రవర్తన అదుపుతప్పితే పరిస్థితేంటి? అలాంటి వ్యక్తులు వికృత నేరాలకు పాల్పడుతూ ఇంటా బయటా అందరికీ పెద్ద ప్రమాదకారులవుతారు. దురదృష్టవశాత్తు ప్రస్తుతం అలాంటి భయానక పరిస్థితులే దాపురించాయి. అశ్లీల దృశ్యాలకు గుడ్లప్పగిస్తున్న వారి సంఖ్య పెరిగిపోతున్నకొద్దీ అతిజుగుప్సాకర సంఘటనలు అధికమవుతూ, మన సమాజం తీవ్రంగా గాయపడుతోంది.

ఇండియాలో అంతర్జాల వినియోగదారుల సంఖ్య దాదాపు 90 కోట్లకు చేరింది. బడికెళ్లే పిల్లలు మొదలు పెద్దల దాకా ప్రతిఒక్కరి చేతిలో నేడు స్మార్ట్‌ఫోన్ ఉంటోంది. వాస్తవానికి మేధా వికాసానికి, పౌర సేవల బట్వాడాకు, వినోదాన్ని పంచుతూ ఒత్తిడిని నివారించడానికి అంతర్జాలం ఎంతో అక్కరకొస్తుంది. అలాంటి ఇంటర్నెట్‌లో దీపం కింద చీకటిలా అశ్లీలమూ వెల్లువెత్తుతోంది. దాని మూలంగా దేశమే కల్లోలంలోకి జారిపోతోంది.

మనసులోని మాటలను పదిమందితో పంచుకోవడానికి వీలుకల్పించే సామాజిక మాధ్యమాలు- సరిగ్గా వాడుకుంటే, దేశ సరిహద్దులకు అతీతంగా ప్రజల నడుమ సత్సంబంధాలను పెంచగలవు. కానీ, జరుగుతున్నదేమిటి? అసభ్య కంటెంట్‌తో సోషల్ మీడియాలో నేడు మురికి కంపు కొడుతోంది. సహజత్వం, క్రియేటివిటీ పేరిట వెబ్‌సిరీస్‌ల్లోకి చేరుతున్న పచ్చి బూతుమాటలు, పరిధిదాటిన శృంగార సన్నివేశాలు- ఓటీటీల ద్వారా నేరుగా నట్టింట్లోకి వచ్చిపడుతున్నాయి. ఇక పోర్న్‌వెబ్‌సైట్లు, యాప్‌లలో మెదళ్లను కలుషితం చేసే వికృత చిత్రాలు, దృశ్యాలు వరదలా పారుతున్నాయి. వాటిని చూస్తూ బుర్ర చెడగొట్టుకుంటున్న ఎంతోమంది నైతికంగా పతనమవుతున్నారు. విపరీతమైన కామోద్రేకంతో హేయ నేరాలకు పాల్పడుతూ జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారు. చిన్నపిల్లల నుంచి ఎంతోమంది మహిళల బతుకులనూ వారు బలితీసుకుంటున్నారు. ఈ దుస్థితి తప్పించేందుకు అశ్లీల వెబ్‌సైట్లు, యాప్‌లపై వేటేస్తున్నట్లు కేంద్రం తరచూ చెబుతోంది. తాజాగా పలు అశ్లీల ఓటీటీలు, యాప్‌లపై అలాగే కొరడా ఝళిపించింది. చీడపురుగుల వంటి అలాంటి యాప్‌లు, వెబ్‌సైట్లను ఎప్పటికప్పుడు గుర్తించి నిషేధాజ్ఞలు విధిస్తుంటేనే- అవి రాజేస్తున్న సామాజిక విధ్వంసాన్ని కొద్దిమేరకైనా నివారించగలం!



నిరుడు కోల్‌కతాలో వైద్యురాలిపై పాశవిక అత్యాచారానికి పాల్పడిన రాక్షసుడు నీలిచిత్రాలకు బానిసయ్యాడని పోలీసుల విచారణలో తేలింది. అతడి ఫోన్‌లో హింసాత్మక పోర్న్ కంటెంట్ ఉన్నట్లు వెల్లడైంది. అశ్లీల వీడియోలు చూసి మెదడు మొద్దుబారిన ఓ బాలుడు నిరుడు మధ్యప్రదేశ్‌లో సొంత సోదరిపైనే హత్యాచారానికి ఒడిగట్టాడు. హైదరాబాద్‌లో రోత వీడియోలను చూడటానికి అలవాటుపడిన మరో ప్రబుద్ధుడు కన్న కూతురితో తప్పుగా ప్రవర్తించి, ఆమె ప్రతిఘటించడంతో బండరాయితో మోది హతమార్చాడు. పోర్న్‌సైట్లలో కంటబడే జుగుప్సాకర దృశ్యాలను అనుకరిస్తూ కట్టుకున్నవాళ్లను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారు చాలామంది. దాంతో పచ్చని సంసారాలు కుప్పకూలుతున్నాయి. భర్తల పైశాచిక ప్రవృత్తికి ఎదురు చెప్పలేని ఎంతోమంది గృహిణుల ఆరోగ్యాలు దెబ్బతినిపోతున్నాయి. ఇలాంటి దారుణాలన్నీ ప్రభుత్వాల దృష్టికి వస్తున్నాయా? చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టాల్సిందే. అలాంటిది అశ్లీల దృశ్యాలనే అనకొండను అడ్డుకోవాలంటే ఎంత వ్యవస్థాగత కృషి అవసరం? ఆన్‌లైన్ ఆటలు ఆడేటప్పుడో, సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూస్తున్నప్పుడో, ఇంకేదో సమాచారం చదువుతున్నప్పుడో ఉన్నట్టుండి అశ్లీల కంటెంట్ ప్రత్యక్షమవుతుంది. ఎవరైనా ఒక్క నిమిషం దాని వంక చూశారంటే, ఆపై అలాంటివే గుట్టలుగుట్టలుగా వచ్చిపడుతుంటాయి. అల్గారిథమ్‌ల మాయ మూలంగా ఫోన్ పట్టుకునే ఎంతోమంది చిన్నారులు, యువత తెలియకుండానే ఘోరమైన ఊబిలో దిగబడిపోతున్నారు. వాటి నుంచి బయటపడలేక ఉజ్జ్వల భవితను బుగ్గిచేసుకుంటున్నారు. అంతర్జాలంలోకి పోటెత్తుతున్న అశ్లీల కంటెంట్‌కు అలవాటుపడుతున్న చిన్నారులు, యువతలో హింసాత్మక ప్రవర్తన, దూకుడు స్వభావం పెరుగుతున్నాయి. అలాంటి వారు చిన్నపిల్లలూ మహిళలపై వేధింపులు, కిడ్నాపులు లైంగిక దాడులకు ఒడిగడుతున్నారని మనస్తత్వ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశానికి వెన్నెముకలాంటి నవతరం ఇలా గాడితప్పుతుంటే, ఇండియా నిజమైన అభివృద్ధిని ఎప్పటికి సాధించగలుగుతుంది?

నీలిచిత్రాల వీక్షకులు అత్యధికంగా ఉన్న దేశాల్లో ఇండియా ఒకటి కావడం ఎంత అప్రతిష్ఠ! చూడటమే కాకుండా సంబంధిత వీడియోల అప్‌లోడ్ల పరంగానూ మన దేశం ముందు వరసలో నిలుస్తూ మరింత చెడ్డపేరును మూటగట్టుకుంటోంది. పోర్న్ మంటల్లో తగలబడుతున్న జీవితాలను రక్షించుకోవాలంటే- సంబంధిత వెబ్‌సైట్లను పూర్తిగా నిషేధించాలి. పేర్లు మార్చుకుని రకరకాల రూపాల్లో మళ్లీ చొరబడేవాటిపట్ల సదా అప్రమత్తంగా ఉండాలి. కేంద్రం సూచించినట్లు ఓటీటీలు స్వీయ నైతిక నిబంధనలను పాటించాలి. మాటవినని వాటిపై యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలి. సోషల్ మీడియాలో కట్టుతప్పుతున్న అశ్లీల రీల్స్‌నూ అరికట్టాలి. టీనేజర్లలో సగానికి పైగా పదమూడేళ్లకే అశ్లీల దృశ్యాలకు చేరువవుతున్నట్లు ఓ అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలను నిత్యం గమనిస్తుండాలి. పాఠశాల దశ నుంచే వారికి నైతిక విలువలు బోధించాలి. అప్పుడే అశ్లీల అసభ్య దృశ్యాల దుర్గమారణ్యంలో చిక్కుబడిపోతున్న భావితరాన్ని కాపాడుకోగలం!

పుణ్యభూమి

– వేణుబాబు మన్నం

రీల్స్ నుంచి..

హాయ్ ఫ్రెండ్స్..! సినిమాలు అంటే మనందరికీ ఇష్టమే కదా..! హీరోలు చేసే కొన్ని ఫైట్‌లు, డాన్స్‌లు.. సరదాగా అప్పుడప్పుడు ఇంట్లో కూడా ట్రై చేస్తాం. ఇలానే ఒక నేస్తం కూడా సినిమాల్లో నటించడమే కాకుండా అవార్డ్స్ కూడా గెలుచుకుంటున్నాడు. మరి తనెవరో చూద్దామా!

విశాఖపట్నంలోని నాయుడుతోటకి చెందిన పోతుల అరుణ్‌దేవ్‌కి పదకొండేళ్లు. ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్నాడు. తండ్రి సురేష్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగి. తల్లి సత్యవాణి గృహిణి. అరుణ్ చిన్నప్పటి నుంచీ చాలా చురుగ్గా ఉండేవాడు. కొవిడ్ సమయంలో డైలాగ్స్ నేర్చుకుని సరదాగా రీల్స్ చేసేవాడు. అలా నటన మీద మరింత ఆసక్తి పెంచుకున్నాడు. అది గమనించిన తల్లిదండ్రులు.. టీవీ, సినిమాల వైపూ ప్రోత్సహించారు. అలా తను రెండో తరగతి చదువుతున్నప్పుడే ఓ టీవీ ఛానెల్లో నిర్వహించిన పిల్లల కార్యక్రమానికి ఎంపికై అందులో రన్నరప్‌గా నిలిచాడు. తరవాత వరసగా సీరియళ్లలో అవకాశాలు వచ్చాయి. అందులో మంచి పేరు తెచ్చుకున్నాడు మన అరుణ్. తరవాత సినిమాల్లోకి వచ్చాడు. '35 చిన్న కథ కాదు' సినిమాలో మంచి నటనకుగానూ తెలంగాణ ప్రభుత్వం 'బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా' ఎంపిక చేసి గద్దర్ అవార్డును అందించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే చదువు, సినీరంగంలోనూ రాణిస్తున్నానని చెబుతున్నాడు అరుణ్. మరో విషయం ఏంటంటే తనకి ఫ్లూట్ వాయించడం కూడా వచ్చట. అరుణ్ ఇలాగే మరిన్ని విజయాలు అందుకోవాలని మనమూ ఆల్ ది బెస్ట్ చెప్పేద్దామా మరి!




హాయ్! బుజ్జీ!!

– అప్పలనాయుడు ఒడ్డు

పదవలయం

ఇక్కడ ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలను రాయండి. అన్నీ 'శి' అక్షరంతోనే ప్రారంభమవుతాయి. ఓసారి ప్రయత్నించండి.

1. కొండ అంచు మరోలా
2. నేర్చుకోవడం
3. తాత్కాలికంగా ఏర్పాటు చేసేది
4. అప్పుడే పుట్టిన బిడ్డ
5. విద్యార్థులు
6. ఒక రుతువు
7. రాయితో చెక్కేవి
8. తల



జవాబు: 1. శిఖరం 2. శిక్షణ 3. శిబిరం 4. శిశువు 5. శిష్యులు 6. శిశిరం 7. శిల్పాలు 8. శిరస్సు

కమిటీ నివేదిక ఆధారంగా.. బుడమేరు ఆక్రమణలపై చర్యలు



సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులను ఆదేశిస్తున్న మంత్రి నారాయణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: బుడమేరు ఆక్రమణలపై నీటి పారుదల శాఖ నియమించిన సాంకేతిక కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. విజయవాడలో శనివారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... బుడమేరును విస్తరించడమా? గట్టు ఎత్తు పెంచడమా? అనే అంశాలపై సాంకేతిక కమిటీ పరిశీలన చేస్తుందని అన్నారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా నగరపాలక సంస్థ అధికారులతో సమన్వయం చేసుకుని ఆక్రమణల విషయంలో తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానం, అనాలోచిత నిర్ణయాల కారణంగానే విజయవాడ ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారని మంత్రి ఆరోపించారు. వాన నీరు బయటకు వెళ్లేలా 2014-19 ప్రాంతంలో రూ.500 కోట్లతో వర్షం నీటి డ్రెయిన్ల పనులు చేపట్టి, 55 శాతం పూర్తి చేస్తే, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మిగిలిన పనులు నిలిచిపోయాయని, ఫలితంగా వర్షపు నీరు బయటకు వెళ్లని పరిస్థితి నెలకొందని అన్నారు. పలుచోట్ల అవుట్‌ఫాల్ డ్రెయిన్లు ఆక్రమణలకు గురి అయ్యాయని, ఫలితంగానే వర్షపు నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండిపోతోందని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో 10 అడుగులు ఉండాల్సిన డ్రెయిన్లు కేవలం 2 అడుగులు కూడా లేకపోవడాన్ని మంత్రి గమనించారు. ఆక్రమణలు తొలగించి డ్రెయిన్లు వెడల్పు చేయాలని, ఆ పనులు చేసే ముందు స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించాలని సూచించారు. ఆక్రమణల తొలగింపు వల్ల ఇళ్లు కోల్పోతే.. ప్రత్యామ్నాయంగా జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు కేటాయించాలని అన్నారు. వీఎంసీ, సీఆర్‌డీఏ నిధులతో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని, సెప్టెంబరు నుంచి పనులు ప్రారంభించి 6 నెలల్లో పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. కమిషనర్ ధ్యానచంద్ర, చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనసు వెన్న.. మమత మిన్న!

★ అమ్మానాన్నలూ.. ఆధునిక పెంపకంలో జాగ్రత్త
★ పిల్లల ప్రతీదశలో.. మీ తోడ్పాటుతోనే ఉన్నతి



తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటాచల స్వామి ఆలయంలో శనివారం అర్చకులు డి.వేణుగోపాల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం దేవతామూర్తుల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. అన్నదానం చేశారు.

కళాత్మక దృష్టి ఉండాలి


శతక పద్యాలపై వివరిస్తున్న బాలాజీ ప్రసాద్

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు కళాత్మక దృష్టి కూడా ఉండాలని స్థానిక పద్య నాటక కళాకారులు బాలాజీప్రసాద్, వాణిపతిశాస్త్రి, బాలచంద్ర్‌లు పేర్కొన్నారు. ఎస్వీఆర్‌జీ నరసింహారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదికవి నన్నయ్య భాషా సాంస్కృతిక క్లబ్ ఆధ్వర్యంలో నో బ్యాగ్ డే సందర్భంగా శనివారం డ్రామా అంశంపై సదస్సు నిర్వహించారు. పద్య రాగాలు ఆలపించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు పద్య గానం, నటనలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.సతీష్, క్లబ్ కార్యదర్శులు శ్రీనివాసరావు, నళినికుమారి, రామకృష్ణ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు నూరు శాతం రాయితీ


గ్రామ సభలో పాల్గొన్న సర్పంచి సునీల, ఎంపీడీవో రమణ, ఆర్‌ఐ పుల్లయ్య తదితరులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా సన్న ,చిన్నకారు రైతులకు పండ్ల, పూల తోటలు పెంచి లబ్ధి పొందాలని రెడ్డిగూడెం ఎంపీడీవో టి.కె.వి.రమణ అన్నారు. శనివారం రంగాపురం గ్రామ సచివాలయంలో ఉపాధి హామీ పథకంలో రైతులకు అందజేస్తున్న సదుపాయాలు అవగాహన కల్పించేందుకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. నూరుశాతం రాయితీ అందజేస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచి పి.సునీల, ఆర్‌ఐ జి.పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు, కె.అశోక్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తెదేపా బలోపేతానికి కృషి చేయాలి


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన ఎంపీ కేశినేని చిన్ని

విస్సన్నపేట, న్యూస్‌టుడే: తెదేపాకు నాయకుల కంటే కార్యకర్తలే ముఖ్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) స్పష్టం చేశారు. విస్సన్నపేటలో శనివారం నిర్వహించిన తెదేపా మండల శాఖ అధ్యక్షుడు రాయల సుబ్బారావు, గ్రామశాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ సమక్షంలో నూతన కమిటీలు తమ విధులను అంకితభావంతో నిర్వహిస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. తిరువూరు నియోజకవర్గంలో తెదేపాకు వరుసగా నాలుగుసార్లు ఓటమి ఎదురైనా కార్యకర్తలు ఎక్కడా చెక్కు చెదరకుండా పార్టీ కోసం శ్రమించారన్నారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన వారందరికీ పదవులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.శ్రీనివాసరావు, తెలుగురైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ లక్ష్మీఅనిత, నియోజకవర్గ తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.6.50 లక్షల విలువైన సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అందజేశారు. తమ వైద్య ఖర్చులకు ఆర్థికసాయం మంజూరు చేసిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ◆ ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద గుంతల్లో నీరు నిలిచి ప్రయాణికులు అవస్థలు పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు జాతీయ రహదారిని పరిశీలించారు. రహదారికి మరమ్మతులు త్వరగా చేపట్టాలని కలెక్టర్‌కు చరవాణిలో ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎ.కొండూరు మండలంలో చేపడుతున్న జల్‌జీవన్ మిషన్ పనులు, కుమ్మరికుంట్ల కూలిపోయిన వంతెన వద్ద ఐరన్ వంతెన ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు.

వరిలో డ్రమ్ సీడర్‌తో తగ్గనున్న పెట్టుబడి


వరి విత్తనాలు వేయడాన్ని పర్యవేక్షిస్తున్న డీపీఎం శంకర్‌నాయక్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

కాకర్ల(తిరువూరు), న్యూస్‌టుడే: డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేయడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని కాకర్ల శివారు రామన్నపాలెంలో సంజీవరావు అనే రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయం విధానంలో డ్రమ్ సీడర్‌తో వరి సాగును శనివారం నిర్వహించారు. ఈ విధానంలో ఎకరాకు 10 కిలోల విత్తనాలు సరిపోతాయని, నాట్లు వేసే కూలీలు, విత్తనాల ఖర్చు తగ్గుతుందని ఆయన వివరించారు. ప్రకృతి వ్యవసాయం అమలు చేయడం ద్వారా భూసారం కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది వాణి, అంజిరెడ్డి, సతీష్, స్వాతి, చిదంబరం పాల్గొన్నారు.

1,2 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు


గోడపత్రికలు ప్రదర్శించిన నాయకులు

తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: జిల్లాలోని జగ్గయ్యపేటలో వచ్చే నెల 1, 2 తేదీల్లో నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా 2వ మహాసభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరులో శనివారం మహాసభ గోడపత్రికలు నాయకులు షేక్.నాగుల్‌మీరా, ఎం.డేవిడ్, టి.కృష్ణయ్య, ఎం.ఉదయ్, జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

హ్యాకథాన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకున్న వారితో అధ్యాపకులు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐటీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు రోజుల కార్యశాలలో భాగంగా శనివారం హ్యాకథాన్ నిర్వహించారు. విద్యార్థులను 28 బృందాలుగా విభజించి నిర్వహించిన పోటీల్లో ఉత్తమమైన మొదటి మూడు ప్రాజెక్టుల బృందాలను విజేతలుగా ఎంపిక చేసి, బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఐటీ విభాగాధిపతి డి.రత్నకిషోర్, కోఆర్డినేటర్లు విజయ్‌కుమార్, విజయశ్రీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రహదారుల్లో ప్రయాణం.. నరకమే..

మండలంలోని పెనుగొలను ప్రధాన రహదారి నుంచి అంగన్‌వాడీ కేంద్రం వెళ్లే రహదారి గుంతలమయంగా ఉంది. మోకాళ్ల లోతు గుంతల్లో నిలిచిన వర్షపు నీటిలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పంచాయతీ అధికారులు ఆ రోడ్డులో గుంతలు పూడ్చించాలని గ్రామస్తులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, పెనుగొలను (గంపలగూడెం)





రూ.లక్షలతో సీసీ రహదారిగా నిర్మించిన స్థానిక తారకరామానగర్ ప్రధాన రహదారి బురద రోడ్డుగా మారిపోయింది. గత ప్రభుత్వ హయాంలో అంతర్గత రహదారులకు అనుసంధానంగా ఎత్తుగా చప్టాలను నిర్మించడంతోనే కష్టాలు మొదలయ్యాయి. సీసీ రోడ్డు నిర్మించినా, సరైన మురుగు కాలువలు లేకపోవడంతో వర్షపు నీరంతా రహదారిపైనే నిలుస్తోంది. మురుగు పారకపోవడం, గోతులతో నిండడంతో స్థానికులు ప్రధాన రహదారిపై నడవాలంటే నానా తిప్పలు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

కూటమి ప్రభుత్వంలోనే సుపరిపాలన


కీర్తిరాయునిగూడెంలో కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రంలో సుపరిపాలన అందుతోందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కీర్తిరాయునిగూడెంలో ఇంటింటికీ ప్రచారంలో భాగంగా సంక్షేమ కరపత్రాలు నాయకులు అందజేశారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, జేమ్స్, యువరాజ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వంతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెదేపా నాయకులు పేర్కొన్నారు. శనివారం రెడ్డిగూడెం పంచాయతీలోని 24, 25 బూత్‌ల పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సోమేశ్వరరావు, ప్రవీణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: పట్టణంలోని 17వ వార్డులో శనివారం తెదేపా నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్.అబ్దుల్‌హుస్సేన్, బూత్ కమిటీ కన్వీనర్ రసూల్, వార్డు అధ్యక్షుడు ఉమర్, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి ఐ.హేమంత్, అహ్మద్, కరీముల్లా పాల్గొన్నారు.


తిరువూరు 17వ వార్డులో..

జి.కొండూరు: చిననందిగామ గ్రామంలో తెదేపా సర్పంచి ధనేకుల శ్రీకాంత్, తెదేపా గ్రామ పార్టీ అధ్యక్షుడు మన్నం వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. బూత్ కన్వీనర్ కోయ పాపారావు, మార్టిన్, రాంబాబు, శ్రీకాంత్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.


చిననందిగామలో..

కొండపల్లి: చేతి వృత్తిదారులకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా సాయమందిస్తోందని పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను పేర్కొన్నారు. స్థానిక 28, 29 వార్డుల పరిధిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి బొమ్మల కళను విస్తృతం చేయడానికి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. కళాకారులకు రుణాలు మంజూరు చేయడంతో పాటు సంక్షేమ పథకాలు వంద శాతం అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

తల్లి పేరుతో మొక్కనాటి రక్షిద్దాం



నాటిన మొక్కల స్థితి నమోదు చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు తమ తల్లి పేరుతో మొక్క నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని కాచవరం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మహమ్మద్ ఇర్ఫాన్ పాషా విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన గ్రీన్ పాస్‌పోర్టులను పంపిణీ చేశారు. విద్యార్థులు నాటిన మొక్క పెరుగుదల స్థితి నెలకొకసారి అందులో నమోదు చేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు పాఠశాలలో తాము నాటిన మొక్కల ప్రగతిని గ్రీన్ పాస్‌పోర్టుల్లో నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: మనస్తాపంతో పురుగు మందు తాగి మృతి చెందిన ఘటన జి.కొండూరు మండలం కందులపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కందులపాడు గ్రామానికి చెందిన మందా శ్రీనివాసరావు (44) మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. ఇటీవల భార్యతో గొడవ జరిగిన నేపథ్యంలో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం మేకలు పొలానికి తోలు కెళ్లి పురుగు మందు తాగేశాడు. గమనించిన స్థానికులు మైలవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా.. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి భార్య మేరి ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జ్వరంతో తెదేపా కార్యకర్త..


బాబు

చీమలపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని చీమలపాడుకు చెందిన తెదేపా కార్యకర్త ములగపాటి బాబు(32) జ్వరంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు కూడా బాబు మృతదేహానికి నివాళులర్పించారు. తెదేపా మండల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన


రెడ్డిగూడెం మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న వేణుగోపాలరావు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిర్వహించే విద్యా కార్యక్రమాల్లో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లా డైట్ అధ్యాపకుడు సీహెచ్ వేణుగోపాలరావు రెడ్డిగూడెం మండలంలో పాఠశాలలను శనివారం సందర్శించారు. అలివేలు మంగాపురం, కొత్తరెడ్డిగూడెం, రెడ్డిగూడెం మోడల్ ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను పరిశీలన చేశారు. విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు, విద్యార్థుల చేరికలపై అవగాహన కల్పించేందుకు ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి.రమేష్‌బాబు, రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ధర్మశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ స్థలాలు కార్పొరేట్లకు ఇవ్వడం అన్యాయం'


ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూఏ సభ్యులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఆర్టీసీ స్థలాలను లులూ సంస్థకు కేటాయించాలన్న ప్రతిపాదన సరైంది కాదని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో అధ్యక్షుడు బీవీ ఆంజనేయులు తెలిపారు. గవర్నర్ పేట-1, 2 డిపో స్థలాలను ఆ సంస్థకు కేటాయించాలన్న ప్రతిపాదనపై ఎన్‌ఎంయూఏ సభ్యులు నిరసన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఆర్టీసీ సంస్థ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. కార్యక్రమంలో శేషగిరి, మోహన్, కోటేశ్వరరావు, వదూద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు

షేక్ జయనావల్లి ......వాది
మరియు
షేక్ అబీదా కాటూన్ మరియు కొందరు .... ప్రతివాది

పైన తెల్పిన వ్యాజ్యం A.S.No.254/2023 షేక్ జయనావల్లి అనునతడు వేసి ఆయనకు ఎదురు వచ్చిన జడ్జిమెంట్ OS.No.59 of 2015, నూజివీడు హైకోర్టు నందు వేసినారు. అందులో 4వ ప్రతివాది అయిన షేక్ అన్వర్ బాషా కోర్టు వారి నోటీసు తీసుకోనందున స్టెప్ పిటీషన్ వేసినారు. ఆ పిటీషన్ 07.07.2025 విచారణ చేసి పబ్లిక్ నోటీస్ ఇవ్వడానికి ఆర్డరు చేసినారు. ఇందుమూలంగా తెలియపరచడము ఏమనగా హైకోర్టు వారు చెప్పినవిధంగా నోటీసు తీసుకొనని షేక్ అన్వర్ బాషా గారికి పబ్లిక్ నోటీసు మూలంగా తెలియపరచడము ఏమనగా, ఈ పబ్లిక్ నోటీసు చూసి మీరు హైకోర్టులో నడుస్తున్న దావాలో ప్రతివాదుల జాబితాలో వకాలత్ వేయాలి. అలా కానీ పక్షంలో పైన తెలిపిన కేసు 04.08.2025న హైకోర్టులో రావడం జరుగుతుంది. షేక్ అన్వర్ బాషా అనే మీరు పైన తెల్పిన వ్యాజ్యంలో పాత్రలు కానీ పక్షంలో ఉన్నత న్యాయస్థానం వారు ముందుకు పోవడం జరుగుతుంది.

ఇట్లు: V. సురేంద్ర రెడ్డి, వాది న్యాయవాది
✆ 94400 11417

న్యాయశాస్త్ర మూల సిద్ధాంతాలను అవగతం చేసుకోవాలి

కానూరు, న్యూస్‌టుడే: న్యాయశాస్త్ర మూల సిద్ధాంతాలను విద్యార్థులు అవగతం చేసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ అన్నారు. శనివారం కానూరు వీడీ సిద్ధార్థ న్యాయ కళాశాలలో జరిగిన పట్టభద్రుల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ హరిహరనాథ శర్మ మాట్లాడుతూ తల్లి లాంటి న్యాయ వృత్తిలో న్యాయవాదులు పూర్తి అంకితభావం కలిగి ఉండాలన్నారు. కాలానికి అనుగుణంగా మారుతున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. కళాశాలలో నేర్చుకున్న విజ్ఞానాన్ని వృత్తిలో అమలు చేయాలన్నారు. హాని కలిగించే విషయాలకు దూరంగా ఉండాలన్నారు. నైపుణ్యాలు నేర్చుకోవాల్సిన సమయంలో సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకరబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న జస్టిస్ అవధానం హరిహరనాథశర్మ, ప్రిన్సిపల్ దివాకరబాబు

సాఫ్ట్‌వేర్ కోర్సులకే సై..!



సీఎస్ఈ, ఐటీ బ్రాంచ్‌లపై విద్యార్థుల ఆసక్తి

కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే

ఉమ్మడి కృష్ణా జిల్లాలో సాంకేతిక విద్యాశాఖ మొదటి విడత కౌన్సెలింగ్‌లో ఎక్కువ మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కోర్సులనే ఎంచుకున్నారు. 2025 సంవత్సరానికి సీట్ల కేటాయింపులో సీఎస్ఈ, ఐటీ బ్రాంచ్‌ల వైపే మొగ్గుచూపారు. కళాశాలలోనూ సీఎస్ఈ, దాని అనుబంధ బ్రాంచ్‌లైన ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌ను ఎంచుకున్నారు. కన్వీనర్ కోటాలో సీఎస్ఈ, ఐటీ, ఆ తర్వాత ఈసీఈ సీట్లు పొందారు. సాఫ్ట్‌వేర్ రంగంలో కొలువులపై ఆసక్తితోనే వీటిపై మొగ్గుచూపారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వివరాలు..

విశ్వవిద్యాలయాలు : 2
ఇంజినీరింగ్ కళాశాలలు : 28
అందుబాటులో బ్రాంచ్‌లు : 23
కన్వీనర్ కోటా సీట్లు : 16176
కేటాయించిన సీట్లు : 12227
కేటాయింపు శాతం : 75.59

బ్రాంచి	సీట్లు	భర్తీ	శాతం
సీఎస్ఈ	8493	7057	83.09
ఐటీ	864	766	88.66
ఈసీఈ	2670	1851	69.33
ఈఈఈ	792	432	55.43
సివిల్	648	329	50.78
మెకానికల్	744	303	40.73

నూతన విధానంలో మైనర్, మేజర్ డిగ్రీలూ చేసుకోవచ్చు..

సాంకేతిక విద్యార్థులు.. నూతన విద్యావిధానం ద్వారా మేజర్, మైనర్ డిగ్రీలు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇంజినీరింగ్‌లో ఈఈఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌లు వచ్చిన వారు.. కంప్యూటర్స్ సైన్సులో ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ కోర్సులు చదువుకోచ్చు. 5వ సెమిస్టర్ నాటికి వారు చదివే బ్రాంచ్‌లో 70శాతం మార్కులు తెచ్చుకుని ఉండాలి. 6, 7 సెమిస్టర్లలతో పాటు మైనర్ డిగ్రీ చేయవచ్చు. 8వ సెమ్ పూర్తయ్యేనాటికి మేజర్ డిగ్రీ అందుకోవచ్చు. ఏ బ్రాంచ్‌లో చదివినా.. నైపుణ్యం ఉంటే మేజర్, మైనర్ డిగ్రీలు పొందవచ్చు. ఈఈఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌ల విద్యార్థులు సాఫ్ట్‌వేర్‌పై ఆసక్తి ఉంటే.. ఈ దిశగా అడుగులు వేస్తే మంచిది. లేదా కోర్ బ్రాంచ్‌లో మొదటి నుంచే సంస్థలకు అవసరమైన నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి.



– ఎస్.సాంబశివరావు, ఆచార్యులు, ఎస్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

ఘాట్ రోడ్డు.. పగుళ్ల మయం..!

రూ.7 కోట్లు ఖర్చు పెట్టినా భక్తులకు తప్పని అవస్థలు

ఇంజినీరింగ్ అధికారులకు పట్టని తీరు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దుర్గగుడిలో భక్తుల సౌకర్యాలు పట్టవు అనడానికి నిత్యం ప్రముఖులు, సాధారణ భక్తులు పయనించే ఘాట్ రోడ్డు పరిస్థితే నిదర్శనం. ఏడేళ్లలో రూ.7 కోట్లు ఖర్చు పెట్టిన ఇంజినీరింగ్ అధికారులు భక్తుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. 2017లో బాగా ఉన్న ఘాట్ రోడ్డుపై రూ.5 కోట్లు వెచ్చించి మొదటి మలుపు నుంచి దుర్గగుడి వరకు సిమెంట్ రోడ్డు వేశారు. ఇరువైపులా పచ్చదనం కోసం దారిని కుదించారు. దీంతో వేసిన ఏడాదికే పగుళ్లు వచ్చాయి. అప్పటి ఈవోలు సూర్యకుమారి, కోటేశ్వరమ్మ నిర్వహణ బాధ్యత ఉన్న గుత్తేదారుకు డబ్బులు మంజూరు చేయకుండా ఆపారు. తరువాత వచ్చిన ఈవో సురేష్ బాబు రోడ్డుకు మరమ్మతులు చేయించాల్సిన గుత్తేదారు పట్టించుకోనప్పటికే ఇంజినీరింగ్ అధికారుల ఒత్తిడితో డబ్బులు ఇచ్చేశారు. తరువాత వచ్చిన ఈవో భ్రమరాంబ భక్తుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని పగుళ్లు వచ్చిన చోట తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. కానీ పగుళ్లు మాత్రం అలానే ఉన్నాయి. టోల్‌గేటు నుంచి మొదటి మలుపు వరకు రోడ్డు దెబ్బతింది. పగుళ్లు వచ్చి ఘాట్ రోడ్డు మూడేళ్ల కిందట దసరా ఉత్సవాల ముందు కుంగిపోయింది. రిటైనింగ్ గోడ జారిపోయి జాతీయ రహదారిపైన పడింది. అప్పటి ఈవో రామారావు యుద్ధ ప్రాతిపదికన ఘాట్ రోడ్డు రిటైనింగ్ గోడను రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టారు. రక్షణ గోడను నిర్మించిన ఇంజినీరింగ్ అధికారులు ఘాట్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు.



పగుళ్లిచ్చిన దుర్గగుడి ఘాట్ రోడ్డు మలుపు



భద్రత కరవైన రక్షణ గోడ

దీక్షల విరమణ సమయంలో భక్తుల బాధ వర్ణనాతీతం

దసరా, భవానీ దీక్షల విరమణ సమయంలో పాదరక్షలు లేకుండా నడిచే భక్తులకు ఘాట్ రోడ్డులో బాధలు వర్ణనాతీతం. ఈ విషయంపై వారితో పాటు దేవస్థానం సిబ్బంది కూడా అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు పగుళ్ల రోడ్డులో ప్రయాణించలేక అవస్థలు పడుతున్నారు. రూ.7 కోట్లు ఖర్చు పెట్టిన అధికారులు కనీసం దసరా ఉత్సవాల సమీపిస్తున్న వేళ మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

తాత్కాలిక మరమ్మతులు చేపడతాం: ఈవో శీనానాయక్

ఈ సమస్యపై ఈవో శీనానాయక్‌ను సంప్రదించగా గడచిన ఐదేళ్ల కాలంలో ఘాట్ రోడ్డుకు మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడం వల్లనే రిటైనింగ్ గోడ కూలిపోయిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రస్తుతం ప్రసాదాల పోటు, ఎలివేటెడ్ క్యూలైన్లు, అన్నదాన భవన నిర్మాణ పనులు చేస్తున్నందున ఘాట్ రోడ్డులో భక్తులకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక మరమ్మతులు చేపడతామని తెలిపారు.

ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు ఇద్దరు వైద్యుల ఎంపిక

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు ఇద్దరు వైద్యులు ఎంపికయ్యారు. ఈ నెల 16న విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పాలక మండలి సమావేశంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులుగా శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సీహెచ్ సుధాకర్, విజయవాడకు చెందిన ఆర్థో ఆచార్యుడు డాక్టర్ సూరపనేని సురేష్‌బాబులను ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రతిపాదించగా దానికి ఆమోదం లభించింది. వారిద్దరు త్వరలో నిర్వహించే ఏపీ మెడికల్ కౌన్సిల్ పాలక మండలి సమావేశానికి హాజరుకావాలని ఆరోగ్య వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి సూచించారు.

ఫైనాన్స్ కమిటీకి ముగ్గురు.. : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఫైనాన్స్ కమిటీ సభ్యులుగా గుంటూరు వైద్య కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ జి. సుబ్బారావు, కడపకు చెందిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ టి.డి.వరుణ్‌కుమార్ రెడ్డి, విజయవాడకు చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వై.సాయి కిశోర్ ఎంపికైనట్లు రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. ఫైనాన్స్ కమిటీ సమావేశాలకు ఆ ముగ్గురు హాజరు కావాలని సూచించారు.

ఒకరు బోధిస్తారు.. మరొకరు దోచేస్తారు..!

లొంగిపోయిన మావోయిస్టు దంపతులు కృష్ణా జిల్లా వారే

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో డీజీపీ హరీశ్‌కుమార్ ఎదుట శనివారం ఇద్దరు మావోయిస్టు దంపతులు లొంగిపోయారు. వీరు కృష్ణా జిల్లాకు చెందిన జోరిగె నాగరాజు అలియాస్ కమలేశ్, ఆతని భార్య మేడక జ్యోతీశ్వరి. అతడిది కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకి గ్రామం కాగా.. ఆమెది గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామం.

పార్టీలో ఎన్నో పదవులు..

కప్పలదొడ్డి గ్రామానికి చెందిన జ్యోతీశ్వరికి పలు పేర్లు ఉన్నాయి. అరుణ, సరిత, మాలతి, తరుణ అనే మారు పేర్లు ఉన్నాయి. పెనమలూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. 1997లో మావోయిస్టు పార్టీ సభ్యురాలిగా చేరారు. ఆర్కేకి సహాయకుడిగా పనిచేస్తున్న జోరిగె నాగరాజును ఆమె వివాహం చేసుకున్నారు. తర్వాత దాచేపల్లి దళం, బెల్లంకొండ, కృష్ణపట్టి, రాచకొండ దళంలో పనిచేశారు. 2001లో పేరు ప్రఖ్యాతులు పొందారు. డివిజనల్ కమిటీ సభ్యురాలిగా రాచకొండ, కృష్ణపట్టి దళాల్లో పని చేశారు. 2006లో డివిజనల్ కమిటీ సభ్యురాలిగా బస్తర్ ప్రాంతానికి పంపించారు. 2008లో మహిళా విభాగ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. తర్వాత పలు పదవులు పొందిన తర్వాత, జోనల్ సబ్ డివిజనల్ కమిటీ ఇన్‌ఛార్జిగా 2022 వరకు కొనసాగారు. మల్టిపుల్ ఎడిమిక్ పొలిటికల్ ఎడ్యుకేషనల్ వర్క్‌షాప్ ఉపాధ్యాయురాలిగా నార్త్ సబ్ జోనల్ బ్యూరోలో పని చేశారు. ఆమెపై రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల రివార్డు కూడా ప్రకటించింది.

ఐటీఐ చదివే రోజుల్లోనే..

పోరంకికి చెందిన జోరిగె నాగరాజు.. పెనమలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివారు. గొల్లపూడిలో ఐటీఐ పూర్తిచేశారు. ఆ సమయంలోనే నక్సలిజం పట్ల ఆకర్షితులై 1991లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్‌లో చేరారు. 1993లో మావోయిస్టు పార్టీ సభ్యుడిగా ఆర్కేకు కొరియర్‌గా పనిచేశారు. అంచెలంచెలుగా ఏరియా కమిటీ సభ్యుడిగా 1998లో పదోన్నతి పొంది పలు దళాల్లో పనిచేశారు. గుత్తికొండ ఏరియా కమిటీ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. 2006లో దండకారణ్య ప్రాంతానికి బదిలీ అయ్యారు. అక్కడ డివిజనల్ కమిటీ సభ్యుడిగా చేరి 2014 వరకు తూర్పు బస్తర్‌లో పనిచేశారు. 2014 నుంచి 2019 వరకు నార్త్ బస్తర్ డివిజనల్ కమిటీ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. తర్వాత తూర్పు బస్తర్‌కు బదిలీ అయ్యారు. 2025 జూన్ వరకు కమిటీ ఇన్‌ఛార్జిగా పని చేశారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్‌లలో అనేక నేరాల్లో పాల్గొన్నారు. నరసరావుపేట డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ శిబిరంపై 2001లో దాడి చేశారు. లైట్నింగ్ మిషన్‌గన్, 30 రైఫిల్స్ దోచుకున్నారు. 2003లో ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి 4 తుపాకులు, 500 రౌండ్ల బుల్లెట్లు దోచుకుని పోలీస్ స్టేషన్‌పై దాడులకు పాల్పడ్డారు. ఈయనపై ఏపీ ప్రభుత్వం రూ.20 లక్షల రివార్డు ప్రకటించింది.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌పై విచారణకు మూడు కమిటీలు

విజయవాడ వైద్యం: విజయవాడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ నాగేశమ్మపై శాఖాపరమైన విచారణకు మూడు కమిటీలు ఏర్పాటయ్యాయి. అందులో ఒక కమిటీ సగం విచారణ పూర్తి చేసింది. అడిషనల్ డీఎంఈ డా.వెంకటేష్‌తో పాటు మరో రెండు కమిటీలు విచారణ నిర్వహిస్తున్నాయి. ఇప్పటివరకు జరిగిన విచారణలో మెస్ బిల్లుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఒక్కో కమిటీ వద్ద ఆమెపై వచ్చిన ఆరోపణలు 15 పేజీలు ఉన్నాయని, మూడు విచారణ కమిటీల వద్ద సుమారు 50 పేజీలకుపైగా ఆరోపణలున్నట్లు తెలిసింది. పరీక్షల ఫీజులు చెల్లింపుల సమయంలోనూ ఆమె అదనంగా వసూలు చేశారని తెలిసింది. విద్యార్థినులను దూషించడమే కాకుండా, కళాశాల ఆవరణలోనే ఓ గదిలో తిష్ఠ వేసి కొంతమంది విద్యార్థినులతో పనులు చేయించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

రాష్ట్రాభివృద్ధిలో యువ సర్జన్ల పాత్ర కీలకం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధిలో యువ సర్జన్లు కీలకపాత్ర పోషించాలని, నైపుణ్యాభివృద్ధిని మరింత పెంపొందించుకోవాలని కానూరు సిద్ధార్థ విశ్వవిద్యాలయం ఉప కులపతి పరుచూరి వెంకటేశ్వరరావు, అవారా వ్యవస్థాపకుడు, ఆచార్యులు డాక్టర్ అజయ్ కాట్రగడ్డ అన్నారు. విజయవాడ ఆర్థోపెడిక్ సొసైటీ (వీవోఎస్) ఆధ్వర్యంలో శనివారం స్థానిక నోవోటెల్ హోటల్‌లో జాతీయ వైద్య సదస్సు నిర్వహించారు. దాదాపు 200 మంది యువ వైద్యులు, పీజీ విద్యార్థులు హాజరై శస్త్ర చికిత్స నైపుణ్యాలను తిలకించారు. అత్యాధునిక చికిత్సా విధానాలను ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు దృశ్య మాధ్యమాల ద్వారా వివరించారు. తొలుత యువ సర్జన్ల నైపుణ్యాలను పెంచే 'బెజవాడ ఎసిటాబులం కోర్సు' వివరాలను ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు బెజవాడ పాపారావు వివరించారు. యువ సర్జన్లకు, భవిష్యత్ వైద్యులకు ఆధునిక చికిత్సా విధానాలను అందిస్తే ప్రజలకు మెరుగైన చికిత్స చేరువ అవుతుందని అన్నారు. సదస్సులో విజయవాడ ఆర్థోపెడిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎం.జె. నాయుడు, కార్యదర్శి కల్లపూడి వాసు, కోశాధికారి ఎస్.విజయ్ కుమార్, వైద్యులు ఉప్పలపాటి వెంకట రమణ, ఎం.హరిశర్మ, అతుల్ పాటిల్, సునీల్ గవాస్కర్, కాషా శ్రీనివాస్ మాట్లాడారు.



జ్యోతి వెలిగిస్తున్న అజయ్, పాపారావు, వాసు, ఎంజే నాయుడు తదితరులు

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

రాఘవయ్యపార్క్, కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల కాలనీలు శిబిరాల్లా ఉన్నాయని.. కనీస సౌకర్యాలు లేవన్నారు. మునక ప్రాంతాలను తప్పుగా గుర్తించారని విమర్శించారు. మునిగిపోయే ప్రాంతాల నిర్వాసితులకు మళ్లీ ముంపులోనే కాలనీలు కట్టించడం సరైందికాదన్నారు. అక్కడ తాగు నీటి సౌకర్యం లేదని, కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం డ్యామ్ గురించి తప్పించి.. పునరావాసంపై సమీక్ష చేసిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. పునరావాస జాబితా అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాల నిమిత్తం నిర్వాసితుల వద్ద డబ్బులు తీసుకున్న గుత్తేదార్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సమీక్ష చేపట్టి సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్వర్ణాంధ్ర 2047 అనేది కార్పొరేట్ల కోసం.. కార్పొరేట్లతో తయారు చేసిన ప్రణాళిక అంటూ ధ్వజమెత్తారు. విజన్ పేరుతో ఇష్టారాజ్యంగా భూములు కేటాయిస్తున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో గ్రామసభ తీర్మానం లేకుండా 7వేల ఎకరాలు కంపెనీలకు కేటాయిస్తూ.. రహస్య జీవోలు జారీచేయడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కరేడులో పెద్ద పోరాటం నడుస్తోందని, అక్కడ ప్రాజెక్టు వద్దని గ్రామసభలో తీర్మానం చేసినప్పటికీ ప్రభుత్వం దొడ్డిదారిన కొద్దిమందిని పిలిపించుకుని సభలు పెట్టిందన్నారు. నెల్లూరు జిల్లా లింగసముద్రంలో జిందాల్ కంపెనీకి ఐరన్ ఓర్ గనులు కేటాయించారని, అసలు కంపెనీయే లేకుండా గనులు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఓటరు జాబితాల సవరణ.. నిరంతరం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఒకప్పుడు సార్వత్రిక ఎన్నికల తరుణంలోనే ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ గుర్తుకు వచ్చేది. అప్పటికప్పుడు హడావుడిగా వెళ్లి ఓటర్లుగా చేరడం, సవరణలు కోరడం జరిగేవి. ఇప్పుడు నిరంతర ప్రక్రియగా మారిపోయింది. ముఖ్యంగా బూత్ స్థాయి అధికారుల (బీఎల్వోల) వ్యవస్థను పటిష్ఠ పరుస్తున్నారు. వీరికి ఆఫ్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, ఆన్‌లైన్‌లో పరీక్షలు రాయించడం వంటివి చేపట్టారు. ఇవి ఈ నెల 2 నుంచి 13 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జరిగాయి. ఈ నెల 14, 15 తేదీల్లో మరోసారి పరీక్షలు నిర్వహించగా, ఉత్తీర్ణత సాధించారు. పరిశీలన నిమిత్తం ఇంటింటా తిరగాల్సి ఉండడంతో.. స్థానికుల నుంచి ఇబ్బందులు ఎదురు కాకుండా బీఎల్వోలకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు.

ఏటా జనవరి మొదటి వారంలో తుది ఓటర్ల జాబితాలు ప్రకటిస్తారు. ఆ మరుసటి రోజు నుంచి జాబితాల సవరణ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇలా..

వివరం	ఫారం–6 (నమోదు)	ఫారం–7 (తొలగింపు)	ఫారం–8 (సవరణ/బదిలీ)
స్వీకరించిన ఫారాలు	3,849	6,059	6,821
అంగీకరించినవి	2,788	4,047	5,309
తిస్కరించినవి	670	1,608	960
పెండింగ్	391	404	552



జూన్‌లో దిల్లీలో శిక్షణ: జిల్లాలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించే ముందు, ఎంపిక చేసిన బీఎల్వోలకు గత నెలలో దిల్లీలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వీరు అక్కడ మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొంది, నియోజకవర్గాల్లో శిక్షణ ఇచ్చారు. దేశ స్థాయిలో ట్రిపుల్ ఐ-డీఈఎం (ఇండియా ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్-డెమొక్రసీ ఎలక్ట్రోరల్ మేనేజ్‌మెంట్), రాష్ట్ర స్థాయిలో ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) పర్యవేక్షిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

జిల్లాలో మొత్తం 1,792 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒకటో కేటగిరి కింద ఒక పోలింగ్ బూత్‌లో 1500 మంది ఓటర్లు దాటితే.. నూతన కేంద్రం ఏర్పాటు చేయడమో లేదా అదే ప్రాంతంలో ఉన్న మరో కేంద్రానికి మార్చడమో చేసే విధంగా హేతుబద్ధీకరణ చేపట్టారు.

పార్టీల అభిప్రాయ సేకరణ

జిల్లాలో 1500 మంది ఓటర్లు దాటిన బూత్‌లు మైలవరం నియోజకవర్గంలో ఒకటి, నందిగామ నియోజకవర్గంలో రెండు ఉన్నాయి. రెండో కేటగిరి కింద 1200లకు పైన, 1500లకు లోపల ఓటర్లు ఉంటే హేతుబద్ధీకరణ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇలాంటివి జిల్లాలో 292 బూత్‌లను గుర్తించారు. హేతుబద్ధీకరణపై రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకుంటున్నారు.

18, 19న దిల్లీలో మహాధర్నా



ప్రచార ప్రతులు ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

చిట్టినగర్: బీసీల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 18, 19 తేదీల్లో దిల్లీ జంతర్‌మంతర్‌లో జాతీయ స్థాయిలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ఇన్‌ఛార్జి వై.నూకాలమ్మ చెప్పారు. శనివారం చిట్టినగర్‌లోని నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి ఆలయ స్నాన మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యం దామాషా ప్రకారం పెరగాల్సి ఉందన్నారు. ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామని అన్నారు. ఏపీ నుంచి 1000 మంది బీసీ నాయకులు ఈ ధర్నాలో పాల్గొంటారని వివరించారు. అనంతరం మహాధర్నా ప్రచార ప్రతులు ఆవిష్కరించారు. బీసీ సంక్షేమ సంఘ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనిశెట్టి లక్ష్మణరావు, సంఘ న్యాయ సలహాదారు పిళ్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు నమ్మి భానుప్రకాష్ యాదవ్, టి.దుర్గారావు, బాడిత రూపేష్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం.. మంత్రముగ్ధం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం (సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ) నెలవారీ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో చెన్నైకి చెందిన కృపా సెంటర్ ఫర్ ఫైన్ ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన 'తకిట తత్ ధుం' భారత నాట్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. లయాన్విత ప్రకృతి, లయబద్ధ జీవితం కథాంశంగా.. సాగిన నాట్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రముఖ నాట్యాచారిణి సాయికృపప్రసన్నను కళాపీఠం కార్యదర్శి బి.వి.ఎస్.ప్రకాశ్, కార్యవర్గ సభ్యుడు తాతినేని శ్రీహరిరావు సత్కరించారు.

చిన్నారుల వికాసం.. సంక్షేమం కీలకం



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : మిషన్ వాత్సల్యను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. శిశు వికాస ప్రగతి సూచికలపై దృష్టిపెట్టాలని, చిన్నారుల క్షేమం, సంక్షేమం రెండూ కీలకమేనని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, శిశు సంక్షేమ కమిటీలతో కలిసి పని చేయాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో మిషన్ వాత్సల్య సమన్వయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 2023-24 నుంచి 2024-25 వరకు తల్లి లేదా తండ్రి లేని, తల్లిదండ్రులు లేని 18 సంవత్సరాల వయసు లోపు ఉన్న 551 మంది బాల, బాలికలకు ఈ పథకం ద్వారా నెలకు రూ.4.000ల చొప్పున సుమారు రూ.2.73 కోట్ల మేర ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. జిల్లాలోని 16 బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా నాణ్యమైన, పారదర్శకమైన సేవలను అందించాలని, రెస్క్యూ చేసిన బాల, బాలికలను జువైనల్ జస్టిస్ ఎదుట హాజరు పరిచి, వారి ఆదేశాల మేరకు బాలల సంరక్షణ కేంద్రాల్లో వసతి కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం, జువైనల్ విభాగ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ సువార్త, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, డీపీవోలు సత్యవతి, జ్యోతి, సీడబ్ల్యూసీ సభ్యుడు రవి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి సమాచారం



ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి అంతరాలయంలో వేకువ జామున ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, 3.30 గంటలకు వస్త్రాలంకరణ సేవ, 4గంటలకు దేవి ఖడ్గమాలార్చన నిర్వహిస్తారు.

ఉదయం భక్తులకు సర్వదర్శనం వేకువ జామున 5 గంటల నుంచి క్యూలైన్లో అనుమతిస్తారు. యాగశాలలో ఉదయం 6.30కి గణపతి హోమం, 7కి రుద్రహోమం, 7.30 గంటలకు నవగ్రహ శాంతి హోమం, 8కి మృత్యుంజయ హోమం, 8.30కి చండీహోమం నిర్వహిస్తారు. ప్రాకార మండపంలో ఉదయం 7.30 గంటలకు లక్ష కుంకుమార్చన, 8 గంటలకు శ్రీచక్ర నవావరణార్చన, మల్లేశ్వరాలయ ప్రాంగణంలో 9 గంటలకు శాంతి కల్యాణం ఆర్జిత సేవలుగా చేస్తారు.

మధ్యాహ్నం అమ్మవారికి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పంచభోగ నివేదన చేస్తారు. అన్ని దర్శనం క్యూలైన్లు నిలిపివేస్తారు. వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలు ఈ సమయంలో ఉండవు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5.30 వరకు దర్శనాలకు భక్తులను అనుమతిస్తారు.

సాయంత్రం దుర్గమ్మకు సాయంత్రం 4గంటలకు స్వర్ణపుష్పార్చన సేవ(గురువారం మాత్రమే), 6 నుంచి 7 గంటల వరకు నివేదన, వేద స్వస్తి, పంచ హారతులు నిర్వహిస్తారు. అన్ని దర్శనాలను ఈ సమయంలో నిలిపివేస్తారు. రాత్రి 7 నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

★ రోజూ రాహు కాలంలో నటరాజస్వామి ఆలయ ప్రాంగణంలో రాహుకేతు పూజలు జరుగుతాయి. ఆర్జిత సేవలకు టిక్కెట్ రుసుము చెల్లించిన భక్తులను మాత్రమే అనుమతిస్తారు.

www.kanakadurgamma.com,https://www.aptemples.ap.gov.in వెబ్ సైట్ల ద్వారా ఆర్జిత సేవా టిక్కెట్లు, ఇతర సమాచారం అందుబాటులో ఉంది. వాట్స్ యాప్ నంబర్ 95523 00009 ఆర్జిత సేవలు, దర్శనం టిక్కెట్లు, విరాళాలను ఇచ్చేందుకు అవకాశం ఉంది.

★ ఉదయం 11 నుంచి 3 గంటల వరకు మల్లికార్జున మహా మండపం రెండో అంతస్తులో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తారు.

'గురువుల వేతనాల సమస్య, పరిష్కరించడంలో విఫలం'

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : బదిలీలు జరిగి 45 రోజులు కావస్తున్నా.. ఉపాధ్యాయుల వేతనాల సమస్య పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. జీవో విడుదల చేసి పొజిషన్ ఐడీలు కేటాయిస్తే మార్గం సుగమం అవుతుందని తెలిపారు. బదిలీయైన ఉపాధ్యాయులకు వేతనాల ఇవ్వాలని, బోధనేతర పనులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ఎంజీ రోడ్డులోని డీఈఓ కార్యాలయం ముందు శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొజిషన్ ఐడీలు లేకపోవడం వల్ల జూన్, జులై వేతనాలను డీడీవో చేయడానికి ఆటంకం కలిగిందని, ఫలితంగా రాష్ట్రంలో బదిలీ అయిన 25 వేల మందికి రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికత అభివృద్ధి చెందినా పొజిషన్ ఐడీలు, క్యాడర్ స్ట్రెంత్ వివరాలు రాష్ట్ర స్థాయి నుంచి డీటీవోలకు పంపడంలో అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. గురువులు యాప్‌లతో పడుతున్న ఇబ్బందులు తెలుసుకోవాలంటే ఉన్నతాధికారులు వారం పాటు ఉపాధ్యాయుడిగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ మాట్లాడుతూ.. హైస్కూల్ ప్లస్‌లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య, సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, పి.లీల, కోశాధికారి పి.నాగేశ్వరరావు, కార్యదర్శి డి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మ్యాజిక్ డ్రెయిన్ల పరిశీలన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: సోమవరం గ్రామంలో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్లను శనివారం రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్తు సీఈవోలు పరిశీలించారు. కృష్ణా, గుంటూరు, చిత్తూరు జడ్పీ సీఈవోలు కన్నమనాయుడు, జ్యోతిబసు, రవికుమార్ తదితరులు డ్రెయిన్లు నిర్మించిన తీరును తెలుసుకున్నారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. వర్షం నీరంతా మ్యాజిక్ డ్రెయిన్లలో ఇంకిపోవడాన్ని గమనించారు.



డ్రెయిన్ల నిర్మించిన తీరును తెలుసుకుంటున్న జడ్పీ సీఈవోలు

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -114 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

డిగ్రీ చదువు.. కొలువులకు నెలవు

Advt Special Feature

డిగ్రీ విద్యతో.. ఉద్యోగానికి బాటలు

విజయవాడ సిటీ: డిగ్రీ కోర్సులకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఎన్నో కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. దాంతో కళాశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయి. ఏటా డిగ్రీ చదువుతుండగా బహుళ జాతి సంస్థలు కళాశాలలకు వస్తున్నాయి. ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులను కొలువులకు ఎంపిక చేస్తున్నాయి. ప్రాంగణ ఎంపికల్లో కొలువులు సాధించిన ఎంతో మంది యువకులు ప్రస్తుతం రూ. లక్షల్లో వేతనాలు అందుకుంటున్నారు.

డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం

★ ఇంటర్న్‌షిప్‌లో 20 నుంచి నాలుగు క్రెడిట్లకు తగ్గింపు ★ మూడేళ్ల డిగ్రీలో 10 క్రెడిట్లు తగ్గుదల ★ ఈ ఏడాది నుంచి అమలుకు ప్రభుత్వం ఆదేశాలు

డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉన్న సింగిల్ మేజర్‌లో కొన్ని మార్పులు చేసింది. సింగిల్ మేజర్ సబ్జెక్టుకు ప్రస్తుతం 60 క్రెడిట్లు ఉండగా.. దాన్ని మేజర్ కోర్, ఎలెక్టివ్‌గా పేర్కొంటూ 60 క్రెడిట్లు కేటాయించింది. మూడేళ్ల డిగ్రీలో ప్రస్తుతం 136 క్రెడిట్లు ఉండగా.. దాన్ని 126 క్రెడిట్లకు కుదించింది. మూడేళ్లలో 10 నెలల ఇంటర్న్‌షిప్‌నకు 20 క్రెడిట్లు ఉండగా... వాటిని నాలుగు క్రెడిట్లకు తగ్గించింది. ప్రస్తుతం మొదటి ఏడాది వేసవి సెలవుల్లో రెండు నెలల కమ్యూనిటీ ప్రాజెక్టు వర్క్, రెండో ఏడాది సెలవుల్లో రెండు నెలల స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌నకు నాలుగేసి చొప్పున మొత్తం 8 క్రెడిట్లు ఇస్తున్నారు. మూడో ఏడాది సెమిస్టర్ ఇంటర్న్‌షిప్‌నకు 12 క్రెడిట్లు ఉన్నాయి. ఇప్పుడు దాని వెయిటేజీ నాలుగు క్రెడిట్లకు తగ్గించారు. మేజర్ కోర్ సబ్జెక్టుకు 44 క్రెడిట్లు, మేజర్ ఎలెక్టివ్‌కు 16 క్రెడిట్ల చొప్పున కేటాయించింది. మూడు సెమిస్టర్ల పాటు ఆంగ్లం, మాతృ భాష సబ్జెక్టులు ఉంటాయి. వాటికి సెమిస్టర్‌కు మూడు క్రెడిట్ల చొప్పున 18 క్రెడిట్లు కేటాయించింది. ప్రస్తుతం నాలుగేళ్ల డిగ్రీ అమల్లో ఉండగా... మూడో ఏడాదిలో బయటకు వెళ్లే ఐచ్ఛికం ఉంది. ప్రస్తుతం జారీ చేసిన క్రెడిట్ ఫ్రేమ్‌లో మూడేళ్ల డిగ్రీ మాత్రమే ఉంది. నాలుగో ఏడాది ఉంటుందా? లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొంది.

మూడేళ్ల డిగ్రీ ఇలా

యూజీ ప్రోగ్రాం	క్రెడిట్లు
మేజర్ సబ్జెక్టు కోర్	44
మేజర్ ఎలెక్టివ్	16
మైనర్ సబ్జెక్టు	24
బహుళ కోర్సులు	6
సామర్థ్య పెంపుదల కోర్సులు (భాషలు)	18
నైపుణ్యాల పెంపుదల కోర్సులు	12
వాల్యూ యాడెడ్ కోర్సులు	2
ఇంటర్న్‌షిప్	4
మొత్తం క్రెడిట్లు	126

డిగ్రీ సింగిల్ మేజరు విధానం

★ డిగ్రీలో ఏదైతే మేజర్ సబ్జెక్టు తీసుకుంటారో దానిలోనే పీజీ చేయొచ్చు

★ డిగ్రీలో ఏదైతే మైనర్ సబ్జెక్టుగా తీసుకుంటారో అందులోనే పీజీ చేయొచ్చు

★ డిగ్రీలో తీసుకున్న గ్రూప్‌నకు అనుగుణంగా 4 ఎలెక్టివ్ పేపర్లు ఉంటాయి. అవి వారు తీసుకున్న సబ్జెక్టుకి సపోర్టుగా మాత్రమే ఉపయోగపడతాయి. 16 క్రెడిట్లు వస్తాయి. కానీ అదే ఎలెక్టివ్ సబ్జెక్టులో పీజీ చేయడానికి వీలు లేదు.

క్వాంటమ్ కంప్యూటర్ ..

డిగ్రీలో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ తీసుకున్న విద్యార్థులందరికీ క్వాంటమ్ కంప్యూటర్ అనేది మైనర్ సబ్జెక్టు. మిగిలిన డిగ్రీ కోర్సుల వారు కూడా తీసుకోవచ్చు. అది వారి సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.







పింఛను పథక పునఃపరిశీలనపై సమీక్ష

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఎన్టీఆర్ భరోసా పింఛను పథకంలో విభిన్న ప్రతిభావంతుల పునఃపరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వినికిడి, మానసిక, బహుళ వైకల్యం తదితరాల కింద ఇప్పటి వరకు 15,607 మంది లబ్ధిదారులను పునఃపరిశీలన చేసినట్లు చెప్పారు. ఇంకా 11,628 మంది మిగిలి ఉన్నారని, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన మిగతావి పూర్తి చేయాలన్నారు. డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, డీఎంహెచ్‌వో ఎం.సుహాసినీ తదితరులు పాల్గొన్నారు.







తెల్లారిపోతున్నారు..!

నెల రోజుల్లో నలుగురు ఏపీ పోలీసులు మృతి

■ శనివారం తెల్లవారుజామున 4:45 నిమిషాలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏపీ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌కు చెందిన ఇద్దరు డీఎస్పీలు మృతి చెందగా, మరో అదనపు ఎస్పీ, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు.

■ జూన్ 26న.. తెల్లవారుజామున 5 గంటల సమయంలో కోదాడ పరిధిలోని దుర్గాపురం వద్ద ముందున్న లారీని దాటే క్రమంలో జరిగిన ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏపీలోని కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్సై, కానిస్టేబుల్ దుర్మరణం చెందారు.

■ జూన్ 4న తెల్లవారుజామున 4:30 నిమిషాలకు కైతాపురం స్టేజీ దాటాక ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి ట్రావెల్ బస్సు బలంగా ఢీకొనడంతో డ్రైవర్, ప్రయాణికురాలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న 18 మంది తీవ్రంగా గాయపడ్డారు.

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే

ఈ ప్రమాద ఘటనలను పరిశీలిస్తే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో తెల్లవారుజామునే అధికంగా ఉంటున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ 8-10 మధ్యలో, అర్ధ రాత్రి 12-2 గంటల మధ్యలో, తెల్లవారు జాము 4-6 మధ్యలో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు.



మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, పక్కన తెలంగాణ పోలీసు అధికారులు

ఈ వరుస ప్రమాదాలకు గల కారణాలపై రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబును 'ఈనాడు-ఈటీవీ' సంప్రదించగా ఆయన పలు విషయాలను వెల్లడించారు. అర్ధరాత్రి తర్వాత జరిగే ప్రమాదాల్లో అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు ప్రధాన కారణమని తమ అధ్యయనంలో తేలిందన్నారు. 90 శాతం ప్రమాదాలు మానవ తప్పిదాలతోనే జరుగుతుండగా, మిగతా పది శాతం ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా చర్యలను చేపట్టకపోవడమే కారణమన్నారు.

☛ రాచకొండ కమిషనరేట్ పరిధిలో జరిగే ప్రమాదాల్లో దానికి గల కారణాలను తెలుసుకునేందుకు యాక్సిడెంట్ అనాలసిస్ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ టీంలో రోడ్డు సేఫ్టీ డీసీపీ, లా అండ్ ఆర్డర్ డీసీపీ, ట్రాఫిక్ డీసీపీ, ఎన్‌హెచ్‌ఏఐ, స్థానిక అధికారులు అందరు ఉంటారని తెలిపారు. ఒక యాప్‌ను కూడా రూపొందించామని, ప్రమాదం జరగడానికి గల కారణం గుర్తించి.. అక్కడ చేపట్టాల్సిన భద్రతా చర్యలను యాప్‌లో నమోదు చేస్తారన్నారు.

☛ సాధ్యమైనంత వరకు అర్ధరాత్రి ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. డ్రైవింగ్ మొదలు పెట్టిన రెండున్నర గంటల తర్వాత పరధ్యానం మొదలవుతుంది. కనుక రెండున్నర గంటల తర్వాత వాహనం నిలిపి డ్రైవర్ కొద్దిసేపు నడవాలి.

శిక్షణ ఇప్పించండి.. కొలువులు కల్పించండి

కరెన్సీనగర్, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ఈనాడు మీతోడు

'ఈనాడు- మీతోడు' ఆధ్వర్యంలో జిల్లా నైపుణ్య శిక్షణ అధికారి ఎస్. శ్రీనివాసరావుతో నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి యువత, తల్లిదండ్రులు ఫోన్లు చేసి ఉపాధి అవకాశాల గురించి తెలుసుకున్నారు. సందేహాలు నివృత్తి చేసుకున్నారు. విద్యార్హతలు ఉన్నాయి.. ఉపాధి కల్పించాలని కొందరు, తాము కొలువులు సాధించడానికి అవసరమైన శిక్షణ ఇప్పించాలని మరికొందరు కోరారు.

? ఇంటర్, డిగ్రీ చదువుకున్నాం. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా తీసుకుంటున్నారు. ఆ శిక్షణకు బయట ఎక్కువ ఖర్చు అవుతోంది. మీరు ఉచితంగా శిక్షణ ఇస్తారా? **- వి.విజయలక్ష్మి పటమట, శామ్యూల్ ప్రకాశ్‌నగర్, రవికిశోర్ భవానీపురం, జి.రమేశ్ కంచికచర్ల.**

నైపుణ్య శిక్షణ అధికారి : పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినా, చేయకపోయినా డేటా ఎంట్రీ ఆపరేటర్, మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నాం. 3 నుంచి 5 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుంది.

? బీటెక్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ చేశాం. ఖాళీగా ఉంటున్నాం. నైపుణ్య శిక్షణ సంస్థ ద్వారా కొలువు సాధించాలంటే ఎలా? **- నాగమల్లేశ్వరరావు మచిలీపట్నం, సీహెచ్ గణేశ్ చింతలపూడి, ఎం.ఆనంద్ కృష్ణలంక**

✔ ప్రైవేట్ సంస్థల్లో కొలువు కావాలంటే నైపుణ్యం డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మీ విద్యార్హతలకు అనుగుణంగా కొలువుల వివరాలు పంపిస్తారు. మీరే ఎంపిక చేసుకోవచ్చు.

జిల్లా నైపుణ్య శిక్షణ అధికారి ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

? జిల్లా వాసులు రాష్ట్రేతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వర్క్ ఫ్రం హోం ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి. వారు ఉంటే రాష్ట్రానికి మేలు. **- డి.బాబూరావు జగ్గయ్యపేట, సీహెచ్ భార్గవి కొత్తూరు తాడేపల్లి, ఎస్. మాధవి తిరువూరు, సుమతి మైలవరం, సునీత ఇబ్రహీంపట్నం, బాషా కొండపల్లి.**

✔ ఇప్పటికే గన్నవరం మేధా టవర్స్‌లో ఐటీ సంస్థలు నడుస్తున్నాయి. వర్క్‌ఫ్రం హోం కొలువుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారులు సంస్థల ప్రతినిధులతో చర్చిస్తున్నారు.

? బీటెక్, డిగ్రీ చదువుకున్నాం. ప్రైవేట్ కొలువు సాధించడానికి సాఫ్ట్‌వేర్, ఏఐ, మెషిన్ లెర్నింగ్‌లో శిక్షణ ఇస్తారా? **- ఎస్.సాగర్‌బాబు కండ్రిక, ప్రవీణ్ కుమార్ రాజీవ్‌నగర్, ఎం. ఆనంద్.. ఆర్.మల్లిక గాంధీనగర్, ఆర్.ధనుంజయరావు సూర్యారావుపేట, కె.శ్రీవాణి ఆకునూరు, డి.సతీష్ వన్‌టౌన్, రామకృష్ణ పోరంకి.**



సమాధానాలు ఇస్తున్న శ్రీనివాసరావు

✔ సాఫ్ట్‌వేర్, ఏఐ, మెషిన్ లెర్నింగ్ కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇస్తాం. ముందుగా నైపుణ్యం డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కావాలి. ఫలితంగా జాబ్‌మేళాలకు హాజరు కావచ్చు. కొలువులకు ఎంపికైతే ప్రస్తుతం కొన్ని సంస్థలే శిక్షణ ఇస్తున్నాయి.

? ఫొటోగ్రఫీలో శిక్షణ ఇస్తారా? వివరాలు? **- లక్ష్మీనారాయణ నందిగామ, బి.శంకర్ గాయత్రినగర్, ఎం.వినయ్ వన్‌టౌన్**

✔ నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నం, తిరుపతిలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

క్వాంటం వ్యాలీతో ఉజ్వల భవిష్యత్తు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమైన క్వాంటం వ్యాలీతో రాష్ట్రంతో పాటు దేశ ముఖచిత్రమే మారబోతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రంలో ప్రారంభం కానున్న క్వాంటం వ్యాలీలో యువతకు ఉజ్వల భవిష్యత్ సాకారమవుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ క్వాంటం వ్యాలీ ఇక్కడ ఏర్పాటు చేసేందుకు తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. విస్సన్నపేట శ్రీశ్రీ డిగ్రీ కళాశాలలో కేశినేని ఫౌండేషన్, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమలు ఏర్పాటుకు సిద్ధమైందన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త, ఉద్యోగి ఉండాలన్నదే లక్ష్యంగా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర అమలు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో తిరువూరులో లెదర్ పార్క్ పరిశ్రమ ప్రారంభిస్తామన్నారు. ఉద్యోగ మేళాలో 20కి పైగా కంపెనీల అధికారులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి 2 వేల మంది పాల్గొన్నారు. ఆర్డీవో మాధురి, ఏఎంసీ ఛైర్మన్ లక్ష్మీఅనిత, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మునియ్య, తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు రాజేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, తెదేపా మండలాధ్యక్షుడు సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, పక్కన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, అధికారులు

ఉపాధి హామీ సిబ్బందికి రూ.33 లక్షల జరిమానా

గంపలగూడెం, న్యూస్‌టుడే: గత ఆర్థిక ఏడాదిలో మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు భారీగా జరిగినట్లు సామాజిక తనిఖీల ద్వారా వెల్లడైంది. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు సామాజిక తనిఖీలు నిర్వహించారు. వీటి నివేదికలను సమర్పించేందుకు మండల స్థాయిలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రజా వేదిక శుక్రవారం రాత్రి ముగిసింది. జిల్లా నీటి నిర్వహణ సంస్థ పథక సంచాలకుడు ఎ.రాము రెండు రోజులపాటు ప్రజావేదికలో పాల్గొని పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలను సామాజిక తనిఖీ నివేదికల ద్వారా గుర్తించారు. బినామీ ఎఫ్ఏతో సత్యాలపాడులో రూ.54 లక్షల విలువైన పనులు నిర్వహించినట్లు గుర్తించి పూర్వ ఏపీవో వెంకటేశ్వరరావును తీవ్రంగా మందలించారు. లింగాలలో జరిగిన అవకతవకలపై సదరు సిబ్బందిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గతేడాది మండలంలో రూ.17.45 కోట్ల విలువైన 1486 ఉపాధి పనులు, రూ.5.4 కోట్ల విలువైన పంచాయతీ రాజ్ పనులు నిర్వహించారు. మొత్తం రూ.22.86 కోట్లు విలువైన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. రూ.3.86 కోట్ల విలువైన 800 పనుల్లో లోపాలు ఉన్నట్లు సిబ్బంది నివేదికలు అందించారు. విచారణానంతరం 200 పనులకు సంబంధించి రూ.18 లక్షలు సిబ్బంది వాపసు చెల్లించాలని (రికవరీ), 270 పనులకు సంబంధించి రూ.15 లక్షలు సిబ్బందికి జరిమానాను డ్వామా పీడీ రాము విధించారు. ఏపీడీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నివేదికలు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాము, అధికారులు

సీపీఎం నాయకులపై కేసు కొట్టివేత

మధురానగర్, న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్‌లోని హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని కోరుతూ శాంతియుత ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసును న్యాయస్థానం కొట్టివేసింది. 2023, జూన్ 9న హిందూ శ్మశాన వాటికలో దెబ్బతిన్న రేకుల షెడ్‌ను పునర్నిర్మించాలని, దహన సంస్కారాలను సక్రమంగా చేసేకునే అవకాశం కల్పించాలని కోరుతూ సీపీఎం నాయకులు సి. హెచ్.బాబూరావు, రమణారావు, దుర్గారావు తదితర ఆందోళనలు చేపట్టారు. వీరిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేయగా.. దాన్ని కొట్టి వేస్తూ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ సూచనలతో న్యాయవాదులు సప్పా రమేష్, ప్రేమ.. నాయకులకు న్యాయ సహాయం అందించారు.

కట్లేరు వంతెన వద్ద రాకపోకల నిలిపివేత



ప్రవహిస్తున్న నీటిలో వెళ్తున్న ప్రయాణికులు

మండలంలోని వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద మళ్లింపు రహదారిపై రాకపోకలను పోలీసులు మళ్లీ ఆపేశారు. భారీ వర్షాలతో కట్లేరుకు చేరిన వరద నీరు వంతెన వద్ద మళ్లింపు రోడ్డుపై ప్రవహించడం ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా గత బుధవారం నుంచి రాకపోకలను ఆపేశారు. వరద తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు పాదచారులు, ద్విచక్ర వాహనదారుల ప్రయాణానికి అనుమతించారు. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కట్లేరుకు వరద చేరి మళ్లింపు రోడ్డుపై ప్రవాహం పెరగడంతో పోలీసులు మళ్లీ వంతెన వద్ద ప్రయాణాలను ఆపేశారు. వరద తగ్గితేనే వినగడప వంతెన వద్ద రాకపోకలకు సాగించేందుకు అనుమతిస్తామని ఎస్సై శ్రీను తెలిపారు. **- న్యూస్‌టుడే, గంపలగూడెం**

ప్రజలకు భరోసా ఇద్దాం..



సమీక్షిస్తున్న డీసీపీ సరిత

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిని గుర్తించి.. ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించేందుకు శక్తి, ఈగల్ బృందాలు ఏర్పాటు చేసినట్లు డీసీపీ కె.జి.వి.సరిత పేర్కొన్నారు. శనివారం రాత్రి పోలీస్ కమిషనరేట్‌లో మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ టి.దైవప్రసాద్‌తో కలిసి శక్తి, ఈగల్ బృందాలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. మహిళలకు సేవ చేసే భాగ్యం కలిగినందుకు అదృష్టంగా భావించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో హాట్ స్పాట్‌లను గుర్తించి ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరారు. శక్తి యాప్ అక్రమార్కుల పాలిట ఆయుధంగా మారుతుందన్నారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలు, యువతులకు శక్తి యాప్ ఉపయోగాలు, సోషల్ మీడియా, సైబర్ నేరాలు గురించి తెలియజేయాలని కోరారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంటే ఏంటి? నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోక్సో చట్టం, డయల్ 112 తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఐసెట్

నీట్

మాక్ కౌన్సెలింగ్ 2025



కరెంట్ అఫైర్స్

■ ఏ పథకం కింద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2025, మే 22న 18 రాష్ట్రాల్లో పునరాభివృద్ధి చేసిన 103 రైల్వే స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించారు? (రూ.1100 కోట్లకు పైగా వ్యయంతో ఈ 103 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించారు.)



మాదిరి ప్రశ్నలు

జ: అమృత్ భారత్ స్టేషన్

■ ఏ నగరంలో జరిగిన 78వ ప్రపంచ ఆరోగ్య అసెంబ్లీ (డబ్ల్యూహెచ్ఏ) లో ట్రకోమా వ్యాధిని విజయవంతంగా నిర్మూలించినందుకు భారత్... ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నుంచి అధికారికంగా గుర్తింపు పొందింది? (ప్రపంచ వ్యాప్తంగా అంధత్వానికి ప్రధాన కారణంగా ఉన్న ఈ అంటువ్యాధి క్లామిడియా ట్రకోమాటిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలుగుతుంది) జ: జెనీవా

■ 'వరల్డ్ టెలీకమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ సొసైటీ డే' ను ఏ రోజున నిర్వహిస్తారు? ('డిజిటల్ ఇన్నోవేషన్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్' అనే థీమ్‌తో ఈ ఏడాది ఈ దినోత్సవాన్ని నిర్వహించారు.) జ: మే 17

మరింత సమాచారం

ఉదయాన్నే నిద్ర లేవడం ఆరోగ్యానికి మంచిది. పొద్దున్నే గాలి స్వచ్ఛంగా ఉండటంతోపాటు సూర్యరశ్మి ద్వారా విటమిన్-డి కూడా లభిస్తుంది. గమనిస్తే ఇక్కడ మొదటి వాక్యాన్ని రెండో వాక్యం సమర్థిస్తోంది. ఉదయాన్నే లేవడం వల్ల ఆరోగ్యానికి ఏవిధంగా మేలు జరుగుతుందో తెలియజేస్తోంది. ఇందులో మొదటి వాక్యం నిశ్చితం, రెండోది కారణం. నిశ్చితం వాస్తవాన్ని వివరిస్తే, కారణం దానికి మద్దతు ఇస్తుంది. రీజనింగ్‌లో భాగంగా ఇలాంటి వాక్యాల రూపంలో అడిగే ప్రశ్నల్లో రెండు ప్రకటనల మధ్య సంబంధాన్ని విశ్లేషించి, సరైన సమాధానాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం పోటీ పరీక్షార్థులు సాధారణ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. వాక్యాల్లోని పదాలను సరిగా అర్థం చేసుకోవాలి.


జనరల్ స్టడీస్ - రీజనింగ్



వాస్తవాల వెనుక నిర్ధారణలు!

నిశ్చితం - కారణం

వివిధ పోటీ పరీక్షల్లో 'రీజనింగ్'లో భాగంగా అనలిటికల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అనే మూడు విభాగాల నుంచి ప్రశ్నలు వస్తుంటాయి. లాజికల్ రీజనింగ్‌లో ప్రకటనలు-వాదనలు, ప్రకటనలు-ఊహలు, ప్రకటనలు-నిర్ధారణలు, ప్రకటనలు-తీసుకోవాల్సిన చర్యలు, నిశ్చితం-కారణం తదితర అంశాలు ఉంటాయి.



నిశ్చితం-కారణం అనే అంశానికి సంబంధించిన ప్రశ్నలో ఒక నిశ్చితం లేదా నిశ్చితి లేదా ప్రతిపాదన, కారణం ఇస్తారు. సాధారణంగా నిశ్చితాన్ని A తో, కారణాన్ని R తో సూచిస్తారు.

కింది ప్రశ్నల్లో ఒక నిశ్చితం (A), కారణం (R) ఇచ్చారు.

1) (A), (R) లు రెండు సరైనవి; (R), (A) కు సరైన వివరణ అయితే

2) (A), (R) లు రెండు సరైనవి; కానీ (R), (A) కు సరైన వివరణ కాకపోతే

3) (A) సరైంది, కానీ (R) సరైంది కాకపోతే

4) (A) సరైంది కాకుండా (R) మాత్రమే సరైంది అయితే

గమనిక: సాధారణంగా ఈ ప్రశ్నలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సమకాలీన అంశాలు, సామాన్య శాస్త్రం లేదా వివిధ అరిథ్‌మెటిక్, రీజనింగ్ అంశాల ఆధారంగా ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. నిశ్చితం (A): ఒక సంకేత భాషలో REASON అనే పదాన్ని IVZHLM గా రాస్తారు.

కారణం (R): ఆంగ్ల అక్షరమాలలో A↔Z, B↔Y, C↔X, D↔W, E↔V మొదలైనవి ప్రతిబింబ అక్షరాలు.

వివరణ: (A), (R) లు రెండూ సరైనవి; (A) కు (R) సరైన వివరణ. **జ: 1**

2. నిశ్చితం (A): $1^2 + 2^2 + 3^2 + \ldots\ldots 49^2 = 40425$

కారణం (R): మొదటి 'n' సహజ సంఖ్యల వర్గాల మొత్తం $\frac{n(n+1)(2n+1)}{6}$

వివరణ: (A), (R) లు రెండూ సరైనవి; (A) కు (R) సరైన వివరణ. **జ: 1**

3. నిశ్చితం (A): $1 + 3 + 5 + \ldots\ldots + 21$ ల మొత్తం = 100.

కారణం (R): మొదటి 'n' బేసి సంఖ్యల మొత్తం 'n^2' అవుతుంది.

వివరణ: మొదటి 'n' బేసి సంఖ్యల మొత్తం 'n^2' అవుతుంది. కానీ $1 + 3 + 5 + \ldots + 21$ల మొత్తం 100 కాదు అంటే (A) సరైంది కాదు కానీ, (R) సరైంది. **జ: 4**

4. నిశ్చితం (A): భారతదేశం ద్రవ్యోల్బణ సమస్యను ఎదుర్కొంటుంది.

కారణం (R): వస్తువుల ధరల పెరుగుదల.. ద్రవ్యోల్బణానికి కారణమవుతుంది.

వివరణ: (A) సరైంది కానీ, (R) సరైంది కాదు. **జ: 3**

5. నిశ్చితం (A): దీర్ఘచతురస్రం చుట్టుకొలత 12 మీటర్లు అయితే గరిష్ఠంగా దాని వైశాల్యం 9 చ.మీ. అవుతుంది.

కారణం (R): రెండు ధన సంఖ్యల గుణ మధ్యమం వాటి అంకమధ్యమం కంటే తక్కువ లేదా సమానం.



వివరణ: దీర్ఘచతురస్రం పొడవు = l మీ.

వెడల్పు = b మీ.

చుట్టుకొలత = $2(l + b)$ = 12 మీ.

= $l + b$ = 6 మీ.

l, b లకు సాధ్యమయ్యే విలువలు (5, 1), (4, 2), (3, 3)

∴ వైశాల్యం = $l \times b$ చ.మీ.

= 3×3 = 9 చ.మీ.

దాని గరిష్ఠ వైశాల్యం 9 చ.మీ. అవుతుంది.

అదేవిధంగా అంకమధ్యమం (AM) గుణ మధ్యమం (GM), హరాత్మక మధ్యమం (HM)

$AM \geq GM \geq HM$

∴ (A), (R) లు రెండూ సరైనవి; కానీ (A) కు (R) సరైన వివరణ కాదు. **జ: 2**

6. నిశ్చితం (A): D, E, F లు త్రిభుజం యొక్క ABC లంబకేంద్రం, కేంద్రాభాసం, పరివృత్త కేంద్రాలయితే ΔDEF వైశాల్యం $= \frac{1}{4}$ (ΔABC) వైశాల్యం.

కారణం (R): ఒక త్రిభుజంలో లంబకేంద్రం, కేంద్రాభాసం, పరివృత్త కేంద్రాలు సరేఖీయాలు.

వివరణ: (A) సరికాదు, కానీ (R) సరైంది. **జ: 4**

7. నిశ్చితం (A):

13	12	5
17	15	8
25	24	?
29	21	20

పై పట్టికలో లోపించిన సంఖ్య 7

కారణం (R): $X^2 + Y^2 = Z$, $\sqrt{Z}$ అనేది కావాల్సిన సమాధానం

వివరణ: $12^2 + 5^2 = 144 + 25 = 169$, $\sqrt{169} = 13$

$15^2 + 8^2 = 225 + 64 = 289$, $\sqrt{289} = 17$

$21^2 + 20^2 = 441 + 400 = 841$, $\sqrt{841} = 29$

$\sqrt{24^2 + x^2} = 25 \Rightarrow 576 + x^2 = 625$

x = 7

(A), (R) లు రెండూ సరైనవి; (R) అనేది (A) కు సరైన వివరణ. **జ: 1**

8. నిశ్చితం (A): సాధారణ సంవత్సరానికి ఉన్న అదనపు రోజుల సంఖ్య '1' అవుతుంది.

కారణం (R): ఇచ్చిన రోజులను 7 తో భాగించగా వచ్చే శేషాన్ని అదనపు రోజులు అంటారు.

వివరణ: సాధారణ సంవత్సరానికి ఉన్న రోజుల సంఖ్య = 365

7) 365 (52
35
15
14
1



అదనపు రోజుల సంఖ్య = 1

(A), (R) లు రెండూ సరైనవే; (R) అనేది (A) కు సరైన వివరణ అవుతుంది. **జ: 1**

9. నిశ్చితం (A): 2025, జనవరి 1 బుధవారం కాబట్టి 2025, డిసెంబరు 31 కూడా బుధవారం అవుతుంది.

కారణం (R): సాధారణ సంవత్సరం ఏ రోజుతో అయితే ప్రారంభమవుతుందో అదే రోజుతో ముగుస్తుంది.

వివరణ: (A), (R) లు రెండూ సరైనవే; (R) అనేది (A) కు సరైన వివరణ. **జ: 1**



10. నిశ్చితం (A): గడియారంలో సమయం 8:30 అయినప్పుడు రెండు ముళ్ల మధ్య కోణం 75°.

కారణం (R): గడియారంలో సమయం 12:00 అయినప్పుడు రెండు ముళ్లు ఏకీభవిస్తాయి.

వివరణ: ఇచ్చిన సమయం = 8:30

$M = \frac{2}{11}(H \times 30 \pm \theta) \Rightarrow 30 = \frac{2}{11}(8 \times 30 \pm \theta)$

$\frac{30 \times 11}{2} = 240 \pm \theta \Rightarrow 165 = 240 \pm \theta$

$\theta = 240 - 165 \quad \Rightarrow \theta = 75^\circ$

(A), (R) లు రెండూ సరైనవే; కానీ (R) అనేది (A) కు సరైన వివరణ కాదు. **జ: 2**

11. నిశ్చితం (A): 5 సెం.మీ. భుజం ఉన్న ఒక సమబాహు త్రిభుజం వైశాల్యం $\frac{25}{4}\sqrt{3}$ చ.సెం.మీ.

కారణం (R): త్రిభుజంలోని కోణాల మొత్తం 180°.

వివరణ: A = 5 సెం.మీ.

సమబాహు త్రిభుజ వైశాల్యం $= \frac{\sqrt{3}}{4} a^2$

$= \frac{\sqrt{3}}{4}(5)^2 = \frac{25}{4}\sqrt{3}$ చ.సెం.మీ.

త్రిభుజంలోని మూడు కోణాల మొత్తం = 180°

$\angle A + \angle B + \angle C = 180^\circ$

(A), (R)లు రెండూ సరైనవి; కానీ (R) అనేది (A)కు సరైన వివరణ కాదు. **జ: 2**

12. నిశ్చితం (A): పంచభుజి అంతర కోణాల మొత్తం 540°.

కారణం (R): పంచభుజిలో 5 భుజాలు ఉంటాయి.

వివరణ: పంచభుజి (n) = 5

అంతర కోణాల మొత్తం $= (n - 2) \times 180^\circ$

$= (5 - 2) \times 180^\circ$

$= 540^\circ$

(A), (R) లు రెండూ సరైనవి; కానీ (A) కు (R) సరైన వివరణ కాదు. **జ: 2**

13. నిశ్చితం (A): దేశంలో ఉనికిలో ఉన్న ఏ రాష్ట్ర సరిహద్దులనైనా మార్చే అధికారం పార్లమెంటుకు ఉంది.

కారణం (R): రాష్ట్ర సరిహద్దును మార్చే బిల్లును కేవలం రాజ్యసభలోనే ప్రవేశపెట్టాలి.

వివరణ: (A) సరైంది కానీ, (R) సరికాదు. **జ: 3**



రచయిత: గోలి ప్రశాంత్‌రెడ్డి

వసుంధర

vasundhara@eenadu.in

'పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలి'... ఏ అమ్మానాన్నల కోరికైనా ఇదే! దానికోసమే శక్తికి మించి కష్టపడుతుంటారు. ఏళ్లు గడవొచ్చేమో తరాలు మారొచ్చేమో... ఆ ప్రేమ మాత్రం మారదు. కాకపోతే ఈ క్రమంలో కొందరు 'బెస్ట్ అమ్మానాన్న' అనిపించుకుంటే... మరికొందరు 'ఐ హేట్ యూ'నీ వినాల్సొస్తుంది. అరె... ఎవరైనా కోరుకునేది ఒకటే అయినప్పుడు పిల్లల ఫీడ్‌బ్యాక్‌లో మాత్రం తేడా ఎందుకు? అంటే... దానికి పెంపకంలో తీరే కారణమంటారు నిపుణులు.



మీరెలాంటి అమ్మానాన్నలు?

చెప్పింది వినాల్సిందేనా?

'అయిదింటి కల్లా ఇంట్లో ఉండాలన్నా కదా? ఆలస్యంగా వచ్చావంటే నీకసలు భయమే లేదనేగా'... కఠినమైన రూల్స్! ఒక్కటి మీరినా శిక్ష తప్పదు. కారణం కనుక్కోరు. వాళ్లు చెప్పబోతే ఎదురు మాట్లాడుతున్నట్టు. పోనీ విన్నా... చివరకు నిర్ణయం మాత్రం అమ్మానాన్నలదే. 'పిల్లలకేం తెలుసు? వాళ్లని సరైన మార్గంలో పెంచాల్సింది మనమే. మా కాలంలో అమ్మానాన్నల మాట జవదాటే వాళ్లమే కాదు...' అని చెబుతుంటారీ అమ్మానాన్నలు. అలా ఉండటమే సరైన పెంపకమనే నమ్మకం. దీన్ని 'అథారిటేరియన్ పేరెంటింగ్' అంటారు. కానీ ఇలా పెరిగిన పిల్లలెలా తయారవుతారో తెలుసా? నలుగురికీ దూరమవుతారు. ఆత్మవిశ్వాసం తక్కువ. చిన్న పొరపాటు జరిగినా, మార్కులు తగ్గినా భయం... ఇంట్లో కొడతారేమోనని! వాటిని తప్పించుకోవడానికి అబద్ధాలు మొదలుపెడతారు. తెలియని కోపం, ఇంట్లోవాళ్లమీద అసహ్యం పెంచుకునేవరకూ వెళతారు. డిప్రెషన్‌కీ లోనవచ్చు అంటున్నాయి అధ్యయనాలు.

యువరాణి, యువరాజుల హోదానేనా?

'నాన్నా... నేను ఈరోజు స్కూలుకి వెళ్లను'! 'సరే కన్నా... నీకిష్టం లేకపోతే వెళ్లకు'... పిల్లలపై పిచ్చి ప్రేమ. యువరాణి, యువరాజుల్లా అరచేతిలో పెంచుతారు. ఏది కావాలన్నా క్షణాల్లో ప్రత్యక్షం కావాల్సిందే. వీళ్ల లక్ష్యం పిల్లలకు బెస్ట్ ఫ్రెండ్ అవ్వాలని, వాళ్ల జీవితాల్ని ఆనందంతో నింపేయాలనే! నిజమే... స్వేచ్ఛ పిల్లల హక్కు. కానీ అది ఎంతవరకు? ఫలానాది తినను, హోమ్ వర్క్ చేయను, నా బొమ్మ ఇవ్వను... ఇలా ఏమన్నా సరేనంటోంటే వాళ్లకి క్రమశిక్షణ అలవడేదెలా? ఇంట్లో అంటే సరే! బయటికి వెళితే స్నేహితులతోసహా అందరూ వాళ్లేమన్నా 'జీ హుజూర్' అనాలంటారు. అలా జరగకపోతే తట్టుకోలేరు. అంతేనా... బాధ్యత తెలియదు. తిండి, చదువు... అన్నింటా ఇబ్బందులు పడతారు. అందుకే ఇలాంటి 'పర్మిసివ్ పేరెంటింగ్' తగదంటారు నిపుణులు.

సమయమే లేదా?

మీ పిల్లల క్లాస్ టీచర్ ఎవరు? ఏ సబ్జెక్టంటే ఇష్టం? వాళ్ల హాబీలేంటి? సమాధానం చెప్పలేరా! స్కూలు, ఆ వెంటే ట్యూషన్ ఇక మీ అవసరం లేదని భావిస్తారు. అలాంటప్పుడు ఇవన్నీ ఎలా తెలుస్తాయి? అన్నీ అమరుస్తున్నాం అనుకుంటారు కానీ దీన్ని నిపుణులేమంటారో తెలుసా? 'నెగ్లెక్ట్‌ఫుల్, అన్ ఇన్వాల్వ్‌డ్ పేరెంటింగ్' అంటారు. కావాలని చేయకపోవచ్చు. కానీ సమయమే ఇవ్వలేరు. భవిష్యత్తులో వాళ్లు కష్టపడొద్దు, కెరియర్‌కి ఇదే ఉత్తమ సమయమని పిల్లల జీవితాల్లో ఏం జరుగుతోందో పట్టించుకోరు. కానీ పిల్లలేం అనుకుంటారో తెలుసా? తామంటే అమ్మానాన్నలకు ప్రేమ లేదనుకుంటారు. రెబల్‌గా తయారవొచ్చు లేదా ముడుచుకుపోతారు. ఆత్మవిశ్వాసాన్నీ కోల్పోతారు. చదువుల్లోనూ, సామాజిక బంధాలపరంగానూ ఇబ్బందులు పడతారు. దీన్ని అత్యంత ప్రమాదకర పేరెంటింగ్‌గా చెబుతారు మానసిక నిపుణులు.

ఇదే ఉత్తమం!

అటు కఠినంగా ఉండొద్దంటారు, ఇటు ప్రేమ కురిపించినా తప్పంటారు. మరెలా అంటారా? మధ్యస్థంగా ఉండే 'అథారిటేటివ్ పేరెంటింగ్'ను అనుసరిస్తే సరి. ఉదాహరణకు- అమ్మా నేను వీడియో గేమ్ ఆడుకుంటా అని పిల్లాడు అన్నాడనుకోండి. 'ముందు హోమ్‌వర్క్ పూర్తిచెయ్యి, తరవాత ఆడుకో. కావాలంటే నేనూ సాయం చేస్తా. అప్పుడు త్వరగా పూర్తవుతుంది, చక్కగా ఆడుకోవచ్చు' అనో 'ఇంకా హోమ్‌వర్క్ పూర్తవ్వలేదు. పోనీ పది నిమిషాలు ఆడుకో, తరవాత చేద్దువు కానీ' అనో చెబుతారు. రూల్స్ ఉంటాయి... కానీ పిల్లల ఆలోచనలకీ విలువిస్తారు. వాళ్ల భావోద్వేగాలనీ పరిగణనలోకి తీసుకుంటారు. ఫలితం... వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సోషల్‌స్కిల్స్, భావోద్వేగాలపై పట్టు ముఖ్యంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవడం అలవడుతుంది. ఇలాంటి తీరుతో విజయాలూ అనుసరిస్తాయి. పోనీ అపజయాలే ఎదురైనా కుంగిపోవడం మాత్రం ఉండదు. దీటుగా ఎదుర్కొంటారు.

అందరి లక్ష్యం పిల్లల క్షేమమే! వాళ్ల భవిష్యత్ కోసం ఆరాటమే. కాకపోతే ఎంచుకునే దారులే వేరు. ఆ దారిలో ఏమాత్రం లోపాలున్నా బలయ్యేది మళ్లీ మన పిల్లలే. కాబట్టి, సరిచూసుకోవడం తప్పనిసరి. అలాగని ఎవరినో అనుసరించొద్దు. మీ పిల్లల తత్వాలు, ఆసక్తులను బట్టి, ఎలా నడవాలో, నడిపించాలో నిర్ణయించుకోండి. ఏదీ అతి కానప్పుడే వాళ్లూ బాధ్యతాయుతంగా ఎదగగలుగుతారు. మరి గమనించుకుంటారుగా!

అదే పదివేలు!

ఆగకుండా మోగే సెల్.... అన్నం తినేటప్పుడు కూడా చూసే టీవీ కార్యక్రమాలు, కృత్రిమంగా సాగే నవ్వులతో రోజుని యాంత్రికంగా గడిపేస్తున్నారు చాలా మంది. యంత్రాలతో కుస్తీపడుతూ, అనుబంధాలను తగ్గించుకుంటూ సాగిపోతున్నారు. ఎంతో కొంత సంపాదించాలి... ఏదో ఒకటి సాధించాలన్నది నిజమే. కానీ, తల్లిదండ్రులు మౌనంగా మీకోసం చేసిన త్యాగాల్ని ఎప్పుడైనా గుర్తుతెచ్చుకుంటున్నారా? వాళ్లకి ఏం చేయాలో ఆలోచించారా?

ఆలోచించండి!

బిడ్డలు బడికి వెళ్లడానికి ముందే వాళ్ల రోజు మొదలయ్యేది. కంటిపాపలైన మీరు నిద్రించాకే వాళ్లకి కంటిమీదకు కునుకు వచ్చేది. మీకు ఒంట్లో నలతగా ఉంటే... వాళ్లెన్ని రాత్రుళ్లు జాగారం చేశారో! మీకు నచ్చిన స్వీటుకోసం తమ ఇష్టాన్ని వదులుకున్న రోజులెన్నో! మీకు మంచి మార్కులొస్తే వారే సాధించినట్లు సంబరపడిపోయేవారు.

ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, ఆరోగ్య సమస్యలే ఎదురొచ్చినా... మిమ్మల్ని ప్రయోజకులుగా మార్చాలన్న లక్ష్యమే వారిని ముందుకు నడిపించేది. ఈ క్రమంలో ఎదురు దెబ్బలు తినడమే కానీ, ప్రశంసలు దక్కిన సందర్భాలు అరుదే! వాటిని గుర్తించకపోయినా పరవాలేదు... వారికోసం కాస్త సమయాన్ని కేటాయించండి. కబుర్లు చెప్పండి. కుశల ప్రశ్నలు వేయండి. అదే చాలని సంబరపడిపోతారు. మనోవేదన నుంచి ఉపశమనం పొందుతారు. ఈ రోజుల్లో తల్లిదండ్రులకు పిల్లలు ఇచ్చే గొప్ప బహుమతి ఇదే. మరి ఈ నేషనల్ పేరెంట్స్ డేని అర్థవంతంగా జరుపుకోండి.

- డాక్టర్ వనిత, రచయిత్రి



పిల్లల పెంపకం అనేది నియంత్రణ కాదు.. మార్గనిర్దేశనం మాత్రమే. బిడ్డలు తమ లక్ష్యాన్ని కనుగొనేందుకు, దాన్ని సాధించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

- కిరణ్ మజుందార్‌షా, వ్యాపారవేత్త

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

నల్ల మచ్చలు తగ్గేదెలా?

నా వయసు నలభై ఐదు. ఈమధ్య ముఖం, మెడ, వీపు మీద నల్ల మచ్చలు కనిపిస్తున్నాయి. పిగ్మెంటేషన్ అని తెలుస్తోంది. సడన్‌గా ఇలా రావడానికి కారణమేంటి? ఎలా తగ్గించుకోవాలి? – ఓ సోదరి

మీరనే కాదు, ఈమధ్య చాలామందిలో ఈ సమస్య కనిపిస్తోంది. దీనికి రెండు కారణాలు... రోజూ వాడే కాస్మెటిక్స్‌లోని రసాయనాలు పడక పిగ్మెంట్ కాంటాక్ట్ డెర్మటైటిస్‌గానీ, లైకన్ ప్లేనస్ డెర్మటైటిస్‌గానీ వచ్చి ఉండొచ్చు. లేదా హెయిర్ డైస్‌లోని హానికర పీపీడీ వల్ల నుదురు, ఛాతీ, మెడ, ముఖం, చేతులు... ఇలా అన్నింటిమీదా పిగ్మెంటేషన్ రావొచ్చు. ముందు చిన్న దురదతో మొదలవుతుంది. రెండుమూడు రోజులకు ఆ దురద తగ్గిపోయి పిగ్మెంటేషన్ కనిపిస్తుంది. చర్మం లోపలి పొరలనుంచి వస్తుంది కాబట్టి ముదురు గోధుమ, నీలం రంగుల్లో కనిపిస్తుంటాయివి. కాబట్టి క్రీమ్స్ ఏమైనా మార్చారా అన్నది గమనించండి. వాటిల్లోని మెర్క్యురీ, నికెల్ వంటి వాటితో ఈ సమస్య ఎదురవ్వొచ్చు. అలాగే పీపీడీ తక్కువ ఉన్నవీ, రసాయనాల్లేని హెర్బల్ డైలూ వాడుకోవాలి. గోరింటాకు ఉత్తమం. ఒకవేళ డై తప్పనిసరి అనుకున్నప్పుడు ఒంటికీ ముఖానికీ ఏదైనా నూనె రాసుకుని వేసుకుంటే తలస్నానం చేసేటప్పుడు అది స్కిన్ మీద పడకుండా ఉంటుంది. అలాగే ప్రతి ఆరు గంటలకోసారి ఎస్‌పీఎఫ్ 55 కన్నా ఎక్కువున్న ట్రిపుల్ స్టార్స్ సన్‌స్క్రీన్ రాసుకుంటే యూవీ ప్రభావం నుంచి తప్పించుకోవచ్చు. అప్పటికీ తగ్గకపోతే నిపుణుల సలహాతో ఐసోట్రిటినాయిన్, డాప్సోన్ ట్యాబ్లెట్లు, స్కిన్ లైటెనింగ్ క్రీములు కొన్ని నెలలు వాడాలి. వీటికీ తగ్గకపోతే లేజర్లు, పీఆర్‌పీ చికిత్సలతో ఫలితం ఉంటుంది. అందుకే క్రీములు, హెయిర్ డైలు వాడేటప్పుడు ప్యాచ్ టెస్ట్ తప్పనిసరి అని గుర్తుపెట్టుకోండి. సోషల్‌మీడియా మాయలో పడొద్దు.

డియర్ వసుంధర



- సూరపనేని పద్మావతి, డెర్మటాలజిస్ట్

గుర్రపు డెక్కతో కాగితం!

చెరువులు, కాలువల నిండా అల్లుకునే కలుపు మొక్క ఈ గుర్రపు డెక్క(వాటర్ హయాసింత్). అది వ్యవసాయానికి చేసే నష్టం గురించి తెలియని వారుండరు. దానితోనే బయోడిగ్రేడబుల్ పేపర్‌ని తయారుచేస్తున్నారు సుస్మితా కృష్ణన్.



సుస్మిత



సుస్మితది తమిళనాడులోని తిరుచ్చి. చిన్నప్పట్నుంచి పర్యావరణంపై ఆసక్తి ఎక్కువ. దాంతో లైఫ్ సైన్సెస్‌లో ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ చదవాలనుకున్నారు. 'భారతీదాసన్ విశ్వవిద్యాలయంలో చేరా. ఇది విద్యార్థుల అవకాశాలకు నెలవు. పరిశోధనలు ఎక్కువ జరుగుతుంటాయి. కాలేజీలో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా చాలా సెమినార్లకు వెళ్లేదాన్ని. అక్కడికి వచ్చిన పర్యావరణ శాస్త్రవేత్తలు చెప్పిన ఒక విషయం నన్ను ఆలోచించేలా చేసింది. అదే గుర్రపు డెక్క. నీటిపై కనుచూపుమేర ఆకుపచ్చ తివాచీ పరచుకున్నట్లు, దానిపై ఊదా రంగు పువ్వులతో చూడ్డానికి అందంగా కనిపిస్తుంది. కానీ అది నీటిలోని జలచరాలకు ఆక్సిజన్ అందకుండా చేస్తుంది. ఈ మొక్క దాని జీవితకాలంలో దాదాపు 3వేల విత్తనాలను ఉత్పత్తి చేయగలదు. అంతేకాదు, 20సంవత్సరాల తర్వాత కూడా తిరిగి మొలకెత్తే సామర్థ్యం దీనిది. అందుకే దాని కాండంతో బయోడిగ్రేడబుల్ పేపర్ తయారుచేయలనుకున్నా. సరిగ్గా అప్పుడే జర్మనీలో హాంబర్గ్ విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ సస్టైనబిలిటీ అకాడమీ(ఐఎస్ఏ) ఫెలోషిప్‌నకు ఎంపికయ్యాను. అక్కడ గుర్రపు డెక్కను కాగితంగా మార్చే ప్రయోగాలు చేశా. సాధారణంగా కలప నుంచి పేపరు తయారు చేయాలంటే దాదాపు 60శాతం సోడా అవసరం. కానీ గుర్రపు డెక్కతో పేపర్ తయారు చేయడానికి 6శాతం చాలు. పైగా ఈ పేపర్ నాణ్యత కూడా ఎక్కువే. సాంకేతికతను ఉపయోగించి దీన్ని తయారుచేసుకుంటే దీన్ని వృథా చేయక్కర్లేదు' అంటారు సుస్మిత.

అడుగడుగునా అడ్డంకులే...


ఆమె కనిపెట్టిన టెక్నాలజీని సొంతదేశంలో అమలు చేయాలనుకున్నారు. 'చాలా పరిశ్రమల చుట్టూ తిరిగా. 'కొత్తది పైగా పెట్టుబడి, ట్రయల్ రన్‌లు, నియంత్రణ ఆమోదాలు ఇవన్నీ రిస్క్‌తో కూడుకున్నవి మాకు వద్దు' అంటూ చాలామంది నిరాకరించారు. అందుకే దీని తయారీ విధానాన్ని విద్యార్థులకు, మహిళలకి నేర్పించాలనుకున్నా. తిరుచ్చిలో నేషనల్ కాలేజీలో రెండురోజులు వర్క్‌షాప్ నిర్వహించాను. తయారీలో ముందుగా మొక్క కాండాన్ని చిన్న ముక్కలుగా కోసి ఎండబెట్టాలి. తర్వాత పీచుని వేరుచేయడానికి ఆల్కలీన్ ద్రావణంలో ఉడకబెట్టాలి. మెత్తని గుజ్జు తయారవుతుంది. ఈ మిశ్రమాన్ని మెష్ ఫ్రేముల్లో వేసి ఎండలో ఆరబెట్టాలి. కిలో గుర్రపు డెక్కతో సుమారు 30 ఏ4 షీట్లు తయారుచేసుకోవచ్చు. ఈ మొత్తం ప్రాసెస్‌కి సుమారు గంట సమయం పడుతుంది' అంటారీమె. సుస్మిత ప్రయోగం అక్కడితో ఆగిపోలేదు... తన లక్ష్యం అవగాహన పెంచడం ఒక్కటే కాదు, ఎక్కువమంది దీన్ని నేర్చుకుని, గుర్రపుడెక్క ఎక్కువ పెరిగే ప్రాంతాలు దీన్ని ఆదాయంగా మార్చుకోవాలంటున్నారు. మహిళల కోసం నేపాల్‌లోని ఓ ఎన్జీఓతో కలిసి బయోడిగ్రేడబుల్ శానిటరీ ప్యాడ్స్‌నీ తయారు చేస్తున్నారు.



బుజ్జాయికో సోఫా..!

పసి పిల్లలంటే అందరికీ అపురూపమే కదా! అందుకే పుట్టినప్పటి నుంచి ప్రతి దశలోనూ వాళ్లను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. ఊయలలో ఊగుతూ తన బోసి నవ్వులతో అమ్మను ఎంత మురిపిస్తుందో. అలాంటి బుజ్జాయిని వదిలి కాస్త పక్కకు వెళ్లాలంటే ఎంత భయమో. కాస్త పెద్దయ్యి కూర్చోవడం మొదలుపెడితే తల్లికి ఒకింత ఆనందమే కానీ, ఎక్కడ కింద పడిపోతారోనని భయం. ఎంత జాగ్రత్తగా చూసినా... ఒక్కోసారి ఏదోక పనిలో పడక తప్పుతుందా! అమ్మలకు అలాంటి కష్టం కలగకూడదనుకున్నారు తయారీదారులు. అందుకే 'బేబీ యాక్టివిటీ చైర్'ని మార్కెట్‌లోకి తీసుకొచ్చేశారు. కాటన్, నైలాన్ క్లాత్‌లతో చేత్తో వీటిని తయారుచేశారు. ఐదు నుంచి తొమ్మిదినెలల వరకూ చిన్నారులు కూర్చునేందుకు అనువుగా వీటిని రూపొందించారు. అంతాబాగుంది చేతికి ఆటవస్తువు దొరక్కపోతే కూనిరాగాలు మొదలుపెట్టేయరూ గడుగ్గాయిలు. అందుకే సోఫాకి ముందుభాగంలో ఆడుకునేందుకు వీలుగా, వారి చేతులకు అనువుగా ప్రత్యేకంగా ఓ ట్రేని ఏర్పాటు చేశారు. దానిమీదే సూర్యుడు, చంద్రుడు, రెయిన్‌బోతోపాటు యాపిల్, దానిమ్మ వంటి ఆట బొమ్మల్నీ అమర్చారు. ఇంకొన్ని అచ్చంగా బొమ్మల రూపంలోనే వారు కూర్చొనే పొజిషన్‌కి అనువుగానూ సిద్ధంచేశారు. చిన్నారి వెనక్కి పడిపోతే దెబ్బ తగలకుండా బ్యాక్ సపోర్ట్‌తోనూ దొరుకుతున్నాయివి. మీ ఇంట్లోనూ బుజ్జాయిలున్నారా... అయితే ఇంకెందుకు ఆలస్యం... వీటిపై ఓ లుక్కేయండి మరి!





నవ్వుని నటించొద్దు..!

'నవ్వు ఆరోగ్యానికి మంచిదే'నని వినడమే కాదు, లాఫింగ్ యోగాలంటూ దానికోసం సమయం కేటాయించుకుని మరీ సాధన చేస్తుంటాం. ఒక్కోసారి కొంతమంది మాట్లాడే మాటలు మనకి కోపం తెప్పిస్తున్నా నవ్వుతూనే సమాధానం చెబుతుంటాం. మనసు బాగోకపోతే ఆ బాధ బయటకు కనిపించకుండా చిరునవ్వుని చిందిస్తూ మోహంలో ఆ లోటు కనపడకుండా దాచేస్తాం. ఒక్కోసారి కొంతమంది



వేసే జోక్స్‌కి మనకి నవ్వు రాదు కానీ మొహమాటం కొద్దీ నవ్వాల్సిన పరిస్థితి. అంతేకాదు, చేసే పనిలో ఒత్తిడికి గురయినప్పుడు ఆ భయం కనిపించకుండా ఉల్లాసంగా కనిపించేందుకు నకిలీ చిరునవ్వుల్ని ప్రదర్శిస్తుంటాం. ఈ నవ్వునే 'ప్లాస్టిక్ స్మైల్' అంటున్నారు నిపుణులు. ఇలాంటి నవ్వు ఆరోగ్యానికి మేలు చేయకపోగా అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుందని చెబుతున్నాయి అధ్యయనాలు. ఆక్యుపేషన్ హెల్త్ సైకాలజీ నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడయ్యింది. ఇలా నకిలీ నవ్వుని ప్రదర్శించే వారు వ్యక్తిగత భావోద్వేగాలను మనసులోనే దాచేస్తున్నారు. దీని వల్ల ఒత్తిడి పెరిగి మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందట.

బంగారం - వెండి



26న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,01,170	92,000	1,16,432
విజయవాడ	98,200	91,600	1,16,400
ప్రొద్దుటూరు	98,600	90,710	1,15,800
రాజమహేంద్రవరం	99,930	91,600	1,26,000
విశాఖపట్నం	99,570	91,600	1,20,000
తమిళనాడు	-----	91,600	1,26,000

కప్ తీసుకెళ్తేనే మేలు...



ప్రయాణాల్లోనూ, ఆఫీసుల్లోనూ కాఫీ, టీల్లాంటివి తాగేందుకు చాలామంది పేపర్ కప్‌నే వాడుతుంటారు. మీరూ అలానేనా? అయితే, మీ శరీరంలోకి రోజూ వేలకొద్దీ మైక్రోప్లాస్టిక్ అణువులు చేరుతున్నట్లే.. అంటున్నారు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్‌పర్సన్ తేజస్వినీ అనంత్‌కుమార్. తాజాగా ఇందుకు సంబంధించి ఆమె సామాజిక మాధ్యమంలో చేసిన పోస్ట్ వైరలవుతోంది. '100మి.లీ వేడి వేడి పానీయాలు పేపర్ కప్‌లో 15నిమిషాలు ఉన్నా చాలు... 25వేల మైక్రోప్లాస్టిక్ అణువులు ఉత్పత్తి అవుతాయని ఐఐటీ ఖరగ్‌పూర్ పరిశోధనలు చెబుతున్నాయి. ఇవి ఆరోగ్యానికి చేసే నష్టం అంతా ఇంతా కాదు. అందుకే, మీరు ఎక్కడికెళ్లినా సరే.. నీళ్ల బాటిల్‌తోపాటు, ఓ కప్‌ను కూడా వెంట పట్టుకెళ్లండి. పేపర్ కప్‌లో టీ, కాఫీలు తాగటం నిషేధించండి' అని సూచిస్తున్నారీమె. దీన్నిబట్టి, ఇక రోజుకి రెండు మూడు సార్లు పేపర్ కప్‌ల్లో తాగే అలవాటున్న వారి శరీరంలోకి సుమారు 75వేల మైక్రోప్లాస్టిక్ అణువులు తెలియకుండానే వెళ్తాయన్నమాట. ఇవి మహిళల్లో హార్మోన్ల అసమతుల్యతకీ, సంతానోత్పత్తి సమస్యలకీ, పిల్లల్లో ఎదుగుదల లోపాలకీ కారణమవుతాయట. కాబట్టి, సాధ్యమైనంతమేర మన సొంత కప్‌నే వాడుకోవటం ఉత్తమం.

సీ-సూట్‌కి చేరలేకపోతున్నారట!



మనదేశంలో డైవర్సిటీ, ఇన్‌క్లూజన్‌పై ఆసక్తి పెరుగుతున్నా... కార్పొరేట్ ప్రపంచంలో మహిళల నాయకత్వానికి ఇంకా అడ్డంకులు చాలానే ఉన్నాయి. ఎంట్రీలెవెల్ వర్క్‌ఫోర్స్‌లో ఆడవాళ్ల సంఖ్య ఎక్కువగానే ఉన్నప్పటికీ సీ-సూట్ లెవెల్‌లో మాత్రం 19శాతమే ఉన్నారట. ఇది ప్రపంచ సగటు 30 శాతం కంటే చాలా తక్కువ. ఈ నిరంతర అంతరం.. మహిళల ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుందట. ఇందుకు సాంస్కృతిక, వ్యవస్థాగత కారణాలతో పాటు మరెన్నో కనిపించని తెరలు అడ్డుగోడల్లా నిలుస్తున్నాయట. పలు అధ్యయనాల ప్రకారం... మగవారు ఎంట్రీ లెవెల్ నుంచి మేనేజర్ హోదాకు 2.1 రెట్లు అధికంగా అవకాశం పొందుతున్నారట. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ చేయడంలో 60 శాతంమంది మహిళలు సవాళ్లను ఎదుర్కొంటున్నారట. ఎమోషనల్ ఇంటెలిజెన్స్, సహకారం, కమ్యూనికేషన్‌లో పురుషుల కంటే మెరుగ్గానే కనిపిస్తున్నా... ప్రోత్సహించే అవకాశాలు మాత్రం తక్కువగా ఉన్నాయి. మరో సంస్థ మెకెన్సీ కూడా ఎంట్రీలెవల్‌లో 33 శాతం మహిళలు ఉన్నప్పటికీ ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో కేవలం 24శాతమే ఉన్నారంటోంది. అయితే, ఇటీవలి కాలంలో టెక్నాలజీ, బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్ రంగాల్లోని కొన్ని సంస్థలు మిడిల్ మేనేజ్‌మెంట్‌లో మహిళలకు ఎక్కువగా అవకాశాలను కల్పిస్తున్నాయి. ఈ మార్పు మరింతగా పెరగాలని మనమూ ఆశిద్దామా!

గుర్తుండట్లేదా..!



బ్రెయిన్ ఫాగ్... మానసిక గందరగోళం, ఏ విషయంపైనా స్పష్టత లేకపోవడం, ఏ పనిపైనా ఏకాగ్రత పెట్టలేకపోవడం, ముఖ్యమైన విషయాలను గుర్తుపెట్టుకోలేకపోవడం వంటివన్నీ 'బ్రెయిన్ ఫాగ్' లక్షణాలు. అయితే ఇది మహిళల్లో హార్మోన్ల హెచ్చుతగ్గుల వల్ల ఏర్పడుతుంది. ముఖ్యంగా గర్భధారణలో, మెనోపాజ్, ప్రి-మెనోపాజ్ దశల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సమయంలో ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ స్థాయుల్లో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. ఇవి మెదడు పనితీరుని ప్రభావితం చేస్తాయి. అందుకే జ్ఞాపకశక్తి లోపిస్తుంది. దీంతో మెదడుపై ఒత్తిడి పడుతుంది. తర్వాత రక్తపోటుకు కారణం అయ్యే అవకాశాలూ ఉన్నాయట. వీటికితోడు నిద్రలేమి, జీవనశైలిలో మార్పులు కూడా ఈ సమస్యను పెంచుతున్నాయి. అయితే దీన్ని మంచి పోషకాహారం తీసుకోవడంతో కొంతవరకూ నయం చేసుకోవచ్చు. అదెలాగంటే తినే ఆహారంలో విటమిన్ ఎ, బి12, సి, డి, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా కెఫీన్ ఉండే పానీయాలు, ఆహారానికి దూరంగా ఉండాలి. వీటితోపాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే కొంతవరకూ దీనినుంచి బయటపడే అవకాశం ఉందంటున్నారు నిపుణులు.

'రాజ్యాంగబద్ధమైన జవాబుదారీతనం'పై నేడు సీఎఫ్‌డీ ఉపన్యాసం

ముఖ్య అతిథిగా జస్టిస్ లావు నాగేశ్వరరావు ప్రసంగం

ఈనాడు, అమరావతి: 'రాజ్యాంగబద్ధమైన జవాబుదారీతనం' అన్న అంశంపై సెంటర్ ఫర్ డెమోక్రసీ (సీఎఫ్‌డీ) సంస్థ ఆదివారం విజయవాడలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తోంది. ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు కీలకోపన్యాసం చేస్తారు. మాజీ అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది డి.వి.సీతారామ్మూర్తి కూడా ప్రసంగిస్తారు. మొగల్రాజపురంలోని సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రజా ప్రయోజన, సామాజిక అంశాలపై పౌరుల్ని చైతన్యవంతుల్ని చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీఎఫ్‌డీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref. B1/48/2025 Dt. 26-07-2025

ఫారమ్ నెం.VI(ఎ)

(2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, బుట్టాయిగూడెం మరియు గణపవరం గ్రామముల నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద కూనవరం మండలం, కుదలిపాడు గ్రామంలలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునఃస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ, చింతూరు వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25-10-2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునఃస్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10-05-2020వ తేదీన జారీచేసిన జి.ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వరరామచంద్రాపురం యూనిట్-2, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వరరామచంద్రాపురం యూనిట్-2, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి-వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు మండలం: బుట్టాయిగూడెం గ్రామం: బుట్టాయిగూడెం

క్రమ సంఖ్య	సర్వే నెంబరు	భూసేకరణ క్రింద విస్తీర్ణం (సెంట్లు.యు.)	భూమి తరగతి	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు: తూర్పు	పడమర	ఉత్తరము	దక్షిణం	చెట్లు, కట్టడములు ఇతరముల వివరములు
1	260-5A	0.94	మెరక	ఆచంట విష్ణుమూర్తి	260-2	258-3	261-2	260-5	పామాయిలు మొక్కలు-66, వేప మొక్కలు-2, కొబ్బరి మొక్కలు-5
2	258-2B	0.54	మెరక		231-4	255-1	258-2	258-1	పామాయిలు మొక్కలు-41, జామయిలు మొక్క-1
3	256-3B	1.48	మెరక		256-2	252	257-2	256-3	పామాయిలు మొక్కలు-90, వేప చెట్టు -1
4	256-2A	1.39	మెరక	గూడవల్లి సత్యనారాయణ	255-1	256-2	256-3	256-1	పామాయిల్ చెట్లు-78, వెదురు పొదలు-5
5	258-1A	0.79	మెరక		258-1	258-2	258-3	260-2	6 అడుగుల సిమెంట్ స్తంభాలు-365, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు-1460, డ్రాగన్ ఫ్రూట్ ఐరన్ రింగ్స్-365
6	260-3A	0.94	మెరక		260-2	260-3	261-2	260-1	6 అడుగుల సిమెంట్ స్తంభాలు-495, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు-1980, బోరు-1, కొబ్బరి చెట్లు-2, జామ చెట్లు -2, బెర్రీ చెట్టు-1, అరటి చెట్లు-4
7	260-3B	0.94	మెరక	గూడవల్లి శ్రీనివాసరావు	260-2	260-5	261-2	260-3	6 అడుగుల సిమెంట్ స్తంభాలు-496, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు-1984, ఐరన్ సపోర్ట్ రింగ్స్- 496.
8	258-1B	0.79	మెరక		231-4	258-2	258-3	260-2	6 అడుగుల సిమెంట్ స్తంభాలు-365, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు-1460, డ్రాగన్ ఫ్రూట్ ఐరన్ రింగ్స్ -365.
9	256-2B	1.38	మెరక		255-2	252	256-3	256-2	పామాయిలు మొక్కలు-78, బోరు-1, షెడ్-1, వెదురు పొదలు-5, అరటి చెట్లు-10.
10	256-3A	1.48	మెరక	ఆచంట గంగరాజు	256-2	256-3	257-1	256-1	పామాయిలు మొక్కలు-90
11	258-2A	0.55	మెరక		258-2	255-1	258-3	258-1	పామాయిలు మొక్కలు-33
12	260-4	0.05	మెరక		260-2	260-5	260-3, 260-5	260-3	పామాయిలు మొక్కలు-1
13	260-5B	0.94	మెరక		260-2	260-5	261-2	260-3	పామాయిలు మొక్కలు-63, బోరు-1, పాక-1, మామిడి మొక్క-1
14	256-1	1.78	మెరక	కూచిపూడి హనుమంతరావు	255-1	256-2, 256-3	257-1	258-3	బోరు-1, తాడి-1
15	261-2A	2.1	మెరక		260-3	261-2	263-1	261-1	బోరు-1, చింత-1 తాడి-5, జామ-1
16	258-3	1.51	మెరక	కూచిపూడి సీతారామయ్య	258-1, 258-2	255, 256	258-3	260-2 260-5	షెడ్, బోరు-1, జామ-2
17	264-1	0.96	మెరక		258-3	257-1 278-1	264-2	261-2	
18	261-2	1.51	మెరక	కూచిపూడి దొర బాబ్జీ	260-5	258-3 264-1	263-1	261-2	
19	258-3	2	మెరక		258-3	257-1	264-1	260-5 261-2	
TOTAL		22.07							

షెడ్యూలు

జిల్లా: ఏలూరు మండలం: బుట్టాయిగూడెం గ్రామం: గణపవరం

క్రమ సంఖ్య	సర్వే నెంబరు	భూసేకరణ క్రింద విస్తీర్ణం (సెంట్లు.యు.)	భూమి తరగతి	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు: తూర్పు	పడమర	ఉత్తరము	దక్షిణం	చెట్లు, కట్టడములు ఇతరముల వివరములు
1	1	5.00	ప్ర.మెరక	గద్దె విజయలక్ష్మి	2	RF	RF	50	
2	37-1B	1.65	ప్ర.మెరక	పుసులూరి మోహన రజిత	36-1C	38	37-1B	37-1C	
3	37-1C	0.25	ప్ర.మెరక	పుసులూరి మోహన్ రజిత	36-2	38	37-1C	37-2	
4	38-1B	6.00	ప్ర.మెరక	గద్దె విజయలక్ష్మి	29	42	38-1A	38-2	
5	43-3	1.02	ప్ర.మెరక	గద్దె రమాదేవి	27	43-1	43-2	43-4	
6	43-4	0.89	ప్ర.మెరక	గద్దె రమాదేవి	27	43-1	43-3	43-5	
7	43-5	1.02	ప్ర.మెరక	గద్దె మాధవి	27	43-1	43-4	43-7	
8	43-6	1.21	ప్ర.మెరక	గద్దె మాధవి	43-7	43-5	27	43-7	
9	50-1	1.26	ప్ర.మెరక	గద్దె నాగ చంద్రరావు	50-2	RF	1, 2	51, 53	
10	51-1	5.00	ప్ర.మెరక	గద్దె మాధవి గారి గార్డియన్ బి పి శ్రీనివాస చౌదరి	50-2	RF	1, 2	51, 53	
11	63-5	4.00	ప్ర.మెరక	పుసులూరి సుజిత	83	63-4	83	65	
12	66-3	1.00	ప్ర.మెరక	పుసులూరి సుజిత	63-4	63-1	62	64	
13	87-2	4.42	ప్ర.మెరక	యాదాల నాగేశ్వరరావు	87-7	86	39	99	తాడి-15
14	89-3A	1.99	ప్ర.మెరక	గద్దె మాధవి గారి గార్డియన్ బి పి శ్రీనివాస చౌదరి	90	89-1B	89-1C	89-3A 2B	
15	115-2A	0.67	ప్ర.మెరక	గద్దె మాధవి గారి గార్డియన్ బి పి శ్రీనివాస చౌదరి	116	37	115-1A	114	
16	128-1	2.35	ప్ర.మెరక	నందిన మోహన్‌రావు	127	110	111, 127	163	
17	170	0.25	ప్ర.మెరక	నందిన మోహన్‌రావు	168	171	107	169	
18	190-1	5.65	ప్ర.మెరక	కోనే కనకదుర్గ	పట్టిన పాలెం గ్రామం	199	189	199	తాడి-10, వేప-6
19	198-1	10.21	ప్ర.మెరక	కోనే కనకదుర్గ	199	197	200	196	
20	200	0.48	ప్ర.మెరక	సురే నాగేశ్వరరావు	198	204	199	201	వేప-2
21	200	1.50	ప్ర.మెరక	రుద్ర రాధ	198	204	199	201	వేప-2
22	200	2.00	ప్ర.మెరక	తోట సత్యవతి	198	204	199	201	వేప-2
23	200	2.58	ప్ర.మెరక	సురే శ్రీనివాసరావు	198	204	199	201	వేప-2
24	200-1A	0.30	ప్ర.మెరక	సురే మురళి	198	204	199	201	
25	200-3	0.30	ప్ర.మెరక	సురే భాస్కరరావు	198	204	199	201	
26	204	2.80	ప్ర.మెరక	పసుపులేటి ధర్మరాజు	206	203	205	200	
27	232-4	1.00	ప్ర.మెరక	శివ కోటి సూర్యకాంతం	232-2C	231	231	236	
28	246	2.51	ప్ర.మెరక	గద్దె శ్రీవేణి	248	261	255	274	తాడి-10
29	256-1	0.99	ప్ర.మెరక	వీరంకి బ్రహ్మానందం	253	256-2	RF	255	
30	257-1	0.17	ప్ర.మెరక	గద్దె బుల్లెమ్మాయి	256	258	RF	257-2B	
31	257-2D	0.12	ప్ర.మెరక	గద్దె బుల్లెమ్మాయి	256	257-2C	257-1	259	
32	259	3.87	ప్ర.మెరక	గద్దె బుల్లెమ్మాయి	255	కాలువ	257	261	
33	259	3.86	ప్ర.మెరక	పసుమర్తి సుబ్బారావు	255	కాలువ	257	261	తాడి-20, ఊడుగా-2
34	261	4.00	ప్ర.మెరక	వుడా నారాయణరావు	246	260	259	262	జీడి-120, వేప-6, తాడి-160, సిందుగ-2, కుంకుడు-4, జువ్వి-2, మద్ది-2
35	261	4.00	ప్ర.మెరక	వుడా నాగరత్నం	246	260	259	262	తాడి-30, కుంకుడు-2
36	261-1	0.79	ప్ర.మెరక	కొప్పుల రాములు	246	260	259	262	
37	261-1A	0.79	ప్ర.మెరక	కొప్పుల నాగరాజు	246	260	259	262	
38	261-1B	0.79	ప్ర.మెరక	కొప్పుల రాజారావు	246	260	259	263	
39	261-1C	0.81	ప్ర.మెరక	కొప్పుల నారాయణమూర్తి	246	260-1	259	262	
40	261-1D	0.79	ప్ర.మెరక	కొప్పుల ప్రకాశ్‌రావు	246	260	260-1	262-1	
41	261-1E	0.79	ప్ర.మెరక	కొప్పుల నాగలక్ష్మి	246	260	259	262	
42	262	1.00	ప్ర.మెరక	వుడా నారాయణరావు	246	రౌతుగూడెం సరిహద్దు	261	263	
43	262	5.15	ప్ర.మెరక	వుడా చలపతిరావు	246	రౌతుగూడెం సరిహద్దు	261	263	జీడి-245, వేప-25, కుంకుడు-3, తాడి-225
44	263	0.50	ప్ర.మెరక	మరీదు సూరయ్య	246	రౌతుగూడెం సరిహద్దు	262	264	జీడి-30
45	263	1.50	ప్ర.మెరక	మరీదు సోమరాజు	246	రౌతుగూడెం సరిహద్దు	262	264	జీడి-30, తాడి-20, వేప-2
46	263	1.50	ప్ర.మెరక	మరీదు దుర్గారావు	246	రౌతుగూడెం సరిహద్దు	262	264	జీడి-24, తాడి-10
47	263	1.53	ప్ర.మెరక	మరీదు వెంకటస్వామి	246	రౌతుగూడెం సరిహద్దు	262	264	టేకు-2, తాడి-10
48	263	2.50	ప్ర.మెరక	మరీదు కొండయ్య	246	రౌతుగూడెం సరిహద్దు	262	264	జీడి-150, తాడి-200, బోరు-1, కుంకుడు-3, వేప-2, చింత-2, మునగ-2
49	264-2	6.64	ప్ర.మెరక	వుడా నాగరాజు	275	రౌతుగూడెం సరిహద్దు	263	265	కొబ్బరి-3, జీడి-35, మామిడి-1, తాడి-57, చింత-1, బోరు-1, షెడ్-1
50	264-2B	1.00	ప్ర.మెరక	కొనకళ్ళ దుర్గా	275	రౌతుగూడెం సరిహద్దు	263	265	జీడి-25, తాడి-27
51	265-2	2.81	ప్ర.మెరక	వుడా కృష్ణకుమారి	272	రౌతుగూడెం సరిహద్దు	264	266	తాడి-30, వేప-2, జీడి-2
52	265-2	3.81	ప్ర.మెరక	వుడా మహేశ్వరరావు	272	రౌతుగూడెం సరిహద్దు	264	266	తాడి-20, కుంకుడు-1, వేప-3, చింత-5
53	266	4.10	ప్ర.మెరక	నారగాని పూర్ణచంద్రరావు	ములగపల్లి గ్రామం	రౌతుగూడెం సరిహద్దు	267	265	తాడి-10, కొబ్బరి-10
54	266	5.09	ప్ర.మెరక	నారగాని సత్తిబాబు	ములగపల్లి గ్రామం	265	267	రౌతుగూడెం సరిహద్దు	కొబ్బరి-8
55	266	0.66	ప్ర.మెరక	వీరంకి బ్రహ్మానందం	ములగపల్లి గ్రామం	265	267	రౌతుగూడెం సరిహద్దు	తాడి-65, వేప-6, మామిడి-2, జువ్వి-4, జామయిలు-8, బోరు-1
56	266	1.67	ప్ర.మెరక	వీరంకి శ్రీరామమూర్తి	ములగపల్లి గ్రామం	265	267	రౌతుగూడెం సరిహద్దు	బోరు-1, జామయిలు-100 వేప-10, మామిడి-6
57	266	1.67	ప్ర.మెరక	వీరంకి సూర్యనారాయణ	ములగపల్లి గ్రామం	265	267	రౌతుగూడెం సరిహద్దు	జామయిలు-115, వేప-10 మామిడి-7.
58	266-1	4.59	ప్ర.మెరక	వుడా రాజ్‌కుమార్	ములగపల్లి గ్రామం	265	267	రౌతుగూడెం సరిహద్దు	టేకు-15, తాడి-35, మద్ది-2.
59	266-2	0.5	ప్ర.మెరక	వుడా గోపాలరావు	ములగపల్లి గ్రామం	265	267	రౌతుగూడెం సరిహద్దు	తాడి-15
60	277-9	2.9	ప్ర.మెరక	గద్దె రాజేష్	282	270	277-8	279	
61	278-4	0.11	ప్ర.మెరక	మద్యాహ్నపు విష్ణు	279	269	277	440	
62	287-3A	1	ప్ర.మెరక	పల్లంటి నాగేశ్వరరావు	305	287-1	287-2	287-5	
63	307-1	0.65	ప్ర.మెరక	కర్నల రాములు	307-3	287	306	307-2	
64	307-2	0.94	ప్ర.మెరక	కర్నల రాములు	307-3	287	307-1	431	
65	313-1	1	ప్ర.మెరక	పుట్టా వీరభద్రం	314	311	314	421	
66	314-1B	3.38	ప్ర.మెరక	చిట్టూరి పాపాయమ్మ	315	313	362	313	
67	318-1	2	ప్ర.మెరక	వీరంకి శివనారాయణ	318-2	317	321	404	తాడి -1
68	318-1	0.8	ప్ర.మెరక	వీరంకి శివనారాయణ	318-2	317	321	404	
69	317	2.09	ప్ర.మెరక	నందిన మోహన్‌రావు	318	316	321	411	
70	322	0.95	ప్ర.మెరక	పుట్టా వీరభద్రం	355	315	323	321	
71	323-4	1	ప్ర.మెరక	పుట్టా వీరభద్రం	354	315	320	322	
72	347-1B1	0.13	ప్ర.మెరక	శీలబోయిన నాంచారమ్మ	348	346	212	344	
73	347-2C3	4.12	ప్ర.మెరక	శీలబోయిన నాంచారమ్మ	348	346	212	344	తాడి-10, టేకు-8, కుంకుడు-2, పాల-1, మామిడి-2, వేప-1.
74	352-1	0.6	ప్ర.మెరక	నందిని మోహన్‌రావు	360	353	338	357	
75	352-2A	0.15	ప్ర.మెరక	నందిని మోహన్‌రావు	360	353	338	357	
76	353-2	0.32	ప్ర.మెరక	అల్లూరి భగవాన్‌రాజు	352	325	334	354	
77	353-3	0.12	ప్ర.మెరక	అల్లూరి భగవాన్‌రాజు	353-1	325	334	353-4	
78	353-4	0.62	ప్ర.మెరక	అల్లూరి భగవాన్‌రాజు	352	354	353-2	354	
79	355-2D	1.15	ప్ర.మెరక	శీలబోయిన నాంచారమ్మ	356	321	357	320	మామిడి-2, టేకు-1, వేప-1, కుంకుడు-1, చీమ చింత-1.
80	364-1A	1.50	ప్ర.మెరక	మద్యాహ్నపు అనుమంత రాధకృష్ణ	366	372	పట్టినపాలెం గ్రామం	360	
81	371	3.95	ప్ర.మెరక	పోల్నాటి దుర్గారావు	370	378	373	379	
82	371	0.79	ప్ర.మెరక	పోల్నాటి శ్రీనివాసరావు	370	378	373	379	
83	371	0.74	ప్ర.మెరక	పోల్నాటి ధర్మరాజు	370	378	373	379	
84	371	0.60	ప్ర.మెరక	కోనే దేవయ్య	370	378	373	379	
85	371	0.39	ప్ర.మెరక	కోనే బులి వెంకయ్య	370	378	373	379	
86	371	0.39	ప్ర.మెరక	మద్దాల నిమ్మరావు	370	378	373	379	
87	378-2	0.03	ప్ర.మెరక	మద్యాహ్నపు విష్ణు	379	377	378-2	387	
88	378-3	0.55	ప్ర.మెరక	మద్యాహ్నపు విష్ణు	379	377	378-5	378-2	
89	378-4	0.11	ప్ర.మెరక	మద్యాహ్నపు విష్ణు	379	377	378-2	387	
90	386	5.24	ప్ర.మెరక	అన్నిశెట్టి కడెమ్మ	పుంత	392	380	పుల్లెపూడి గ్రామం	కొబ్బరి-15
91	390-1	0.75	ప్ర.మెరక	చెట్టి మంగరాజు	386	395	389	393	
92	392-1	0.60	ప్ర.మెరక	తుమ్మలపల్లి దుర్గమ్మ	386	393	391	393	
93	392-1	0.61	ప్ర.మెరక	దుష్ప గవరమ్మ	386	393	391	393	
94	392-1	0.30	ప్ర.మెరక	వామిశెట్టి సత్యనారాయణ	386	393	391	393	
95	392-1	0.30	ప్ర.మెరక	వామిశెట్టి సిద్ధరావు	386	393	391	393	
96	392-2	0.28	ప్ర.మెరక	తుమ్మలపల్లి దుర్గమ్మ	386	393	391	393	
97	392-2	0.28	ప్ర.మెరక	దుష్ప గవరమ్మ	386	393	391	393	
98	392-2	0.14	ప్ర.మెరక	వామిశెట్టి సత్యనారాయణ	386	393	391	393	
99	392-2	0.14	ప్ర.మెరక	వామిశెట్టి సిద్ధరావు	386	393	391	393	
100	392-3	0.97	ప్ర.మెరక	తుమ్మలపల్లి దుర్గమ్మ	386	393	392-2	393	
101	392-3	0.98	ప్ర.మెరక	దుష్ప గవరమ్మ	386	393	392-2	393	
102	392-3	0.49	ప్ర.మెరక	వామిశెట్టి సత్యనారాయణ	386	393	392-2	393	
103	392-3	0.49	ప్ర.మెరక	వామిశెట్టి సిద్ధరావు	386	393	392-2	393	
104	392-3	1.75	ప్ర.మెరక	పుసులూరి మోహన రజిత	386	393	391	393	
105	393-1	0.05	ప్ర.మెరక	మద్యాహ్నపు అనుమంత రాధ కృష్ణ	391	395	390	394	
106	393-1	0.80	ప్ర.మెరక	రాజనాల పేర్రాజు	391	395	390	394	
107	393-2	1.00	ప్ర.మెరక	మద్యాహ్నపు అనుమంత రాధ కృష్ణ	391	395	390	394	
108	393-3	0.20	ప్ర.మెరక	మద్యాహ్నపు అనుమంత రాధ కృష్ణ	391	395	390	394	
109	406	2.00	ప్ర.మెరక	పోలిశెట్టి విష్ణువర్ధన్‌రావు	402	408	403	490	
110	407-1	1.01	ప్ర.మెరక	తోట దుర్గమ్మ	406	414	408	490	
111	407-3	0.31	ప్ర.మెరక	తోట దుర్గమ్మ	406	414	408	490	
112	422-1	1.50	ప్ర.మెరక	మునుసూరి దుర్గా కామేశ్వరి	419	429	421	423	
113	426-1	0.23	ప్ర.మెరక	మరీదు సోమరాజు	426-2	448	428	425	
114	426-1	0.23	ప్ర.మెరక	మరీదు దుర్గారావు	426-2	448	428	425	చింత-1
115	426-1	0.24	ప్ర.మెరక	మరీదు వెంకటస్వామి	426-2	448	428	425	
116	426-1	0.23	ప్ర.మెరక	మరీదు కొండయ్య	426-2	448	428	425	తాడి-10, చింత-2
117	426-2	0.51	ప్ర.మెరక	మరీదు సూరయ్య	426-2	448	428	425	
118	426-2	0.50	ప్ర.మెరక	మరీదు వెంకటస్వామి	426-2	448	428	425	
119	426-2	0.50	ప్ర.మెరక	మరీదు కొండయ్య	426-2	448	428	425	
120	426-2	0.50	ప్ర.మెరక	మరీదు కొండయ్య	426-2	448	428	425	
121	428-3	0.23	ప్ర.మెరక	మరీదు సూరయ్య	428-1	436	428-1	426	
122	428-3	0.22	ప్ర.మెరక	మరీదు సోమరాజు	428-1	436	428-1	426	
123	428-3	0.22	ప్ర.మెరక	మరీదు దుర్గారావు	428-1	436	428-1	426	
124	428-3	0.28	ప్ర.మెరక	మరీదు వెంకటస్వామి	428-1	436	428-1	426	
125	428-3	0.22	ప్ర.మెరక	మరీదు కొండయ్య	428-1	436	428-1	426	
126	431-1	0.95	ప్ర.మెరక	మన్నెంశెట్టి పద్మావతి	308	286	307	429	
127	431-1A	1.62	ప్ర.మెరక	గంధ్రాల రామచంద్ర శేఖర్	308	286	307	429	
128	431-2	0.53	ప్ర.మెరక	యడ్లపల్లి నాగన్న	308	286	307	429	
129	431-2	1.10	ప్ర.మెరక	యడ్లపల్లి కోరయ్య	308	286	307	429	
130	462-2	0.51	ప్ర.మెరక	మరీదు సోమరాజు	426-2	448	428	425	
131	476-6	0.93	ప్ర.మెరక	సింగులూరి రాములు	476-7	476-5	481	508	

(మిగతా 13వ పేజీలో)

మా జిల్లాల్లోనూ మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తాం

పరిశీలించిన జిల్లాల పంచాయతీ అధికారులు



మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ వివరాలు తెలుసుకుంటున్న డీపీవోలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: తమ జిల్లాల్లోనూ మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తామని జిల్లా పంచాయతీ అధికారులు(డీపీవోలు) తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం సోమవరం గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా నిర్మిస్తున్న మ్యాజిక్ డ్రెయిన్లను శనివారం రాష్ట్రంలోని 26 జిల్లాల డీపీవోలు పరిశీలించారు. గ్రామంలో ఇప్పటికే నాలుగు డ్రెయిన్ల నిర్మాణం పూర్తికాగా.. మరొకటి నిర్మాణంలో ఉంది. మిగిలిన జిల్లాల్లోనూ ఉపాధి నిధులతో తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించాలన్న పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలతో వారంతా వచ్చి చూశారు. ఉపాధి హామీ పథకం ఏపీడీ ఎస్.శ్రీనివాసరావు, ఏపీవో శరత్‌బాబు డ్రెయిన్ల నిర్మాణం గురించి వారికి వివరించారు. నాలుగు రోజులుగా జోరు వాన కురుస్తున్నా... డ్రెయిన్లలో నీరు ఇంకిపోవడాన్ని డీపీవోలు గమనించారు. డీపీవోల బృందం వీరులపాడు మండలం పొన్నవరంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన స్వామిత్వ సర్వే తీరును సైతం పరిశీలించింది. సోమవరంలోని మ్యాజిక్ డ్రెయిన్లను రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల జడ్పీ సీఈవోలు శనివారం పరిశీలించారు.

ఏపీ భవన్‌లో 'హరిహర వీరమల్లు' ప్రదర్శన

ఈనాడు, అమరావతి: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రాన్ని దిల్లీలోని ఏపీ భవన్‌లో శని, ఆదివారాల్లో ప్రదర్శించనున్నట్టు రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు తొలి షో, ఆదివారం సాయంత్రం 4 గంటలకు మరో షో ఉంటుందని ఓ ప్రకటనలో తెలిపారు.

చంద్రబాబుపై అభ్యంతరకర పోస్టు.. కేసు

చాట్రాయి, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబుకు శ్రద్ధాంజలి అంటూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన వ్యక్తిపై శనివారం కేసు నమోదైంది. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామానికి చెందిన వెదుళ్ల ప్రసాద్.. 'వి. ప్రసాద్.. వి.ప్రసాద్' అనే తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా ఈ నెల 24న సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా అనుచిత పోస్టు చేశారు. గతంలోనూ ఇలానే పోస్టులు చేయగా మందలించినట్లు ఎస్సై డి.రామకృష్ణ తెలిపారు. ప్రవర్తనలో మార్పు రాకపోగా, చిన్నంపేటలో తెదేపా కార్యకర్తలను రెచ్చగొడుతూ గొడవలకు ప్రేరేపిస్తున్నారని తెదేపా గ్రామ అధ్యక్షుడు కందుకూరి అప్పారావు చేసిన ఫిర్యాదు మేరకు చాట్రాయి పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో ఆర్థిక స్థిరత్వం లేకుండాపోయింది: జగన్

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వ విధానాలతో ఆదాయాలు పెరగక, రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోతోందని మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. కాగ్ విడుదల చేసిన ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి సంబంధించి నెలవారీ కీ ఇండికేటర్లలో ఇది బయటపడిందని పేర్కొన్నారు. శనివారం ఆయన కాగ్ వివరాలను 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'విపరీతమైన అవినీతి కారణంగా రాష్ట్ర ఆదాయంలో వృద్ధి పేలవంగా ఉంది. మొదటి త్రైమాసికంలో రాష్ట్ర సొంత ఆదాయాలు 3.47% మాత్రమే పెరిగాయి. అప్పులు 15.61% పెరిగాయి. ప్రభుత్వ వ్యయాల కోసం సొంత ఆదాయంపై కాకుండా ఇతర వనరులపై ఆధారపడటం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. రాష్ట్రంలో ఆర్థిక స్థిరత్వం, నిర్వహణ సజావుగా సాగడం లేదు' అని జగన్ విమర్శించారు.

పరిశ్రమ నిర్వహణలో ఎక్కడా నిబంధనలు పాటించట్లేదు

జేఆర్ ఎకోపై కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ ఆగ్రహం



పరిశ్రమలో నిల్వలు పరిశీలిస్తున్న కృష్ణయ్య, అధికారులు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంతంలో జాతీయ రహదారికి సమీపంలో ఉన్న జేఆర్ ఎకో వేస్ట్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కర్మాగారాన్ని శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. రసాయన వ్యర్థాలను శుద్ధి చేసి, దాన్ని ఇంధనం కింద విక్రయించే ప్రక్రియలో ఎక్కడా సరైన నిబంధనలు పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన మౌలిక సదుపాయాలు, నిర్మాణాలు లేకుండానే అనుమతులు పొంది ఉత్పత్తులు ఎలా ప్రారంభించారో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రమాదకర రీతిలో సాగుతున్న ఈ కర్మాగారం నిర్వహణపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం వెంటనే పరిశీలన జరిపి నివేదిక ఇవ్వాలని చెప్పారు. ఆయన వెంట కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎంబీబీఎస్ సీట్లపై అసత్య ప్రచారం నమ్మొద్దు

ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి


ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వైద్య, దంత వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ /బీడీఎస్ కోర్సు సెల్ఫ్ ఫైనాన్సింగ్, యాజమాన్య కోటా బి1, బి2, ఎన్నారై కోటా సీట్ల భర్తీకి విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సవివర (డీటెయిల్డ్) నోటిఫికేషన్ శనివారం విడుదల చేసింది. ప్రైవేటు వైద్య కళాశాలలు గరిష్ఠంగా ఏడాదికి రూ.39.60 లక్షలు దాటకుండా ఫీజులు నిర్ణయించినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. నోటిఫికేషన్ విడుదల కాగానే.. ఫలానా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని తెలియని వ్యక్తుల నుంచి ఫేక్ కాల్స్ వస్తున్నాయని తల్లిదండ్రులు చెబుతున్న నేపథ్యంలో.. వాటిపై అప్రమత్తంగా ఉండాలని, అలాంటి ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. అన్ని కౌన్సెలింగ్‌లు విశ్వవిద్యాలయమే నిర్వహిస్తుందని, ప్రతి విషయాన్ని వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. వర్సిటీ మార్గనిర్దేశకాల్లో అభ్యంతరాలు ఉంటే 89787-80501, 79977-10168 నంబర్లకు, సాంకేతిక సమస్యలు తలెత్తితే 90007-80707 నంబరుకు ఫోన్ చేయవచ్చని ఆమె సూచించారు.

నిర్ణీత సమయంలో బదిలీలు పూర్తి చేయండి

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలను నిర్ణీత సమయంలో పూర్తి చేసి, దానిపై అప్పీల్ చేసుకునేందుకు 5 రోజులు గడువు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ కోరారు. శనివారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగి జీవితంలో సాధారణ బదిలీల ప్రక్రియ ఒక ప్రాణసంకటంలా మారిందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి, తమ అభిప్రాయాలు తెలియజేసే వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు రూ.30వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. క్లాస్ 4 నుంచి రాష్ట్ర స్థాయి అధికారి వరకు ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ఒక స్టేట్‌మెంట్ రూపంలో ఆగస్టులో అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పనిచేసే ప్రాంతంలో ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం నివాసిత స్థలాలు మంజూరు చేసి, దాని విలువను బకాయిల నుంచి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి అనుబంధంగా పింఛనర్ల సంఘం, ఓపీఎస్ సాధన సమితి, మహిళా విభాగాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

మీరు ముందుగా వీటిని జయించండి



మీరు గెలవాల్సింది ఇతరులపై కాదు!
మీరు వేసే వాయిదాలపై, చెప్పే సాకులపై,
స్వీయ సామర్థ్యాల పట్ల ఉన్న అనుమానాలపై,
కంఫర్ట్ జోన్‌పై, మీ పాత దురలవాట్లపై ముందుగా
పోరాడండి. వాటిని జయిస్తేనే మీరు
జీవితంలో గెలిచినట్టు!
– బ్రాడ్ లీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఆపరేషన్ సిందూర్‌తో... భారత్ బలం తెలిసింది

- ప్రధాని నరేంద్ర మోదీ
- తూత్తుకుడి విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ ప్రారంభం



తూత్తుకుడి విమానాశ్రయంలో టెర్మినల్‌ను ప్రారంభించి, పరిశీలిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: ఆపరేషన్ సిందూర్‌తో భారత్ బలం తెలిసిందని, ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడంలో మేడ్ ఇన్ ఇండియా కీలక పాత్ర పోషించిందని ప్రధాని మోదీ అన్నారు. మాల్దీవుల పర్యటన ముగించుకున్న ఆయన శనివారం రాత్రి తమిళనాడులోని తూత్తుకుడి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. తమిళుల సంప్రదాయ దుస్తులతో విచ్చేసిన మోదీకి రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రి తంగం తెన్నరసు తదితరులు స్వాగతం పలికారు. రూ.450 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తూత్తుకుడి విమానాశ్రయంలో విస్తరించిన కొత్త టెర్మినల్‌ను మోదీ ప్రారంభించారు. రాష్ట్రంలో రూ.4,900 కోట్లతో పూర్తైన వివిధ రహదారులు, రైల్వే మార్గాలను ఆయన జాతికి అంకితం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బ్రిటన్, మాల్దీవుల పర్యటనల్లో చారిత్రక ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు చెప్పారు. ఆత్మవిశ్వాసంతో భారత్ అభివృద్ధి చెందుతోందన్నారు. తమిళనాడును అభివృద్ధి చేసే పని 2014లో ప్రారంభం అయిందని, ఈ 11 ఏళ్లలో రహదారులు, ఇంధనం, విమానాశ్రయాలు సహా పలు పథకాలను పూర్తి చేసినట్లు చెప్పారు. తూత్తుకుడి విమానాశ్రయం కొత్త టెర్మినల్ ద్వారా ఏడాదికి 20 లక్షల మంది రాకపోకలు సాగించొచ్చన్నారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. దక్షిణ తమిళనాడు ముఖద్వారంగా తూత్తుకుడి మారుతుందని, వాణిజ్యం వృద్ధి చెందుతుందని, కొత్త విమానాశ్రయాల వల్ల లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

7 నెలలే గడువు.. మావోయిస్టులూ లొంగిపోండి

- లేదంటే వచ్చే ఏడాది మార్చికల్లా నిర్మూలించి తీరతాం
- డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా



విజయవాడ సీపీ కార్యాలయంలో లొంగిపోయిన మావోయిస్టు దంపతులు జోగారి నాగరాజు, మేడక జ్యోతిశ్రీలకు చెక్కును అందజేస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

ఈనాడు, అమరావతి: 'మావోయిస్టులూ.. మీకు మరో ఏడు నెలలే గడువు. ఈలోపే లొంగిపోయి, జనజీవన స్రవంతిలోకి రండి. లేదంటే వచ్చే ఏడాది మార్చికల్లా నిర్మూలించి తీరతాం' అని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా హెచ్చరించారు. రాష్ట్రానికి చెందిన 20 మంది మావోయిస్టు పార్టీలో పలు ప్రాంతాల్లో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్నారని, వీరంతా జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, తూర్పు బస్తర్ డివిజనల్ కమిటీ ఇన్‌ఛార్జి జోగారి నాగరాజు ఎలియాస్ కమలేశ్, ఆయన భార్య, తూర్పు బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యురాలు మేడక జ్యోతిశ్రీ ఎలియాస్ అరుణ విజయవాడ పోలీసు కమిషనరేట్ ప్రాంగణంలో డీజీపీ ఎదుట శనివారం లొంగిపోయారు. 'కమలేశ్ స్వస్థలం కృష్ణా జిల్లా పోరంకి. అరుణ గూడూరు మండలం కప్పలదొడ్డి వాసి. కమలేశ్ 34 ఏళ్లుగా, అరుణ 28 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారు. వీరిపై వరుసగా రూ.20 లక్షలు, రూ.5 లక్షల రివార్డులున్నాయి' అని డీజీపీ పేర్కొన్నారు. ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో మావోయిస్టుల నుంచి భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్న ఆయుధాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. కొద్ది రోజులుగా లొంగిపోయిన 13 మంది మావోయిస్టులకు వారిపై ఉన్న నగదు రివార్డుల చెక్కులను పంపిణీ చేశారు.

మన పరిధిలో ఎవరూ లేరు..

ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) పరిధి మన రాష్ట్ర భూభాగంలో ప్రస్తుతం ఒక్క మావోయిస్టూ లేరని డీజీపీ స్పష్టం చేశారు. ఇటీవల ఏవోబీలో ఐదు సార్లు ఎదురుకాల్పుల ఘటనలు జరిగాయి. వాటిల్లో కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి ఎలియాస్ ఉదయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ, జగన్, డివిజనల్ కమిటీ కార్యదర్శి రమేష్ సహా ఆరుగురు మృతి చెందారని వెల్లడించారు. కొన్నాళ్లుగా ఏడుగురు మావోయిస్టులను అరెస్టు చేయగా, 40 మంది లొంగిపోయారని చెప్పారు. రాష్ట్రంలో గంజాయి సాగును పూర్తిగా అరికట్టామని, రవాణాను కట్టడి చేస్తున్నామని వివరించారు.

ఎరువుల కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు: సీఎస్

ఈనాడు, అమరావతి: రైతులకు యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. కావాలని కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తేనే డీఏపీ విక్రయిస్తామని రైతుల్ని ఇబ్బంది పెడుతున్న వారిపై ఈసీ, పీడీ చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎరువుల దుకాణాలు, గోదాములను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. ఉత్తమ నీటి నిర్వహణ విధానాల్ని పాటించాలన్నారు.



కొరమీను పెంపకానికి ఏర్పాటైన షెడ్డు ★ షెడ్డులో నీటి తొట్టె ★ తొట్టెలోకి వదులుతున్న కొరమీను పిల్ల ★ తొట్టె నుంచి తీసిన చేపను కొలనులో వదులుతున్న రైతు ★ అమ్మకానికి సిద్ధమైన కొరమీను చేప

కొరమీను.. తొట్టెల్లో పెరిగేను

అన్నదాతలకు ఆదాయం తెచ్చేను

రుణాలిచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

ఈనాడు, ఒంగోలు: పోషక విలువలు, మార్కెట్లో ఎంతో డిమాండ్ ఉండే కొరమీను చేపలను కొద్దిపాటి స్థలంలోనే పెంచవచ్చు. వ్యవసాయానికి అనుబంధంగా పెంపకాన్ని చేపట్టవచ్చు. కావాల్సిందల్లా తొట్టెను పెట్టేందుకు చిన్న షెడ్డు, కొలను. ప్రధానమంత్రి ఉపాధి కల్పన(పీఎంఈజీపీ) కింద రూ.లక్షన్నర రాయితీ వస్తుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ)లోని జీవనోపాధుల విభాగం వారు ఔత్సాహికులకు బ్యాంకు రుణాలు ఇప్పించడంతో పాటు యూనిట్లనూ ఏర్పాటు చేస్తున్నారు.

పెంపకం ఎలా?

15 వేల లీటర్ల సామర్థ్యమున్న నీటి తొట్టెలో 4 అంగుళాల సైజు కొరమీను పిల్లలను వెయ్యి వరకు వదలాలి. వాటికి రోజూ మేత అందించాలి. తొట్టెలో నీటిని రెండు రోజులకోసారి మార్చాలి. చేప విసర్జితాల్లోని నత్రజని పైరుకు ఎరువుగా పనికొస్తుంది కాబట్టి.. ఆ నీటిని పొలాలకు మళ్లించి వాడుకోవచ్చు. 4 నెలల పాటు తొట్టెలో 450 నుంచి 500 గ్రాముల వరకు పెరిగిన కొరమీను చేపలను కొలనులోకి వదులుతారు. తొట్టెలో పెంచడం వల్ల పిల్లల సంరక్షణ మెరుగ్గా ఉండి నష్ట తీవ్రత తక్కువవుతుంది. కొలనులో మరో 4 నెలల పాటు పెంచితే కిలోకి పైగా పెరుగుతాయి. తర్వాత వాటిని విక్రయించుకోవచ్చు. ఖాళీ అయిన తొట్టెలో మళ్లీ పిల్లలను పెంచొచ్చు. అలా మొదటి 8 నెలల్లో ఆదాయం రాకున్నా ఆ తర్వాత 4 నెలలకోసారి పొందొచ్చు.

ప్రభుత్వ సాయం

ఎకరం పొలం, బోరు ఉన్నవారు వెలుగు అధికారులను సంప్రదిస్తే పీఎంఈజీపీ కింద దరఖాస్తు చేయిస్తారు. యూనిట్ ఏర్పాటుకు రూ.4.41 లక్షల ధరను నిర్ణయించారు. పీవీసీతో నీటి తొట్టె, షెడ్డు, 25×25 అడుగుల కొలను తవ్వకం, చేప పిల్లలు, 8 నెలల పాటు మేత, మందులు అవసరం. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 35 శాతం, ఇతర వర్గాలకు 25 శాతం రాయితీ ఇస్తారు. రాష్ట్రంలో వెయ్యి యూనిట్ల ఏర్పాటును అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ బాధ్యతను 'ఉదయ్ ఆక్వా కనెక్ట్' సంస్థకు అప్పగించారు. మొదటి పంట చేతికొచ్చే వరకు వీరి పర్యవేక్షణ ఉంటుంది. దిగుబడి వచ్చాక రైతు స్థానికంగా అమ్ముకోవచ్చు. లేదంటే ఆక్వా కనెక్ట్ సంస్థే కొంటుంది.

నికరంగా రాబడి

వెయ్యి చేపల్ని 8 నెలలు పెంచేందుకు మేత ఖర్చు రూ.1.25 లక్షలవుతుంది. యూనిట్ పెట్టిన మొదట్లో ఈ ఖర్చును ఆక్వా కనెక్ట్ సంస్థ చూసుకుంటుంది. వెయ్యి పిల్లల్లో 800 బతికినా, 800 కిలోల దిగుబడి వస్తుంది. తక్కువలో తక్కువ కిలో రూ.300 చొప్పున అమ్మినా రూ.2.40 లక్షలొస్తాయి. ఖర్చులన్నీ పోనూ 4 నెలలకోసారి రూ.80 వేల ఆదాయం పొందొచ్చు.

నేడు సింగపూర్‌కు చంద్రబాబు

- పెట్టుబడుల సాధనే లక్ష్యం
- ఆ దేశాధ్యక్షుడు, మంత్రులు, పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు
- ఐదు రోజుల పర్యటనలో 29 అధికారిక కార్యక్రమాలు
- చంద్రబాబు వెంట మంత్రులు లోకేశ్, టీజీ భరత్, నారాయణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం నుంచి ఐదురోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, పి.నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు వెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా సింగపూర్ దేశాధ్యక్షుడు, మంత్రులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రభుత్వ ప్రతినిధులతో వీరు సమావేశమవుతారు. సింగపూర్ ప్రాజెక్టులు, పోర్టులు, ఇతర ప్రదేశాల్ని సందర్శిస్తారు. తొలిరోజు ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు ఓవిస్ ఆడిటోరియంలో ఏపీ ఎన్నార్టీ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే 'తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు. సింగపూర్, మలేసియా, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ తదితర దేశాల నుంచి తెలుగు పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, పెట్టుబడిదారులు, ఉద్యోగులు సహా సుమారు 1,500 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రుల భాగస్వామ్యం, ఎగుమతులు పెంచడానికి అనుసరించాల్సిన విధానాలు, ఏపీ యువతకు నైపుణ్య శిక్షణ, విదేశాల్లో ఉద్యోగ కల్పన తదితర అంశాలపై ఇందులో చర్చించనున్నారు.

రాష్ట్రాభివృద్ధిలో సింగపూర్ కీలక భాగస్వామి: చంద్రబాబు

రాష్ట్రాభివృద్ధిలో అత్యంత కీలక భాగస్వాముల్లో సింగపూర్ ఒకటని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తన సింగపూర్ పర్యటన గురించి శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. ''ప్రపంచ వేదికపై బ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌ను ప్రోత్సహించడానికి, రాష్ట్ర ప్రగతిశీల విధానాలు తెలియజేయడానికి, సమ్మిళిత అభివృద్ధి కోసం సింగపూర్‌లో పర్యటిస్తున్నాను. ఈ సందర్భంగా మా విశ్వసనీయ భాగస్వామ్యాన్ని పునరుద్ధరిస్తాం. అక్కడి మంత్రులు, పారిశ్రామికవేత్తలు, ప్రవాసాంధ్రుల్ని కలవడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను'' అని చంద్రబాబు పేర్కొన్నారు.



సింగపూర్‌లో 'తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్‌ఈస్ట్ ఏషియా' కార్యక్రమం జరిగే వన్ వరల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏపీ ఎన్నార్టీ సంస్థ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు

వరుస సమావేశాలు..

చంద్రబాబు బృందం ఆదివారం ఉదయం ఆరు గంటలకు సింగపూర్ విమానాశ్రయానికి చేరుకోనుంది. తొలుత సింగపూర్‌లోని భారత హైకమిషనర్‌తో వీరు భేటీ అవుతారు. ఉదయం 11:30 గంటలకు సుర్బానా-జురాంగ్ సంస్థ ప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12:30 గంటలకు ఎవర్ సెండాయ్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ శ్రీడాటోనాథన్ ఎలుమలైతో వాణిజ్య అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం భారత హైకమిషనర్ నివాసంలో విందుకు హాజరవుతారు.

రోడ్ షోలో పాల్గొననున్న చంద్రబాబు

సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రితో చంద్రబాబు బృందం 28న భేటీ కానుంది. నగరాలు, పట్టణాల సుస్థిరాభివృద్ధి ప్రణాళికలపై అధ్యయనం కోసం అక్కడి బిడదారి ఎస్టేట్‌ను సందర్శిస్తారు. సుస్థిర నగరాభివృద్ధిపై నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సింగపూర్ ప్రభుత్వం నిర్మించిన స్పోర్ట్స్ స్కూల్, టువాస్ పోర్టుల్ని సందర్శించనున్నారు. అనంతరం పెట్టుబడిదారులతో నెట్‌వర్కింగ్ కోసం ఆంధ్రప్రదేశ్- సింగపూర్ బిజినెస్ ఫోరం నిర్వహించే రోడ్ షోలో చంద్రబాబు పాల్గొంటారు.

పెట్రో కెమికల్ ఐలాండ్ సందర్శన

జులై 29న ఏఐ సింగపూర్, ఎస్‌ఐఏ ఇంజినీరింగ్, కేప్పెల్, జీఐసీ లాంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు బృందం వరుసగా భేటీ కానుంది. ఐటీ, ఫిన్‌టెక్ బిజినెస్ రౌండ్ టేబుల్‌లో పదికి పైగా అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో చంద్రబాబు చర్చిస్తారు. అనంతరం సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాని లీ హ్సియన్ లూంగ్‌లతో వేర్వేరుగా సమావేశం అవుతారు. జురాంగ్ పెట్రోకెమికల్ ఐలాండ్ సందర్శిస్తారు. అనంతరం వివిధ కంపెనీల సీఈవోలతో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. 30న కేపిటా ల్యాండ్, సుమితోమో మిట్సుయి బ్యాంక్, టెమసెక్ సంస్థలతో సమావేశం అవుతారు. సింగపూర్ విదేశాంగ మంత్రి బాలకృష్ణన్‌తో భేటీ కానున్నారు. జులై 31న సింగపూర్ హోంమంత్రి కె.షణ్ముగంతో పాటు స్థానిక ప్రతినిధులతో సమావేశమవుతారు. అదేరోజు రాత్రి హైదరాబాద్‌కు చంద్రబాబు బృందం తిరుగు ప్రయాణం కానుంది. అంతర్జాతీయ పెట్టుబడులకు ఈ పర్యటన గేట్‌వేగా నిలవబోతోంది. ఐదు రోజుల పర్యటనలో మొత్తం 29 కార్యక్రమాల్లో చంద్రబాబు బృందం పాల్గొననుంది. ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, క్రీడలు, నౌకాశ్రయాలు, ఫిన్‌టెక్ రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్య అవకాశాలపై ఆయా రంగాల ప్రతినిధులతో చర్చిస్తారు.



తాడికొండ వాలులో ఉన్న రాంకీ ఘనవ్యర్థాల నిల్వ కేంద్రం

రాంకీ సంస్థకు పీసీబీ నోటీసులు

వ్యర్థాల నిల్వలో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తింపు

పరవాడ, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా పరవాడలోని 'జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ' డెవలపర్‌గా వ్యవహరిస్తున్న విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్(రాంకీ) సంస్థ నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించిన నేపథ్యంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నోటీసులు జారీ చేసింది. ఉత్తరాంధ్ర, ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని పలు ఫార్మా సంస్థలకు చెందిన ఘన వ్యర్థాలను వాహనాల్లో పరవాడకు తరలిస్తారు. అక్కడ రాంకీ సంస్థ వీటిని ప్రాసెస్ చేసి తాడికొండపై ఉన్న 'ల్యాండ్‌ఫిల్' కేంద్రానికి తరలిస్తుంది. ఈ ప్రక్రియకు రాంకీ యాజమాన్యానికి సదరు ఫార్మా సంస్థలు కొంత రుసుం చెల్లిస్తాయి. అయితే, తాడికొండపై ఉన్న ల్యాండ్‌ఫిల్ కేంద్రం పూర్తిగా నిండిపోయింది. ఈ నేపథ్యంలో రాంకీ సంస్థ సమీపంలో ఉన్న కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్(సీడబ్ల్యూఎంపీ) షెడ్లకు వెనుక ప్రదేశంలో నిబంధనలకు విరుద్ధంగా వందల టన్నుల ఘన వ్యర్థాలను నిల్వ చేసింది. ఇక్కడి పరిస్థితిపై ఇటీవల తనిఖీలు చేపట్టి, తాజాగా రాంకీ సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు పీసీబీ ఈఈ ముకుందరావు శనివారం తెలిపారు. మరోవైపు 'ల్యాండ్‌ఫిల్' ప్రాంతం నిండిపోవడంతో రాంకీ యాజమాన్యం గత కొద్ది రోజులుగా ఫార్మా కంపెనీల నుంచి వ్యర్థాలను తీసుకునే ప్రక్రియను నిలిపివేసిందని, దీంతో వ్యర్థాలను కంపెనీల్లో నిల్వ ఉంచాల్సిన పరిస్థితి నెలకొందని ఫార్మా కంపెనీ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మరో నూతన ల్యాండ్‌ఫిల్ కేంద్రం ఏర్పాటు జరిగే వరకు ఫార్మా కంపెనీల వ్యర్థాలను నెల్లూరులో ఉన్న వ్యర్థాల నిల్వకేంద్రానికి తరలించడానికి సన్నాహాలు చేస్తున్నామని పీసీబీ ఈఈ వెల్లడించారు.

పేదల ఇళ్లు అమ్మేసి.. నిధులు కుమ్మేసి!

- వైకాపా హయాంలో టిడ్కో గృహాల విక్రయాలు
- గుడివాడలో సాగిన దందాపై విచారణేదీ?



కృష్ణా జిల్లా మల్లాయపాలెంలోని టిడ్కో ఇళ్లు

ఈనాడు, అమరావతి, గుడివాడ-న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో కృష్ణా జిల్లా గుడివాడ నియోజకవర్గం మల్లాయపాలెం పంచాయతీ పరిధిలోని టిడ్కో ఇళ్లకు సంబంధించి చోటుచేసుకున్న అక్రమాలు అన్నీఇన్నీ కావు. దీనిపై అప్పట్లో తెదేపా సహా ప్రతిపక్ష పార్టీలన్నీ గగ్గోలు పెట్టాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది దాటినా.. ఆ దందాపై దృష్టి సారించనే లేదు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో అక్కడ 8,912 టిడ్కో ఇళ్ల నిర్మాణం ఆరంభించారు. 80 శాతం పనులు పూర్తయిన సమయంలో.. వైకాపా గద్దెనెక్కింది. అంతే, ఆ ఇళ్ల కోసం తెదేపా ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో చాలా మందిని జాబితా నుంచి తప్పించారు. తమకు డబ్బు ముట్టజెప్పిన వారి పేర్లను జాబితాలో చొప్పించారు. దీనికోసం ఒక్కో ఇంటికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకూ వసూలు చేశారు. ఇలా ఏకంగా 1,600 ఇళ్ల వరకు పక్కదారి పట్టించారు. తమను జాబితా నుంచి ఎందుకు తొలగించారని అర్హులైన లబ్ధిదారులు నిలదీస్తే.. వారిపై దాడులు చేసేందుకూ వెనుకాడలేదు. ఈ వ్యవహారమంతా వైకాపా నేత కొడాలి నాని ప్రధాన అనుచరుడి కనుసన్నల్లోనే జరిగింది. దీనికోసం వైకాపా కార్యాలయంలో ఓ తాత్కాలిక ఉద్యోగిని కూడా మున్సిపాలిటీకి అనుబంధంగా నియమించుకున్నారు. గుడివాడ పరిధిలో లేని బయట వారిని తీసుకొచ్చి మరీ ఇళ్లు కేటాయించారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా.. కలెక్టర్ నుంచి వచ్చిన జాబితాలో అర్హుల పేర్లను ఆన్‌లైన్‌లో పక్కాగా మార్చేశారు. జాబితా నుంచి తొలగించిన వారు టిడ్కో ఇళ్ల కోసం అంతవరకు కట్టిన డబ్బును కూడా తిరిగివ్వకుండా ముప్పుతిప్పలు పెట్టారు.

రూ.2 కోట్ల దుబారాకు ఇప్పటికీ లెక్కల్లేవ్..

తెదేపా హయాంలో 80 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను.. వైకాపా వచ్చాక ఏకంగా మూడేళ్లకు పైగా గాలి కొదిలేశారు. భవనాలు శిథిలావస్థకు చేరే పరిస్థితి ఏర్పడింది. దీనిపై తీవ్ర విమర్శలు రేగడంతో హడావుడిగా వైకాపా రంగులేసి.. ఏడు వేల మందికి పైగా లబ్ధిదారులకు ఒకేసారి కేటాయించేశారు. నాటి సీఎం జగన్‌ను రప్పించి హడావుడి చేశారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా.. కేటాయించడంతో అక్కడ నివాసం ఉండేందుకు స్థానికులు నరకం అనుభవించారు. దీంతో చాలామంది కొద్దిరోజులకే వెనక్కి వచ్చేశారు. టిడ్కో ఇళ్ల ఆరంభోత్సవం పేరుతో రూ.2 కోట్ల నిధులను వైకాపా నేతలు జేబుల్లో వేసుకున్నారు. ప్రారంభోత్సవానికి జగన్ వస్తున్నారంటూ హడావుడి చేసి, ప్రభుత్వ నిధుల ఖర్చులను విచ్చలవిడిగా చూపారు. నిమ్మరసం పంపిణీ చేసినందుకు ఏకంగా రూ.28 లక్షల బిల్లులు పెట్టారు. ఈ కాంట్రాక్టులన్నీ కొడాలి నానీ అనుచరులే దక్కించుకున్నారు. వీటిపైనా అధికారులు ఇప్పటివరకు దృష్టిసారించింది లేదు.

మిథున్‌రెడ్డితో ఆయన భార్య, కుమారుడి ములాఖత్



రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో మిథున్‌రెడ్డిని కలిసి బయటకు వస్తున్న ఆయన భార్య లక్ష్మీ దివ్య, కుమారుడు జస్విన్‌రెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో ఆయన భార్య లక్ష్మీ దివ్య, కుమారుడు జస్విన్‌రెడ్డి శనివారం ములాఖత్ అయ్యారు. ఉదయం 11 గంటలకు జైలు లోపలకు వెళ్లిన వారు 11:30 గంటలకు బయటకొచ్చారు. మాజీ ఎంపీ భరత్‌రామ్ జైలు వద్ద వారితో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కక్షతోనే మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని ఆరోపించారు. మద్యం ద్వారా జగన్ హయాంలో ప్రభుత్వానికి రూ.7 వేల కోట్ల మేర ఆదాయం పెరిగితే నష్టం ఎక్కడ వచ్చిందని ప్రశ్నించారు.

(12వ పేజీ తరువాయి)

క్రమ సంఖ్య	సర్వే నెంబరు	భూసేకరణ క్రింది విస్తీర్ణం (సెంట్లు.య.)	భూమి తరగతి	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు తూర్పు	పడమర	ఉత్తరము	దక్షిణం	చెట్లు, కట్టడములు ఇతరముల వివరములు
132	478-1	2.00	ప్ర.మెరక	చిలంతరావు సీలమ్మ	477	451	479	475	
133	480-2A	4.80	ప్ర.మెరక	పోడూరి వీరభద్రరావు	423	479	425	481	
134	483	1.23	ప్ర.మెరక	దొడ్డ సత్యనారాయణ	484	416	415	487	
135	490	0.87	ప్ర.మెరక	తోట దుర్గమ్మ	491	485	407	489	
136	490-1	1.58	ప్ర.మెరక	పోతంశెట్టి అంజిబాబు	491	485	407	489	
137	490-2	0.66	ప్ర.మెరక	బండారు జగదేశ్వరి	491	485	407	489	
138	490-3	0.74	ప్ర.మెరక	వల్లూరి శ్రీనివాసరావు	400	406	402	491	
139	49-1	5.00	ప్ర.మెరక	పుసులూరి హేమంత్ కుమార్	49-2	50	2	54	బోరు-1, తాడి-90, వేప-6, విప్ప-1
140	492-1	0.75	ప్ర.మెరక	తోట దుర్గారావు	400	492-1	402	491	
141	492-1	0.73	ప్ర.మెరక	తోట శరభేంద్రరావు	400	492-1	402	491	
142	492-2	0.97	ప్ర.మెరక	తోట వెంకటేశ్వరరావు	400	492-1	402	491	
143	492-2	0.19	ప్ర.మెరక	తోట అర్జునరావు	400	492-1	402	491	
144	49-4	0.55	ప్ర.మెరక	పుసులూరి హేమంత్ కుమార్	48	49-3	2	55	
145	510-1C	0.30	ప్ర.మెరక	దొడ్డ సత్యనారాయణ	511	517	508	516	
మొత్తము		218.69							

ప్రదేశము: వి.ఆర్.పురం యూనిట్-II
తేది : 26-07-2025

సం/- ఎస్.సరళా వందనం
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

సం/- కె.ఆంజనేయులు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణాధికారి)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి.ఆర్.పురం యూనిట్-II, చింతూరు

సభాపతి నేతృత్వంలో సదుపాయాల కమిటీ

- మండలి ఛైర్మన్ అధ్యక్షతన సభా నియమావళి కమిటీ
- రెండు సంయుక్త కమిటీలకు ఛైర్మన్లుగా వైకాపా సభ్యులు

ఈనాడు, అమరావతి: శాసనసభ, శాసనమండలి ఉభయ సభలకు సంబంధించి 9 సంయుక్త కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి కమిటీలో ఛైర్మన్, 11 మంది సభ్యుల చొప్పున నియమితులయ్యారు. 2025-26 సంవత్సరానికిగాను ఈ కమిటీలను నియమించినట్లు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ శనివారం బులెటిన్ విడుదల చేశారు. సదుపాయాలు, వన్యప్రాణులు- పర్యావరణ పరిరక్షణ.. ఈ రెండు కమిటీలకు శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. బీసీ సంక్షేమంపై కమిటీకి బీద రవిచంద్ర, ఎస్సీ సంక్షేమం- వర్ల కుమార్ రాజా, ఎస్టీ సంక్షేమం- మిరియాల శిరీషాదేవి, మైనారిటీ సంక్షేమం- మహ్మద్ నజీర్ అహ్మద్, స్త్రీ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమంపై కమిటీకి గౌరు చరితారెడ్డి ఛైర్మన్లుగా నియమితులయ్యారు. వైకాపా ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులును సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీకి, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిని గ్రంథాలయ కమిటీకి ఛైర్మన్లుగా నియమించారు.

శాసనమండలిలో కమిటీలు ఇలా..: శాసనమండలికి ప్రత్యేకంగా ఏడు కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో సభా నియమాలు, తెలుగు భాష- సంస్కృతి అభివృద్ధి.. ఈ రెండు కమిటీలకూ మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు అధ్యక్షులుగా వ్యవహరించనున్నారు.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

బడుల్లో భద్రతా తనిఖీలు చేపట్టండి

రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

దిల్లీ: బడి పిల్లల రక్షణ కోసం పాఠశాలల్లో తగిన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు ఉన్నాయా అనే విషయంలో తనిఖీలు నిర్వహించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల భవన నిర్మాణం సక్రమంగా ఉందా.. లేదా అన్నది పరిశీలించాలని శనివారం సూచించింది. రాజస్థాన్‌లోని ఝాలావాడ్ జిల్లాలో ఒక ప్రభుత్వ పాఠశాల భవనం కూలి ఏడుగురు విద్యార్థులు మృతి చెందడంతోపాటు 28 మంది గాయపడిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసింది. 'పాఠశాలల్లో భద్రతా తనిఖీలు నిర్వహించాలి. అత్యవసర పరిస్థితుల్ని ఎలా ఎదుర్కోవాలో తెలుపుతూ సిబ్బందికి, విద్యార్థులకు శిక్షణనివ్వాలి. అగ్ని ప్రమాదాల నుంచి భద్రత కల్పించే ఏర్పాట్లు ఉన్నాయా.. అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఉన్నాయా.. ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలున్నాయా.. అత్యవసర పరిస్థితుల్ని ఎదుర్కొనే సన్నద్ధత ఉందా అన్నది తనిఖీ చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరాం' అని కేంద్ర విద్యాశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.



మీ జీవితం సులభతరం అవ్వాలంటే..

నేటి సమాజంలో అనేకమంది.. చాలా అనవసర విషయాలను వ్యక్తిగతంగా తీసుకుంటున్నారు. అలాంటి వ్యక్తులు, పరిణామాలు మీకు ఎదురైతే- చిరునవ్వుతోనే బదులివ్వండి. ఒక్కోసారి మిమ్మల్ని విమర్శించినా.. మీకు సంబంధం లేదన్నట్టు భావించి ముందుకు సాగండి. దానివల్ల మీ జీవన ప్రయాణం వంద రెట్లు సులభతరంగా మారుతుంది.

– జూలీ గుర్నర్, పర్ఫార్మెన్స్ కోచ్



తొలి గేమ్ సమం

హంపి × దివ్య మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్

బాటుమి (జార్జియా)

భారత అమ్మాయిలు కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ మధ్య ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్ ఆసక్తికరంగా సాగుతోంది. వీళ్ల మధ్య శనివారం తొలి గేమ్ 41 ఎత్తుల వద్ద డ్రాగా ముగిసింది. ఇద్దరికీ గెలిచే అవకాశాలు లభించినా.. పైచేయి సాధించలేకపోయారు. హంపి నల్లపావులతో ఆడింది. రెండో గేమ్‌లో తెల్లపావులతో ఆడనుండడం ఆమెకు సానుకూలాంశం. క్లాసికల్ ఫార్మాట్లో రెండో గేమ్ కూడా డ్రాగా ముగిస్తే సోమవారం టైబ్రేక్స్ ఆడతారు. తొలి గేమ్‌లో 11వ ఎత్తు తర్వాత దివ్య బలమైన స్థితిలో కనిపించింది. కానీ అవకాశాన్ని ఆమె ఉపయోగించుకోలేకపోయింది. అయితే 25వ ఎత్తు వద్ద సమయం తక్కువగా ఉండడంతో దివ్య ఒత్తిడికి గురైంది. మూడో స్థానం కోసం జరుగుతున్న పోరులో చైనా అమ్మాయిలు జోంగ్యి తాన్, టాప్ సీడ్ లీ టింగ్‌జీ పాయింట్ పంచుకున్నారు. ఫైనల్‌కు చేరిన హంపి, దివ్య ఇప్పటికే క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారు. మూడో స్థానంలో నిలిచిన క్రీడాకారిణికి కూడా ఆ టోర్నీలోకి ప్రవేశం లభిస్తుంది.

సెప్టెంబరు 9 నుంచి ఆసియా కప్

14, 21 తేదీల్లో భారత్, పాక్ మ్యాచ్‌లు

కరాచి: ఆసియా కప్ టీ20 టోర్నీ సెప్టెంబరు 9 నుంచి 28 వరకు యూఏఈలో జరగనుంది. ఈ విషయాన్ని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఛైర్మన్ మోసిన్ నఖ్వీ 'ఎక్స్'లో వెల్లడించాడు. "2025 ఆసియా కప్ యూఏఈ వేదికగా జరుగుతుందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఈ ప్రతిష్టాత్మక టోర్నీని సెప్టెంబరు 9 నుంచి 25 వరకు నిర్వహిస్తాం. పూర్తి షెడ్యూల్ త్వరలోనే ప్రకటిస్తాం" అని నఖ్వీ పేర్కొన్నాడు. ఎనిమిది జట్లు పోటీ పడే ఈ టోర్నీకి ఆతిథ్య దేశం భారతే అయినా.. మ్యాచ్‌లు మాత్రం యూఏఈలో జరుగుతాయి. ఇటీవలే ఢాకాలో నిర్వహించిన ఏసీసీ సర్వసభ్య సమావేశంలో వేదికను ఖరారు చేశారు. లీగ్ దశలో భారత్, పాకిస్థాన్ రెండుసార్లు తలపడనున్నాయి. సెప్టెంబరు 14, 21 తేదీల్లో, ఆదివారాల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. భారత్ తన మ్యాచ్‌లన్నింటినీ దుబాయ్‌లోనే ఆడే అవకాశముంది. టోర్నీకి అబుదాబి మరో వేదికగా నిలవనుంది. భారత్, పాకిస్థాన్, యూఏఈ , ఒమన్ గ్రూప్-ఎలో ఉండగా.. శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, హాంకాంగ్ గ్రూప్-బిలో చోటు దక్కించుకున్నాయి. మొత్తంగా టోర్నీలో 19 మ్యాచ్‌లుంటాయి. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో ఈసారి ఆసియా కప్‌ను టీ20 ఫార్మాట్లో నిర్వహించనున్నారు.

వెన్నెల, తన్విలకు కాంస్యాలు





సోలో (ఇండోనేషియా): ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను భారత షట్లర్లు వెన్నెల కలగొట్ల, తన్వి శర్మ కాంస్యాలతో ముగించారు. శనివారం మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో వెన్నెల 15-21, 18-21తో లూసి యా (చైనా) చేతిలో ఓడింది. రెండో గేమ్‌లో వెన్నెల పోరాటం ఆకట్టుకుంది. 15-20తో వెనుకబడిన స్థితిలో మూడు మ్యాచ్ పాయింట్లను కాచుకుంది. కానీ కీలక సమయంలో చేసిన తప్పిదం ఆమెకు ఓటమిని మిగిల్చింది. మరో సెమీస్‌లో తన్వి 13-21, 14-21తో ఎనిమిదో సీడ్ యిన్ కింగ్ (చైనా)కు తలొంచింది. తొలి గేమ్‌లో ఓడినా.. రెండో గేమ్‌లో తన్వి 6-1తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాత తడబడి గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కోల్పోయింది. ఈ టోర్నీలో సింగిల్స్‌లో ఇద్దరు భారత అమ్మాయిలు పతకాలు గెలవడం ఇదే తొలిసారి.

సాత్విక్ జోడీ ఓటమి

చెంగ్డూ: చైనా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పోరాటం ముగిసింది. శనివారం పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్ జంట 13-21, 17-21తో ఆరోన్ చియా-సో వుయ్ (మలేసియా) జోడీ చేతిలో వరుస గేముల్లో ఓడింది. రెండో గేమ్‌లో 8-13తో వెనుకబడినా భారత జంట పుంజుకుని 16-16తో స్కోరు సమం చేసింది. తర్వాత తడబడి ఓటమి పాలైంది. ఆరోన్ జంటతో 14 మ్యాచ్‌లు ఆడిన భారత జోడీకి ఇది పదకొండో ఓటమి. ఈ ఏడాది మెరుగ్గానే ఆడుతున్నా భారత జంట టైటిల్ సాధించలేకపోతోంది. ఇండియా ఓపెన్, సింగపూర్ ఓపెన్, మలేసియా ఓపెన్లలో సెమీస్‌లోనే వెనుదిరిగింది. ఇండోనేషియా ఓపెన్లో క్వార్టర్స్‌లోనే ఓడిన సాత్విక్ ద్వయం.. జపాన్ ఓపెన్లో రెండో రౌండ్లో ఇంటిముఖం పట్టింది.

డేవిడ్ ధమాకా

37 బంతుల్లోనే సెంచరీ

విండీస్‌పై ఆసీస్‌దే టీ20 సిరీస్



బసెటీర్ (సెయింట్ కిట్స్): వెస్టిండీస్‌తో అయిదు టీ20ల సిరీస్‌ను ఆస్ట్రేలియా మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే చేజిక్కించుకుంది. టిమ్ డేవిడ్ (102 నాటౌట్; 37 బంతుల్లో 6×4, 11×6) మెరుపు శతకం బాదడంతో మూడో టీ20లో ఆసీస్ 6 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. షై హోప్ (102; 57 బంతుల్లో 8×4, 6×6), బ్రెండన్ కింగ్ (62; 36 బంతుల్లో 3×4, 6×6) చెలరేగడంతో మొదట వెస్టిండీస్ 4 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్‌తో పాటు మిచెల్ ఓవెన్ (36 నాటౌట్; 16 బంతుల్లో 2×4, 3×6) మెరవడంతో లక్ష్యాన్ని ఆసీస్ 16.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మార్ష్ 22, మ్యాక్స్‌వెల్ 20 పరుగులు చేశారు. ఆకాశమే హద్దుగా చెలరేగిన డేవిడ్.. ఆస్ట్రేలియా తరపున టీ20ల్లో వేగవంతమైన సెంచరీ (37 బంతుల్లో) నమోదు చేశాడు. ఈ విజయంతో సిరీస్‌లో ఆస్ట్రేలియా 3-0తో ఆధిక్యంలో నిలిచింది.

ఫైనల్లో ఓడిన శ్రీజ



సత్యన్ జంటకు డబుల్స్ టైటిల్

లాగోస్ (నైజీరియా): డబ్ల్యూటీటీ కంటెండర్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లో డిఫెండింగ్ ఛాంపియన్, హైదరాబాద్ అమ్మాయి ఆకుల శ్రీజ టైటిల్ నిలబెట్టుకోలేకపోయింది. ఆమె ఆఖరి మెట్టుపై తడబడింది. శనివారం మహిళల సింగిల్స్ తుదిపోరులో శ్రీజ 7-11, 3-11, 4-11, 11-9, 11-13తో రెండో సీడ్ హనోకా హషిమెటో (జపాన్) చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో సత్యన్-ఆకాశ్ పాల్ జంట టైటిల్ గెలుచుకుంది. తుదిపోరులో సత్యన్ జోడీ 11-9, 11-4, 11-9తో లియో నాడ్‌రెస్ట్-జులెస్ రొనాల్డ్ (ఫ్రాన్స్) ద్వయంపై విజయం సాధించింది.

నగాల్ పరాజయం

దిల్లీ: టాంపెర్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్లో భారత స్టార్ సుమిత్ నగాల్ కథ ముగిసింది. శనివారం పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అతడు 5-7, 2-6తో సషా గెమార్డ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. తొలి సెట్లో గట్టిగానే పోరాడిన నగాల్.. రెండో సెట్లో అనవసర తప్పిదాలు చేసి ప్రత్యర్థికి అవకాశం ఇచ్చాడు. తొలి గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసే అవకాశాన్ని కూడా వదులుకున్నాడు. దీనికి తోడు మ్యాచ్‌లో అయిదుసార్లు సర్వీస్ కోల్పోయి ఓటమిని కొనితెచ్చుకున్నాడు.

సాహిల్‌కు స్వర్ణం

రైన్ రుర్ ఇసెన్ (జర్మనీ): ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లో భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. ఆర్చరీ పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం తుదిపోరులో సాహిల్ జాదవ్ 149-148తో అజయ్ స్కాట్ (బ్రిటన్)ను ఓడించాడు. కాంస్య పతక పోరులో మరో భారత ఆర్చర్ కుశాల్ దలాల్‌కు చుక్కెదురైంది. అతడు 148-150తో కొనెకి (పోలెండ్) చేతిలో ఓడాడు. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో పర్ణీత్ కౌర్‌కు రజతమే దక్కింది. ఫైనల్లో ఆమె 146-147తో మూన్ యెన్ (దక్షిణ కొరియా)కు తలొంచింది. ఈ టోర్నీలో కాంపౌండ్ విభాగాన్ని భారత్ అయిదు పతకాలతో ముగించింది.

స్ప్రింట్ రేసులో వెర్‌స్టాపెన్ గెలుపు

స్పా-ఫ్రాంకోర్‌ఛాంప్స్ (బెల్జియం): బెల్జియం గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ స్ప్రింట్ రేసులో మాక్స్ వెర్‌స్టాపెన్ విజయం సాధించాడు. 15 ల్యాప్‌ల రేసును ఈ రెడ్‌బుల్ స్టార్ 26.37 సెకన్లలో పూర్తి చేశాడు. మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి (27.12 సె) రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. లాండో నోరిస్ (మెక్‌లారెన్, 27.78 సె) మూడో స్థానంలో నిలిచాడు. ఫెరారీ స్టార్ లూయిస్ హామిల్టన్ (56.54 సె) 15వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

ఛాంపియన్స్

ఇంగ్లాండ్ 311 పరుగుల భారీ ఆధిక్యం సాధించాక.. భారత్ ఇలా రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిందో లేదో అలా రెండు వికెట్లు పడిపోయాయి.. స్కోరు బోర్డుపై ఒక్క పరుగూ చేయకుండానే ఇద్దరు ఔటైపోయారు.. ఆ స్థితిలో ఆట చివరి రోజుకు వెళ్తుందనే ఆశలే లేవు. నాలుగో రోజు భారత్ కథ ముగిసిపోతుందని.. ఇన్నింగ్స్ ఓటమి ఖాయమని.. అందరూ ఒక అంచనాకు వచ్చేసిన పరిస్థితి!

కానీ సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాత్రం కాడి వదిలేయలేదు. ప్రతికూల పరిస్థితుల్లో అసాధారణ పోరాటమే చేశారు ఈ ఇద్దరూ. ముందు ఓపిగ్గా క్రీజు చుట్టూ గోడ కట్టి.. ఆ తర్వాత పరుగులూ రాబట్టి శుక్రవారం మరో వికెట్ లేకుండా ఆట ముగించిందీ జంట. ఫలితంగా నాలుగో టెస్టులో డ్రా మీద ఆశలు చిగురించాయి. చివరి రోజు వీళ్లిద్దరూ ఇంకొన్ని గంటలు నిలిస్తే.. వీరి స్ఫూర్తితో మిగతా బ్యాటర్లూ పోరాడితే మాంచెస్టర్‌లో టీమ్ ఇండియా డ్రాతో గట్టెక్కొచ్చు.

ఎదురు నిలిచారు

● రాహుల్, శుభ్‌మన్ అద్భుత పోరాటం

● రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 174/2 ● ఇంగ్లాండ్ 669.. ఆధిక్యం 311



697

ఈ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ పరుగులు. ఇంగ్లాండ్‌లో ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆసియా బ్యాటర్‌గా అతను రికార్డు సృష్టించాడు. 2006లో మహ్మద్ యూసుఫ్ (పాకిస్థాన్) 631 పరుగులతో నెలకొల్పిన రికార్డును అతను బద్దలు కొట్టాడు.

మాంచెస్టర్

ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టులో ఓటమి తప్పించుకుని, సిరీస్‌పై ఆశలను సజీవంగా ఉంచుకోవడానికి టీమ్‌ఇండియా గట్టిగా పోరాడుతోంది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (87 బ్యాటింగ్; 210 బంతుల్లో 8×4), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (78 బ్యాటింగ్; 167 బంతుల్లో 10×4) పట్టుదలతో నిలవడంతో నాలుగో రోజు ఆట చివరికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 174/2తో నిలిచింది. క్రిస్ వోక్స్ (2/48) తొలి ఓవర్లోనే 2 వికెట్లు తీసి భారత్‌ను కష్టాల్లోకి నెట్టినా.. రాహుల్, గిల్ జోడీ గొప్పగా పోరాడి జట్టును కాపాడింది. ఇంగ్లాండ్ స్కోరుకు భారత్ ఇంకా 137 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు 544/7తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లాండ్ 669 పరుగులకు ఆలౌటైంది. బెన్ స్టోక్స్ (141; 198 బంతుల్లో 11×4, 3×6) సెంచరీ పూర్తి చేశాడు. జడేజా 4 వికెట్లు తీశాడు.

స్కోరు 0.. వికెట్లు 2: ఇంగ్లాండ్‌కు 300కు పైగా ఆధిక్యం కోల్పోయాక రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌కు తొలి ఓవర్లోనే డబుల్ షాక్ తగిలింది. వోక్స్ వరుస బంతుల్లో రెండు వికెట్లు తీసి భారత్‌ను గట్టి దెబ్బ తీశాడు. నాలుగో బంతికి జైస్వాల్, అయిదో బంతికి సుదర్శన్ స్లిప్‌లో క్యాచ్‌లు ఇచ్చి డకౌటయ్యారు. 0/2తో భారత్ లంచ్‌కు వెళ్లింది. ఈ ఆరంభం చూశాక భారత్ ఘోర పరాభవానికి రంగం సిద్ధమైనట్లే కనిపించింది. కానీ ఫామ్‌లో ఉన్న రాహుల్, శుభ్‌మన్.. రెండు సెషన్ల పాటు వికెట్టే ఇవ్వకుండా ఇంగ్లిష్ బౌలర్లను కాచుకున్నారు. కొన్ని ఓవర్ల పాటు ఓపిగ్గా ఆడిన ఈ ద్వయం.. తర్వాత బ్యాట్లకు పని చెప్పింది. అప్పటిదాకా పిచ్, ఇంగ్లాండ్ బౌలర్లు ప్రమాదకరంగా కనిపించగా.. తర్వాత అంతా మామూలైపోయింది. 46 పరుగుల వద్ద కార్స్ బౌలింగ్‌లో బ్యాక్‌వర్డ్ పాయింట్లో శుభ్‌మన్ ఇచ్చిన క్యాచ్‌ను డాసన్ వదిలేయడం భారత్‌కు కలిసొచ్చింది. ఇది మినహా ఈ భాగస్వామ్యం లోపరహితంగా సాగింది. టీకి ముందే శుభ్‌మన్ అర్ధశతకం పూర్తి చేశాడు. విరామానికి స్కోరు 86/2. మూడో సెషన్లో రాహుల్ దూకుడుగా ఆడాడు. టీకి 29 పరుగులతో ఉన్న రాహుల్.. తర్వాత వేగంగా అర్ధశతకం పూర్తి చేయడమే కాక.. గిల్ స్కోరును దాటేశాడు. ఆఖర్లో ఒక్క వికెట్ అయినా పడగొట్టాలని ఇంగ్లాండ్ గట్టిగా ప్రయత్నించింది. చుట్టూ ఫీల్డర్లను మోహరించి స్పిన్నర్లు డాసన్, రూట్‌తో బౌలింగ్ చేయించింది. కానీ భారత జోడీ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు.

ఆ మూడు వికెట్లు తీయడానికి..: 544/7.. మూడో రోజు ఆట చివరికి ఇంగ్లాండ్ స్కోరిది. స్టోక్స్ 77 పరుగులతో క్రీజులో ఉన్నప్పటికీ, అవతల మిగిలింది టెయిలెండర్లే కాబట్టి.. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ముగియడానికి ఎంతో సమయం పట్టదనుకున్నారంతా. కానీ ఈ మూడు వికెట్లు తీయడానికి ఇంకో 22.1 ఓవర్లు పట్టాయి భారత్‌కు. ఈలోపు ఇంకో 125 పరుగులు ఇంగ్లాండ్ ఖాతాలో జమ అయ్యాయి. ఈ మ్యాచ్‌లో బంతితో 5 వికెట్ల ప్రదర్శన చేసిన స్టోక్స్.. బ్యాటుతో ఇంకా రెచ్చిపోయి సెంచరీ చేశాడు. డాసన్ (26) ఓవర్‌నైట్ స్కోరుకు 5 పరుగులే జోడించి బుమ్రా బౌలింగ్‌లో బౌల్డ్ అయినా.. కార్స్ (47; 54 బంతుల్లో 3×4, 2×6)ను ఆపడం భారత బౌలర్ల వల్ల కాలేదు. అతను ప్రధాన బ్యాటర్లకు దీటుగా బ్యాటింగ్ చేశాడు. బుమ్రా సహా బౌలర్లందరినీ అలవోకగా ఎదుర్కొంటూ స్టోక్స్‌తో 9వ వికెట్‌కు ఏకంగా 95 పరుగులు జోడించాడు. మరో ఎండ్‌లో స్టోక్స్ కూడా ధాటిగా ఆడుతూ శతకం పూర్తి చేశాడు. ఆ తర్వాత కూడా దూకుడు కొనసాగించాడు. ఈ జోడీ జట్టు స్కోరును 650 దాటించింది. కాసేపట్లో లంచ్ అనగా స్టోక్స్, కార్స్‌లను వరుస ఓవర్లలో ఔట్ చేసిన జడేజా.. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.



ముప్పు తొలగిపోలేదు


అయిదు టెస్టుల సిరీస్‌లో 1-2తో వెనుకబడ్డ టీమ్‌ఇండియాకు సిరీస్‌పై ఆశలు నిలవాలంటే ఈ మ్యాచ్‌లో గెలవాలి లేదా డ్రా చేసుకోవాలి. విజయావకాశాలు మూడో రోజే చేజారాయి. నాలుగో రోజు ఒక దశ వరకు ఆట చూస్తే.. ఓటమి తప్పదనే అనిపించింది. అయితే రాహుల్, గిల్ గొప్పగా పోరాడి డ్రాపై ఆశలు రేకెత్తించారు. అయితే వీళ్లెంత బాగా ఆడినా.. భారత్‌కు ఇప్పటికీ ఓటమి ముప్పు తొలగిపోలేదు. చివరి రోజు ఉదయం కొత్త బంతితో ఆర్చర్, వోక్స్, స్టోక్స్, కార్స్‌లను ఎదుర్కోవడం అంత తేలిక కాదు. రాహుల్, గిల్ అయిదో రోజు కూడా ఇదే పోరాట పటిమను కొనసాగించి, ఒక సెషన్ అయినా ఓవర్లను కరిగించాల్సిందే. భారత్ రెండు సెషన్లకు మించి ఆడితేనే.. మ్యాచ్‌ను డ్రాగా ముగించడానికి అవకాశముంటుంది.

భారత్ తొలి ఇన్నింగ్స్: 358

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) రాహుల్ (బి) జడేజా 84; డకెట్ (సి) జురెల్ (బి) కాంబోజ్ 94; పోప్ (సి) రాహుల్ (బి) సుందర్ 71; రూట్ (స్టంప్డ్) జురెల్ (బి) జడేజా 150; బ్రూక్ (స్టంప్డ్) జురెల్ (బి) సుందర్ 3; స్టోక్స్ (సి) సుదర్శన్ (బి) జడేజా 141; జేమీ స్మిత్ (సి) జురెల్ (బి) బుమ్రా 9; డాసన్ (బి) బుమ్రా 26; వోక్స్ (బి) సిరాజ్ 4; కార్స్ (సి) సిరాజ్ (బి) జడేజా 47; ఆర్చర్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 38; మొత్తం: (157.1 ఓవర్లలో ఆలౌట్) **669**; వికెట్ల పతనం: 1-166, 2-197, 3-341, 4-349, 5-499, 6-515, 7-528, 8-563, 9-658; బౌలింగ్: బుమ్రా 33-5-112-2; అన్షుల్ కాంబోజ్ 18-1-89-1; సిరాజ్ 30-4-140-1; శార్దూల్ 11-0-55-0; జడేజా 37.1-0-143-4; సుందర్ 28-4-107-2

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి (సి) రూట్ (బి) వోక్స్ 0; రాహుల్ బ్యాటింగ్ 87; సుదర్శన్ (సి) బ్రూక్ (బి) వోక్స్ 0; శుభ్‌మన్ బ్యాటింగ్ 78; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (63 ఓవర్లలో 2 వికెట్లకు) **174**; వికెట్ల పతనం: 1-0, 2-0; బౌలింగ్: వోక్స్ 15-3-48-2; ఆర్చర్ 11-2-40-0; కార్స్ 10-2-29-0; డాసన్ 22-8-36-0; రూట్ 5-1-17-0

బుమ్రా రిటైర్ అవుతాడేమో..



దిల్లీ: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, అశ్విన్ తర్వాత రిటైరయ్యే పెద్ద ఆటగాడు బుమ్రానేనని టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డాడు. తన దేహంతో పోరాటంలో అతడు ఓడిపోయినట్లు కనిపిస్తున్నాడని అన్నాడు. 31 ఏళ్ల బుమ్రా నాలుగో టెస్టు మూడో రోజు తేలిపోయాడు. 28 ఓవర్లలో ఒకే వికెట్ పడగొట్టాడు. ఈ నేపథ్యంలోనే కైఫ్ స్పందించాడు. "బుమ్రా వచ్చే టెస్టు మ్యాచ్‌ల్లో ఆడకపోవచ్చు. రిటైరైనా కావొచ్చు" అని అన్నాడు. "విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, అశ్విన్ ఇప్పటికే రిటైరయ్యారు. ఇప్పుడు బుమ్రా వంతు అనిపిస్తోంది. అతడు లేని టెస్టు క్రికెట్‌కు అభిమానులు అలవాటు పడడం మొదలు పెట్టాలి" అని కైఫ్ చెప్పాడు. "నా అంచనా తప్పు కావాలని కోరుకుంటున్నా. కానీ ఈ మ్యాచ్‌లో బుమ్రాను చూస్తుంటే అతడు ఆటను ఆస్వాదించట్లేదని అనిపిస్తోంది. దేహంతో పోరాటంలో బుమ్రా ఓడిపోయాడు. ఆట పట్ల అతడికున్న ఇష్టం ఇంకా అలాగే ఉంది. కానీ అతడి దేహమే అందుకు సహకరించట్లేదు. అలాంటి స్థితిలో ఎవరైనా ఏం చేస్తారు" అని అన్నాడు.


కివీస్‌దే ముక్కోణపు సిరీస్

ఫైనల్లో దక్షిణాఫ్రికాపై విజయం



హరారె: న్యూజిలాండ్ జట్టు టీ20 ముక్కోణపు సిరీస్‌ను గెలుచుకుంది. శనివారం రసవత్తరంగా సాగిన ఫైనల్లో ఆ జట్టు 3 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. కాన్వే (47), రచిన్ రవీంద్ర (47) మెరవడంతో మొదట కివీస్ 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఎంగిడి (2/24) బంతితో రాణించాడు. ఛేదనలో దక్షిణాఫ్రికా 6 వికెట్లకు 177 పరుగులే చేయగలిగింది. ప్రిటోరియస్ (51) టాప్ స్కోరర్. హెండ్రిక్స్ (37), బ్రెవిస్ (31) రాణించారు. హెన్రీ (2/19) సూపర్‌గా బౌలింగ్ చేశాడు. ఆఖరి ఓవర్లో దక్షిణాఫ్రికాకు కేవలం ఏడు పరుగులే అవసరమవగా.. హెన్రీ 3 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బ్రాస్‌వెల్, మిచెల్ కళ్లు చెదిరే క్యాచ్‌లకు బ్రెవిస్, లిండె ఔటయ్యారు.

ఈ రోజుల్లో బ్యాటింగ్ తేలిక


పీటర్సన్

దిల్లీ: ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు కెవిన్ పీటర్సన్ కొత్త చర్చకు తెర దీశాడు. 20-25 ఏళ్ల కిందటితో పోలిస్తే ఇప్పుడు బ్యాటింగ్ చేయడం చాలా తేలికని, టెస్టు ఆడే దేశాల్లో బౌలింగ్ నాణ్యత పడిపోయిందని అన్నాడు. "ఇలా అంటున్నందుకు నా పైన అరవకండి. 20-25 ఏళ్ల కిందటితో పోలిస్తే ఈ రోజుల్లో బ్యాటింగ్ చాలా తేలికైపోయింది. ఇప్పటికంటే అప్పుడు బ్యాటింగ్ రెండు రెట్లు కష్టంగా ఉండేది అనుకుంటా" అని చెప్పాడు. "వకార్, షోయబ్, అక్రమ్, ముస్తాక్, కుంబ్లే, శ్రీనాథ్, హర్భజన్, డొనాల్డ్, పొలాక్, క్లుసెనర్, గాఫ్, మెక్‌గ్రాత్, వార్న్, లీ, గిలెస్పీ, బాండ్, వెటోరి, కెయిన్స్, వాస్, మురళీ, ఆంబ్రోస్, వాల్ష్.. ఇలా చాలా మంది మంచి బౌలర్లు ఉండేవాళ్లు. నేను 22 మంది పేర్లు చెప్పాను. ఈ తరంలో వాళ్లతో పోల్చదగ్గ 10 మంది బౌలర్ల పేర్లు చెప్పండి" అని ఎక్స్‌లో పీటర్సన్ పేర్కొన్నాడు. ఇంగ్లాండ్ బ్యాటర్ రూట్.. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో పాంటింగ్‌ను అధిగమించి రెండో స్థానానికి చేరిన నేపథ్యంలో పీటర్సన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. పీటర్సన్ ఇంగ్లాండ్ తరపున 104 టెస్టులు, 136 వన్డేలు, 37 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.




అశోక్ గజపతిరాజును అభినందిస్తున్న మంత్రి లోకేశ్. పక్కన పల్లా శ్రీనివాసరావు ★ అశోక్ గజపతిరాజును సన్మానిస్తున్న భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్. చిత్రంలో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ తదితరులు

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు ప్రమాణం

పణజి: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా శనివారం ప్రమాణం చేశారు. పణజిలోని రాజ్‌భవన్‌లో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. గోవా ప్రజలతో అనుబంధం ఏర్పడినందుకు ఎంతో ఆనందంగా ఉందని, తామంతా కలిసి ఒక జట్టుగా పనిచేస్తామని ఈ సందర్భంగా గవర్నర్ అశోక్ గజపతిరాజు చెప్పారు. సుదీర్ఘ కాలంగా తాను రాజకీయాల్లో ఉన్నానని, గోవా భాష అర్థం కాకపోయినా నెమ్మదిగా అలవాటు పడతానని చెప్పారు. మీ కోసం కాకుండా మీతో కలిసి పని చేస్తానని వ్యాఖ్యానించారు. మనమంతా కలిసి దేశాన్ని ముందుకు తీసుకెళ్దామని, భారతదేశం ప్రపంచంలో నంబర్ 1గా ఉండాలని ఆకాంక్షించారు. అధికారపక్షంతో పాటు ప్రతిపక్షంలోనూ ఉన్న అనుభవం తనకుందని తెలిపారు. అశోక్ గజపతిరాజు 2014 మే 27 నుంచి 2018 మార్చి 10 వరకు ఎన్డీయే ప్రభుత్వంలో పౌర విమానయానశాఖ మంత్రిగా చేశారు. కాగా.. నాలుగేళ్ల పాటు గోవా గవర్నర్‌గా చేసిన పీఎస్ శ్రీధరన్ పిళ్లైకి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు నారా లోకేశ్, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పలువురు తెదేపా, భాజపా ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు. అశోక్ గజపతిరాజును భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మతో కలిసి సన్మానించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తోనూ ఏపీ భాజపా నేతలు కాసేపు భేటీ అయ్యారు.

ఏ పదవిలోనైనా హుందాగా వ్యవహరిస్తారు

ఈనాడు, అమరావతి: అశోక్ గజపతిరాజు ఏ పదవి చేపట్టినా.. హుందాగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఆయనకు ఎక్స్ వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అంకితభావంతో, నిష్పక్షపాతంగా నూతన బాధ్యతల్ని నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

ఆసియా స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో జెస్సీరాజ్ సత్తా

- సబ్ జూనియర్ విభాగంలో వెండి పతకం కైవసం



జెస్సీరాజ్

మంగళగిరి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీరాజ్ మరో అంతర్జాతీయ పతకంతో మెరిసింది. దక్షిణ కొరియాలో ఈ నెల 24న ప్రారంభమైన 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ సోలోడాన్స్ సబ్ జూనియర్ విభాగంలో వెండి పతకం సాధించి సత్తా చాటింది. ఇప్పటి వరకు ఆమె 50కు పైగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పతకాలను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆమెతో పాటు కోచ్ సింహాద్రిని శనివారం భారత్ రోలర్ స్కేటింగ్ సమాఖ్య కార్యదర్శి భగీరథకుమార్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి థామస్ చౌదరి, ఏపీ ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛైర్మన్ పవన్‌కుమార్, ఆయాన్ టెక్నికల్ కమిటీ సభ్యులు అలెక్స్‌వాంగ్, ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ రవినాయుడు తదితరులు అభినందించారు.

రూ.143 కోట్లతో వసతిగృహాల మరమ్మతులు

ఈనాడు, అమరావతి: కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.143 కోట్లతో వసతి గృహాల మరమ్మతులు చేపట్టినట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి వెల్లడించారు. ఇప్పటికే ఇందులో 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కొత్తగా మరో రూ.100 కోట్లతో వసతి గృహాలను నిర్మిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల విద్య, ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. గురుకులాల్లోని ఏ విద్యార్థి అయినా అనారోగ్యంతో చనిపోతే ఆ కుటుంబానికి అండగా సాంత్వన పథకం కింద రూ.3 లక్షలు ఇస్తున్నామని తెలిపారు.

లంచం తీసుకుంటూ దొరికిన ఈడీ అధికారికి జైలుశిక్ష

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే: చైనాకు చెందిన లోన్ యాప్ నిర్వహణకు సంబంధించి నిఖిల్ ఇన్నాని అనే వ్యక్తిపై నమోదైన కేసును రద్దు చేసేందుకు రూ.5 లక్షల లంచం తీసుకుంటూ బెంగళూరులో దొరికిన అప్పటి ఈడీ అధికారి ఎం.లలిత్ బజాద్.. దోషి అని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు చెప్పింది. 2021 ఫిబ్రవరిలో లంచం తీసుకుంటూ బజాద్ దొరికిపోయారు. ఈ కేసులో విచారణ పూర్తిచేసిన న్యాయమూర్తి మంజునాథ్ సంగ్రేశి నిందితునికి మూడేళ్ల సాధారణ కారాగారశిక్ష, రూ.5.5 లక్షల జరిమానా విధించిన విషయాన్ని అధికారులు శనివారం ధ్రువీకరించారు.

భూగర్భ జలాలు కాపాడితేనే భవిష్యత్తు!

- కొత్త ఉద్యాన పంటలతో నీటి పొదుపు సాధ్యం
- 'ఈనాడు'తో పంజాబ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎ.వేణుప్రసాద్



ఈనాడు, అమరావతి: 'కిలో ధాన్యం ఉత్పత్తికి ప్రపంచ నీటి వినియోగ సగటు.. 2,500 లీటర్లు. చైనాలో 300 లీటర్లు మాత్రమే. అదే మన దేశంలో ఏకంగా 5,600 లీటర్లు. ఈ స్థాయిలో వినియోగం వల్లే మన వద్ద భూగర్భ జలాలు త్వరగా పడిపోతున్నాయి. ఈ ప్రమాదం నుంచి బయటపడాలంటే సాగులో సాంకేతికత, అధునాతన పద్ధతులు అవసరం' అని పంజాబ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, పంజాబ్ ప్రభుత్వ ఎన్నారై కమిషన్ సభ్యుడు ఎ.వేణుప్రసాద్ తెలిపారు. నల్గొండ జిల్లా పెంచికల్‌దిన్నెకు చెందిన వేణుప్రసాద్ బాపట్ల వ్యవసాయ కళాశాల 1980 బ్యాచ్ విద్యార్థి. 1991లో ఐఏఎస్‌కు ఎంపికై సుమారు 30 ఏళ్లపాటు పంజాబ్‌లో వివిధ హోదాల్లో పని చేశారు. ఇటీవల కృష్ణా జిల్లా ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టులో నిర్వహించిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్, నీటి వనరుల సమర్థ వినియోగం, సాగులో సంస్కరణలపై 'ఈనాడు'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పంజాబ్ ప్రగతి ఆదర్శం

పంజాబ్ ప్రభుత్వం రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన నేపథ్యంలో ఓ సంస్కరణ తెచ్చింది. రైతుకు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న సాగు భూమిని ప్రభుత్వం తీసుకొని అంతే విలువైన పొలాన్ని ఒకేచోట కేటాయించింది. అదే సమయంలో రైతు నుంచి నిర్ణీత భూమి తీసుకొని అందులో ఇంకుడు గుంతలు, చెరువులు తవ్వించింది. ఫలితంగా ప్రస్తుతం అక్కడ భూగర్భ జలాలకు కొదవ లేదు. తెలుగు రాష్ట్రాల్లోనూ భూగర్భ జలాలు పెంపొందించే మార్గాలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. పొలాల్లో రైతులే ఇంకుడు గుంతలు తవ్వించుకునేలా అవగాహన కల్పించాలి. అక్కడ పంట కాలువల్లో పూడికతీత, తూడు తొలగింపు, గట్ల పటిష్ఠం తరచూ జరుగుతుంది.

ఉద్యాన పంటలు ఎంతో మేలు

విద్యార్థులు, శాస్త్రవేత్తలు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలి. నేలలను బట్టి పంటలు వేసేలా సూచనలు చేయాలి. నీటి ప్రవాహానికి తగ్గట్లు భూములను చదును చేసుకోవాలి. తేమ ఎక్కువ రోజులు నిలిచేలా భూమిని సిద్ధం చేసుకోవాలి. ఆ మేరకు విత్తనాలనూ అభివృద్ధి చేయాలి. ప్రస్తుతం మన వద్ద 120 రోజులకు వరి చేతికొస్తుంది.. 90 నుంచి 100 రోజుల్లో పంట ఇచ్చే వంగడాలు సిద్ధం చేయాలి. వరితో పోలిస్తే ఉద్యాన పంటలకు నీటి అవసరం తక్కువ. బిందు సేద్యంతో ఉద్యాన పంటల్లో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించొచ్చు. ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వాలు ఉద్యాన పంటలకు మంచి రాయితీలు ఇస్తున్నాయి. డ్రాగన్, అంజీర, అవకాడో వంటి కొత్తరకం పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నాయి. వీటిని అందిపుచ్చుకోవాలి.

విద్యుత్తు నిర్వహణలో..

విద్యుత్తు వృథాను అరికట్టాలి. వానా కాలంలోనూ ఏసీల వినియోగం, యథేచ్ఛగా లైట్లు, ఫ్యాన్లు వాడటం, ఏ సీజన్‌లోనైనా ఫ్రిజ్‌ను సమ్మర్ మోడ్‌లోనే పెట్టి ఉంచడం.. వంటి చిన్న పనులే పెద్దఎత్తున కరెంటు వృథాకు కారణమవుతున్నాయి. ప్రతి ఒక్కరూ విద్యుత్తు వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పీఎం సూర్య ఘర్ వంటి పథకాలతో సౌర శక్తిని వాడుకోవాలి.



డ్వాక్రా మహిళలకు చెక్కును అందిస్తున్న సురేష్‌కుమార్, తేజ్‌భరత్, ధ్యానచంద్ర తదితరులు

ఆహారమూ వ్యాపారమూ.. 'తృప్తి'కరం!

డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో క్యాంటీన్ ప్రారంభం



విజయవాడ పంజా సెంటర్‌లో ఏర్పాటు చేసిన తృప్తి క్యాంటీన్

విజయవాడ వన్ టౌన్, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకే రుణాలిచ్చి ప్రోత్సహిస్తూ తృప్తి క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ చెప్పారు. విజయవాడ పంజా సెంటర్‌లో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రలతో కలిసి శనివారం ఆయన తృప్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. 'మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 750 క్యాంటీన్లు పెడతాం. ఇప్పటికే నెల్లూరులో ఏర్పాటుచేసిన క్యాంటీన్ దిగ్విజయంగా నడుస్తోంది. అక్కడ డ్వాక్రా మహిళలకు రోజుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల ఆదాయం వస్తోంది. 30వేల మంది మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చే లక్ష్యాన్ని సీఎం చంద్రబాబు మాకు అప్పగించారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ ఆదాయం వచ్చేలా వారందరికీ దారి చూపాలని ఆదేశించారు' అని సురేష్‌కుమార్ తెలిపారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు(ఐఓబీ) రుణంగా ఇచ్చిన రూ.10,88,550 చెక్కును డ్వాక్రా మహిళలకు అధికారులు అందించారు. ఐఓబీ రీజినల్ మేనేజర్ హర్జిత్‌సింగ్, సారా ప్రాజెక్ట్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ జె.సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన తైవాన్ వ్యాపార బృందం

రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాల పరిశీలన



తైవాన్ వ్యాపార బృందానికి శ్రీసిటీ గురించి వివరిస్తున్న ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాల పరిశీలనలో భాగంగా తైవాన్‌కు చెందిన 14మంది వ్యాపార ప్రతినిధుల బృందం శనివారం తిరుపతి జిల్లాలోని శ్రీసిటీని సందర్శించింది. బ్రాండెడ్ అథ్లెటిక్, క్యాజువల్ ఫుట్‌వేర్ తయారీదారు పౌచెన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాక్స్‌లిన్ నేతృత్వంలో విచ్చేసిన ఈ బృందానికి ప్రభుత్వం తరఫున కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) ఆర్.శివశంకర్ స్వాగతం పలికారు. పారిశ్రామిక పెట్టుబడులకు గమ్యస్థానంగా శ్రీసిటీ ప్రత్యేకతలను శివశంకర్ వారికి వివరించారు. ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు రంజిత్, గీతాంజలి, ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి మనీష్‌తో పాటు వర్చువల్‌గా పాల్గొన్న ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డా.ఎన్.యువరాజ్ బృందంతో ప్రత్యేక చర్చలు జరిపారు.

వెలుగులు నింపుతున్న వేల్పూరు

నేత్రదానంతో ఆదర్శంగా నిలుస్తున్న గ్రామస్థులు



నేత్రదానం చేసిన వారి కుటుంబ సభ్యులతో చలపతిరావు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే-శావల్యాపురం: పుట్టెడు దుఃఖంలోనూ ఇతరులకు సహాయపడాలన్న వారి ఆలోచన ఆదర్శనీయం. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు వాసులు నేత్రదానంలో ముందడుగు వేస్తున్నారు. ఈ గ్రామంలో 2019 నుంచి ఇప్పటివరకు 18 కుటుంబాలు.. తమ వారు చనిపోయిన సందర్భాల్లో వారి కళ్లను దానం చేశాయి. మార్కాపురం వైద్య కళాశాల ఉద్యోగి చలపతిరావు అవయవదానంపై గ్రామస్థుల్లో చైతన్యం నింపుతున్నారు. వృత్తిరీత్యా వైద్యశిబిరాల్లో పాల్గొనే ఈయనకు ఓ సందర్భంలో శంకర నేత్రాలయ వైద్యులు ఓ సలహా ఇచ్చారు. 'ఎవరైనా చనిపోతే.. వారి కళ్లను దానం చేస్తారేమో తెలుసుకుని, సమాచారమివ్వండి. మేమే వచ్చి తీసుకుంటాం' అని చెప్పారు. తరువాత చలపతిరావు బంధువుల్లో ఒకరు చనిపోగా, ఆ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి నేత్రాలు దానం చేయించారు. చనిపోయిన తర్వాత కళ్లు మట్టిలో కలిసిపోవడం కంటే, వాటిని దానం చేస్తే.. వేరొకరి జీవితాల్లో వెలుగులు నింపిన వారమవుతామని చెబుతానని, వారి అంగీకారంతోనే దానం చేసేలా చూస్తానని చలపతిరావు అంటున్నారు. జిల్లాలో మొత్తం 29 మంది నేత్రదానం చేస్తే.. అందులో వేల్పూరు వారే 18 మంది ఉండడం విశేషం.

ఈ లోకంలోనే నా కొడుకు..



'నా పెద్ద కొడుకు రామాంజనేయులు జీవించి ఉన్నప్పుడు అతని కుటుంబాన్ని, తమ్ముళ్లను, నన్ను నడిపించాడు. చనిపోయాక కూడా నేత్రదానం ద్వారా వేరే వారి జీవితాల్లో వెలుగులు నింపాడు. అంతకంటే ఇంకేం కావాలి' అని వేల్పూరుకు చెందిన ఓబూరి నాగరత్నమ్మ చెప్పారు.

చాలా ఆనందమిచ్చింది..



'ఏడు నెలల కిందట మా తాతయ్య చనిపోయారు. ఆయన కళ్లతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపారన్న వార్త చాలా ఆనందమిచ్చింది. మా ఇంట్లో కుటుంబ సభ్యులందరి అంగీకారంతో నేత్రదానం చేశాం' అని మోతుకూరి రమ్యకృష్ణ తెలిపారు.

సైనికులకు ఇక ఉచిత న్యాయ సహాయం

రాష్ట్రంలో తొలి న్యాయసేవా సహాయ కేంద్రం ప్రారంభం



న్యాయ సేవా సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భాస్కరరావు తదితరులు

విజయవాడ(గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టిన 'నల్సా వీర్ పరివార్ సహాయత యోజన 2025' పథకం కింద రాష్ట్రంలో తొలి న్యాయ సేవా సహాయ కేంద్రాన్ని విజయవాడలోని రాష్ట్ర సైనిక్ బోర్డు కార్యాలయంలో ప్రారంభించారు. దీని ద్వారా దేశానికి సేవ చేస్తున్న సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత న్యాయసాయం అందిస్తారు. ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ సూచనల మేరకు సభ్య కార్యదర్శి బి.హిమబిందు ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. అనిశా ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఇన్‌ఛార్జి ఛైర్మన్ పి.భాస్కరరావు శనివారం దీనిని ప్రారంభించారు. సైనికులు, మాజీ సైనికుల సమస్యలను సత్వరం పరిష్కరించి, దేశానికి వారు చేసిన సేవలకు గౌరవం ఇవ్వడమే ఈ పథకం లక్ష్యమని ఆయన వివరించారు. ఆయా కుటుంబాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ హెచ్.అమరరంగేశ్వరరావు, రాష్ట్ర సైనిక్ బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బలహీనపడుతున్న వాయుగుండం

ఈనాడు, విశాఖపట్నం: ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ పరిసరాల్లో వాయుగుండం కొనసాగుతోంది. ఇది పశ్చిమ దిశగా మధ్యప్రదేశ్ వైపు కదులుతూ ఆదివారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో బుధవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉందన్నారు.


మోదీయే ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ నేత

గ్లోబల్ లీడర్ సర్వేలో భారత్ ప్రధానికి అగ్రస్థానం

ఇంటర్నెట్ డెస్క్: ప్రధాని మోదీ మరో ఘనత సాధించారు. అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ సంస్థ నిర్వహించిన 'గ్లోబల్ లీడర్ సర్వే'లో అత్యంత విశ్వసనీయత ఉన్న నేతగా మొదటిస్థానంలో ఆయన నిలిచారు. ఈ నెల 4-10 మధ్య నిర్వహించిన ఈ సర్వేలో ప్రధాని మోదీకి 75% మంది మద్దతు లభించింది. ఆ వివరాలను భాజపా నేత అమిత్ మాలవీయ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. భారతీయులతోపాటు ప్రపంచవ్యాప్తంగా కోట్లమంది విశ్వసించే నేతగా మోదీ అగ్రస్థానంలో నిలిచారని ఆయన కొనియాడారు. 59%తో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్ రెండో స్థానంలో నిలవగా.. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే (57%), కెనడా ప్రధాని మార్క్ కార్నీ (56%) వరుసగా మూడు, నాలుగు స్థానాలు దక్కించుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 44 శాతంతో ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యారు.

బాలికకు ఐ లవ్ యూ చెప్పడాన్ని లైంగిక వేధింపుగా పరిగణించలేం

• ఛత్తీస్‌గఢ్ హైకోర్టు స్పష్టీకరణ



ఈటీవీ భారత్: పోక్సో చట్టం కింద నమోదైన కేసులో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. బాలికకు ఐ లవ్ యూ చెప్పడాన్ని లైంగిక వేధింపుగా పరిగణించలేమని స్పష్టంచేసింది. ఈ మేరకు ట్రయల్ కోర్టు తీర్పును జస్టిస్ సంజయ్ ఎస్ అగర్వాల్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం సమర్థించింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీలును తిరస్కరించింది. పోక్సో చట్టం కింద కేసు నమోదైన యువకుడిని నిర్దోషిగా ప్రకటించింది. 2019 నాటి ఈ కేసులో 15 ఏళ్ల విద్యార్థిని పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా ఓ యువకుడు ఆమెకు ఐ లవ్ యూ చెప్పాడు. దీంతో విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. యువకుడిపై ఐపీసీ 354డీ, 509, పోక్సో చట్టంలోని సెక్షన్ 8, ఎస్సీ-ఎస్టీ చట్టంలోని సెక్షన్ 3(2) కింద కేసు నమోదు చేశారు.

మాల్దీవులతో సుదృఢ బంధాన్ని కాంక్షిస్తున్నాం

• ప్రధాని మోదీ ఉద్ఘాటన
• స్వాతంత్ర్య వేడుకలకు హాజరు

మాలే: మాల్దీవులతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్ ఆశిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. సామర్థ్య నిర్మాణం, అభివృద్ధి సహకారంతో భారత్ మాల్దీవులకు మద్దతు ఇస్తుందని భరోసా ఇచ్చారు. మాల్దీవుల 60వ స్వాతంత్ర్య వేడుకలకు మోదీ శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు మాల్దీవుల ఉపాధ్యక్షుడు ఉజ్ హుస్సేన్ మహమ్మద్ లతీఫ్‌తో సహా పలువురు రాజకీయ నేతలతో భేటీ అయ్యారు. "మౌలిక సదుపాయాలు, వాతావరణ మార్పులు, మరికొన్ని కీలక రంగాల్లో ఇరుదేశాలు కలిసి పని చేస్తున్నాయి. ఇది మన ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. ముమ్ముందు ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఆశిస్తున్నాం" అని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పీపుల్స్ మజ్లిస్(మాల్దీవుల పార్లమెంట్) స్పీకర్ అబ్దుల్ రహీమ్‌తో భేటీ అయిన మోదీ ఇరుదేశాల పార్లమెంటు సన్నిహిత సంబంధాల గురించి మాట్లాడారు. ప్రవాస భారతీయులతో భేటీలో ఆయన హిందూ మహాసముద్ర ద్వీప సమూహ పురోగతికి ప్రవాసులు అందించిన సహకారాన్ని ప్రశంసించారు. మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నసీమ్‌తోనూ మోదీ సమావేశమయ్యారు. పొరుగుదేశాలకు మొదటి ప్రాధాన్యమిస్తూ భారత్ అనుసరిస్తున్న మహాసాగర్ విధానంలో మాల్దీవులు కీలకంగా నిలిచే అంశంపై వారు చర్చించారు. ఇరుదేశాల మధ్య స్నేహ సంబంధాలను నసీమ్ బలంగా సమర్థించారని మోదీ తెలిపారు.



మాలేలో జరిగిన మాల్దీవుల 60వ స్వాతంత్ర్య వేడుకల్లో ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో కలిసి పాల్గొన్న ప్రధాని మోదీ

స్వాతంత్ర్య వేడుకల్లో...

మాల్దీవుల స్వాతంత్ర్య వేడుకల్లో మోదీకి అరుదైన గౌరవం లభించింది. రాజధాని మాలేలోని ఐకానిక్ రిపబ్లిక్ స్క్వేర్‌లో అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు, పలువురు మంత్రులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. 50 నిమిషాల పాటు జరిగిన ఈ వేడుకలకు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్, ఆ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సహా ప్రధాని ప్రతినిధి బృందంలోని పలువురు హాజరయ్యారు.

భారత్.. మాకు కొండంత అండ: ముయిజ్జు

భారత్- మాల్దీవులు ఆర్థిక దౌత్యానికి మించి దృఢమైన, విడదీయలేని బంధాన్ని ఏర్పరచుకున్నాయని ముయిజ్జు వెల్లడించారు. ఇరుదేశాల సుదీర్ఘకాల బంధాలకు హిందూ మహాసముద్రాన్ని సాక్ష్యంగా ఆయన అభివర్ణించారు. ప్రధాని మోదీ గౌరవార్థం శుక్రవారం జరిగిన విందు సందర్భంగా భారత ప్రభుత్వ నిరంతర మద్దతుకు, స్థిరమైన స్నేహానికి ముయిజ్జు కృతజ్ఞతలు తెలిపారు. "సుదీర్ఘకాలంగా మాల్దీవులకు భారత్ సన్నిహిత, విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోంది. ఎలాంటి విపత్తులు, సంక్షోభాల సమయంలోనైనా మా ద్వీప దేశానికి భారత్ అండగా నిలిచింది" అని ముయిజ్జు వెల్లడించారు.

భారత సైన్యంలో రుద్ర, భైరవ్

• సైన్యాధిపతి జనరల్ ద్వివేది వెల్లడి



ద్రాస్‌లోని కార్గిల్ వార్ మెమోరియల్ వద్ద సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది నివాళులు

ద్రాస్: శత్రుమూకల నుంచి భవిష్యత్తులో ఎదురయ్యే ముప్పును ఎదుర్కొనేలా, వాటిని విస్మయపరిచే దాడులు చేసేలా భారత సైన్యంలో రుద్ర, భైరవ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్‌లోని కార్గిల్ వార్ మెమోరియల్ వద్ద ఆయన నివాళులర్పించారు. సాధారణ పౌరులు కార్గిల్ అమర వీరులకు నివాళులర్పించేలా 'ఈ-శ్రద్ధాంజలి'తోపాటు పలు యాప్‌లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. 'రుద్ర.. ఆల్ ఆర్మ్ బ్రిగేడ్‌కు శుక్రవారం నేను ఆమోదం తెలిపా. దీని కింద పదాతి, యాంత్రిక దళాలతోపాటు ట్యాంకు యూనిట్లు, శతఘ్నులు, ప్రత్యేక బలగాలు, మానవ రహిత వైమానిక యూనిట్లు ఒకే చోట ఉంటాయి. పరిపాలనా రవాణా, పోరాట మద్దతుకు ఉపయుక్తంగా ఉంటాయి. దీంతోపాటు ప్రత్యేక దాడుల దళం.. భైరవ్ లైట్ కమాండో యూనిట్లను ఏర్పాటు చేశాం. ఇవి సరిహద్దుల్లో శత్రువును విస్మయపరిచే దాడులు చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయి' అని ద్వివేది వివరించారు. ప్రతి పదాతి దళ బెటాలియన్‌కు ఇక డ్రోన్ ప్లటూన్ ఉందని, శతఘ్ని దళంలో శక్తిబాణ్ రెజిమెంట్లు ఏర్పాటు చేశామని, ఇందులో డ్రోన్, డ్రోన్ విధ్వంసక, గాలిలో ఎక్కువసేపు సంచరించగలిగే ఆయుధ వ్యవస్థలు ఉన్నాయని తెలిపారు.

జవాన్ల త్యాగం ప్రతీ తరానికి స్ఫూర్తిదాయకం

• కార్గిల్ అమరవీరులకు రాష్ట్రపతి, ప్రధాని నివాళులు

దిల్లీ: కార్గిల్ యుద్ధంలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి దేశ భూభాగాన్ని కాపాడిన అమర వీరులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ శనివారం ఘనంగా నివాళులర్పించారు. దేశ గౌరవాన్ని కాపాడటానికి తమ జీవితాలను త్యాగం చేసిన సైనికుల ధైర్యసాహసాలు, అంకితభావం ప్రతి తరానికి స్ఫూర్తినిస్తాయని కొనియాడారు.

■ కార్గిల్ యుద్ధంలో సైనికుల త్యాగం మన సాయుధ దళాల సంకల్పానికి నిదర్శనమని, వారికి దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

■ 'దేశాన్ని కాపాడేందుకు తమ ప్రాణాలను త్యాగం చేసిన అమర వీరులకు నా హృదయపూర్వక నివాళులు. దేశం వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది' అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

■ 'కార్గిల్ యుద్ధంలో మాతృభూమిని రక్షించిన అమర వీరుల త్యాగానికి నా నమస్కారం. వారి ధైర్యం, పరాక్రమాలు తరతరాలకు స్ఫూర్తినిస్తాయి' అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

గాజాలో హమాస్‌ను తుదముట్టించండి: ట్రంప్

వాషింగ్టన్: గాజా కాల్పుల విరమణ చర్చలు విఫలమవడానికి హమాస్ కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. సైనిక చర్యను ఇజ్రాయెల్ ఉధృతం చేయడాన్ని సమర్థించారు. గాజాలో తుది పనిని పూర్తిచేయాలని, సైనిక చర్యను ముమ్మరం చేసి హమాస్‌ను తుదముట్టించాలని ఇజ్రాయెల్‌కు సూచించారు. హమాస్‌కు శాంతి ఒప్పందంపై ఆసక్తిలేదని అభిప్రాయపడ్డారు. శనివారం స్కాట్లాండ్ పర్యటనకు బయలుదేరే ముందు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.



ఫాలోవర్ల సంఖ్య నాయకత్వానికి గీటురాయి కాదు

మీ ఫాలోవర్ల సంఖ్య మీ నాయకత్వ ప్రతిభను నిర్ణయించదని గుర్తుంచుకోండి. మీరెంత మంది జీవితాలను ప్రభావితం చేశారన్నదే అసలైన గీటురాయి. స్వార్థ నాయకులు విభజించి పాలించి తమ వ్యక్తిగత ఎజెండాలను ముందుకు తీసుకెళ్లాలనుకుంటారు. సేవ చేయాలనుకొనే నాయకుల తీరు వేరు. ఉమ్మడి లక్ష్యాల సాధనకు వారు ప్రజలను ఏకం చేస్తారు. ప్రపంచంలో గొప్ప నాయకులెవరంటే తోటివారిలోని అత్యుత్తమ ప్రతిభను వెలికితీసేవారే.

– ఆడమ్ గ్రాంట్, సైకాలజిస్ట్

మూడోరోజూ థాయ్, కంబోడియా పోరాటం

• 33కు చేరిన మృతుల సంఖ్య

సురిన్: థాయ్‌లాండ్, కంబోడియాల మధ్య సాగుతున్న పోరాటం శనివారం మూడో రోజుకు చేరింది. ఇప్పటి వరకూ 33 మంది మరణించారు. దాదాపు 1.68 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. సరిహద్దు వెంబడి ఉన్న అనేక గ్రామాల్లో తుపాకీ కాల్పులు, శతఘ్నుల మోతలు వినిపించాయి. దాడుల్లో ఎఫ్-16 విమానాలు, డ్రోన్‌లను కూడా వినియోగించినట్టు అధికారులు తెలిపారు. గత గురువారం సరిహద్దులో ఒక మందుపాతర పేలి ఐదుగురు థాయ్‌లాండ్ సైనికులు గాయాలపాలు కావడం ఈ సంఘర్షణకు దారితీసిన సంగతి తెలిసిందే. దీంతో ఇరుదేశాలూ పరస్పరం దౌత్య సిబ్బందిని ఉపసంహరించాయి. కంబోడియాలో తాజాగా 12 మరణాలు నమోదయ్యాయి. ఆ దేశంలో ఇప్పటిదాకా మరణించిన వారి సంఖ్య 13కు చేరింది. ఈ పోరాటాన్ని నిలుపుదల చేయాల్సిందిగా ఆగ్నేయాసియా దేశాల సంఘం(ఆసియన్)పై అంతర్జాతీయ ఒత్తిడి పెరుగుతోంది. తమ దేశ సరిహద్దు గ్రామాల్లో నివసిస్తున్న 37,635 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని కంబోడియా సమాచార మంత్రి నెత్ ఫియాక్ట్రా వెల్లడించారు.



కంబోడియాలోని బాట్టావా పునరావాస కేంద్రంలో ప్రజలకు సరకులు పంపిణీ చేస్తున్న అధికారులు

బిహార్‌లో అంబులెన్సులో సామూహిక అత్యాచారం

గయా: బిహార్‌లో దారుణం జరిగింది. హోంగార్డు పరీక్షకు హాజరైన యువతిపై అంబులెన్సులో సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన వెలుగుచూసింది. బోధ్ గయాలోని పరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన హోంగార్డు దేహదారుఢ్య పరీక్షకు అదే ప్రాంతానికి చెంది ఓ యువతి హాజరయ్యారు. పరీక్ష సమయంలో ఆమె స్పృహ కోల్పోవడంతో అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. స్పృహ వచ్చిన అనంతరం ఆమె... తనపై అంబులెన్సులో సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. దర్యాప్తు జరిపిన పోలీసులు అంబులెన్సు డ్రైవర్ వినయ్ కుమార్, టెక్నీషియన్ అజిత్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. సీసీటీవీ దృశ్యాలు, ఫోరెన్సిక్ ఆధారాలు, వైద్యుల నివేదిక... యువతి ఆరోపణలను నిర్ధారించాయని పోలీసులు చెప్పారు. నిందితులపై తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నీతీశ్‌కు మద్దతిచ్చినందుకు చింతిస్తున్నా

• బిహార్‌లో శాంతిభద్రతలు భయంకరంగా ఉన్నాయి
• కేంద్ర మంత్రి చిరాగ్ ధ్వజం

పట్నా, గయా: బిహార్ ఎన్డీయే కూటమిలో విభేదాలు తలెత్తాయి. భాగస్వామ్య పక్షాలైన జేడీయూ, లోక్ జన్‌శక్తి పార్టీల మధ్య విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. శనివారం కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్.. ముఖ్యమంత్రి నీతీశ్‌పై తీవ్రంగా ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు భయంకరంగా ఉన్నాయని, నీతీశ్ ప్రభుత్వానికి మద్దతిచ్చినందుకు చింతిస్తున్నానని స్పష్టం చేశారు. ప్రభుత్వం నేరగాళ్లకు లొంగిపోయిందని ఘాటుగా వ్యాఖ్యానించారు. పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ మహిళపై అంబులెన్స్‌లో అత్యాచారం జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ సర్కారుపై విమర్శలు గుప్పించారు. 'ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి నేరాలు జరుగుతుంటాయి. కానీ వాటిని నియంత్రించడం ప్రభుత్వ బాధ్యత. నియంత్రించకపోతే ఈ నేరాల్లో ప్రభుత్వ హస్తం ఉండి ఉండాలి.. లేదంటే కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తూ ఉండాలి. వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని బిహార్ ప్రభుత్వాన్ని కోరుతున్నా' అని చిరాగ్ పాసవాన్ పేర్కొన్నారు. మొదట తన పార్టీలోని నేరగాళ్లను అదుపులో పెట్టాలని చిరాగ్‌కు జేడీయూ హితవు పలికిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'బిహార్ ఫస్ట్' అనే నినాదంతో ఎన్నికలకు వెళ్తున్నామని, కొత్త ప్రభుత్వం ఏర్పడగానే నేర వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలిస్తామని, నేరస్థులను జైళ్లలో పెడతామని స్పష్టం చేశారు.



ఆపరేషన్ సిందూర్‌పై ఎన్‌సీఈఆర్‌టీ పాఠం!

దిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో భారత్ అనుసరించిన రక్షణ వ్యూహం, దౌత్య విధానాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ ఒక ప్రత్యేక పాఠాన్ని రూపొందిస్తున్నట్టు అభిజ్ఞవర్గాలు తెలిపాయి. ఈ పాఠాన్ని రెండు భాగాలుగా రూపొందించారు. మొదటి భాగం 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకూ, రెండో భాగం 9 నుంచి 12వ తరగతి వరకూ వర్తిస్తాయి. పహల్గాం ఉగ్రదాడికి భారత్ ఇచ్చిన వ్యూహాత్మక సైనిక సమాధానాన్ని వివరిస్తూ 8 నుంచి 10 పేజీల పాఠాన్ని రూపొందిస్తున్నారని వర్గాలు తెలిపాయి. గత ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు 26 మందిని కాల్చి చంపడం, అందుకు ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లపై భారత్ ఆపరేషన్ సిందూర్ కింద చర్యలు చేపట్టడం విదితమే. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావన పెంపొందించేందుకు గాను ఆపరేషన్ సిందూర్ పాఠాన్ని పాఠ్యాంశంలో చేర్చే యోచనలో ఉన్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గతంలో ఓసారి వెల్లడించారు. దేశ పురోగతిని వివరించడం, విద్యార్థుల్లో దానిపై సానుకూల భావాన్ని పెంచడం కోసం భారత చరిత్రను స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అప్పట్లో ఆయన అన్నారు. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌ను ఉన్నత తరగతుల వారికి బోధించే ప్రయత్నం చేస్తున్నామని కూడా ఆయన వెల్లడించారు.



రాజస్థాన్ సీఎంవో, జైపుర్ ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపు

ఇంటర్నెట్ డెస్క్: రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి కార్యాలయంతోపాటు జైపుర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. ఈ-మెయిల్ ద్వారా ఈ బెదిరింపులకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. మరో గంట లేదా రెండు గంటల్లో సీఎంవో, విమానాశ్రయాల్లో బాంబు పేలుళ్లు జరుగుతాయని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండండంటూ ఆ మెయిల్స్‌లో దుండగులు హెచ్చరించారు. వెంటనే అప్రమత్తమైన యాంటీ బాంబు స్క్వాడ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సీఎం కార్యాలయంతోపాటు ఎయిర్‌పోర్టులో ముమ్మర తనిఖీలు చేపట్టారు. శనివారం ప్రభుత్వ సెలవు కావడంతో సీఎంవోలో పరిమిత సంఖ్యలో అధికారులు, సిబ్బంది ఉన్నారు. వెంటనే వారందరినీ ఖాళీ చేయించినట్లు పోలీసులు తెలిపారు. రెండుచోట్లా ఎలాంటి అనుమానాస్పద వస్తువుల జాడ కనిపించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఉత్తుత్తి బెదిరింపులకు పాల్పడిన ఆగంతకులను గుర్తించడానికి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



జైపుర్ విమానాశ్రయం

సామాన్యులపై దాడులు కొనసాగించిన ఇజ్రాయెల్

• నేలకొరిగిన 25 మంది పాలస్తీనీయులు

డెయిర్ అల్ బలా: ఆకలితో అలమటిస్తూ ఆహారం కోసం పడిగాపులు కాస్తున్న నిరాయుధులైన గాజా వాసులపై ఇజ్రాయెల్ మళ్లీ విరుచుకుపడింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకూ గాజాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వైమానిక దాడులు, తుపాకీ కాల్పుల్లో 25 మంది పాలస్తీనీయులు మృతి చెందారని స్థానిక ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. మృతుల్లో అధిక సంఖ్యాకులు జికిం క్రాసింగ్ వద్ద ఆహార ట్రక్కుల కోసం వేచి ఉన్నవారేనని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. సామాన్యులపై జరిగిన కాల్పులపై స్పందించడానికి ఇజ్రాయెల్ నిరాకరించింది. మరోవైపు గాజాలో తీవ్ర క్షామ పరిస్థితులు నెలకొన్నాయని, పోషకాహార లేమి వల్ల ఎందరో మృత్యువాత పడుతున్నారని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. శాంతి చర్చల్లో పాల్గొంటున్న తమ ప్రతినిధుల్ని అమెరికా, ఇజ్రాయెల్‌లు ఉపసంహరించుకోవడంతో గాజాలో కాల్పుల విరమణ చర్చలు నిలిచిపోయినట్లయింది. హమాస్‌తో చర్చలు జరపడానికి బదులు ఇతర ప్రత్యామ్నాయాలను తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం పేర్కొన్నారు. దీంతో చర్చలపై అనిశ్చితి నెలకొంది.



గాజాలో స్వచ్ఛంద సంస్థలు పంపిణీ చేసే ఆహారం కోసం ఆరాటపడుతున్న పాలస్తీనీయులు



కేంద్రమంత్రి కిరణ్ రిజిజు నుంచి సంసద్‌రత్న అవార్డు స్వీకరిస్తున్న భాజపా ఎంపీ రవి కిషన్

17 మంది ఎంపీలకు సంసద్‌రత్న-2025 అవార్డులు

దిల్లీ: పార్లమెంటులో ఉత్తమ పనితీరు కనబరిచిన 17 మంది ఎంపీలకు సంసద్‌రత్న-2025 అవార్డులను ప్రైమ్ పాయింట్ ప్రజెంటేషన్ ఫౌండేషన్ అందజేసింది. ఇందులో సుప్రియా సూలే (ఎన్సీపీ-ఎస్పీ), రవి కిషన్ (భాజపా), నిశికాంత్ దుబె (భాజపా), అర్వింద్ సావంత్ (శివసేన-యూబీటీ) తదితరులున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి 2016 నుంచి వరుసగా మూడు సభల్లో కృషి చేసిన భర్తృహరి మెహతాబ్ (భాజపా-ఒడిశా), ఎన్‌కే ప్రేమచంద్రన్ (రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ-కేరళ), సుప్రియా సూలే (ఎన్సీపీ-ఎస్పీ, మహారాష్ట్ర), శ్రీరంగ్ అప్పా బార్నె (శివసేన, మహారాష్ట్ర)లకు ప్రత్యేక జ్యూరీ అవార్డులు దక్కాయి. వీరితోపాటు స్మిత ఉదయ్ వాగ్ (భాజపా), నరేశ్ మహాస్కే (శివసేన), వర్ష గైక్వాడ్ (కాంగ్రెస్), మేధ కులకర్ణి (భాజపా), ప్రవీణ్ పటేల్ (భాజపా), విద్యుత్ బారన్ మహతో (భాజపా), దిలీప్ సైకియా (భాజపా) తదితరులు ఇతర అవార్డులకు ఎంపికయ్యారు. కమిటీల కేటగిరీలో ఉత్తమ నివేదికలు ఇచ్చిన ఆర్థిక, వ్యవసాయ స్టాండింగ్ కమిటీలకు ఛైర్మన్లుగా ఉన్న భర్తృహరి మెహతాబ్, చరణ్‌జీత్ సింగ్ చన్నీలు (కాంగ్రెస్) అవార్డులు అందుకున్నారు.

ప్రతిపక్షానికే నష్టం: రిజిజు

పార్లమెంటులో తరచూ అంతరాయాలవల్ల ప్రతిపక్షాలే నష్టపోతాయని, ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచే అవకాశాన్ని కోల్పోతాయని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు అభిప్రాయపడ్డారు. సంసద్‌రత్న-2025 అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ప్రభుత్వం పార్లమెంటులో జవాబుదారీగా ఉంటుంది. సభ జరుగుతున్నప్పుడు మంత్రులు కఠిన ప్రశ్నలను ఎదుర్కొంటారు. వెంటనే సభ వాయిదా పడితే వారు ఉపశమనం పొందుతారు. అప్పుడు మంత్రుల దగ్గరి నుంచి సమాధానాలు రావు' అని పేర్కొన్నారు. సోమనాథ్ ఛటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఆయనను తొలిసారి కలిసినప్పుడు ధూమపానం చేసే ఎంపీల కోసం స్మోకింగ్ రూం ఏర్పాటు చేయాలని కోరానని, దీంతో ఆగ్రహించిన సోమనాథ్.. స్పీకర్‌తో జరుగుతున్న మొదటి సమావేశంలో ఇటువంటి విషయాలు చర్చించడానికి వచ్చారా అని తనను తీవ్రంగా మందలించారని తెలిపారు. నాటి నుంచి అత్యున్నత పదవుల్లో ఉన్న వారి దృష్టికి ఎటువంటి సమస్యలు తీసుకువెళ్లాలి.. వారితో ఎలా మాట్లాడాలనే విషయాలను తెలుసుకున్నానని పేర్కొన్నారు.

గుజరాత్‌లో భాజపాను ఓడించడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం: రాహుల్ గాంధీ



ఆణంద్: ఎన్నికల అభ్యర్థులను ఎన్నుకునే సమయంలో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని గుజరాత్‌లోని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. 'సంగతన్ సృజన్ అభియాన్(పార్టీని బలోపేతం చేసేందుకు ప్రచారం)'లో భాగంగా శనివారం ఆణంద్‌లో జరిగిన జిల్లా అధ్యక్షుల శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం పక్షపాతం వహిస్తోందని, భాజపాకు కీలకమైన గుజరాత్‌లో ఆ పార్టీని ఓడించడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని రాహుల్ వ్యాఖ్యానించారు. శిక్షణా అభ్యర్థులకు ఆయన దిశానిర్దేశం చేశారు. 2027 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొన్న కాంగ్రెస్ కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షుల కోసం మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది.

రాజస్థాన్ పాఠశాల ఘటనలో దోషుల్ని శిక్షించాలి: కాంగ్రెస్

రాజస్థాన్‌లోని ఝాలావాడ్‌లో ప్రభుత్వ పాఠశాల భవనం పైకప్పు కూలి ఏడుగురు పిల్లలు మరణించిన ఘటనపై కాంగ్రెస్ భాజపాను తీవ్రంగా విమర్శించింది. దీనిపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. "మీడియా నివేదికల ప్రకారం.. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం గురించి వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా అమాయక పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువగా బహుజన్ సమాజ్‌కు చెందినవారు. వీరి ప్రాణాలంటే భాజపా ప్రభుత్వానికి విలువ లేదా?" అని రాహుల్ శనివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. "మన పిల్లల పాఠశాలల పై కప్పులు మరమ్మతులు చేయించలేని ప్రభుత్వం, 'వికసిత్ భారత్' గురించి పెద్ద కలలను చూపిస్తోంది. అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకునే.. భాజపా దేశాన్ని నాశనం చేసింది. రైలు ప్రమాదాలు, వంతెనలు కూలిపోవడం, కొత్తగా నిర్మించిన రోడ్లలో పగుళ్లు- ఇవన్నీ సర్వసాధారణమైపోయాయి. భాజపా దృష్టి కేవలం అధికార దాహంపైనే కేంద్రీకృతమై ఉంది" అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

ఐటీ పార్కు హైదరాబాద్, బెంగళూరు వెళ్లిపోతోంది

• అజిత్ వ్యాఖ్యలు వైరల్

ముంబయి: మహారాష్ట్ర ఐటీ పార్కుపై ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. హింజెవాడిలో 2,800 ఎకరాల్లో రాజీవ్‌గాంధీ ఐటీ పార్కు ఉంది. ఇందులో 800 కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. నిర్వహణ లోపం వల్ల ఈ ఐటీ పార్కు హైదరాబాద్, బెంగళూరులకు తరలిపోతోందంటూ అజిత్ మాట్లాడిన మాటలు వైరల్‌గా మారాయి. శనివారం ఉదయం పుణె సమీపంలోని పింప్రీ చించ్వాడ్‌లో పలు ప్రాంతాలను అజిత్ పవార్ పరిశీలించారు. స్థానికంగా జరుగుతున్న పనులను గమనించారు. అక్రమ నిర్మాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచి గణేశ్ జంబూల్కర్‌తో మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడంతో మీడియా ఎదుట డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. "మనల్ని మనమే నాశనం చేసుకుంటున్నాం. హింజెవాడి నుంచి ఐటీ పార్క్ వెళ్లిపోతోంది. అయినా మీకు ఏ పట్టింపు లేదు" అని రుసరుసలాడారు. కెమెరాలను ఆపండి అంటూ గట్టిగా అరిచారు.



ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో బండరాళ్లతో నిండిపోయిన కేదార్‌నాథ్ ధామ్ మార్గం

మన్నించుకుని ముందుకు సాగండి

యుద్ధ విమాన పైలట్, అతని భార్యకు సుప్రీంకోర్టు హితవు

దిల్లీ: 'జరిగిపోయిన తప్పిదాలకు పరస్పరం మన్నించుకోండి. మనస్పర్ధలు వీడి వైవాహిక జీవితాన్ని ఆనందంగా గడపండి' అంటూ యువ దంపతులకు సుప్రీంకోర్టు హితబోధ చేసింది. వైవాహిక జీవితంలో తలెత్తిన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ ధర్మాసనం సూచించింది. భర్త యుద్ధ విమానాల పైలట్. 2019 బాలాకోట్ మెరుపుదాడుల్లో పాల్గొన్న వీర సైనికుడు. భార్య ఐఐఎంలో పట్టభద్రురాలైన విద్యావంతురాలు. తనపై భార్య దాఖలు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'మీరిద్దరూ వయసులో చిన్నవారే. చాలా భవిష్యత్తుంది. మంచి జీవితాన్ని గడిపే అవకాశమూ ఉంది. పరస్పరం క్షమించుకుని కలిసికట్టుగా ముందుకు సాగండి' అని ధర్మాసనం తెలిపింది. భార్య, మామ తనను, తన కుటుంబ సభ్యులను మానసిక వేదనకు గురిచేస్తున్నారని భర్త న్యాయస్థానానికి నివేదించారు. తనపై దాఖలైన ఎఫ్.ఐ.ఆర్.ను కొట్టివేయాలన్న అభ్యర్థనను పంజాబ్, హరియాణా హైకోర్టు తిరస్కరించడంతో సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.


రష్యా, ఉక్రెయిన్ వైమానిక దాడులు

మాస్కో: రష్యా, ఉక్రెయిన్ మధ్య శుక్రవారం రాత్రి జరిగిన పరస్పర వైమానిక దాడుల్లో నలుగురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. ఉక్రెయిన్‌లోని దక్షిణ ద్నిప్రో, ఈశాన్య సుమీ ప్రాంతాలపై రష్యా జరిపిన దాడుల్లో ఇద్దరు మృతి చెందారని, 8 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. 208 డ్రోన్లు, 27 క్షిపణులతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిందని వెల్లడించారు. ఉక్రెయిన్ చేసిన దాడుల్లో ఇద్దరు మృతి చెందారని, కనీసం ఐదుగురు గాయపడ్డారని రష్యా అధికారులు తెలిపారు. ఈ దాడుల వల్ల పలు ప్రాంతాల్లో రోడ్లు, భవనాలు ధ్వంసమయ్యాయని ఇరుదేశాల అధికారులు ధ్రువీకరించారు.

ఝార్ఖండ్‌లో చెక్‌డ్యాంలో పడి నలుగురు యువకుల మృతి

సరాయ్‌కేలా: ఝార్ఖండ్‌లోని సరాయ్‌కేలా-ఖర్సావా జిల్లాలో శనివారం 18 నుంచి 20 ఏళ్ల వయసున్న నలుగురు యువకులు స్నానంచేస్తూ ప్రమాదవశాత్తు చెక్‌డ్యాంలో మునిగి మృతిచెందారు. దరాయ్‌కేలా గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు స్నానం చేయడానికి సమీపంలోని చెక్‌డ్యాంకి వెళ్లారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వీరిలో ఇద్దరు యువకులు బయటే నిలబడ్డారు. నీటిలోకి దిగిన నలుగురు యువకులు ప్రవాహ ఉద్ధృతికి కొట్టుకుపోయారు.

నైపుణ్యాలకే ఎర్ర తివాచీ!



- కళాశాల బ్రాండింగ్‌ను పట్టించుకోని 73% నియామక సంస్థలు
- ఈ-స్కూల్‌లో 83%, బీ-స్కూల్‌లో 46% మందికి ఉపాధి ఆఫర్ రాలేదు
- అన్‌స్టాప్ టాలెంట్-2025 నివేదికలో వెల్లడి

ఈనాడు – అమరావతి

ఉద్యోగ నియామకాల్లో ప్రీమియర్ కళాశాల కంటే అభ్యర్థుల ప్రతిభకే నియామక సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. కళాశాలల బ్రాండింగ్‌ను 73% నియామక సంస్థలు పట్టించుకోవడం లేదు. ఏ కళాశాలలో చదివినా నైపుణ్యాలున్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. 2025లో బయటకు వచ్చిన ఇంజినీరింగ్ స్కూల్(ఈ-స్కూల్) పట్టభద్రుల్లో 83%, బిజినెస్ స్కూల్(బీ-స్కూల్) పట్టభద్రుల్లో 46% మందికి ఉద్యోగం లేదా ఇంటర్న్‌షిప్ ఆఫర్ లేకుండానే మిగిలిపోయారని 'అన్‌స్టాప్ టాలెంట్ నివేదిక-2025' పేర్కొంది. దేశవ్యాప్తంగా 23 రౌండ్‌టేబుల్ సమావేశాల్లో 700 మందికి పైగా మానవ వనరుల విభాగం అధికారులు, 30,120 జన్-జెడ్ నిపుణులతో మాట్లాడి, వారి అభిప్రాయాలతో ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించింది. అభిప్రాయాల సేకరణలో పాల్గొన్న వారిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 25% ఉన్నట్లు పేర్కొంది. టాప్-30 బీ-స్కూళ్లల్లోనూ ప్రతి నలుగురిలో ఒకరికి ఉద్యోగావకాశాలు లభించడం లేదని ఈ నివేదిక తెలిపింది.

ఇంజినీరింగ్‌లో వేతన సమానత్వం..

- 51% మంది జెన్-జెడ్ నిపుణులు బహుళ ఆదాయ మార్గాలను కోరుకుంటున్నారు. ఫ్రీలాన్సింగ్, గిగ్ లాంటి మార్గాల ద్వారా అదనపు ఆదాయం ఆశిస్తున్నారు.
- ఆర్ట్స్, సైన్స్ మహిళా పట్టభద్రుల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఏడాదికి రూ.6 లక్షల్లోపే సంపాదిస్తున్నారు. పురుషులు ఈ మార్కును దాటుతున్నారు.
- ఇంజినీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివిన వారిలో లింగభేదం లేకుండా సమాన వేతనాలు లభిస్తున్నాయి.
- ఇంజినీరింగ్ అభ్యర్థులు గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తుంటే, బీ-స్కూల్ గ్రాడ్యుయేట్లు గూగుల్, మెకిన్సే, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీల్లో పని చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.
- 2023లో ప్రతి 8 మందిలో ఒకరు ఎలాంటి చెల్లింపులు లేని ఇంటర్న్‌షిప్‌లు చేయగా, 2024లో ప్రతి నలుగురిలో ఒకరు ఇలాంటివి చేశారు.
- ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో ప్రతి నలుగురిలో ఒక పురుష అభ్యర్థి ప్రభుత్వ రంగంలోకి ప్రవేశించాలని కోరుకుంటుండగా.. మహిళా ఇంజినీర్లలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఈ తరహా ఆలోచిస్తున్నారు.
- 71% ప్రీమియర్ బీ-స్కూల్ వాళ్లు పదోన్నతి కంటే జీతం పెంపును ఎంచుకుంటున్నారు.

ఉద్యోగ భద్రత, ఉపాధి రాదేమోననే భయం..

- 51% మంది ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందుతున్నారు.
- గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తున్న 40% మందిని తమకు నచ్చిన రంగంలో ఉద్యోగం రాదేమో అనే భయం వెంటాడుతోంది.
- అవసరాలకు సరిపడా డబ్బు సంపాదించలేకపోవడం వల్ల 33% మంది ఒత్తిడికి గురవుతున్నారు
- 23% మందిలో కొత్త నగరం, ప్రదేశానికి మారాలనే భయం నెలకొంది.

ఆలోచనల మధ్య వ్యత్యాసం

- 77% మంది జెన్-జెడ్ నిపుణులు నెలవారీ లేదా ప్రాజెక్టు ఆధారిత సమీక్షలు ఉండాలని కోరుకుంటున్నారు. కానీ, 71% నియామక సంస్థలు మాత్రం ఇప్పటికీ వార్షిక, ద్వైవార్షిక, త్రైమాసిక సమీక్షలు వంటి సంప్రదాయ చెక్-ఇన్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నాయి.
- 70% మంది అభ్యర్థులు కేస్ స్టడీస్, ఐడియాథాన్‌లలో పాల్గొంటుండగా.. 25% నియామక సంస్థలు మాత్రమే వాటిని ప్రాథమిక నియామక సాధనంగా భావిస్తున్నాయి.
- 43% మంది ఉద్యోగస్థులు సంస్థ బ్రాండ్ కంటే ఉద్యోగ 'భూమిక' ఆధారంగా అవకాశాన్ని ఎంపిక చేసుకుంటున్నారు.
- 72% మంది జీతం కంటే ఉద్యోగ సంతృప్తికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఆచితూచి మాట్లాడు

- ప్రభుత్వ కాంట్రాక్టుల నిబంధనలు తెలియవా?
- కేటీఆర్‌పై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆగ్రహం


మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

ఈనాడు డిజిటల్, అనకాపల్లి: తెలంగాణలో రిత్విక్ కంపెనీకి రూ.1,660 కోట్ల కాంట్రాక్టులు కట్టబెట్టారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించడం ఆయన మూర్ఖత్వమని భాజపా నేత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఒక కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చేటప్పుడు ఎలాంటి నియమ నిబంధనలు పాటిస్తుందో.. తొమ్మిదిన్నరేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు తెలియదా అని నిలదీశారు. తెలంగాణలో భాజపా, తెదేపా కలిసి పోటీచేస్తే భారాసకు పుట్టగతులు ఉండవని ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అనకాపల్లిలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'కేటీఆర్ చెప్పిన చోటుకు వస్తాను. ఆయనా వస్తే మీడియా సమక్షంలో చర్చించుకుందాం' అంటూ సవాల్ విసిరారు. కేటీఆర్ ఆచితూచి మాట్లాడాలని.. లేకుంటే చాలా నిజాలు బయటపెట్టాల్సి ఉంటుందని సీఎం రమేశ్ హెచ్చరించారు. 'కవితపై మద్యం కేసు విచారణ ఆపితే. . భారాసను భాజపాలో కలుపుతామని అనలేదా? విలీనంపై మాట్లాడేందుకు మా ఇంటికి వచ్చిన విషయం మర్చిపోయారా? కావాలంటే అప్పటి సీసీటీవీ ఫుటేజీ మీడియాకు పంపిస్తాను. గతంలో కేటీఆర్ కోరిక మేరకు నేను భాజపా పెద్దలను కలిశాను. భారాస పని అయిపోయిందని, వారితో పొత్తు అవసరం లేదని పార్టీ పెద్దలు చెప్పడంతో అదే విషయాన్ని నేను ఆయనకు తెలిపాను. తుమ్మల నాగేశ్వరరావు లాంటి నేతలను ఎందుకు వదిలేసుకున్నారని నేను అడిగితే.. తమ పార్టీకి ఆ వర్గం నేతల అవసరం లేదని, రేవంత్‌రెడ్డి గెలిచిన తర్వాత వారి సామాజికవర్గం కూడా ఆయన వెనక వెళ్లిపోయిందని కేటీఆర్ నాతో చెప్పారు' అని రమేశ్ పేర్కొన్నారు. 'ఏపీ రాజకీయాలకు సంబంధించి జగన్‌తో కలిసి ప్రయాణం చేస్తున్నామని నాతో చెప్పడం వాస్తవం కాదా' అని నిలదీశారు.

రేవంత్‌రెడ్డి, సీఎం రమేశ్‌లతో చర్చకు సిద్ధం

తెలంగాణలో కాంగ్రెస్, భాజపాల కుమ్మక్కు: కేటీఆర్



ఈనాడు, హైదరాబాద్: భారాస ఎప్పటికీ ఏ పార్టీలో విలీనమయ్యే ప్రసక్తే లేదని, ఇది తెలంగాణ ప్రజలకు తెలుసని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఓ ప్రకటనలో అన్నారు. ''దేశంలో ఎక్కడా లేనివిధంగా భాజపా, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయం తెలంగాణలో జరుగుతోంది. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిదికి రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టు ఇచ్చింది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం భాజపాకు చెందిన ఏపీ ఎంపీ సీఎం రమేశ్‌కు రూ.1,660 కోట్ల రోడ్డు కాంట్రాక్టు ఇచ్చింది. ఇది నేను బయటపెట్టా. కాంగ్రెస్, భాజపా ఇరకాటంలో పడిన ప్రతిసారీ ఆ పార్టీల నేతలు భారాస.. భాజపాలో విలీనం అవుతుందనే అంశాన్ని తెరపైకి తెచ్చి తెలంగాణ ప్రజలను సందిగ్ధంలో పడేయాలని చూస్తున్నారు. సీఎం రమేశ్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కలిసొస్తే హెచ్‌సీయూ భూములపై జరిగిన రూ.10,000 కోట్ల కుంభకోణంపై, ఫ్యూచర్‌సిటీకి రూ.1,660 కోట్ల రోడ్డు నిర్మాణం పేరుతో జరిగిన కుంభకోణంపై చర్చకు నేను సిద్ధం' అని కేటీఆర్ సవాల్ విసిరారు.

ఎల్‌ఆర్‌ఎస్ అమలుకు మార్గదర్శకాల జారీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అనుమతులు తీసుకోకుండా వేసిన లేఔట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) మినహా ఇతర పుర, నగరపాలక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో వేసిన అనధికార లేఔట్లకు ఈ పథకం వర్తించనుంది. ఈ మేరకు మార్గదర్శకాలు పేర్కొంటూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులిచ్చారు. ఈ ఏడాది జూన్ 30కి ముందు వేసిన లేఔట్లను ఈ పథకం కింద క్రమబద్ధీకరించనున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 18 వేల ఎకరాల్లో వేసిన లేఔట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించిన పోర్టల్ ఆగస్టు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి రానుంది. 2014-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌ఆర్‌ఎస్‌లో నిర్దేశించిన బేసిక్ ధరలనే.. ఇప్పుడు కూడా నిర్ణయించారు. నిర్దేశించిన విలువను స్థానిక సబ్ రిజిస్ట్రార్ ధరలతో పోలుస్తారు. ఒకవేళ నిర్దేశించిన ధర ఎక్కువగా ఉంటే.. సబ్ రిజిస్ట్రార్ విలువను పరిగణనలోకి తీసుకుంటారు. తక్కువగా ఉంటే.. ఎల్‌ఆర్‌ఎస్‌లో నిర్ణయించిన ధర వసూలు చేస్తారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు అపరాధ రుసుములు

ప్లాట్ విస్తీర్ణం (చ.మీ.)	నిర్దేశించిన ప్రాథమిక ధర (చ.మీ.కు)
100 వరకు	రూ.200
100–300	రూ.400
300–500	రూ.600
500 పైన	రూ.750

■ 10% ఓపెన్ స్పేస్ అందుబాటులో లేకపోతే.. జరిమానాతో పాటు దరఖాస్తుదారు ఈ ఏడాది జూన్ 30 నాటికి ఆ భూమి బేసిక్ విలువ (సబ్ రిజిస్ట్రార్ ప్రకారం)లో 14 శాతాన్ని ఓపెన్‌స్పేస్ ఛార్జీలుగా చెల్లించాల్సి ఉంటుంది.

మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు ప్రయాణం

- 5 రకాల బస్సుల్లో ఆగస్టు 15 నుంచి అమలు: అచ్చెన్నాయుడు

అన్నవరం, న్యూస్‌టుడే: కూటమి హామీల్లో భాగంగా మహిళలు రాష్ట్రమంతటా ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా వెళ్లొచ్చని, ఈ పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామని మంత్రి కె.అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా అన్నవరంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో కలిసి శనివారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ''మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఇటీవల ఆర్టీసీ అధికారులతో మంత్రి లోకేశ్, నేను సమావేశమయ్యాం. ఒక జిల్లాకు పరిమితం చేద్దామని అధికారులు సలహా ఇచ్చారు. కానీ, మాటిచ్చాం అమలు చేయాలని లోకేశ్ చెప్పారు. ఐదు రకాల బస్సుల్లో ఎక్కడికి వెళ్లినా ఉచితంగా ప్రయాణించేలా అమలు చేస్తున్నాం. ఆటోడ్రైవర్లకు ఇబ్బందులు లేకుండా అదేరోజు వారికి ఆర్థిక సహాయం అందజేస్తాం. జగన్ ప్రభుత్వం రద్దుచేసిన వితంతు పింఛనును పునరుద్ధరిస్తున్నాం. వచ్చే నెల 2, 3 తేదీల్లో 'అన్నదాత సుఖీభవ' ద్వారా 54 లక్షల మందికి ఆర్థిక సహాయం అందిస్తాం. జె బ్రాండ్ల మద్యం తాగి కిడ్నీలు, ఊపిరితిత్తులు పాడైనవారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం చేస్తున్నాం. పరామర్శల పేరుతో జగన్ అరాచకాలు సృష్టిస్తున్నారు. ఈ విషయంలో ప్రజలు, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి. నన్ను 82రోజులు జైల్లో పెట్టినప్పుడు తిరిగి స్వగ్రామం వెళ్తుండగా అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకోవడానికి వచ్చాను. అప్పట్లో నా అభిమానులు, తెదేపా నాయకులు నాతో ఫొటో తీసుకోవడానికి కూడా భయపడ్డారు. ఎందుకంటే, నాతో ఫొటో దిగినవారి ఇళ్లకు తెల్లారేసరికి పోలీసులు వెళ్లేవారు'' అని ఆయన చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, కాకినాడ జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తదితరులు

హస్తకళకు నష్టాల మరక

కష్టాల ఊబిలో ఏలూరు తివాచీ పరిశ్రమ


రూపుదిద్దుకున్న తివాచీపై డయ్యింగ్ వేస్తూ..


అమ్ముడుపోక నిలిచిన సరకు

ప్రభుత్వం చేయూత అందించాలని వేడుకోలు

ఈనాడు, ఏలూరు: ప్రసిద్ధి చెందిన 'ఏలూరు తివాచీ' పరిశ్రమ నానాటికీ తన ప్రాభవాన్ని కోల్పోతోంది. అధునాతన భవనాలు, కాన్ఫరెన్స్ హాళ్లు, కార్పొరేట్ కార్యాలయాల్లో అందం కోసం పరిచే ఈ తివాచీల తయారీకి దక్షిణ భారతదేశంలోనే ఏలూరు ప్రసిద్ధి. ప్రస్తుతం 20 వరకు కుటీర పరిశ్రమలున్నాయి. ఇక్కడి పనివారు గొర్రెల ఊలుతో చేతులతో అందంగా తివాచీలను నేస్తారు. ఇవి కొన్నేళ్ల పాటు చెక్కు చెదరవు. ఇక్కడ తయారయ్యే ఒక పెద్ద తివాచీకి రూ.20-25 వేలు వెచ్చించాలి. ఇదే యంత్రంపై నేసిందైతే రూ.2-3 వేలకే వస్తుంది. ఈ పరిస్థితుల్లో తయారైన కొద్దిపాటి సరకు అమ్ముడుపోక కుటీర పరిశ్రమలు నష్టాల్లోకి జారుకున్నాయి. 1983లో నాటి ఎన్టీఆర్ ప్రభుత్వం ఇక్కడి ఉత్పత్తులను ప్రోత్సహించిందని నిర్వాహకులు గుర్తు చేసుకుంటున్నారు. తివాచీలను ప్రభుత్వమే కొనుగోలు చేసి.. వాటిని క్రాఫ్ట్‌బజార్, లేపాక్షి ఎంపోరియం, చేనేత ఎక్స్‌పోల్లో పెట్టి విక్రయించిందని చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అలాంటి చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.


తివాచీ నేస్తున్న కార్మికులు

హస్తకళను బతికించండి

– అబ్దుల్ నయీం, పరిశ్రమదారు, ఏలూరు

ఐదు తరాల నుంచి మా కుటుంబం ఈ హస్తకళ వృత్తిలో ఉంది. ఒకప్పుడు ఎగుమతి వ్యాపారం ద్వారా మంచి లాభాలు కళ్లజూశాం. ప్రస్తుతం కార్మికుల జీత భత్యాలు, యూనిట్ల నిర్వహణ వ్యయాలు సమకూరితే చాలనుకుంటున్నాం. గతంలో మా పరిశ్రమలో 60-70 మందికి ఉపాధినివ్వగా ప్రస్తుతం 10 మందికి మాత్రమే పని కల్పించగలుగుతున్నాం.

'ఫ్రీ హోల్డ్' ఉచ్చులో పట్టా భూములు!

- రీసర్వే అనంతరం మళ్లీ ఇనాంగా మార్చడంతో రైతుల ఆందోళన
- 50 వేల ఎకరాలపై ప్రభావం



ఈనాడు, అమరావతి: జగన్ పాలనలో జరిగిన భూముల రీసర్వే పాపాలు యజమానులను వెంటాడుతూనే ఉన్నాయి. నిషిద్ధ జాబితా నుంచి 'ఫ్రీ హోల్డ్' భూములు తప్పించడంలో నాడు భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయి. వాటిని కూటమి ప్రభుత్వం చక్కదిద్దుతోంది. అలాగే నిషిద్ధ జాబితా(22ఏ) నుంచి నిబంధనలకు వ్యతిరేకంగా తొలగించిన ఎసైన్డ్ భూములపై విచారణ జరుపుతోంది. ఈ క్రమంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని కొన్ని పట్టా భూములను 'సర్వీసు ఇనాం' కింద చేర్చడం కొత్త సమస్యలకు దారి తీస్తోంది. 50, 60 ఏళ్ల కిందట 'సర్వీస్ ఇనాం'లుగా రికార్డుల్లో ఉన్నాయని పట్టా భూములనూ రీసర్వే తర్వాత 'ఇనాం' కేటగిరీలో చేర్చి, నిషిద్ధ జాబితాలో ఉంచారు. ఇలాంటివి రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఎకరాలు ఉన్నట్లు అంచనా. దీనివల్ల సదరు భూముల రిజిస్ట్రేషన్‌లు నిలిచాయి.

బాధితుల గగ్గోలు!

ప్రకాశం జిల్లా ఉలిచి గ్రామంలో కొన్ని భూములు పూర్వం 'ఇనాం'గా ఉండేవి. ఆ తర్వాత ప్రభుత్వం రైత్వారీ పట్టాల ఇవ్వడంతో అవి పట్టా భూములయ్యాయి. ఈ గ్రామంలో 2023లో రీ-సర్వే పూర్తయ్యాక ఈ భూముల నేపథ్యం రెవెన్యూ పూర్వ రికార్డుల్లో 'ఇనాం'గా ఉందని వీటిని నిషిద్ధ జాబితా నుంచి 'అక్రమంగా తప్పించిన జాబితా'లోకి చేర్చారు. దీంతో వీటి రిజిస్ట్రేషన్లు నిలిచాయి. ఒంగోలు డివిజన్‌లో 1,365, కనిగిరి డివిజన్‌లో 3,757, మార్కాపురంలో 4,401 ఎకరాల క్రయవిక్రయాలు స్తంభించాయి. బాధితుల విజ్ఞప్తి మేరకు తహసీల్దార్లు ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అవి..ఇవి.. ఒకటే అంటే ఎలా?

పేదలకు పంపిణీ చేసి 20 ఏళ్లు దాటిన ఎసైన్డ్ భూములపై వారికి యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పిస్తామని వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. తప్పించిన ఎసైన్డ్ భూముల్లో 2,86,951 ఎకరాలకు అసలు రికార్డులు లేవని గుర్తించారు. చుక్కల భూముల్లో 17,901 ఎకరాలనూ ఎసైన్డ్ కేటగిరీలో తప్పించారు. 28 వేల ఎకరాల అభ్యంతరం ఉన్న పోరంబోకు భూములు, నీటి కుంటలు, 5,433 ఎకరాల ప్రైవేటు భూములు, 28 వేల ఎకరాలను పేదలకు అందజేసి 20 ఏళ్లు దాటకున్నా విముక్తి కల్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం ఫ్రీ హోల్డ్ భూముల వ్యవహారంపై వచ్చే అక్టోబరు నాటికి నివేదికను ప్రభుత్వానికి అందచేస్తామని వెల్లడించింది. సదరు భూములకు తాజాగా పెంచిన గడువు ప్రకారం వచ్చే సెప్టెంబరు 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌లు జరగవు. ఇనాం, ఇతర పట్టా భూముల రిజిస్ట్రేషన్ కొనసాగింపుపై కూటమి ప్రభుత్వం పునఃపరిశీలన చేయాల్సి ఉంది.

జగన్ సర్కారు నిర్వాకంతో!

జమీందారీ వ్యవస్థ రద్దయ్యాక ఇనాం భూములకు రైత్వారీ పట్టాలు వచ్చాయి. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఇనాం చట్టానికి సవరణ చేశారు. చట్టంలో 1956 నుంచి జరిగిన లావాదేవీలకు వర్తింపజేసే క్రమంలో ఒకచోట 'ప్రాస్పెక్టివ్'కు బదులు 'రెట్రాస్పెక్టివ్' అని పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో 25 వేల ఎకరాలు నిషిద్ధ జాబితాలోకి వెళ్లాయి. 2019 ఫిబ్రవరి 23న అప్పటి తెదేపా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ఏరియా) ఇనామ్స్ (అబాలిషన్ అండ్ కన్వర్షన్ ఇన్ టూ రైత్వారీ) ఎమైండ్‌మెంట్ ఆర్డినెన్స్-2019 తెచ్చింది. దీని ప్రకారం 1957 నుంచి 2013 మధ్య ఇచ్చిన పట్టాలు చెల్లుబాటు కావాల్సి ఉండగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకోకపోవడంతో సమస్య అలాగే ఉండిపోయింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. నలుగురు మావోయిస్టుల మృతి

చర్ల, న్యూస్‌టుడే: అమరవీరుల వారోత్సవాలకు ముందు మావోయిస్టులకు ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ జిల్లాలో శనివారం సాయంత్రం జరిగిన ఎన్‌కౌంటర్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. సంఘటనా స్థలం నుంచి ఇన్సాస్, ఎస్ఎల్ఆర్‌తోపాటు పెద్ద మొత్తంలో ఆయుధాలు, పేలుడు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బాసగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని నైరుతి ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాలకు పక్కా సమాచారం అందింది. దీంతో అక్కడి అడవుల్లో బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు పార్టీ అమరవీరుల వారోత్సవాలకు పిలుపునిచ్చింది.

'హిడ్మా' ఊరికి వంతెన

మావోయిస్టు కమాండర్ 'హిడ్మా' స్వగ్రామం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పువర్తిలో వంతెన నిర్మించారు. ఎల్మగూడ-పువర్తి మధ్యలో రూ.53 కోట్లతో రోడ్డు వేస్తున్నారు. ఇందులో భాగంగా 15 మీటర్ల వంతెన నిర్మించారు.

ఉపాధ్యాయ కరదీపిక.. బోధన సులువిక!

టీచర్లకు తొలిసారిగా హ్యాండ్‌బుక్స్


మేడికొండూరు విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్న పుస్తకాలు

పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కూటమి ప్రభుత్వం విద్యారంగంలో పలు మార్పులు తీసుకొస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల టీచర్లకు తొలిసారిగా ఉపాధ్యాయుల కరదీపిక (హ్యాండ్ బుక్) పేరుతో పుస్తకాలు అందిస్తోంది. ఎస్‌సీఈఆర్‌టీ సాకారంతో 'సమగ్ర శిక్ష' ద్వారా 'సామర్థ్యాధారిత బోధన- అభ్యసన ఉపాధ్యాయ వనరు' పేరుతో వీటిని రూపొందించింది. బోధనలో కొత్తదనాన్ని ప్రోత్సహించేలా, మూస విధానానికి తిలోదాకాలిచ్చేలా ఇవి రూపుదిద్దుకున్నాయి. 1-10వ తరగతి వరకు సంబంధించిన ఉపాధ్యాయులకు వీటిని ప్రభుత్వం అందించనుంది. ఆయా తరగతుల్లో ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ఒక పుస్తకం ఉండేలా తయారు చేసింది. ముందుగా ఆయా పుస్తకాలను ఉపాధ్యాయులు క్షుణ్ణంగా చదువుతారు. దీంతో వారికి పిల్లలకు అర్థమయ్యేలా పాఠాలు బోధించడం మరింత తేలిక అవుతుంది. అలాగే నోట్స్ తయారు చేయడం సులభతరంగా ఉంటుంది. నైపుణ్యం మరింత పెరుగుతుంది. ప్రశ్న పత్రం తయారు చేయడమూ సులభం అవుతుంది.



ఉపాధ్యాయ కరదీపిక పేరుతో ముద్రించిన పుస్తకాలు

– న్యూస్‌టుడే, మేడికొండూరు, దుగ్గిరాల

కన్నా... ఎవరెక్కువ నీకన్నా!

పిల్లలు కళ్ల ముందు తిరుగుతుంటే ఆ సంతోషమే వేరు. కానీ, దివ్యాంగులుగా పుడితే.. పెరిగే కొద్దీ బుద్ధి వికసించకపోతే? ఆ ప్రశ్నే వేదనాభరితం. ఇక అనుభవంలోకి వస్తే భరించడం ఎంతో కష్టం. అయినా సరే తల్లిదండ్రుల ప్రేమ అంతులేనిది కదా! పిల్లల ఆరోగ్యం బాగు చేయాలని నిత్యం తపిస్తుంది. కంటికి రెప్పలా తోడుంటుంది. ఇలా ఎందరో తల్లిదండ్రులు సర్వం త్యాగం చేసి ఆ పిల్లల ఆలనాపాలనా కోసం జీవితాలను అంకితం చేస్తుంటారు. విశాఖలోని రాణి చంద్రమణి దేవి(ఆర్‌సీడీ) ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి వారిని చూడొచ్చు. ఆటిజంతో బాధపడే బాలలకు ఇక్కడున్న పాఠశాలలో శిక్షణ ఇప్పిస్తున్నారు. చిన్నారుల మానసిక పరిస్థితి మేరకు కొందరు దగ్గరుండి తర్ఫీదు ఇస్తున్నారు. జులై 27న తల్లిదండ్రుల దినోత్సవం నేపథ్యంలో ఈ త్యాగధనుల కృషికి హ్యాట్సాఫ్ చెబుదాం! – ఈనాడు, విశాఖపట్నం





అన్నీ తామై.. ప్రేమకు రూపమై!

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం గొట్టిపాడుకు చెందిన చిట్టినేని సుధాకర్, సరితలకు 25 ఏళ్ల క్రితం వివాహమైంది. పెద్ద కుమారుడు లోకేశ్ (22), చిన్న కుమారుడు హేమసాయి (14) తీవ్రమైన కండరాల బలహీనత రుగ్మత (డీఎండీ) బారిన పడి మంచానికే పరిమితమయ్యారు. వారికి సపర్యలన్నీ తల్లిదండ్రులే చేస్తున్నారు. గతంలో సుధాకర్ తమకున్న 75 సెంట్ల భూమితో పాటు మరి కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తుండేవారు. ఇప్పుడు ఇద్దరు పిల్లలనూ చూసుకోవడం కోసం భార్యతో పాటు సుధాకర్ కూడా ఇంట్లో ఉంటున్నారు. అప్పుడప్పుడూ ట్రాక్టర్ తోలడం వంటి చిన్నచిన్న పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. – న్యూస్‌టుడే, గొట్టిపాడు (ప్రత్తిపాడు)


కుమారులు లోకేశ్, హేమసాయిలతో తల్లిదండ్రులు సుధాకర్, సరిత

మైసూర్ బజ్జీ దొరికింది.. మజానే బుజ్జీ



ఆకలిగొన్న బుజ్జి ఉడతకు ఓ పొట్లం దొరికింది. చింపి చూస్తే దానిలో మైసూర్ బజ్జీ కనిపించింది. ఇంకేం.. ఆకలి తీరినట్లేనని టక్కున అందుకుని చెట్టెక్కింది. వెక్కివెక్కిరించే తినబోయింది.. ఇంతలోనే బజ్జీ పట్టుజారి కిందపడిపోయింది. ఎవరైనా ఉన్నారా అని చుట్టూ చూసుకొని మళ్లీ కిందికి వచ్చి పట్టుకొని చెట్టెక్కింది. మైసూర్ బజ్జీకి చిన్న రంధ్రం చేసి, కొద్దికొద్దిగా తింటూ కొమ్మలు దూకుతూ మజా చేసుకుంది. విశాఖపట్నంలో తాటిచెట్లపాలెం వద్ద జాతీయ రహదారి పక్కనే కనిపించిన ఈ ఉడత విన్యాసాలు ఆకట్టుకున్నాయి. – ఈనాడు, విశాఖపట్నం

వ్యాపారం రాణించాలంటే.. బాగా కనిపించాలిగా మరి!



ఆగస్టు 9న రాఖీ పండగను పురస్కరించుకొని.. హైదరాబాద్ బేగంబజార్ హోల్‌సేల్ మార్కెట్‌లో రాఖీ అమ్మకాలు జోరందుకున్నాయి. కొనుగోలుదారులను ఆకర్షించేలా ఓ వ్యాపారి తన మూడంతస్తుల దుకాణానికి ఇలా పెద్దపెద్ద రాఖీలు తయారు చేయించి కట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో చిరు వ్యాపారాలు ఏటా బేగంబజార్‌కు వచ్చి పెద్దమొత్తంలో రాఖీలను కొనుగోలు చేస్తుంటారు.
– ఈనాడు, హైదరాబాద్

16 ఎవరెస్టులు... 436 ఐఫిల్ టవర్లు!

- ఏడాదిలో మొబైల్‌ను ఒక్కొక్కరూ స్క్రోల్ చేస్తున్న దూరమిది..
- చేతి వేళ్లపై ఒత్తిడి పెంచుతున్న సెల్‌ఫోన్ వినియోగం



చేతినిండా పని అంటే సంతోషమే! ఉంటే ఆనందమే! కానీ... మొబైల్ పుణ్యమా అని... గంటల తరబడి... చేతులకు చెబుతున్న పని మాత్రం ఆందోళనకరం అంటున్నారు నిపుణులు!

ఫోన్ చేత్తో పట్టుకుని మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తూ, స్క్రోల్ చేస్తున్నప్పుడు ఎప్పుడైనా బొటన వేలు, చూపుడు వేలు, చిటికెన వేలు తిమ్మిరిగా, లాగినట్లు, పట్టేసినట్లుగా అనిపించిందా..? అయితే మీకు ఫోన్ ఫింగర్/ టెక్స్టర్స్ థంబ్ సమస్య ఉన్నట్లే. ఇదో కొత్త తరహా జీవనశైలి సంబంధిత సమస్య. దీన్ని వైద్య పరిభాషలో 'డీ క్వెర్వైన్ టెనోసినోవైటిస్' అంటారు. ఈ లక్షణాలు రిపిటీటివ్ స్ట్రెస్ ఇంజురీ (ఆర్ఎస్ఐ)లో భాగమని వైద్య నిపుణులు చెబుతున్నారు. స్మార్ట్ ఫోన్ ఎక్కువ సేపు చేత్తో పట్టుకుని టైప్ చేసినా, స్క్రోల్ చేసినా చేతి వేళ్లలోని కండరాలు, నరాలపై ఒత్తిడి పెరిగి నొప్పి పుడుతుంది. ఇది సాధారణమే అనిపించినా దీర్ఘకాలంలో ఈ సమస్య చేతి వేళ్లు బలహీనపడి కదలికలపైనా ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.

ప్రతివ్యక్తి రోజుకు...

సగటున 108 నిమిషాలు మొబైల్‌ను స్క్రోల్ చేస్తున్నట్లు అంచనా. అయితే 5 సెకన్లకు సుమారు 30 సెం.మీ.లు స్క్రోల్ చేస్తున్నారు అనుకుందాం..! ఈ ప్రకారంగా మీ బొటన వేలు స్క్రోల్ చేసిన దూరం

ఒక్క రోజులో 0.38 కిలోమీటర్లు	ఒక వారంలో 2.7 కి.మీ.లు
ఒక నెలలో సుమారు 12 కి.మీ.లు	ఒక ఏడాదిలో 144 కి.మీ.లు

ప్రపంచ ప్రఖ్యాత గోపురాల కంటే ఎక్కువ!

ఏడాది కాలంలో మీరు స్క్రోల్ చేసే దూరం

- ఐఫిల్ టవర్ ఎత్తు 330 మీటర్లు.. మీ బొటన వేలు దాన్ని 436 సార్లు ఎక్కుతుంది
- ఎవరెస్టు పర్వతం ఎత్తు 8,848 మీటర్లు మీ బొటనవేలు దాన్ని 16 సార్లు చేరుకుంటుంది
- అంతర్జాతీయ విమానాలు ఎగిరే సగటు ఎత్తు 13వేల మీటర్లు మీ వేళ్లు ఈ ఎత్తును 11 సార్లు దాటేస్తాయి

ఈ గణాంకాలు కేవలం మొబైల్‌ను రెండు గంటల కంటే తక్కువ వాడుతున్న వారిలో మాత్రమే! రోజులో 5-6 గంటల పాటు అలసట లేకుండా సెల్‌ఫోన్‌ను స్క్రోల్ చేసే యోధుల రికార్డు గురించి చెప్పనే అక్కర్లేదు!

ఎందుకీ సమస్య..?




సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి మునిగి తేలుతున్నారు చాలామంది. చాటింగ్, ఆన్‌లైన్ తరగతులు, ఆన్‌లైన్ షాపింగ్, డిజిటల్ పేమెంట్స్.. ఇలా అన్నింటి వినియోగం అమాంతం పెరిగింది. దీంతో ఫోన్లు ఎక్కువగా వాడే వారిలో చేతివేళ్లు పటుత్వం కోల్పోవడం, తిమ్మిర్లు, వణుకు, కీళ్లలో సమస్యలు వస్తాయి.

ఎలా గుర్తించొచ్చు..?


ఈ సమస్య ఫోన్ ఎక్కువగా వాడే పిల్లలు, విద్యార్థులు, యువత, కాల్ సెంటర్ ఉద్యోగులు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, ఐటీ, డెలివరీ, కంటెంట్ వర్కర్లలో ఎదురయ్యే అవకాశం ఉంది. మొబైల్ ఎక్కువ సేపు వినియోగిస్తే ఆ ఒత్తిడికి వేళ్లు ఎర్రగా మారుతుంటాయి. మణికట్టుపై ఒత్తిడి ఎక్కువవ్వడం, వేళ్లు పట్టేసినట్లు అనిపిస్తుంది. ఇలాంటి సమస్యలు ఉంటే.. ఫిజియోథెరపిస్టునో.. ఎముకల వైద్య నిపుణులనో సంప్రదించడం మేలు. పట్టించుకోకుండా వదిలేస్తే భవిష్యత్తులో శస్త్రచికిత్సల వరకూ వెళ్లాల్సి రావొచ్చు.

- ఈనాడు, అమరావతి



ఇలా చేయండి!

- మొబైల్ వినియోగం తప్పనిసరైనవాళ్లు.. ఒకే చేత్తో ఫోను పట్టుకోవద్దు. వేరొక చేతికి ఫోన్ మార్చాలి.
- వాయిస్ టైపింగ్‌తో మెసేజ్‌లు పంపడం.. ఇంటర్నెట్ సెర్చింగ్, ఇతర అవసరాలకు అలెక్సా, సిరి, ఓకేగూగుల్ లాంటి టూల్స్ వినియోగించడం మేలు.
- ప్రతి అరగంటకోసారైనా సెల్‌ఫోన్ పక్కన పెట్టేసి వేళ్లకు విరామం ఇవ్వాలి.
- మణికట్టు, వేళ్లకు తేలిక పాటి వ్యాయామాలు చేయాలి.



జాగ్రత్తలతో సమస్యకు పరిష్కారం

గతంలో వడ్రంగి, మేస్త్రీల్లో వచ్చే సమస్యలు ఇప్పుడు మొబైల్ ఎక్కువగా వాడే వారిలో కనిపిస్తున్నాయి. సెల్‌ఫోన్ అధిక వినియోగంతో బొటన వేలు దగ్గర రెండు కండరాల పొరల వద్ద వాపు వస్తోంది. అప్పుడు వేలికి విశ్రాంతి ఇవ్వాలి. తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలి. ఫలితం కనిపించకపోతే శస్త్రచికిత్స అవసరం కావచ్చు.
– డాక్టర్ కాట్రగడ్డ సాయికృష్ణ, ఎముకల వైద్య నిపుణులు, విజయవాడ

చిట్టీ డిష్యుం.. డిష్యుం



ప్రపంచ కృత్రిమ మేధ సదస్సు సందర్భంగా చైనాలోని షాంఘైలో శనివారం నిర్వహించిన ప్రదర్శనలో బాక్సింగ్ ఆడుతున్న ఓ రోబోను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు

32 ఏళ్లుగా 'ఉచిత' ట్రాఫిక్ విధులు.. గుండెల నిండా విషాదం సుడులు




దిల్లీ: దేశ రాజధాని నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన సీలంపుర్ కూడలికి ఉదయాన్నే ఎనిమిదింటికి ఓ బక్కపల్చని వృద్ధుడు వస్తారు. తెల్లటి యూనిఫామ్‌తో వచ్చే పోయే వాహనాల రద్దీని క్రమబద్ధీకరించే ఆయనను ట్రాఫిక్ పోలీసు అనుకుంటారు. తలపై టోపీ, మెడలో విజిల్, చేతిలో కర్ర ఉన్నా.. ఆయన పోలీసు కాని పోలీసు. 32 ఏళ్లుగా పైసా ప్రతిఫలం ఆశించకుండా రోజూ పన్నెండు గంటలు స్వచ్ఛందంగా ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు గంగారామ్ (72). చాలా ఏళ్ల క్రితం ఇదే కూడలిలో ఆయన ఏకైక కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆ బాధతో భార్య కూడా కన్నుమూశారు. అప్పట్నుంచీ ఒంటరైన గంగారామ్ తన దుస్థితి మరే కుటుంబానికి రావద్దని రోజూ 20 కి.మీ.లు ప్రయాణం చేసి వచ్చి మరీ సీలంపుర్ కూడలిలో ట్రాఫిక్‌ను చక్కదిద్దుతున్నారు. దిల్లీ పోలీసు శాఖ, స్వచ్ఛంద సంస్థలు ఆయన సేవలను గుర్తించి పలుమార్లు సత్కరించాయి. ఇటీవల సోషల్ మీడియాలోనూ బాగా ప్రాచుర్యం పొందిన గంగారామ్ కథ విన్న నెటిజన్లు బరువెక్కిన హృదయాలతో ఆయనకు సెల్యూట్ చేస్తున్నారు.

గున్న ఏనుగు గుణపాఠం!



ఇంటర్నెట్ డెస్క్: ఖాళీ చిప్స్ ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లను కారు అద్దాల్లోంచి విసిరేసే నాగరికులను నిత్యం చూస్తుంటాం. వీధుల్లో చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ కవర్లనూ ఇష్టానుసారం పడేస్తుంటాం. అల్లంత దూరాన చెత్తకుండీ ఉన్నా వెళ్లేందుకు అడుగు ముందుకు పడదు. ఇటువంటి బద్ధకం రాయుళ్లకు ఈ గున్న ఏనుగు గుణపాఠం చెబుతోంది. తల్లి ఏనుగుతో కలిసి రహదారి వెంట వెళుతూ దారిలో మనుషులు పడేసిన పేపర్ గ్లాసును తన తొండంతో ఎత్తి పక్కనే ఉన్న చెత్తబుట్టలో వేసింది. ఆగి వెనక్కు చూసిన తల్లి ఏనుగుతో 'అమ్మా! ఇదిగో వస్తున్నా' అన్నట్టు చకచకా వెళ్లిపోయింది. కర్ణాటక భాజపా నేత సీటీ రవి 'ఎక్స్'లో షేర్ చేసిన ఈ వీడియో వైరల్‌గా మారింది. "పిల్ల ఏనుగు చేసిన పనిని మనుషులుగా మనమెందుకు చేయకూడదు?" అంటూ పలువురు నెటిజన్లు స్పందిస్తున్నారు.

నీటి చౌరస్తా!



గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది కరవు సీమ అనంతలో జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. హెచ్చెల్సీ, హంద్రీ నీవా కాలువలు జలకళతో ఉట్టిపడుతున్నాయి. అనంతపురం జిల్లాలో ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో తుంగభద్ర డ్యాం, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఒకేసారి నీరు వదిలారు. ఉరవకొండ మండలం ఇంద్రావతి గ్రామం వద్ద హై లెవల్ కెనాల్‌లోంచి తుంగభద్ర, దానిపైన కట్టిన అక్విడక్ట్‌లోంచి కృష్ణా జలాలు ప్రవహిస్తూ అన్నదాతలను ఆనందంలో ముంచెత్తాయి. – ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, ఉరవకొండ

పట్టు వస్త్రాలే.. వధూవరులను కట్టేసుకున్నాయి!



సాంకేతికత, సృజనతో పట్టుపోగును పసిడివన్నెల కంటే మిన్నగా మారుస్తున్నారు.. ధర్మవరం నేతన్నలు. ఈసారి పెళ్లి చీరలపై వధూవరుల చిత్రాలు నేసి ఔరా అనిపిస్తున్నారు. వధూవరుల చిత్రాలను మొదట కంప్యూటర్‌లో స్కాన్ చేసి, దాన్ని సాఫ్ట్‌వేర్‌లోకి మార్చుతున్నారు. ఆ తర్వాత మగ్గంలోని కంప్యూటరైజ్డ్ జాకార్డ్ హుక్స్, అచ్చు, పన్నెల వంటి పరికరాలను అనుసంధానించి గ్రాఫ్ సెట్ చేస్తున్నారు. ఈ సాంకేతిక ప్రక్రియల తర్వాత దారం పోగులకు రంగులు అద్దుతున్నారు. ఆ తర్వాత మగ్గంపై చిత్రాలు వచ్చేలా చీర నేసేస్తున్నారు. – న్యూస్‌టుడే, ధర్మవరం

పాఠశాలల్లో కూసింత కళా పోషణ!






విద్యార్థుల సృజనకు మెరుగులు దిద్దేందుకు ప్రభుత్వం వినూత్న చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రతి నెలా చివరి శనివారం నో బ్యాగ్ డేను అమలు చేస్తోంది. ఆ రోజు అంతా విద్యార్థులు చిత్రలేఖనం, అల్లికలు, యోగా వంటి కృత్యాలు నేర్చుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం నింబగల్లులో విద్యార్థులు ఈ శనివారం గణేశుడి ప్రతిమలు, ఎడ్లబండ్లు తదితర బొమ్మలను మట్టితో తయారు చేశారు. మొక్కల ఆకులతో చార్టు మీద అందమైన బొమ్మలు వేశారు. ఉపాధ్యాయులు తిమ్మప్ప, సరిత, శైలజ, కవిత వారికి నేర్పించారు.
– ఈనాడు అనంతపురం, న్యూస్‌టుడే, ఉరవకొండ

ఆరోగ్యం 'ట్రాక్'లో పడాలని..




రవీంద్రనాథ్ ఠాగూర్


ఇసుకలో చెప్పులు లేకుండా నడుస్తుంటే.. ఆ హాయే వేరు. ఇందుకోసం సముద్ర తీరానికో, నది వద్దకో వెళ్లాల్సిన అవసరం లేకుండా విజయవాడ శివారు గంగూరులోనే ఆ వాతావరణాన్ని సృష్టించారు పారిశ్రామికవేత్త ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్. 300 మీటర్ల పొడవైన ఇసుక ట్రాక్‌ను ఆయన దశాబ్దం క్రితమే ఇక్కడ అందుబాటులోకి తెచ్చారు. ప్రజలు నడవడం వల్ల మెత్తగా మారిపోయిన ఇసుకను తొలగించి.. రెండేళ్లకోసారి కొత్తగా గండ్ర ఇసుక తెచ్చి ట్రాక్‌లో నింపుతున్నారు. పచ్చని గడ్డి మైదానాలు, ఇసుకలో పాదరక్షలు లేకుండా నడిచే వారికే ఆరోగ్య ప్రయోజనాలు అధికంగా ఉంటాయని ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు డాక్టర్ భరత్‌చంద్ర తెలిపారు. ఇసుక రేణువులు కదిలే స్వభావం కలిగి ఉండడంతో.. నడిచేటప్పుడు స్థిరత్వం కోసం శరీరం బ్యాలెన్స్ చేసుకుంటుందని, ఫలితంగా ఎక్కువ బలం ఉపయోగించడం వల్ల త్వరగా అలిసిపోతామని ఆయన వెల్లడించారు. 'ఇసుకలో నడిస్తే మంచిదని తెలిసి ట్రాక్‌ను సిద్ధం చేయించా. నా వయసు ఇప్పుడు 85 ఏళ్లు ఏ నొప్పులూ లేవు' అని రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. –ఈనాడు, అమరావతి

కంటికే విందు.. తినడానికి కాదు



ఒక్కోసారి ఆకర్షణీయ రూపం వెనుక ప్రమాదకర అంశం దాగి ఉండొచ్చు. దాన్ని చాటేలా ఉంది ఈ పుట్టగొడుగు. నోరూరించేలా కనిపిస్తున్న ఈ పుట్టగొడుగు కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని అటవీ ప్రాంతంలో కనిపించింది. దీనిని రేంజి అధికారి అనిల్‌కుమార్‌కు చూపగా.. ఈ పుట్టగొడుగు పేరు మైసెనా అసికులా అని... ఇవి తినడానికి పనికిరావని స్పష్టంచేశారు.
– న్యూస్‌టుడే, పెంచికల్‌పేట

సెల్ పర్సు.. తెరిస్తే పెద్ద ప్రయోజనమే





ప్లాస్టిక్ సంచులు వద్దని అందరూ చెబుతారు. అయితే మార్కెట్ నుంచి వస్తువులు, కూరగాయలు తెచ్చుకోవడానికి ప్రతిసారీ జూట్ సంచులను తీసుకెళ్లం. దీంతో అనివార్యంగా షాపు వాళ్లు ఇచ్చే ప్లాస్టిక్ సంచుల్లో వస్తువులు తెచ్చుకోక తప్పని పరిస్థితి. ఈ అలవాటును తప్పించే లక్ష్యంతో.. సంచినే సెల్‌ఫోన్ పర్సులా రూపొందించారు నల్గొండకు చెందిన పర్యావరణవేత్త మిట్టపల్లి సురేశ్‌గుప్తా. 'సెల్‌ఫోన్ లేకుండా ఈ రోజుల్లో బయటికి వెళ్లలేం. దీంతో సంచినే సెల్‌ఫోన్ పర్సులా రూపొందించా. దీనిలో ఫోన్ పెట్టుకొని వెళితే.. వచ్చేటప్పుడు కూరగాయలు, సరకులు తెచ్చుకోవచ్చు' అని చెబుతున్నారు గుప్తా. రూ.200 విలువ చేసే ఈ చేతి సంచిని సామాజిక స్పృహతో ఆయన ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు. – ఈనాడు, నల్గొండ

నేనూ సీతాకోకచిలుకనే!



తల, కాళ్లపై జుట్టుతో చూడముచ్చటగా ఉన్న ఈ జీవి ఏ కీటకమో కాదండోయ్.. అచ్చంగా సీతాకోకచిలుక. గోధుమ వర్ణంలో మెరిసిపోతున్న ఈ జీవి నిగ్మియా ఐసిలియా. ఎరెబిడే కుటుంబానికి చెందినది. పరిమాణంలో ఇవి రెండు సెంటీమీటర్లే ఉంటాయని, మన దేశంతో పాటు శ్రీలంకలో మాత్రమే అరుదుగా కనిపిస్తాయని ఫారెస్ట్ బీట్ అధికారి రాజేశ్ తెలిపారు. ఏలూరు జిల్లా ఆటపాక సమీపంలోని కొల్లేరులో ఈ సీతాకోకచిలుక కనిపించింది. – ఈనాడు, కైకలూరు

పెద్దపులి కనిపిస్తే!

ఈనాడు, హైదరాబాద్: ఇటీవల కాలంలో అభయారణ్యాల్లో పర్యటనలు పెరుగుతున్నాయి. తిరుమలకు వెళ్లే నడక మార్గాల్లోనూ తరచూ చిరుతలు సంచరిస్తున్నాయి. తిరుమలలో తితిదే బ్యాటరీ స్టేషన్ ప్రాంతాల్లో శనివారం రాత్రి చిరుత పులి సంచారం కలకలం సృష్టించింది. పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్ల దాడిలో తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. అటవీ ప్రాంతాల్లోనే కాదు కొన్నిసార్లు జనావాసాల్లోకీ ఈ క్రూరమృగాలు వస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుందాం.

ఒంటరిగా వెళ్లొద్దు..

- అడవిలోకి ఒంటరిగా వెళ్లొద్దు. కనీసం ఇద్దరు, ముగ్గురితో వెళ్లాలి. చేతిలో బలమైన వెదురు కర్ర ఉండాలి. సమీప గ్రామస్థుల్ని వెంట తీసుకెళ్లాలి.
- అడవిలో ఎక్కడైనా జింక, పశువు చనిపోయి ఉంటే సమీపంలో పులి ఉంటుందని సంకేతం. పక్షులు, నెమళ్ల అరుపులు వినిపిస్తే అప్రమత్తం కావాలి. పెద్దపులి, చిరుత వచ్చేప్పుడు అలారంలా నెమళ్ల అరుపులతో హెచ్చరికలు చేస్తాయి. అడవుల్లో పొదలు, గుహలు వంటి చీకటి ప్రదేశాలు పులుల ఆవాసాలు.
- పెద్దపులులు ప్రధానంగా అమ్రాబాద్, కవ్వాల్, నాగార్జునసాగర్ వంటి టైగర్ రిజర్వుల్లో సంచరిస్తున్నాయి. చిరుతలు, పెద్దపులులు అభయారణ్యాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని అడవులు, హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో.. వ్యవసాయ పొలాల్లోనూ సంచరిస్తున్నాయి.
- శ్రీశైలానికి వచ్చే భక్తులకు నల్లమల అడవిలో రహదారి పక్కన పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు తారసపడతాయి.
- ఏపీలో కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని నల్లమల అడవికి సమీపప్రాంతాల్లో పులులు, చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం ఉంది.



ఒక్కో అడుగు వెనక్కు వేస్తూ

పెద్దపులి ఎదురుపడ్డప్పుడు ప్రశాంతంగా ఉండాలి. 15-20 మీటర్లకు పైగా దూరంలో కనిపిస్తే ఇబ్బంది ఉండదు. మనిషి ముఖం పులి వైపే ఉండాలి. రివర్స్‌లో ఒక్కో అడుగు వెనక్కి వేసుకుంటూ ఆ ప్రాంతాన్ని విడిచిపెడితే సురక్షితంగా బయటపడొచ్చు. అడవిలోకి వెంట శునకాల్ని తీసుకెళ్లాలి. పులి వాసనను గుర్తించి గట్టిగా అరిచి అప్రమత్తం చేస్తాయి. సాధారణంగా పులులు మనిషిపై దాడిచేయవు. ఎలుగుబంట్ల విషయంలోనూ ఇవే జాగ్రత్తలు తీసుకోవాలి.
– నవాబ్ షఫత్ అలీఖాన్, ప్రముఖ షూటర్

పరుగెత్తొద్దు.. కళ్లలోకి చూడొద్దు

పెద్దపులి ఎదురుపడితే పరుగెత్తొద్దు. కళ్లలోకి చూడొద్దు. వీపు భాగం చూపించొద్దు. వంగితే జంతువు అనుకుని మనిషి వెనుకభాగంపై పంజా విసురుతుంది. నిలబడే ఉండాలి. పక్కన చెట్లు ఉంటే అక్కడ పనిచేస్తున్నట్లు ఉండాలి. పులులకు వినికిడి శక్తి, చూపు ఎక్కువ. మనుషులు వస్తుంటే అవే జాగ్రత్త పడి దూరం వెళతాయి.
– తులసీరావు, అటవీశాఖ విశ్రాంత ఉన్నతాధికారి

EENADU Vol: 51, Issue: 348 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

గారాలపట్టీలా.. రసాయన కర్మాగారాలా!

ముద్దులొలికే చిన్నారులు స్వచ్ఛతకు మారుపేరు. ఈ పసిమొగ్గల్లో ప్రమాదకరమైన రసాయనాలు ఎక్కువగా ఉంటున్నట్లు అమెరికా శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. ఏకంగా 96 రకాల విషతుల్య పదార్థాలు వీరి పసిదేహాల్లో పోగుపడినట్లు తేలింది. మెదడు సహా పలు అవయవాల ఎదుగుదలలో కీలకమైన శైశవ ప్రాయంలో ఈ గరళాలు తిష్టవేయడం వల్ల వారి భావి జీవితంపై పెను ప్రభావం పడొచ్చని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.



ఏమిటీ పరిశోధన?

అమెరికాలోని పలు వైద్యసంస్థల ఆధ్వర్యంలో ఈ పరిశోధన జరిగింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్‌ఐహెచ్) దీనికి తోడ్పాటు అందించింది. కాలిఫోర్నియా, జార్జియా, న్యూయార్క్, వాషింగ్టన్ రాష్ట్రాల్లోని 2-4 ఏళ్ల వయసున్న 201 మంది చిన్నారుల మూత్ర నమూనాలను శాస్త్రవేత్తలు విశ్లేషించారు. అందులో పర్యావరణంలో సాధారణంగా కనిపించే 111 రసాయనాల ఉనికి కోసం శోధించారు.

ఏ రసాయనాల కోసం అన్వేషించారంటే..

- ప్లాస్టిక్ బొమ్మలు, ఆహార ప్యాకేజింగ్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, గృహోపకరణాల్లో వాడే థాలేట్లు, వాటి ప్రత్యామ్నాయాలు.
- సౌందర్య ఉత్పత్తులు, లోషన్లు, షాంపూలు, ఔషధాల్లో వాడే పారాబెన్లు.
- ప్లాస్టిక్ కంటెయినర్లు, ఆహార క్యాన్ లైనింగ్‌లో వాడే బిస్ఫెనాల్స్.
- సన్‌స్క్రీన్లు, కాస్మెటిక్స్, ప్లాస్టిక్స్‌లో వాడే బెంజోఫెనోన్స్.
- వ్యవసాయం, ఇళ్లలో చీడల నివారణకు వాడే క్రిమిసంహారక మందులు.
- వాహనాల పొగ, గ్రిల్ చేసిన ఆహారం, పొగాకు పొగలో ఉండే పాలీసైక్లిక్ ఆరోమేటిక్ హైడ్రోకార్బన్లు (పీఏహెచ్‌లు).
- యాంటీబ్యాక్టీరియల్ సబ్బులు, వ్యక్తిగత రక్షణ ఉత్పత్తుల్లో ఉండే బ్యాక్టీరియానాశనులు.

నివ్వెరపరిచే ఫలితాలు..

శాస్త్రవేత్తల పరిశోధనలో నివ్వెరపరిచే ఫలితాలు వెలువడ్డాయి.

- ఐదుగురు చిన్నారుల్లో 96 రకాల రసాయనాలు ఉన్నాయి.
- సగం మంది పిల్లల్లో 48 రసాయనాలు తిష్టవేశాయి.
- 90 శాతం మందికిపైగా చిన్నారుల్లో 34 రసాయనాలు ఉన్నాయి.
- వీటిలో 9 రసాయనాలపై జాతీయ ఆరోగ్య సర్వేల్లో పరిశీలన ఉండటంలేదు.
- మొదటి సంతానంతో పోలిస్తే ఆ తర్వాత పుట్టినవాళ్లలో రసాయనాల మోతాదు ఎక్కువగా ఉంటోంది. 3 లేదా 4 ఏళ్ల వయసువారితో పోలిస్తే రెండేళ్ల వయసువారిలో ఇవి ఎక్కువగా ఉంటున్నట్లు తేలింది.
- ట్రైక్లోసాన్ వంటి పురాతన రసాయనాలు క్రమంగా తగ్గుతున్నాయి. డీఎస్‌హెచ్ ప్లాస్టిసైజర్, పలు ఆధునిక క్రిమిసంహారాలు పెరుగుతున్నాయి.

ఎదుగుదలకు అవరోధం?

మెదడు, శరీర వృద్ధిలో ఈ పసిప్రాయమే కీలకం. ఈ వయసులో క్రిమిసంహారకాలు, ప్లాస్టిసైజర్లు, అగ్నిమాపకాల్లోని కొన్ని రసాయనాల తాకిడికి గురికావడం వల్ల ఎదుగుదల జాప్యం కావడం, హార్మోన్ల విచ్ఛిత్తి, ఇతర దీర్ఘకాల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

- ఇటీవల 50 ఏళ్లలోపే క్యాన్సర్ బారినపడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. దీనికి రసాయనాలు, ప్లాస్టిక్‌ల తాకిడే కారణమని విశ్లేషిస్తున్నారు.

తాకిడి ఎలా?

- ఆహారం తీసుకునేటప్పుడు, నీరు తాగేటప్పుడు, కలుషిత గాలితో కూడిన గదులు, ఆరుబయట గాలిని పీల్చడం వల్ల, కలుషిత ఉపరితలాలను తాకడం ద్వారా చిన్నారులు ఈ రసాయనాల బారినపడుతున్నారు.
- తరచూ వేళ్లను నోట్లో పెట్టుకోవడం, నేలపై ఎక్కువగా ఆడుకోవడం, వారి చిన్న శరీరంతో పోలిస్తే ఎక్కువ గాలిని తీసుకోవడం వంటి కారణాల వల్ల రసాయనాల తాకిడి వీరిపై ఎక్కువగా ఉంటోంది.

తల్లుల కన్నా ఎక్కువగా..

గర్భిణులుగా ఉన్నప్పుడు ఈ పిల్లల తల్లుల నుంచి మూత్ర నమూనాలను సేకరించి శాస్త్రవేత్తలు విశ్లేషించారు. పిల్లల ఫలితాలతో పోల్చి చూశారు. చాలామంది మాతృమూర్తుల కన్నా వారి చిన్నారుల్లోనే కొన్ని రసాయనాలు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది.

ఏం చేయాలి?

ఈ రసాయనాల వల్ల దీర్ఘకాల ఆరోగ్యంపై ప్రభావం గురించి మరిన్ని అధ్యయనాలు అవసరం. హానికారక రసాయనాలకు పిల్లలు గురికాకుండా మరింత విస్తృతంగా నియంత్రణ, పర్యవేక్షణ విధానాలను తీసుకురావాలి. అన్నిరకాల రసాయనాల తాకిడిని తప్పించుకోవడం అసాధ్యం. అయితే పిల్లలు ఎక్కువగా వీటి బారిన పడకుండా చూడటానికి తీసుకోవాల్సిన చర్యలు..

- థాలేట్లు, పారాబెన్, ఫ్రాగ్రెన్స్ రహిత ఉత్పత్తులను ఎంపిక చేసుకోవాలి.
- #3, #6, #7 అని రాసున్న ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి. వీటిలో బీపీఏ లేదా సంబంధిత రసాయనాలు ఉండొచ్చు.
- తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా.. తినడానికి ముందు దీన్ని మరువకూడదు.
- ఇంట్లోకి ధారాళంగా గాలి వచ్చే ఏర్పాట్లు ఉండాలి. గదిలో హెపా ఫిల్టర్లు వాడాలి.
- పండ్లు, కూరగాయలను వాడే ముందు బాగా శుభ్రం చేయాలి. ఆర్గానిక్ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- రసాయన అవశేషాలు కలిగిన ధూళిని తొలగించడానికి నిత్యం తడి వస్త్రంతో శుభ్రం చేయాలి.

- ఈనాడు ప్రత్యేక విభాగం


జైపుర్‌లో శనివారం తీజ్ వేడుకల్లో సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు

న్యాయవ్యవస్థ వికేంద్రీకరణకు కృషి చేస్తున్నా

- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్



అమరావతి (మహారాష్ట్ర): న్యాయాన్ని ప్రజల ముంగిటకు చేర్చాలంటే న్యాయ వ్యవస్థను వికేంద్రీకరించక తప్పదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టం చేశారు. న్యాయ మౌలిక సదుపాయాల కమిటీ అధినేతగా తాను కొత్త తాలూకా, జిల్లా స్థాయి కోర్టుల ఏర్పాటుకు ఒక నమూనా సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనపై పని జరుగుతోందిగానీ ఎప్పటిలోగా అధికారిక ఆమోదం లభిస్తుందో తెలియదని వ్యాఖ్యానించారు. శనివారం మహారాష్ట్రలోని అమరావతి జిల్లా సెషన్స్ కోర్టులో దివంగత టి.ఆర్.గిల్డా స్మారక ఈ-లైబ్రరీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రిటైర్మెంట్ తర్వాత మధ్యవర్తిత్వ, న్యాయ సలహా సేవలు అందిస్తానని, ప్రభుత్వ పదవిని స్వీకరించబోనని పునరుద్ఘాటించారు. 'గతంలో నేనే విషయాన్ని అనేకసార్లు ప్రకటించా. రానున్న నవంబరు 23 తరువాత నేను ఎలాంటి ప్రభుత్వ పదవినీ స్వీకరించబోను. మధ్యవర్తిత్వ, న్యాయ సలహా సేవలకు అంకితమవుతా' అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. శుక్రవారం తన స్వగ్రామం దారాపూర్‌ను సందర్శించిన సీజేఐ.. తన తండ్రి, మాజీ గవర్నర్ ఆర్.ఎస్.గవాయ్‌కి నివాళులర్పించారు. దాదాసాహెబ్ గవాయ్‌గా ప్రసిద్ధులైన తన తండ్రి పేర ఆయన గ్రామ ప్రవేశ ద్వార నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

జీవిత ఖైదీ ముందస్తు విడుదల దరఖాస్తును మరోసారి పరిశీలించండి

- హైజాకర్ కేసులో ఎస్‌ఆర్‌బీకి దిల్లీ హైకోర్టు ఆదేశం

దిల్లీ: విమానాన్ని హైజాక్ చేసిన కేసులో జీవిత ఖైదు పడిన దోషి ముందస్తు విడుదలను నిరాకరిస్తూ శిక్ష సమీక్ష బోర్డు (ఎస్‌ఆర్‌బీ) చేసిన సిఫారసును దిల్లీ హైకోర్టు పక్కనపెట్టింది. 8 వారాల్లో మరోసారి పరిశీలించి నిర్ణయం వెలువరించాలని జస్టిస్ సంజీవ్ నరూలా ధర్మాసనం ఇటీవల ఆదేశించింది. 1993లో 192 మంది ప్రయాణికులున్న విమానాన్ని హైజాక్ చేసిన కేసులో హరిసింగ్‌కు శిక్ష పడింది. ఇప్పటికే రెమిషన్‌తో కలిపి ఆయన 22 సంవత్సరాలు జైలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు విడుదలకు ఆయన దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎస్‌ఆర్‌బీ తిరస్కరిస్తోంది. దీనిని సవాలు చేస్తూ హరిసింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

రాజకీయాలతోనే ధన్‌ఖడ్ నిష్క్రమణ: కాంగ్రెస్

దిల్లీ: కొంతం స్వతంత్రంగా ప్రవర్తించినందుకే మాజీ ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పదవి కోల్పోయినట్లు కనిపిస్తోందని కాంగ్రెస్ శనివారం ఆరోపించింది. 'ధన్‌ఖడ్ నిష్క్రమణ వెనక రాజకీయ కారణాలే తప్ప రాజ్యాంగ అంశాలు లేవు. ఆయన దాదాపు రాజ్యాంగపరమైన ఉన్నత పదవులతో మత్తుపెడుతున్నారు' అని కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ అన్నారు. ధన్‌ఖడ్ వ్యవహారంలో ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థ నిర్మాణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిందని ఆయన ఆరోపించారు. రాజ్యసభలో జస్టిస్ యశ్వంత్ వర్మకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల తీర్మానం ప్రవేశపెట్టకుండా నిరోధించడం ద్వారా ప్రభుత్వం సంకుచిత రాజకీయాలకు పాల్పడుతోందని విలేకరులతో మాట్లాడుతూ ఆయన అన్నారు. న్యాయ వ్యవస్థలో జవాబుదారీతనం విషయంలో ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మపై చర్యకు సిద్ధమంటున్న ప్రభుత్వం అలహాబాద్ హైకోర్టుకు చెందిన జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన తీర్మాన ప్రతిపాదనను పట్టించుకోవడం లేదని అన్నారు.

అమెరికా వీసా, పౌరసత్వ పరీక్షలు.. మరింత కఠినం కానున్నాయా?

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసా, పౌరసత్వ విధానాలను మరింత కఠినతరం చేసే దిశగా కొత్త ఆలోచనలు చేస్తూనే ఉన్నారు. అమెరికా ప్రభుత్వం నైపుణ్యం కలిగిన కార్మికుల కోసం వీసా వ్యవస్థలో మార్పులు చేయనుందని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ కొత్త అధ్యక్షుడు జోసెఫ్ ఎడ్లో ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. అమెరికా పౌరసత్వం కోసం నిర్వహించే పరీక్షలను మరింత క్లిష్టంగా మార్చాలనే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ''ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షలు ఏమంత కఠినంగా లేవు. బట్టీ పట్టి అప్పగించే సమాధానాల్లా ఉంటున్నాయి. యూఎస్ ఆర్థికవ్యవస్థ కోసం హెచ్-1బీ వీసాను ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై పునరాలోచన చేస్తున్నాం'' అని జోసెఫ్ పేర్కొన్నారు. ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడే దీన్ని సంస్కరించే ప్రయత్నాలు ప్రారంభించారు. తర్వాత బాధ్యతలు చేపట్టిన జో బైడెన్ ఆ నిర్ణయాన్ని ఉపసంహరించారు.



చరిత్ర రచనలో ట్రంప్ సర్కారు జోక్యం

- నిధులను అడ్డుకోవడం తగదు: జడ్జి

వాషింగ్టన్: రచయితల గిల్డ్ సభ్యులకు అమెరికా జాతీయ హ్యూమనిటీస్ నిధి నుంచి వచ్చే గ్రాంట్లను ట్రంప్ ప్రభుత్వం రద్దు చేయడాన్ని న్యూయార్క్ దక్షిణ జిల్లా కోర్టు జడ్జి కొలీన్ మెక్ మహోన్ తప్పుబట్టారు. దీనిపై యథాతథస్థితి కొనసాగిస్తూ శుక్రవారం ఆమె ఇంజంక్షన్ ఉత్తర్వులిచ్చారు. గ్రాంట్ల రద్దు.. రచయితల గిల్డ్ సభ్యుల రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. రచయితల భావజాలం, దృష్టికోణం నచ్చకపోవడంవల్లే వారి గ్రాంట్లను రద్దు చేశారని వ్యాఖ్యానించారు. 1970, 1980లలో అమెరికాలో శ్వేత జాత్యహంకార గ్రూపు 'కు క్లక్స్ క్లాన్' పునరుత్థానం గురించి పుస్తకం రాస్తున్న ఒక అధ్యాపకుడి గ్రాంటునూ రద్దు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి చరిత్రను మార్చే హక్కు లేదని ఆమె పేర్కొన్నారు.

ఉద్యోగులను ఆకట్టుకునేందుకు.. తక్కువ ఖర్చుతో ప్రత్యేక వీసాలు

ఇంటర్నెట్ డెస్క్: ఉద్యోగ నిర్వహణలో వర్క్ ఫ్రమ్ హోమ్, రిమోట్ వర్కింగు వంటి విధానాలు ఇటీవలి కాలంలో బాగా పెరిగాయి. ఆఫీసుకు వెళ్లకుండా నచ్చిన చోట ఉంటూ.. ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రశాంతంగా పనిచేసుకునేందుకు చాలా మంది ఉద్యోగులు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల పని నాణ్యత పెరగడంతోపాటు నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయన్న ఉద్దేశంతో పలు సంస్థలు ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అతి తక్కువ ఖర్చుతో తాత్కాలిక వీసాలపై ఉద్యోగులను ఆకట్టుకునేందుకు వివిధ దేశాలు ప్రత్యేక వీసాలను తీసుకొస్తున్నాయి. పోర్చుగల్ కేవలం 90 యూరోల (దాదాపు రూ.9 వేలు)తో డిజిటల్ నోమాడ్ వీసా (డీ8 వీసా)ను ఇస్తుండగా.. జర్మనీ 74 యూరోల (దాదాపు రూ.7.5 వేలు)తో జర్మన్ ఫ్రీలాన్స్ వీసాను జారీ చేస్తోంది. పోర్చుగల్ జారీ చేస్తున్న డిజిటల్ నోమాడ్ వీసాల్లో లాంగ్‌టర్మ్ రెసిడెన్సీ, తాత్కాలిక ప్రాతిపదికన రెండు రకాల వీసాలు ఉన్నాయి. ఆయా దేశాల నిబంధనల మేరకు వీటిని పొందవచ్చు.

ఆపరేషన్ సిందూర్‌పై రేపటి నుంచి లోక్‌సభలో చర్చ

దిల్లీ: ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారం నుంచి ప్రత్యేక చర్చ ప్రారంభం కానుంది. మూడురోజుల వ్యవధిలో 16 గంటలపాటు చర్చించడానికి అంగీకారం కుదిరిన విషయం తెలిసిందే. రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ చర్చలో పాల్గొంటారు. ప్రధాని మోదీ కూడా చర్చలో జోక్యం చేసుకునే అవకాశం ఉంది.

ఐరోపాను నాశనం చేస్తున్న వలసలు

- ఇదొక భయంకరమైన దండయాత్ర: ట్రంప్
- అగ్రరాజ్యాధిపతి గోల్ఫ్ ఆటపై విమర్శలు

ఎడిన్‌బరో: ఐరోపాను వలసల ప్రవాహం నాశనం చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. వ్యవస్థను సరిచేసుకోకపోతే ఇక ఐరోపా మిగలదని అన్నారు. వలసలను 'భయంకరమైన దండయాత్ర'గా అభివర్ణించారు. శనివారం స్కాట్లాండ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ట్రంప్ తండ్రి ఫ్రెడ్ ట్రంప్, తల్లి మేరీ ఆన్ మెక్‌లియోడ్ ఇద్దరూ యూరప్ నుంచే అమెరికాకు వలస రావడం గమనార్హం! యూరప్ పర్యటన సందర్భంగా బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయన్‌లతో ట్రంప్ సమావేశం కానున్నారు.

పర్యటన ఖర్చుపై వివాదం

ట్రంప్, ఆయన తనయుడు ఎరిక్ కలిసి స్కాట్లాండ్‌లో టర్న్‌బెర్రీ సమీపంలో చరిత్రాత్మక గోల్ఫ్‌క్లబ్‌లో గోల్ఫ్ ఆడారు. వారి కుటుంబం 2008లో దీనిని సొంతం చేసుకుంది. బ్రిటన్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఒకపక్క వందలమంది నిరసనకారులు ఎడిన్‌బరోలోని అమెరికా కాన్సులేట్ ఎదుట ప్రదర్శనలు కొనసాగిస్తుండగా మరోపక్క ఆయన గోల్ఫ్ ఆడారు. సొంత గోల్ఫ్ రిసార్టుల ప్రచారం కోసమే ట్రంప్ ఈ పర్యటన చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఐదు రోజుల పర్యటన కోసం లక్షల డాలర్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఆయన ఉపయోగించే 'ఎయిర్‌ఫోర్స్ వన్' విమాన ప్రయాణానికి గంటకు 2,73,063 డాలర్లు (సుమారు రూ.2.3కోట్లు) ఖర్చు అవుతుంది. వాస్తవానికి ట్రంప్ బ్రిటన్ పర్యటన సెప్టెంబరులో జరగాలి. సొంత గోల్ఫ్ క్లబ్బుల మార్కెటింగ్ కోసం అధికారాన్ని ఉపయోగించుకుంటున్నారని శ్వేతసౌధం మాజీ ఉద్యోగి, న్యాయవాది రిచర్డ్ పెయింటర్ మండిపడ్డారు. మొత్తంగా స్కాట్లాండ్ పర్యటనకు 38 లక్షల డాలర్లు ఖర్చు కానున్నట్లు ఓ పత్రిక కథనం అంచనా వేసింది.


ఎయిర్‌ఫోర్స్ వన్


స్కాట్లాండ్‌లోని టర్న్‌బెర్రీ గోల్ఫ్ కోర్టులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

యుద్ధ విమానానికి ఎదురుగా వెళ్లిన మరో విమానం

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

లాస్ వెగాస్: అమెరికాలో సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. దక్షిణ కాలిఫోర్నియాకు నుంచి లాస్ వెగాస్‌కు శుక్రవారం ఈ విమానం వెళ్తున్న సమయంలో బ్రిటన్ యుద్ధ విమానం హాకర్ హంటర్ ఎదురుగా వస్తోంది. చివరిక్షణంలో పైలట్లకు దీనిపై ఆన్‌బోర్డు అప్రమత్తత హెచ్చరిక రెండుసార్లు వచ్చింది. ఉలిక్కిపడిన పైలట్లు కేవలం 36 సెకన్లలో తమ విమానాన్ని 300 అడుగులు కిందికి దింపారు. ఆకస్మికంగా అలా చేయడంతో వచ్చిన కుదుపుల వల్ల ఇద్దరు సహాయకులకు గాయాలైనట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.




టీఆర్‌ఎఫ్‌పై ఉగ్ర ముద్రకు అభ్యంతరం లేదు

- పహల్గాం దాడిలో ప్రమేయంపై ఆధారాలు చూపాలి: పాక్ మంత్రి

ఇంటర్నెట్‌డెస్క్: పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్‌ఎఫ్)ను ఉగ్రసంస్థగా అమెరికా ప్రకటించడంపై స్పందిస్తూ పాకిస్థాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఉగ్ర సంస్థగా ముద్ర వేయడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదంటూనే పహల్గాం దాడిలో టీఆర్‌ఎఫ్ ప్రమేయంపై ఆధారాలు చూపాలని పేర్కొంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో పాక్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషాక్ దార్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో దార్ మాట్లాడుతూ.. ఇటీవల ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో పహల్గాం ఉగ్రదాడిని ఖండించే తీర్మానంలో టీఆర్‌ఎఫ్‌ను ప్రస్తావించడాన్ని వ్యతిరేకించారు. దాని కార్యకలాపాలకు సంబంధించి మరిన్ని ఆధారాలు అవసరమని పేర్కొన్నారు. "వాణిజ్యం, ఆర్థిక సహకారం, ఉగ్రవాదంపై పోరాటం.. ఇలా ప్రతి అంశంలో భారత్‌తో కలిసి పనిచేసేందుకు పాక్ సిద్ధంగా ఉంది. ఆ చర్చలు అర్థవంతంగా ఉండాలి'' అని మాట్లాడారు. అయితే, కశ్మీర్ అంశం, సరిహద్దు భద్రత, ఆర్థిక సంబంధాల్లో ఉన్న ఆందోళనలపై గతంలోని విధివిధానాల ఆధారంగానే చర్చలు ఉండాలని నిబంధనలు పెట్టడం గమనార్హం.

ప్రపంచ ఆరోగ్య సంక్షోభాలపై పోరాడిన డాక్టర్ డేవిడ్ నబర్రో మృతి



జెనీవా: బర్డ్ ఫ్లూ, ఎబోలా, కోవిడ్ మహమ్మారి తదితర ప్రపంచ ఆరోగ్య సంక్షోభాలను ఎదుర్కొనేందుకు ఐరాస చేపట్టిన చర్యలకు నేతృత్వం వహించిన బ్రిటిష్ వైద్యుడు డాక్టర్ డేవిడ్ నబర్రో(75) మరణించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయేసస్ శనివారం తన సోషల్ మీడియా పోస్టులో ఈ విషయాన్ని ధ్రువీకరించారు. డేవిడ్ నబర్రో ప్రపంచ ఆరోగ్యం కోసమే కాక.. అందరికీ సమానమైన వైద్య ఆరోగ్య అవకాశాల కోసం పాటుపడ్డారని, ఎంతో వివేకం కలిగిన ఆయన మరెందరికో గురువుగా వ్యవహరించారని టెడ్రోస్ పేర్కొన్నారు. కోవిడ్-19పై డబ్ల్యూహెచ్‌ఓ ప్రత్యేక దూతగా వ్యవహరించడం ద్వారా ప్రపంచ ఆరోగ్యానికి నబర్రో అందించిన సేవలకు గుర్తుగా బ్రిటన్ రాజు చార్లెస్ ఆయనను నైట్‌హుడ్ ('సర్' బిరుదు)తో సత్కరించారు.


'కార్గిల్ విజయ్ దివస్' సందర్భంగా శనివారం లద్దాఖ్‌లోని ద్రాస్‌లో నిర్వహించిన ర్యాలీ.. పాల్గొన్న కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవీయ, సంజయ్ సేఠ్, స్థానికులు

ఝార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టుల మృతి

గుమ్లా: ఝార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో శనివారం ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఘాఘ్రా ఠాణా పరిధిలోని లవదాగ్ వద్ద సీపీఐ(మావోయిస్టు) చీలిక వర్గమైన ఝార్ఖండ్ జన్ ముక్తి పరిషద్ (జేజేఎంపీ) సభ్యులు సమావేశమయ్యారన్న సమాచారం ప్రాతిపదికగా భద్రతా దళాలు చేపట్టిన చర్య ఎన్‌కౌంటర్‌కు దారితీసింది.

రాహుల్‌వి స్వార్థపూరిత రాజకీయాలు: మాయావతి

లఖ్‌నవూ: దళితులు, గిరిజనుల పట్ల చాలాకాలంగా కాంగ్రెస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధ్యక్షురాలు మాయావతి శనివారం ఆరోపించారు. వారి రాజకీయ, ఆర్థిక, రిజర్వేషన్ల సంబంధిత ఆకాంక్షలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అంగీకరించడం కొత్తకాదని 'ఎక్స్'లో పోస్టు చేశారు. "రాహుల్ గాంధీవి స్వార్థపూరిత రాజకీయాలు. ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్ల ఎప్పుడూ కాంగ్రెస్ వైఖరి నిరాశాజనకంగానే ఉంది'' అని మాయావతి విమర్శించారు.

బిహార్‌లో ఎస్.ఎస్.సి. ప్రశ్నపత్రాల లీకేజీ వైఫల్యమే: రాహుల్

దిల్లీ: బిహార్‌లోని కొన్ని కేంద్రాల్లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్.ఎస్.సి) ప్రశ్నపత్రాల లీకేజీకి మోదీ ప్రభుత్వ వైఫల్యమే కారణమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అవినీతి, అసమర్థత, పరీక్షల మాఫియాతో మిలాఖత్ కావడంవల్లే ఇలాంటి అవకతవకలు జరుగుతున్నాయని శనివారం 'ఎక్స్'లో విమర్శించారు. సాంకేతిక, నిర్వహణాపరమైన సమస్యలవల్ల బిహార్‌లో కొన్ని కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత ఎస్.ఎస్.సి. ఫేజ్-13 పరీక్షలు వాయిదా పడినట్లు వచ్చిన వార్తలపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ స్పందించారు. ఎస్.ఎస్.సి. పరీక్షా కేంద్రాలకు 400-500 కిలోమీటర్ల నుంచి వచ్చిన అభ్యర్థులు.. చివరి క్షణంలో పరీక్ష రద్దయిందని తెలిసి తీవ్ర నిరాశానిస్పృహలకు గురయ్యారని తెలిపారు. ఈ సంవత్సరంలోనే ఇలాంటి అవకతవకల వల్ల 85 లక్షల మంది అభ్యర్థుల భవితవ్యం దెబ్బతిన్నదని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు.

అన్యాయం జరుగుతుందన్న ఆవేదనలో భాగంగానే తేజస్వీ వ్యాఖ్యలు

ఓటరు జాబితాల సవరణ పేరుతో ఎన్నికల సంఘం అన్యాయం చేస్తోందన్న ఆవేదనతోనే బిహార్ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మాట్లాడి ఉంటారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ప్రస్తుత దశలో అలాంటి నిర్ణయం తొందరపాటే అవుతుందని తెలిపింది. ఎన్నికల బరిలో దిగటానికి తాము సిద్ధమేనని, అయితే, అన్ని ఐచ్ఛికాలను పరిశీలిస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ శనివారం దిల్లీలో తెలిపారు. విపక్షాలు ఎన్నికల బహిష్కరణ నిర్ణయానికి వచ్చాయంటే ఎన్నికల సంఘం విశ్వసనీయతకు అది పెను విఘాతమే అవుతుందని హెచ్చరించారు.

అగ్నికి ఆజ్యం పోయొద్దు: అమెరికా

- రష్యాకు ఆయుధ పరికరాల సరఫరాపై చైనాకు హెచ్చరిక

ఇంటర్నెట్‌డెస్క్: ఐక్యరాజ్య సమితి వేదికగా అమెరికా, చైనాల మధ్య మాటల యుద్ధం నడిచింది. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న దాడులకు ఉపయోగపడే వస్తువుల ఎగుమతులను నిలిపివేయాలంటూ బీజింగ్‌ను అమెరికా హెచ్చరించగా దీనికి బీజింగ్ గట్టిగా సమాధానం ఇచ్చింది. శుక్రవారం ఐరాస భద్రతామండలి సమావేశంలో అమెరికా తాత్కాలిక రాయబారి డోరతీ షియా మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌పై ప్రయోగించే డ్రోన్‌లు, క్షిపణులలో వినియోగించే భాగాలతో సహా రష్యా సైనిక సామర్థ్యాలకు దోహదపడే ఎగుమతుల్ని నిలిపివేయాలని చెబుతూ చైనా పేరును ప్రత్యేకంగా ప్రస్తావించారు. రష్యాలకు ఆయా సరఫరాల కారణంగా ఉక్రెయిన్‌పై దాడులు మరింత తీవ్రతరమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘర్షణను నిలువరించే ప్రయత్నాలను ఇది బలహీనపరుస్తుందన్నారు. శాంతి నెలకొల్పాలనే ఉద్దేశం చైనాకు నిజంగా ఉంటే మాస్కో దూకుడుకు ఆజ్యం పోయడం మానేయాలని హెచ్చరించారు. ఈ ఆరోపణలను చైనా తిప్పికొట్టింది. ఆ దేశ డిప్యూటీ రాయబారి గెంగ్ షువాంగ్ మాట్లాడుతూ.. 'ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని చైనా ప్రారంభించలేదు. సంఘర్షణలో భాగం కాలేదు. ప్రాణాంతక ఆయుధాలను ఎప్పుడూ అందించలేదు. డ్రోన్‌లతో సహా పలు వస్తువుల ఎగుమతులపై కఠిన వైఖరితోనే ఉన్నాం. కీవ్ సమస్యపై అమెరికా నిందలు వేయడం మాని.. శాంతిచర్చల్లో సరైన పాత్ర పోషించండి' అంటూ ఎదురుదాడికి దిగారు. పశ్చిమదేశాల ఆంక్షలకు గురికాని విధంగా చైనా రహస్యంగా రష్యాకు ఆయుధాలు తరలించిందంటూ ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ కథనం వెలువరించింది.

ప్రత్యామ్నాయ విద్యావిధానం కావాలి: ఆర్‌ఎస్‌ఎస్

కొచ్చిన్: భారతీయ విద్యా విధానం చిరకాల వలసవాద ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిందని, అభివృద్ధి చెందిన దేశంగా మనం భారతీయ తత్వశాస్త్ర ప్రాతిపదికగా ఒక ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని అభివృద్ధిపరచుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) అధినేత మోహన్ భాగవత్ పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ అయిన శిక్షా సంస్కృతి ఉత్థాన్ న్యాస్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ 'చింతన్ బైఠక్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏ పని చేసే వారు ఆ పనిలో నిష్ణాతులై ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, అందరితో సత్సంబంధాలు కలిగివుండి నేతృత్వం వహించాలని అన్నారు. ఆదివారం నాడు న్యాస్ నిర్వహించనున్న 'జ్ఞాన సభ'లో కూడా భాగవత్ ప్రసంగించనున్నారు.

రేపు సుప్రీంకోర్టులో జస్టిస్ వర్మ వాదనలు

దిల్లీ: అధికారిక నివాసంలో కాలిన నోట్ల కట్టలు లభ్యమైన కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ వాదనలను సుప్రీంకోర్టు ఈ నెల 28న ఆలకించనుంది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు అంతర్గత విచారణ సంఘం తనను దోషిగా చెప్పడాన్ని కొట్టివేయాలంటూ ఆయన పిటిషన్ దాఖలుచేసిన విషయం తెలిసిందే. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం దీనిపై వాదనలు వినే అవకాశం ఉంది. అభిశంసన ప్రక్రియ చేపట్టాలని రాష్ట్రపతికి, ప్రధానికి మాజీ సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా చేసిన సిఫార్సును కొట్టివేయాలని కూడా జస్టిస్ వర్మ కోరుతున్నారు. నిర్దోషిగా రుజువు చేసుకోవాల్సిన భారాన్ని ఈ కమిటీ తనపైనే నెట్టిందని, తానే పరిశోధించి అభియోగాలను తిరస్కరించాల్సి ఉందని ఆయన పిటిషన్లో తెలిపారు.

ఇరాన్‌లో కోర్టు భవనంపై దాడి.. ఆరుగురి మృతి

దుబాయ్: ఇరాన్ దక్షిణ ప్రాంతంలోని సిస్తాన్ ప్రావిన్సు రాజధాని జాహెదాన్‌లో శనివారం గుర్తు తెలియని దుండగులు కోర్టు భవనంపై దాడికి పాల్పడ్డారు. గ్రెనేడ్‌లతో దాడులుచేస్తూ కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. 20 మంది గాయపడ్డారు. అనంతరం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు దుండగులను భద్రతా సిబ్బంది కాల్చి చంపారు. తూర్పు సిస్తాన్, నైరుతి బలోచిస్తాన్ ప్రావిన్సులకు చెందిన జైష్ అల్-అదిల్ గ్రూపు ఈ దాడికి పాల్పడినట్లు స్థానిక వార్తాసంస్థ వెల్లడించింది.

ఈనాడు సినిమా


ప్రభాస్

సెట్స్‌పైకి స్పిరిట్ అప్పుడే!

ఏకకాలంలోనే వరుస సినిమాలతో సెట్స్‌పై తీరిక లేకుండా గడుపుతున్నారు అగ్రహీరో ప్రభాస్. ప్రస్తుతం ఆయన ప్రధాన పాత్ర పోషిస్తున్న 'రాజాసాబ్', 'ఫౌజీ' చిత్రాలు శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడాయన 'స్పిరిట్' సినిమాను పట్టాలెక్కించేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రమిది. త్రిప్తి దిమ్రీ కథానాయికగా నటిస్తోంది. భూషణ్ కుమార్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణను సెప్టెంబరు నుంచి ప్రారంభించనున్నట్లు అధికారికంగా తెలిపింది చిత్రబృందం. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ప్రభాస్ పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది.

ఆగస్టు 14న కానిస్టేబుల్ కనకం



అదొక మారుమూల గ్రామం. ప్రశాంతంగా ఉండే ఆ ఊరిలో వరుసగా అమ్మాయిలు అదృశ్యమవుతుంటారు. ఇప్పుడా కేసును పరిష్కరించడానికి రంగంలోకి దిగింది కానిస్టేబుల్ కనకమహాలక్ష్మీ. మరి ఆమె ఈ కేసును ఎలా ఛేదించిందో తెలుసుకోవాలంటే 'కానిస్టేబుల్ కనకం' వెబ్‌సిరీస్ చూడాల్సిందే. వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్ర పోషించింది. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు. రాజీవ్ కనకాల, మేఘలేఖ, అవసరాల శ్రీనివాస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సిరీస్ విడుదల తేదీని పంచుకుంటూ.. ఇన్‌స్టా వేదికగా ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ పోస్టర్‌ను పంచుకుంది. "కానిస్టేబుల్ కనకం ఆన్ డ్యూటీ. నిత్యం మనం చూసే పోలీసు కాదు.. ఇది సాధారణమైన కేసు కాదు.. ఆగస్టు 14న రాబోతుంద"నే వ్యాఖ్యను జోడించింది. ఇందులో కానిస్టేబుల్ కనకం పాత్రలో కనిపించనుంది వర్ష. కోవెలమూడి సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ సంయుక్తంగా నిర్మించారు.

వైవిధ్యమైన ప్రేమ కథ మేమిద్దరం



ప్రేమించడం అందరికి సాధ్యమే. కానీ దాన్ని చివరి వరకూ నిలబెట్టుకోవడమే కష్టం. ఇప్పుడీ ప్రయత్నంలోనే ఉన్నారు చంద్రసాహస్, మేఘమాల. వీరిద్దరూ ప్రేమికులు. చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకున్న చంద్రసాహస్.. తన తండ్రి జీకేను మళ్లీ పెళ్లి చేసుకోవాలని కోరతాడు. ఈ క్రమంలో జీకే కాలేజీ రోజుల్లో ప్రేమించిన రమణిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. కానీ ఆ నిర్ణయం చంద్రసాహస్ ప్రేమ కథని మలుపు తిప్పుతుంది. అది ఎందుకు? ఆ తర్వాత ఏమైందనేదే 'మేమిద్దరం' చిత్రం. ప్రతి ఆదివారం అద్భుతమైన కథలతో మెప్పిస్తున్న ఈటీవీ విన్ 'కథా-సుధ'లో భాగంగా వైవిధ్యమైన కథతో రాబోతున్న చిత్రమిది. ఈ నేపథ్యంలోనే నేడు ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమైందీ సినిమా. ఇంద్రజ, రవి వర్మ, ఐశ్వర్య, అజిత్ ప్రధాన పాత్రధారులుగా హేమంత్ కృష్ణ తెరకెక్కించారు. నవీనా యాటా నిర్మించారు.

వెంకన్నస్వామి నడిపిస్తే పోయి టాప్‌లో కూర్చుంటా!

– 'కింగ్డమ్' ట్రైలర్ విడుదల వేడుకలో విజయ్ దేవరకొండ


విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే, నాగవంశీ

తెలుగు ప్రేక్షకులకు ఓ కొత్త రకమైన యాక్షన్ గ్యాంగ్‌స్టర్ సినిమాని చూపించబోతున్నాం అన్నారు సూర్యదేవర నాగవంశీ. 'అర్జున్ రెడ్డి' సినిమాలో విజయ్ దేవరకొండ ఎంత గాఢమైన నటన ప్రదర్శించారో, అది మళ్లీ 'కింగ్డమ్'లో చూస్తారని చెప్పారు. ఆయన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సాయి సౌజన్యతో కలిసి నిర్మించిన చిత్రమే 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే నాయకానాయికలు. సత్యదేవ్ ముఖ్యభూమిక పోషించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఈ చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శనివారం రాత్రి తిరుపతిలో ట్రైలర్ విడుదల వేడుకని నిర్వహించారు. కథానాయిక భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ "ఇదొక క్లాసిక్ మాస్ సినిమా. చూసిన ప్రతి ఒక్కరూ ప్రేమలో పడతారు. దర్శకుడు ఎంతో స్పష్టతతో, ఎంతో ప్రశాంతంగా ఈ సినిమాని తీశారు. విజయ్ దేవరకొండ సినిమా కోసం పడే తపన ఎంతో స్ఫూర్తినిస్తుంది" అని చెప్పారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "విజయ్ విషయంలో గత కొన్నేళ్లుగా ప్రేక్షకులు ఏమేం మిస్ అయ్యారో అవన్నీ ఈ సినిమాలో చూడబోతున్నాం. ఈ సినిమా విషయంలో ఎలాంటి తప్పు జరగకూడదని గౌతమ్, నేను చాలా జాగ్రత్తలు తీసుకుని పనిచేశాం. చిత్ర పరిశ్రమలో పరిస్థితులు ఏమాత్రం అనుకూలంగా లేవు. ప్రేక్షకులు ఎక్కువగా థియేటర్‌కి వచ్చి సినిమా చూస్తేనే మేం మరిన్ని నాణ్యమైన సినిమాలు తీయడానికి సాధ్యమవుతుంది" అన్నారు. కథానాయకుడు విజయ్ దేవరకొండ రాయలసీమ యాసలో ప్రసంగించడం ఈ వేడుకకి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆయన మాట్లాడుతూ "గత ఏడాది నుంచి 'కింగ్డమ్' సినిమా విడుదల గురించి ఆలోచిస్తున్నప్పుడు నా మనసులో ఒక్కటే అనిపించింది. మన తిరుపతి ఏడుకొండల వెంకన్నస్వామి కానీ ఈ ఒక్కసారి నా పక్కనుండి నన్ను నడిపించారో, చాలా పెద్దోడిని అవుతాను. పోయి టాప్‌లో కూర్చుంటా. ఎప్పట్లాగే ప్రాణం పెట్టి గట్టిగా పనిచేశా. ఈసారి నా సినిమాని చూసుకోవడానికి చాలా మంది ఉన్నారు. తన సంగీతంతో అనిరుధ్ పగలగొట్టాడు. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ, ఎడిటర్ నవీన్ నూలి, కథానాయిక భాగ్యశ్రీ అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు, పనిచేస్తూనే ఉన్నారు. ఇక మిగిలింది రెండే. ఆ వెంకన్నస్వామి దయ, ప్రేక్షకుల ఆశీసులు. ఈ రెండూ నాతో ఉంటే ఎవ్వరూ మనల్ని ఆపేదేలే" అన్నారు.

దిల్దారు వయ్యారివే..


రితికా, తేజ

'హనుమాన్' సంచలన విజయంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్నారు తేజ సజ్జా. ఇప్పుడు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో 'మిరాయ్' చిత్రంలో సూపర్ యోధ పాత్రతో అలరించనున్నారు. రితికా నాయక్ కథానాయిక. మంచు మనోజ్ ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 5న ఈ సినిమా 2డీ, 3డీ ఫార్మాట్లలో 8 భాషల్లో విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమా గ్లింప్స్, టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం తాజాగా ఫస్ట్ సింగిల్‌గా 'వైబ్ ఉంది బేబీ' అనే పాటను విడుదల చేసింది. ఈ సాంగ్ "ఓ పోరి దిల్దారు వయ్యారివే..నీ సూపు తల్వారుతో కొయ్యకే..గాడ్ ఏమో నీకూ నాకు రాసుంటాడే..మనజోడి ఒకటైతే మ్యాడ్ ఉంటదే..వైబ్ ఉంది బేబీ వైబ్ ఉందిలే..ఈ గ్లోబుని ఊపే వైబ్ ఉందిలే.. వైబ్ ఉంది బేబీ వైబ్ ఉందిలే ఈ గ్లోబునాపే వైబ్ ఉందిలే.." అంటూ సాగుతున్న ఈ పాట యూత్‌లో మంచి వైబ్‌ని క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి గౌర హరి స్వరాలు సమకూరుస్తున్నారు. ఈ పాటకి కృష్ణకాంత్ సాహిత్యమందించగా అర్మాన్ మాలిక్ ఆలపించారు. ఈ సినిమాలో శ్రియ, జయరామ్, జగపతి బాబు తదితరులు నటిస్తున్నారు.


హర్షిత, నిహాల్, సందీప్‌కిషన్, విశ్వనాథ రెడ్డి, సూర్య శ్రీనివాస్

'చైనా పీస్' అని ఎందుకు పెట్టామంటే!

ఒక బృందం వంద శాతం నమ్మకం, నిజాయతీతో శ్రమించి చేసిన సినిమానే ఇదని... ఒక కొత్త సినిమా మన ముందుకొచ్చినప్పుడు చూసి ప్రోత్సహించడం ఓ అందమైన అనుభవం అన్నారు హీరో సందీప్‌కిషన్. ఆయన ముఖ్య అతిథిగా శనివారం హైదరాబాద్‌లో 'చైనా పీస్' టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ కథానాయకులుగా.. . అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. మూన్‌లైట్ డ్రీమ్స్ సంస్థ నిర్మిస్తోంది. "దేశభక్తి ప్రధానంగా సాగే చిత్రమిది. కానీ దీనికి 'చైనా పీస్' అని పేరు పెట్టడం వెనక కారణమేమిటన్నది తెరపైనే చూడాలి. అన్ని విభాగాలపైనా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని ఈ సినిమాని తెరకెక్కించాం" అన్నారు దర్శకుడు. ఈ కార్యక్రమంలో సూర్య శ్రీనివాస్, కమల్ కామరాజు, హర్షిత, దీక్షాపంత్ తదితరులు పాల్గొన్నారు.

"నేను ఇదే చేయాలి... ఇంతే చేయాలని ఎప్పుడూ గిరిగీసుకోలేదు. పని చేయడానికి నా ముందున్న అవకాశాల్ని వెతుకుతాను తప్ప పరిమితులపై ఎప్పుడూ దృష్టిపెట్టలేదు" అంటోంది కథానాయిక శ్రుతిహాసన్. కమల్‌హాసన్ కూతురుగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆమె 15 ఏళ్లుగా విజయవంతంగా కెరీర్‌ని కొనసాగిస్తోంది. దక్షిణాదితో పాటు హిందీలోనూ నటించిన ఆమె ఇటీవల రజనీకాంత్ చిత్రం 'కూలీ'లో నటించింది. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో, సన్ పిక్చర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శ్రుతిహాసన్ విలేకర్లతో ముచ్చటించారు.



కూలీ.. నాకు ఓ అరుదైన అవకాశం!

'కూలీ' ప్రయాణం గురించి ఏం చెబుతారు?

నా కెరీర్ మొదలై చాలా ఏళ్లయ్యింది. ఎంతో మందితో కలిసి నటించా. వృత్తి పరంగా ఎన్నెన్నో అనుభవాలు ఉన్నాయి. కానీ 'కూలీ' అనుభవం మాత్రం ప్రత్యేకమైనది. ఒక అరుదైన అవకాశం ఇది. ఇంత మంది స్టార్స్ ఉన్న ఈ సినిమాలో నేనొక భాగం కావడం ఎంతో తృప్తినిచ్చింది.

ఇలాంటి ఓ అరుదైన అవకాశం మీ సొంతమైన క్షణాల గురించి చెబుతారా?

నేనూ, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కలిసి ఇనిమేల్ అనే ఓ ఇండిపెండెంట్ వీడియో సాంగ్ చేశాం. ఆ పాటకి సంబంధించిన పనులు జరుగుతున్నప్పుడే ఆశ్చర్యకరంగా ఈ పాత్ర గురించి చెప్పారు. లోకేశ్ కనగరాజ్ సినిమా అంటే గన్స్, యాక్షన్, చీకటి కోణాల్నే ఊహిస్తాం. కానీ ఆయన నాకు ఓ బలమైన మహిళ పాత్ర గురించి చెప్పారు. అది నచ్చే ఈ సినిమా చేశా.

పోస్టర్ చూస్తుంటే సినిమాలో మీరూ యాక్షన్ చేసినట్టు అనిపిస్తోంది...

దర్శకుడి సిగ్నేచర్ స్టైల్‌లోనే డిజైన్ చేసి వదిలిన పోస్టర్ అది. అందుకే అలా అనిపిస్తుందేమో! కానీ ఇందులో నాకు యాక్షన్ సన్నివేశాలేమీ లేవు. బాధ్యత కలిగిన ఓ అమ్మాయిగా కనిపిస్తా. పాత్ర పేరు ప్రీతి. ప్రతి అమ్మాయికీ, మహిళకీ కనెక్ట్ అయ్యే పాత్ర. ఇందులో నటించడానికి కారణమదే.

మన నిజమైన ప్రపంచం ఇదే

"సామాజిక మాధ్యమాలకి ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో కొన్నాళ్లు దూరం కావాలి. అది చాలా మేలు చేస్తుంది. మన వాస్తవ ప్రపంచం ఏమిటో అర్థమవుతుంది. అభిమానులతో కనెక్ట్ అవ్వడానికి ఓ గొప్ప మాధ్యమం సోషల్ మీడియా. అయితే ఆ ప్రపంచంలోకి వెళ్లాక తెలియకుండానే గంటలపాటు అందులో గడిపేస్తుంటాం. నా సమయం ఏమవుతుందో, ఎక్కడికిపోయిందో కూడా అర్థం అయ్యేది కాదు కొన్నిసార్లు. అందుకే ఇన్‌స్టాకి కొన్నాళ్లు దూరంగా గడిపా. డిజిటల్ డిటాక్స్ అనేది ప్రతి ఒక్కరికీ అవసరం. సామాజిక మాధ్యమాల్లో మనం చూసే ప్రపంచమే, నిజమైన ప్రపంచం కాదు. మన వ్యక్తిగత జీవితంలో ఏం చేస్తున్నామన్నదే మన ప్రపంచం. అది అందరం అర్థం చేసుకోవాలి. నేను నా కుటుంబం, స్నేహితులకు కచ్చితంగా సమయాన్ని కేటాయిస్తాను".

ప్రీతి పాత్రలో నటిస్తున్నప్పుడు ఎదురైన సవాళ్లు ఎలాంటివి?

భావోద్వేగాలతో ముడిపడిన పాత్ర. చిత్రీకరణకి ముందే దర్శకుడు నా పాత్ర గురించి ఎంతో స్పష్టతనిచ్చారు. దాంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా నటించాను. అలాగని ఇదేమీ సులభమైన పాత్ర కాదు. సత్యరాజ్‌కి కూతురుగా కనిపిస్తా. ఇందులో నేను ఎవ్వరికీ జోడీగా కనిపించను.

సుదీర్ఘ కాలంగా కెరీర్‌ని కొనసాగిస్తున్న నవతరం కథానాయికల్లో మీరొకరు. ఈ ప్రయాణం గురించి మీ ఆలోచనల్ని పంచుకుంటారా?

నేను తొలి సినిమా చేస్తున్నప్పుడు రెండో, మూడో సినిమా చేసే అవకాశం వస్తుందని కూడా నాకు ఉండేది కాదు. కానీ ఇన్నేళ్లుగా సినిమాలు చేస్తున్నానంటే అదొక దీవెన అనుకుంటాను. తొలి సినిమా విడుదలైన తర్వాత నేను ఇంకా బాగా నటించాలని అర్థమైంది. ఇప్పటికీ, ప్రతి సినిమా విడుదల తర్వాత కూడా నాలో అదే అభిప్రాయమే. ఇన్ని సినిమాలు, ఇన్నేళ్లు అని లెక్కలేసుకోకుండా... చేయాల్సిన పనిపై దృష్టిపెడుతుంటా.

ఇప్పటివరకూ చేయాలనుకుని చేయలేకపోయిన పాత్రలేమైనా ఉన్నాయా?


నాకు సంగీతం అంటే ఇష్టం. స్వతహాగా నేనొక గాయనిని, వాయిద్యకారిణిని. అలా ఓ మ్యూజిషియన్ పాత్రలో చేయాలనే కోరిక ఉంది. అవకాశం వస్తే తప్పకుండా చేస్తా.

కొత్త సినిమాల సంగతులేమిటి?

గతేడాది మొత్తం 'కూలీ'తోనే బిజీగా ఉన్నా. కొత్తగా ఇప్పుడే కథలు వింటున్నా. కొత్త దర్శకులు, రచయితలతో పనిచేయాలనే ఆసక్తి ఉంది. తెలుగులోనూ కొన్ని కథలు విన్నా. త్వరలోనే ఆ వివరాలు బయటికొస్తాయి.

రజనీకాంత్, ఆమిర్‌ఖాన్, నాగార్జున, ఉపేంద్ర... ఇలా చాలా మంది స్టార్స్ నటించారు కదా. సెట్‌లో వాతావరణం ఎలా ఉండేది?

సెట్ ఎప్పుడూ రెట్టింపు సందడితో ఉండేది. మా నాన్న, రజనీకాంత్ మంచి స్నేహితులు. వాళ్లిద్దరి అనుబంధం గురించి, రజనీ తన వర్కింగ్ స్టైల్ గురించీ... ఇంకా చాలా విషయాలు పంచుకునేవారు. ఇక ఆమిర్‌ఖాన్‌ని నేను అంకుల్ అని పిలుస్తుంటా. నా జీవితంలో ఓ ముఖ్యమైన దశలో ఆయన కుటుంబం తోడుగా ఉంది. నాగార్జున పాత్ర ప్రేక్షకులు ఆశ్చర్యపోయేలా ఉంటుంది.



అన్వేశ్, ప్రియాంక, మురళీమోహన్, జితేంద్ర

అదే కలయికతోనే 'అతడు 2' చేస్తాం

– మురళీమోహన్

"మేం తీసిన అన్ని సినిమాలు ఒకెత్తు... 'అతడు' మరో ఎత్తు. అప్పట్లోనే అధునాతన సాంకేతికతతో ఆ సినిమాని తీశాం. కానీ అప్పట్లో థియేట్రికల్‌గా మేం అనుకున్న స్థాయిలో ఆడలేదు. బుల్లితెరపై మాత్రం రికార్డులు సృష్టించింది. రీ రిలీజ్‌లో భాగంగా మరోసారి విడుదలవుతున్న ఈ సినిమా ఈసారి మాత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంటుందని నమ్ముతున్నాం" అన్నారు ప్రముఖ నటుడు మురళీమోహన్. ఆయన జయభేరి ఆర్ట్స్ పతాకంపై నిర్మించిన చిత్రమే 'అతడు'. మహేశ్‌బాబు కథానాయకుడిగా నటించగా, త్రివిక్రమ్ దర్శకత్వం వహించారు. అధునాతన 4కే హంగులతో సరికొత్తగా ముస్తాబైన ఈ చిత్రం మహేశ్ పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తోంది. జితేంద్ర గుండపనేని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. మురళీమోహన్ మాట్లాడుతూ "గత కొన్నేళ్లుగా ఈ సినిమాని మళ్లీ విడుదల చేస్తామని చాలా మంది నన్ను సంప్రదిస్తున్నారు. జితేంద్ర వచ్చి అడిగిన తర్వాత కాదనలేకపోయా. నా సోదరుడు కిశోర్ కుమార్తె ప్రియాంక ఈ సినిమాని సాంకేతికంగా అప్‌గ్రేడ్ చేసింది. ప్రియాంక ఆధ్వర్యంలో ఇకపై జయభేరి ఆర్ట్స్ నుంచి సినిమాలు వస్తూనే ఉంటాయి. మహేశ్‌బాబు, త్రివిక్రమ్ అప్పట్లో ఎంతో కష్టపడి ఈ సినిమాని తీశారు. ఒక ఇంగ్లిష్ సినిమా స్థాయిలో ఈ చిత్రం ఉందని సెన్సార్ వాళ్లు అప్పట్లోనే మెచ్చుకున్నారు. మా సంస్థ గౌరవాన్ని పెంచిన చిత్రమిది" అన్నారు. ఇందులో నాజర్ పోషించిన పాత్ర కోసం శోభన్‌బాబుని సంప్రదించామని, ఆ పాత్ర కోసం ఆయనకి బ్లాంక్ చెక్‌ని పంపగా... 'తాను అందరికీ హీరోగానే గుర్తుండాలి తప్ప, ఇతర పాత్రల్లో కాదు' అంటూ మా ఆఫర్‌ని తిరస్కరించారని చెప్పారు మురళీమోహన్. కొనసాగింపు చేయడానికి ఆస్కారం ఉన్న కథ ఇదని, నేటి తరం కూడా ఈ సినిమాని చూసి రెండో భాగం తీయాలని అడిగితే ఇదే కలయికలోనే 'అతడు 2' చేస్తామని ఆయన తెలిపారు. "అప్పట్లో 'అతడు' సినిమాని ఫిల్మ్ కెమెరాతో తీశారు. మేం ఇప్పుడున్న సాంకేతికతని వాడుకుంటూ 8కే, సూపర్ 4కేలోకి మార్చాం. మళ్లీ ఈ సినిమా పాత రోజుల్ని గుర్తు చేస్తుంది" అన్నారు జయభేరి ఆర్ట్స్ ప్రతినిధి ప్రియాంక దుగ్గిరాల. సినిమాల రీరిలీజ్‌తో వచ్చిన డబ్బునంతా మహేశ్‌బాబు ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకి ఉపయోగిస్తామని చెప్పారు మహేశ్‌బాబు ఫౌండేషన్ ప్రతినిధి అన్వేశ్. ఇప్పటివరకూ రీరిలీజ్ అయిన సినిమాలకంటే ఈ సినిమా ఎక్కువ వసూళ్లు సాధిస్తుందన్నారు జితేంద్ర గుండపనేని.

'థామా'లో వరుణ్ ధావన్


వరుణ్ ధావన్

మడాక్ ఫిల్మ్స్ హారర్ కామెడీ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'థామా' చిత్రం రూపొందుతోంది. ఇందులో ఆయుష్మాన్ ఖురానా, రష్మిక జంటగా నటిస్తున్నారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేశ్ రావల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. 'ముంజ్యా'లాంటి చిత్రానికి దర్శకత్వం వహించిన ఆదిత్య సర్పోత్దార్ ఈ సినిమాకి దర్శకుడు. అయితే ఈ సినిమాలో వరుణ్ ధావన్ అతిథి పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. తాజాగా దీని కోసం చిత్ర బృందం వరుణ్‌తో ఆరు రోజులు చిత్రీకరణ చేసినట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. 'స్త్రీ 2' సినిమా కంటే 'థామా'లో వరుణ్ పాత్రకు ఎక్కువ స్క్రీన్ టైమ్ ఉంటుందని..ఈ సినిమాపై తన నటన ప్రభావం ఎక్కువగా ఉండేలా నిర్మాతలు నిర్ధారించుకున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం.

'ఖోస్లా కా ఘోస్లా' సీక్వెల్ సన్నాహాలు


అనుపమ్ ఖేర్

ఎంతో కష్టపడి సంపాదించుకున్న స్థలంలో ఇల్లు కట్టుకోవాలని కలలు కనే ఓ మధ్యతరగతి వ్యక్తి కథతో రూపొందిన చిత్రమే 'ఖోస్లా కా గోస్లా'. అనుపమ్ ఖేర్, బొమన్ ఇరానీ తదితరులు నటించిన ఈ సినిమా 2006లో విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. జాతీయ పురస్కారాన్ని అందుకున్న ఈ చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నాయిక హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్ర పోషించనుందని సమాచారం. "ఖోస్లా కా ఘోస్లా 2' స్క్రిప్ట్ పనుల్ని ఇప్పటికే మొదలు పెట్టింది చిత్రబృందం. మొదటి భాగంలానే వినోదాత్మకంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. టీ సిరీస్ నిర్మించనున్న ఈ సినిమాలో నటించడానికి ఉత్సాహంగా ఉంది హ్యూమా. వచ్చే ఏడాది నవంబరులో విడుదల చేయాలని నిర్ణయించుకున్నార'ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

యుద్ధమే రానీ సిద్ధమై ఉన్నా..


నరేశ్, కృష్ణ, మనీషా

'కళ్ల ముందు నువ్వుండగా రెప్ప కూడా పడదుగా.. . నువ్వు తప్ప ఇంకెవ్వరూ కనపడరే..' అంటూ తన మనసులోని అంతరంగాన్ని ప్రేయసి ముందు ఆవిష్కరించాడు ఓ కుర్రాడు. మరి ఈ జంట ప్రేమ ప్రయాణం ఎలా సాగిందో తెలియాలంటే 'బ్రాట్' చూడాల్సిందే. డార్లింగ్ కృష్ణ, మనీషా ప్రధాన పాత్రల్లో శశాంక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. మంజునాథ్ కంద్కూర్ నిర్మాత. ఐదు భాషల్లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'యుద్ధమే రానీ సిద్ధమై ఉన్నా...' అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ప్రముఖ నటుడు వీకే నరేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్జున్ జన్య స్వరకల్పనలోని ఈ గీతాన్ని సనారె రచించగా, సిద్ శ్రీరామ్ ఆలపించారు.

ఈనాడు బిజినెస్ వారాంతం

రెయిన్‌బో హాస్పిటల్ లాభం రూ.54 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ (రెయిన్‌బో హాస్పిటల్) ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.352.93 కోట్ల త్రైమాసిక ఆదాయంపై రూ.53.81 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.330.22 కోట్లు, నికరలాభం రూ.39.73 కోట్లుగా ఉన్నాయి. కొత్తగా ప్రారంభించిన ఆసుపత్రుల నుంచి ఆదాయాలు పెరుగుతున్నట్లు రెయిన్‌బో హాస్పిటల్ సీఎండీ రమేష్ కంచర్ల వివరించారు. ఇతర ఆసుపత్రులను కొనుగోలు చేయడం ద్వారా త్వరగా ఎదుగుతామన్నారు. వరంగల్ ప్రశాంతి హాస్పిటల్‌లో ఇటీవల మెజార్టీ వాటా కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. రాజమండ్రిలో 100 పడకల ప్రాంతీయ హాస్పిటల్ సిద్ధమవుతోందని, బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీ, హెన్నూర్‌లలో రెండు ఆసుపత్రులు త్వరలో ప్రారంభమవుతాయని అన్నారు. కోయంబత్తూరులో 130 పడకల ఆసుపత్రి నిర్మాణం నిర్ణీత ప్రణాళిక ప్రకారం సాగుతోందన్నారు.

కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభం రూ.4,472 కోట్లు



ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో కోటక్ మహీంద్రా బ్యాంక్ ఏకీకృత నికర లాభం రూ.4,472 కోట్లకు పరిమితమైంది. స్థూల ఆర్థిక పరిస్థితులు అధ్వానంగా ఉండడంతో, రిటెయిల్ వాణిజ్య వాహనాల పోర్ట్‌ఫోలియోపై ఒత్తిడి కనిపించడం ఇందుకు నేపథ్యం. 2024-25 ఇదే త్రైమాసికంలో బ్యాంక్ లాభం రూ.7,448 కోట్లు కావడం గమనార్హం. సాధారణ బీమా వ్యాపారంలో వాటా విక్రయం వల్ల వచ్చిన రూ.3,000 కోట్లు ఇందులో కలిసి ఉన్నాయి. 2024-25 మార్చి త్రైమాసికంలో లాభం రూ.4,993 కోట్లుగా ఉంది. స్టాండలోన్ పద్ధతిన చూస్తే ఏడాది క్రితంతో పోలిస్తే నికర లాభం 7% తగ్గి రూ.3,282 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ ఆదాయం 6% పెరిగి రూ.7,259 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 0.37% తగ్గి 4.65 శాతానికి పరిమితమైంది. మొత్తం కేటాయింపులు రెట్టింపై రూ.1,200 కోట్లకు చేరాయి. ప్రస్తుతానికి సూక్ష్మ రుణ సంస్థ(ఎమ్‌ఎఫ్‌ఐ)లకు రుణాల పంపిణీ విషయంలో అప్రమత్తతతో ఉన్నామని, ద్వితీయార్ధంలో వేగం పెంచుతామని బ్యాంకు ఎండీ, సీఈఓ అశోక్ వాస్వానీ పేర్కొన్నారు.

880 టన్నులకు ఆర్‌బీఐ పసిడి నిల్వలు



ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద పసిడి నిల్వలు 879.98 టన్నులకు చేరాయి. జూన్ 27తో ముగిసిన వారంలో 400 కిలోగ్రాముల బంగారాన్ని ఆర్‌బీఐ కొనుగోలు చేసినట్లు నెలవారీ బులెటిన్ వెల్లడించింది. ఆర్‌బీఐ వద్ద ఉన్న పసిడి నిల్వల విలువ 84.5 బిలియన్ డాలర్లు (రూ.7.26 లక్షల కోట్లు)గా ఉంది. మన విదేశీ మారకపు నిల్వల్లో వీటి వాటా 12 శాతమని పేర్కొంది. 'కొన్ని కరెన్సీలతో పోలిస్తే, అమెరికా డాలర్ బలహీన పడినందున జూన్ ప్రథమార్ధంలో పసిడి ధరలు పరుగులు తీశాయి. భౌగోళిక ఉద్రిక్తతలు సద్దుమణగడంతో ద్వితీయార్ధంలో ధరలు కాస్త తగ్గాయి. ముడిచమురు, లోహ ధరల్లో పరిమిత కదలికల నేపథ్యంలో బ్లూమ్‌బర్గ్ కమొడిటీ ధరలు సూచీ పెరిగింది' అని ఆర్‌బీఐ వివరించింది. అంతర్జాతీయ ముడిచమురు ధర 10% పెరిగితే, మనదేశంలో ద్రవ్యోల్బణం 0.20% వరకు అధికమయ్యే అవకాశం ఉందని ఆర్‌బీఐ ఆర్థికవేత్తలు రూపొందించిన పత్రం పేర్కొంది.

దుబాయా.. అమెరికానా ఎక్కడ స్థిరపడదాం?



- భారతీయ ధనికుల వలస బాట
- సౌకర్యాలు, సంపద కోసమే
- ఈ ఏడాదిలో 3,500 మంది వెళ్తారని అంచనా
- ప్రత్యేక సదుపాయాలతో ఆకర్షిస్తున్న దేశాలెన్నో

మనదేశం నుంచి 1960, 70 దశకాల్లోనే ఇంజినీర్లు, డాక్టర్లు మంచి అవకాశాల కోసం అమెరికా, యూకే, కెనడా తదితర దేశాలకు వలస వెళ్లారు. 1980, 90 నుంచీ నిర్మాణ రంగంలో, ఇళ్లల్లో పనిచేయడానికి ఎంతో మంది కార్మికులు గల్ఫ్ దేశాల బాట పట్టారు. ఇలా 'ఆయా వృత్తుల్లో నైపుణ్యాలున్న వారు (మేధో వలస)', పనిచేసే కార్మికులు 'కార్మిక శక్తి వలస' తరలి వెళ్లడం మామూలయ్యింది. ఇటీవల మనదేశం నుంచి ధనికుల వలసలూ పెరుగుతున్నాయి. మంచి జీవన విధానం, సంపద, సౌకర్యాలను ఆశించి ఎంతో మంది సంపన్నులు దుబాయ్, అమెరికా, న్యూజిలాండ్, పోర్చుగల్, యూకే.. తదితర దేశాలకు వెళ్లి, పౌరసత్వం తీసుకుని స్థిరపడుతున్నారు. మరికొందరు తమ సంపదను కాపాడుకోవడానికి, ఇంకా పెంచుకోవడానికి విదేశాల వైపు చూస్తున్నారు. కుబేరులను ఆకర్షించేందుకు కొన్ని దేశాలు ప్రత్యేక పథకాలనూ అమలు చేస్తున్నాయి.

మారుతున్న ఆదాయ వర్గీయులు

ప్రస్తుతం పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అధిక వృద్ధి రేటు సాధిస్తోంది మనదేశమే. సగటున 6 శాతానికి పైగా వార్షిక వృద్ధి నమోదవుతూ.. మన జీడీపీ 4 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరింది. 10 ట్రిలియన్ డాలర్లకు చేరడానికి మరీ అధిక సమయం పట్టదనే అభిప్రాయమూ ఉంది. మనదేశంలో పేదరికం తగ్గుతూ, మధ్యతరగతి జనాభా పెరుగుతోంది. ధనికుల సంఖ్య పెరిగిపోతోంది. 2014 నుంచి 2024 మధ్య మనదేశంలో సంపన్నుల సంఖ్య 72% పెరిగింది. ఇంత వరకూ బాగానే ఉంది. కానీ 'ద హెన్లీ ప్రైవేట్ వెల్త్ మైగ్రేషన్ రిపోర్టు- 2025' ప్రకారం.. ఒకదేశం నుంచి ఏటా ధనికులు అత్యధికంగా వలస పోతోందీ భారతే కావడం ఆశ్చర్యకరంగా ఉంది. ఈ ఏడాదిలో 3,500 మంది భారతీయ సంపన్నులు ఇతర దేశాలకు వెళ్లి స్థిరపడతారని అంచనా. వీరి సంపద విలువ 26 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.24 లక్షల కోట్ల)కు పైగానే ఉంది. 2024లో 4,300 మంది, 2023లో 5,100 మంది సంపన్నులు మనదేశం నుంచి వలస వెళ్లారు.

దుబాయ్ నచ్చేస్తోంది.. ఎందుకంటే

మనదేశ సంపన్నులను ఆకర్షించడంలో యూఏఈ అగ్రస్థానంలో ఉంది. యూఏఈలో పెద్దది, కాస్మోపాలిటన్ సంస్కృతి కలిగిన నగరమైన దుబాయ్‌ను ఎంతో మంది సంపన్నులు తమ నివాస కేంద్రంగా ఎంచుకుంటున్నారు. అక్కడి ప్రభుత్వం చేపట్టిన 'గోల్డెన్ వీసా' కార్యక్రమం, సున్నా పన్ను విధానం ధనవంతులను ఆకర్షిస్తోంది. యూఏఈలో ఆదాయపు పన్ను, వారసత్వ పన్ను, మూలధన లాభాలపై పన్ను లేవు. ప్రపంచ స్థాయి సదుపాయాలు దుబాయ్‌లో ఉన్నాయి. అందువల్లే రష్యా, యూకే, కొన్ని ఆఫ్రికా, ఆగ్నేయ ఆసియా దేశాల నుంచీ సంపన్నులు దుబాయ్‌లో స్థిరపడుతున్నారు. ఈ ఏడాదిలో యూఏఈ 9,800 మంది ధనికులను ఆకర్షిస్తుందని అంచనా. అమెరికా కంటే ఇది అధికం.

అమెరికా ఈబీ-5 వీసా

అమెరికా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈబీ-5 వీసాకు ఆదరణ బాగుంది. 8 లక్షల డాలర్లు పెట్టుబడి పెట్టి, 10 మందికి ఉద్యోగాలిస్తే శాశ్వతంగా అక్కడ ఉండే వీలుంది. ఇప్పటికే ఎంతో మంది మనవారు ఈ వీసా తీసుకుని, అమెరికాలో స్థిరపడ్డారు. దీంతోపాటు అధ్యక్షుడు ట్రంప్ 5 మిలియన్ డాలర్ల (సుమారు రూ.43 కోట్ల) పెట్టుబడి పెట్టేవారికి అమెరికాలో శాశ్వత నివాసం ఇచ్చేలా 'గోల్డెన్ కార్డు' తీసుకువచ్చారు. దీనికి ఇప్పటికే 70,000 మంది ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. గ్రీన్ కార్డుకు ప్రత్యామ్నాయంగా దీన్ని భావిస్తున్నారు.

పోర్చుగల్ గోల్డెన్ వీసా

ఐరోపా ఖండంలోని చిన్న దేశాల్లో ఒకటైన పోర్చుగల్ కూడా ప్రపంచ దేశాల సంపన్నులను ఆకర్షిస్తోంది. మన దేశం నుంచీ ఆ దేశానికి వెళ్లి, స్థిరపడే వారి సంఖ్య బాగా పెరిగింది. విదేశీయులు తమ దేశంలో పనిచేయడానికి, స్థిరపడటానికి, పౌరసత్వాన్ని పొందడానికి పోర్చుగల్ ప్రభుత్వం వీలుకల్పిస్తోంది. 5 లక్షల యూరోల (సుమారు రూ.5 కోట్ల) పెట్టుబడి పెట్టి, కొన్ని ఉద్యోగాలు కల్పిస్తే అక్కడ గోల్డెన్ వీసా ద్వారా శాశ్వత నివాసయోగ్యం కలుగుతోంది. ఒక ఏడాదిలో 7 రోజులు పోర్చుగల్‌లో నివసిస్తే, ఆ దేశ పౌరసత్వం ఎక్కడికీ పోదు.

న్యూజిలాండ్ కూడా

'గోల్డెన్ వీసా' నిబంధనలను ఈ ఏడాది ప్రారంభంలో న్యూజిలాండ్ ప్రభుత్వం సవరించింది. 'గ్రోత్' కేటగిరీ వీసా కావాలంటే 50 లక్షల న్యూజిలాండ్ డాలర్ల (రూ.25 కోట్ల) పెట్టుబడి అక్కడ వ్యాపారంలో పెట్టాలి. బ్యాలెన్స్‌డ్ కేటగిరీ వీసా కోసం కోటి న్యూజిలాండ్ డాలర్లను షేర్లు, బాండ్లు, మేనేజ్డ్ ఫండ్స్, స్థిరాస్తిలో పెట్టుబడి పెడితే సరిపోతుంది. న్యూజిలాండ్‌లో స్థిరపడటానికి దరఖాస్తు చేసుకునే వారిలో నాలుగో వంతు మంది మన దేశీయులేనట.

కారణాలెన్నో...

మనదేశం నుంచి సంపన్నులు ఇతర దేశాల్లో స్థిరపడాలనుకోవడానికి ఎన్నో కారణాలున్నాయి.

- **పన్ను భారం** ఇందులో ముఖ్యమైనది. పన్ను అధికారుల తనిఖీలు, పెనాల్టీలు అనుభవిస్తున్న/చూస్తున్నవారు ఎందుకీ ఇబ్బందులు పడటం, అనే ఆలోచనకు వస్తున్నారు.
- **పారదర్శకత** అధికమైంది. ఎవరికీ తెలియకుండా సంపదను దాచుకునే అవకాశాలు తగ్గిపోతున్నాయి. లెక్కల్లో చూపాల్సిన మొత్తం పెరిగి, పన్ను భారం అధికమవుతోంది.
- **క్రిప్టో కరెన్సీ** రూపంలో సంపదను దాచుకోవచ్చు, చెల్లింపులు చేయొచ్చు. కానీ మనదేశంలో క్రిప్టో లావాదేవీలను నిరుత్సాహపరిచే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోంది. క్రిప్టో ట్రేడింగ్ లాభాలపై ఎంతో అధికంగా పన్ను చెల్లించాల్సి వస్తోంది.
- **మంచి సదుపాయాలు..** ఉన్నత విద్య, ఆరోగ్యం, జీవన విధానం కోసం తరలి వెళ్తున్న వారు మరికొందరు.

- ఈనాడు, హైదరాబాద్

పబ్లిక్ ఇష్యూకు నెఫ్రోప్లస్

- రూ.353.4 కోట్ల విలువైన తాజా షేర్లు
- ఓఎఫ్‌ఎస్‌లో 1.27 కోట్ల షేర్ల విక్రయం

ఈనాడు, హైదరాబాద్: డయాలసిస్ సేవలు అందించే నెఫ్రోప్లస్ హెల్త్ సర్వీసెస్ (నెఫ్రోప్లస్) త్వరలో పబ్లిక్ ఇష్యూకు రానుంది. దీని కోసం సెబీ వద్ద పత్రాలు దాఖలు చేసింది. రూ.353.4 కోట్ల విలువైన తాజా షేర్లతో పాటు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) కింద ప్రమోటర్ల గ్రూపునకు చెందిన కొన్ని సంస్థలు 1,27,92,056 ఈక్విటీ షేర్లు విక్రయిస్తాయి. ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్లో రూ.129.1 కోట్లతో మనదేశంలో కొత్తగా డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మరో రూ.136 కోట్లతో అప్పులు తీరుస్తారు.

హైదరాబాద్ నుంచి విదేశాలకూ..: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న నెఫ్రోప్లస్, తన సేవలను దేశంలోని ఇతర ప్రాంతాలకు, విదేశాలకూ విస్తరించింది. మనదేశంలో 269 నగరాల్లో 447 డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తోంది. ఏటా 33,000 మందికి సేవలు అందిస్తోంది. ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్తాన్, నేపాల్, సౌదీఅరేబియా దేశాల్లోనూ కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ ఏడాది మార్చి ఆఖరుకు ఈ సంస్థ వద్ద 5,000 డయాలసిస్ యంత్రాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 33 లక్షల చికిత్సలు నిర్వహించింది.

✦ విక్రమ్ ఉప్పలతో పాటు బీపీపీ ట్రస్ట్, ఎడోరస్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ పీటీఈ లిమిటెడ్, హెల్త్‌కేర్ పేరెంట్ లిమిటెడ్, ఇన్వెస్ట్‌కార్ప్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్-2, ఇన్వెస్ట్‌కార్ప్ గ్రోత్ అపర్చునిటీ ఫండ్ ఈ సంస్థ ప్రమోటర్ల జాబితాలో ఉన్నాయి.

కోడి గుడ్డు

27న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	425
వరంగల్	427
విజయవాడ	475
గోదావరి	455
విశాఖపట్నం	465
చిత్తూరు	503

బ్రిటిష్ బ్రాండ్‌లు వస్తున్నాయ్

- సౌందర్య, ఫ్యాషన్, దుస్తుల విభాగంలో ఎక్కువ
- సగటు టారిఫ్ 15% నుంచి 3 శాతానికి తగ్గడం వల్లే
- మారనున్న మన రిటెయిల్ ముఖచిత్రం



బ్రిటన్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఫలితంగా ఆ దేశానికి చెందిన ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులు మన మార్కెట్లోకి రానున్నాయి. ముఖ్యంగా సౌందర్య, ఫ్యాషన్, దుస్తుల విభాగాల్లో పలు బ్రాండ్లు మన మార్కెట్లో విక్రయించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ విక్రయాలు జరుపుతున్న బ్రాండ్ల ఫ్రాంఛైజీలు మరింత విస్తరించనున్నాయి.

ఎందుకంటే: ఎఫ్‌టీఏ కారణంగా బ్రిటిష్ వస్తువులపై మనదేశం విధించే సగటు సుంకం 15% నుంచి 3 శాతానికి పరిమితం కానుంది. దీంతో ఆయా బ్రాండ్ల ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. ఫలితంగా గిరాకీ పెరిగే వీలుంది.

ఈ బ్రాండ్లు మరింత విస్తరణ: ఇప్పటికే ద బాడీ షాప్, ప్రెట్ ఏ మాంగర్, బర్బెరీ, అసోస్, నెక్స్ట్ వంటి బ్రిటిష్ బ్రాండ్లు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇవి మరింత విస్తరించే అవకాశం ఏర్పడింది. ఇప్పటికే ఉన్న బ్రిటిష్ రిటెయిల్ బ్రాండ్లకు ఉన్న ఫ్రాంఛైజీలు పెరుగుతాయని.. కొత్త బ్రాండ్లకూ ఫ్రాంఛైజీ ఒప్పందాలు జరుగుతాయని.. మెట్రో నగరాలతో పాటు చిన్న పట్టణాలకూ బ్రిటన్ ఉత్పత్తులు తరలి వస్తాయని క్రిసిల్ అంచనా వేస్తోంది.

సంయుక్త సంస్థలూ: ఇ-కామర్స్ ఒప్పందాలు పెరగొచ్చు. మార్కెటింగ్ పెట్టుబడులు, భాగస్వామ్యాలు భారీ స్థాయిలో పెరగనున్నాయి. భారత కంపెనీలతో సంయుక్త సంస్థలు ఏర్పడే అవకాశమూ లేకపోలేదు.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లాభంలో 32% క్షీణత



దిల్లీ: ప్రైవేటు రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో రూ.463 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఏప్రిల్-జూన్ లాభం రూ.681 కోట్లతో పోలిస్తే ఇది 32% తక్కువ. సూక్ష్మ రుణాలు వసూలు కాకపోవడం ఇందుకు కారణం. మొత్తం ఆదాయం మాత్రం రూ.10,408 కోట్ల నుంచి రూ.11,869 కోట్లకు చేరుకుంది. వడ్డీ ఆర్జన రూ.8,789 కోట్ల నుంచి రూ.9,642 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ ఆదాయం రూ.4,695 కోట్ల నుంచి రూ.4,933 కోట్లకు పెరిగింది. జూన్ త్రైమాసికం చివరకు స్థూల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏల) నిష్పత్తి 1.90% నుంచి 1.97 శాతానికి పెరిగినా, నికర ఎన్‌పీఏల నిష్పత్తి 0.59% నుంచి 0.55 శాతానికి తగ్గింది. కేటాయింపులు రూ.994 కోట్ల నుంచి రూ.1,659 కోట్లకు పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి 15.59% నుంచి 14.86 శాతానికి తగ్గింది.

వడ్డీ రేట్లు తగ్గించడంలో ప్రైవేటు బ్యాంకుల ఆలస్యం



ఆర్‌బీఐ జోక్యం చేసుకోవాలన్న ఫాడా

దిల్లీ: రెపో రేటు కోత ప్రయోజనాన్ని వాహన రుణాలు తీసుకున్న వారికి బదిలీ చేయడంలో ప్రైవేటు రంగ బ్యాంకులు ఆలస్యం చేస్తున్నాయని వాహన డీలర్ల సంఘాల సమాఖ్య(ఫాడా) ఆరోపించింది. ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జోక్యం చేసుకోవాలని కోరుతూ, బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాసింది. వాహన రుణ స్వీకర్తలకు వడ్డీ రేట్లను సత్వరం తగ్గించేలా ప్రైవేటు బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశాలు ఇవ్వాలని కోరింది. 'మీ నాయకత్వంలో ఆర్‌బీఐ తన చరిత్రలోనే అత్యంత వేగవంతంగా రెపోరేటు తగ్గించి, ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతాలను స్పష్టంగా ఇచ్చింది. అయినా వాహన రిటెయిల్ రంగానికి ఈ ప్రయోజనం పూర్తిగా అందలేదు. ప్రభుత్వ రంగ బ్యాంకులు రెపో రేటు కోత ప్రయోజనాన్ని సత్వరం తమ ఖాతాదార్లకు బదిలీ చేసినా, ప్రైవేటు రంగ బ్యాంకులు మాత్రం ఆలస్యం చేస్తున్నాయ'ని ఫాడా వైస్ ప్రెసిడెంట్ సాయి గిరిధర్ పేర్కొన్నారు. దీన్ని సరి చేయాలని కోరారు.

సోనా కామ్‌స్టర్ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ప్రియా కపూర్



దిల్లీ: వాహన విడిభాగాల సంస్థ సోనా కామ్‌స్టర్ (సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్ లిమిటెడ్) నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ప్రియా సచ్‌దేవ్ కపూర్ నియామకానికి వాటాదార్లు ఆమోదం తెలిపారు. సంస్థ ఛైర్మన్‌గా ఉండి, జూన్ 12న మరణించిన సంజయ్ కపూర్ భార్య ప్రియ నియామకానికి ఈ నెల 25న జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదార్లు ఆమోదం తెలిపారని నియంత్రణ సంస్థలకు కంపెనీ సమాచారమిచ్చింది. అదనపు డైరెక్టర్ హోదాలో నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 2025 జూన్ 23 నుంచి ఆమె నియామకం అమల్లోకి వస్తుందని పేర్కొంది. సంజయ్ కపూర్ మరణం తర్వాత.. జెఫెరీ మార్క్ ఓవర్లీని (2025 జూన్ 23 నుంచి అమల్లోకి వచ్చేలా) ఛైర్మన్‌గా కంపెనీ బోర్డు ఏకగ్రీవంగా నియమించింది. అయితే సోనా గ్రూప్ మాజీ ఛైర్‌పర్సన్, సంజయ్ కపూర్ తల్లి అయిన రాణీ కపూర్, ఈ నెల 24న కంపెనీ బోర్డుకు లేఖ రాశారు. గత నెలలో సంజయ్ మరణం తర్వాత కుటుంబం మొత్తం అంత్యక్రియల ప్రక్రియల్లో నిమగ్నమై ఉండగా, కంపెనీ నియంత్రణను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు, కుటుంబ వారసత్వాన్ని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నట్లు ఆమె ఆరోపించారు. తమ కుటుంబం తరఫున తాను ఎవరినీ బోర్డులోకి సిఫారసు చేయలేదన్నారు.

బ్రిటిష్ ప్రభుత్వానికి మన కంపెనీలూ ఉత్పత్తులు సరఫరా చేయొచ్చు



- రూ.10.50 లక్షల కోట్ల అవకాశాలు
- ఎఫ్‌టీఏ నేపథ్యం

దిల్లీ: 122 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10.50 లక్షల కోట్ల) విలువైన బ్రిటిష్ ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్లోకి దేశీయ కంపెనీలు అడుగుపెట్టనున్నాయి. భారత్-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఇందుకు వీలుకల్పించనుందని వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్‌వాల్ పేర్కొన్నారు. 'తొలిసారిగా బ్రిటన్‌లోని సామాజిక వ్యవస్థలో ఎటువంటి పక్షపాతం లేకుండా, భారత సరఫరాదార్లకు బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు బ్రిటన్ అంగీకరించింద'ని ఆయన తెలిపారు. అదే సమయంలో బ్రిటన్ సరఫరాదార్లకు సైతం 114 బి.డాలర్ల (రూ.9.80 లక్షల కోట్ల) విలువైన భారత ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌కు తలుపులు తెరచినట్లు వివరించారు. కేవలం తక్కువ బిడ్ వేశారని కాకుండా.. సరఫరాదారు పని వల్ల దేశ సామాజిక, పర్యావరణ మెరుగుదల ఎలా ఉంటుందన్నదానిపైనే ఆధారపడి బ్రిటన్‌లో పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ ఉంటుంది.

✦ వస్తువులు, సేవల ప్రొక్యూర్‌మెంట్‌కు భారత్ విధించిన పరిమితి రూ.5.5 కోట్లు కాగా, బ్రిటన్ పరిమితి రూ.1.6 కోట్లుగా ఉంది. నిర్మాణ సేవలకు మాత్రం ఇరు దేశాలు రూ.60 కోట్లుగా పరిమితిని నిర్ణయించాయి. కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలకు మాత్రమే రూ.250 కోట్ల వరకు పరిమితిని వర్తింపజేశాయి.

ఇక్కడ పాల్గొనవచ్చు: భారత కంపెనీలు బ్రిటన్‌కు చెందిన కేంద్ర ప్రభుత్వ స్థాయి ప్రొక్యూర్‌మెంట్‌లలో పాల్గొనవచ్చు. బెల్‌ఫాస్ట్ మెట్రోపాలిటన్ కాలేజ్, నార్తర్న్ రీజినల్ కాలేజ్, నార్త్ వెస్ట్ రీజినల్ కాలేజ్ వంటి సంస్థలు నిర్వహించే ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్‌లో భారత సరఫరాదార్లు పాల్గొనవచ్చు. ✦ బ్రిటన్ సరఫరాదార్లు క్లాస్-2 లోకల్ సరఫరాదారుగా ఇక్కడ పాల్గొనవచ్చు. అయితే వారి ఉత్పత్తి, సేవలు కనీసం 20 శాతం మేర బ్రిటన్ నుంచి ఉండాలి.

మత్స్య ఉత్పత్తుల్లో సహకారానికి భారత్, మాల్దీవుల ఒప్పందం

దిల్లీ: మత్స్య ఉత్పత్తుల విషయంలో పరస్పరం సహకరించుకోవడానికి ఒప్పందంపై భారత్, మాల్దీవులు సంతకాలు చేశాయి. మాల్దీవుల చేపల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని, ట్యూనా చేపలను పట్టుకోవడంలో స్థిరత్వాన్ని సాధించేందుకు ఇది ఉపకరిస్తుంది. హిందూ మహాసముద్రంలోని లోతైన ప్రాంతాల్లో మత్స్యసంపదను చేరేందుకు భారత జాలర్లకు వీలవుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ మాల్దీవుల పర్యటనలో భాగంగా కుదిరిన 6 ఒప్పందాల్లో ఇదీ ఒకటి. మత్స్య సాగును పటిష్ఠం చేయడం, వనరుల సమర్థ నిర్వహణ, మత్స్య అనుకూల వ్యవస్థలను అభివృద్ధి చేయడం ఈ ఒప్పంద లక్ష్యం.

రూ.2.58 లక్షల కోట్ల పబ్లిక్ ఇష్యూలు



జాబితాలో టాటా కేపిటల్, ఎల్‌జీ, ఫోన్‌పే, మీషో

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలోనూ పబ్లిక్ ఇష్యూల సందడి హోరెత్తనుంది. తొలి పబ్లిక్ ఆఫర్ల (ఐపీఓ) ద్వారా మొత్తంగా రూ.2.58 లక్షల కోట్ల నిధులు సమీకరించేందుకు కంపెనీలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే రూ.1.15 లక్షల కోట్ల ఐపీఓ ప్రతిపాదనలకు సెబీ అనుమతి ఇవ్వగా.. మరో రూ.1.43 లక్షల కోట్ల నిధుల సమీకరణకు సంబంధించి సెబీ అనుమతి కోసం కంపెనీలు ఎదురు చూస్తున్నాయి. జనవరిలో స్టాక్‌మార్కెట్లు ఒడుదొడుకులను ఎదుర్కొన్నా, తదుపరి రాణిస్తుండటం.. మదుపర్ల నుంచి ఐపీఓలకు విశేష ఆదరణ లభిస్తుండటం, దేశీయంగా సానుకూల ఆర్థిక పరిస్థితుల వంటి అంశాలు కంపెనీల ఉత్సుకతకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. మ్యూచువల్ ఫండ్ సంస్థల పెట్టుబడులు పెరుగుతుండటమూ ప్రధాన కారణమని పేర్కొంటున్నారు.

✦ ఈ ఏడాది తొలి అర్ధభాగంలో (జనవరి-జూన్) 26 కంపెనీలు రూ.52,200 కోట్లు సమీకరించాయి. ఇందులో అత్యధికంగా హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.12,500 కోట్లు సమీకరించింది.

✦ రాబోయే ప్రధాన కంపెనీల ఐపీఓల్లో టాటా కేపిటల్ రూ.17,200 కోట్లు, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ రూ.15,000 కోట్లను సమీకరించే అవకాశం ఉంది.

✦ ఫిన్‌టెక్ సంస్థ గ్రో కూడా ఐపీఓ ద్వారా రూ.5,950 కోట్లు సమీకరించేందుకు యోచన చేస్తోంది.

✦ ఫోన్‌పే, మీషో, లెన్స్‌కార్ట్, బోట్, వుయ్‌వర్క్ ఇండియా, ఫిజిక్స్ వాలా, షాడోఫాక్స్ సహా మరిన్ని కొత్త తరం కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు రానున్నాయి. ఈ కంపెనీలు రూ.1,500-9,000 కోట్ల శ్రేణిలో నిధులను సమీకరించే అవకాశం ఉంది.

✦ పైన్ ల్యాబ్స్, అర్బన్ కంపెనీ, వేక్‌ఫిట్, షిప్‌రాకెట్, అమాగి, టేబుల్‌స్పేస్ లాంటి మరికొన్ని నవతరం కంపెనీలు కూడా పబ్లిక్ ఇష్యూకు వచ్చే సన్నాహాల్లో ఉన్నాయి.

✦ 2024లో 90 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.1.60 లక్షల కోట్లు సమీకరించాయి. తొలి అర్ధభాగంలో 34 కంపెనీలు రూ.29,607 కోట్లు, రెండో అర్ధభాగంలో 56 కంపెనీలు రూ.1.30 లక్షల కోట్లను సమీకరించడం గమనార్హం.

రూ.1,75,000 కోట్ల విలువ వద్ద టాటా కేపిటల్ ఐపీఓ!

ఐపీఓ కోసం సంస్థ విలువను 18-20 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1,75,000 కోట్లు)గా పెట్టుకోవాలని టాటా కేపిటల్ అనుకుంటోంది. ఇంతకుముందు 11 బిలియన్ డాలర్ల విలువను కంపెనీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీంతో పోలిస్తే తాజా విలువ చాలా ఎక్కువ. ఇటీవలి రైట్స్ ఇష్యూ, ఇతర కంపెనీల పబ్లిక్ ఇష్యూలకు మదుపర్ల నుంచి విశేష ఆదరణ లభించడంతోనే.. సంస్థ విలువ పెంపునకు టాటా కేపిటల్ మొగ్గు చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా 2.2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.19,000 కోట్లు) సమీకరించాలని టాటా కేపిటల్ అనుకుంటోంది. వచ్చే సెప్టెంబరులో ఈ ఐపీఓ ఉండొచ్చు.

7 దరఖాస్తులకు సెబీ ఆమోదం

తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) నిర్వహించే నిమిత్తం ఏడు కంపెనీల దరఖాస్తులకు సెబీ ఆమోద ముద్ర వేసింది. వీటిల్లో ఫిజిక్స్‌వాలా, సాత్విక్ గ్రీన్ ఎనర్జీ, వీఎంఎస్ ఇంజినీరింగ్, ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్, ఫుజియామా పవర్ సిస్టమ్స్, ఎస్ఐఎస్ క్యాష్ సర్వీసెస్, ఆన్లాన్ హెల్త్‌కేర్ ఉన్నాయి.

ఫిజిక్స్‌వాలా: విద్యా సాంకేతిక యూనికార్న్ సంస్థ ఇది. సెబీకి రహస్య ప్రి-ఫిల్లింగ్ పద్ధతిలో ఐపీఓ దరఖాస్తును సమర్పించింది. అందువల్ల ఐపీఓ వివరాలు బయటకు తెలిసే వీలుండదు.

సాత్విక్ గ్రీన్ ఎనర్జీ: హరియాణాకు చెందిన సౌర ఫలకాల తయారీ కంపెనీ ఇది. ఐపీఓ ద్వారా రూ.1,150 కోట్లను సమీకరించనుంది.

ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్: ముంబయికి చెందిన స్థిరాస్తి అభివృద్ధి సంస్థ ఇది. పబ్లిక్ ఇష్యూ కింద రూ.392 కోట్ల విలువైన తాజా షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ప్రమోటర్లు, ఒక వాటాదారు ఆఫర్ ఫర్ సేల్‌లో 28.57 లక్షల షేర్లను విక్రయించనున్నారు.

వీఎంఎస్ ఇంజినీరింగ్: ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) కింద ఈ కంపెనీ ప్రమోటరు నితిశ్ గుప్తా 5.44 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.

ఫుజియామా పవర్ సిస్టమ్స్: పై కప్పు సౌర ఉత్పత్తుల తయారీ సంస్థ ఇది. ఐపీఓలో భాగంగా రూ.600 కోట్ల విలువైన తాజా షేర్లను, ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు 2 కోట్ల షేర్లను విక్రయించనున్నారు.

ఎస్ఐఎస్ క్యాష్ సర్వీసెస్: నగదు నిర్వహణ సంబంధిత సేవలను నిర్వహించే ఈ కంపెనీ.. ఐపీఓలో భాగంగా రూ.100 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేయనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు 37.15 లక్షల షేర్లను విక్రయించనున్నారు.

ఆన్లాన్ హెల్త్‌కేర్: రసాయనాల తయారీ సంస్థ ఇది. 1.4 కోట్ల తాజా షేర్లను కంపెనీ జారీ చేయనుంది.

ఐపీఓ కోసం సెబీకి 2 దరఖాస్తులు

దిల్లీ: హృద్రోగులకు వేసే స్టెంట్‌ల తయారీ సంస్థ సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ (ఎస్ఎంటీ) లిమిటెడ్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధుల సమీకరణకు అనుమతి కోరుతూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ఉంటుంది. అంటే ఐపీఓ నిధులేమీ సంస్థకు రావు. సంస్థ ప్రమోటర్లు, ఇంతకుముందే పెట్టుబడి పెట్టినవారు 2.76 కోట్ల ఈక్విటీ షేర్లను ఈ ఇష్యూలో విక్రయిస్తారు. 2001లో స్థాపితమైన ఈ సంస్థ వైద్య పరికరాలను అభివృద్ధి చేస్తోంది. భారత్, థాయ్‌లాండ్‌లో ఆర్ అండ్ డీ కేంద్రాలను కలిగి ఉంది. ఇప్పటికే 102 పేటెంట్లు ఉండగా, మరో 71 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

✦ 2024-25లో రూ.1,025 కోట్లు, 2023-24లో రూ.902 కోట్ల ఆదాయాన్ని సంస్థ ఆర్జించింది.

✦ క్లౌడ్ ఆధారిత సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ సంస్థ అమాగి మీడియా ల్యాబ్స్ ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు అనుమతి కోరుతూ ముసాయిదా పత్రాలను సెబీకి దాఖలు చేసింది. రూ.1,020 కోట్ల విలువైన తాజా షేర్లు జారీ చేయడంతో పాటు, ఓఎఫ్ఎస్ కింద ప్రస్తుత వాటాదార్లు 3.41 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ప్రీ-ఐపీఓ ద్వారా రూ.204 కోట్లు సమీకరించాలనుకుంటున్నామని, అది జరిగితే తాజా షేర్ల వాటా తగ్గుతుందని సంస్థ తెలిపింది.

aha@eenadu.in

ఆహా! .. ఏమి రుచి

ప్లేట్‌ని ప్రేమిద్దాం

లంచ్ టైమ్ అయ్యింది, తిందామా? సరే, వెళ్లి టీవీ పెట్టు.

నీకోసం ఉప్మా చేశా, ఇదిగో. అలాగే, మొబైల్ ఇలా ఇవ్వు.

టీ తెచ్చా, తీసుకోండి. పేపర్ చదువుతూ తాగుతానులే, అక్కడ పెట్టు.



ఇవన్నీ చూస్తుంటే ఎక్కడో విన్నట్టు, స్వయంగా అన్నట్టు ఉంది కదా!

దీన్నే 'డిస్ట్రాక్షన్ ఈటింగ్' అంటున్నారు ఆహార నిపుణులు. అంటే ఏదో ఒకటి చూస్తూనో, చేస్తూనో తినడం.

అలా ఏమైనా ఉంటే కానీ తినడానికి ఆసక్తి రాకపోవడం. ఏమీ లేకపోతే చెయ్యి దురదపెట్టడం.

కానీ ఇదేమంత మంచి అలవాటు కాదు.

అయినా తినడానికి పరమాన్నం ఉండగా, పరధ్యానం ఎందుకు దండగ?

ఆ ఈటేదేదో కాస్త ఇష్టంగా, శ్రద్ధగా, ఆసక్తిగా తినొచ్చుగా...

అందుకే రండి.. ప్లేట్‌ని ప్రేమిద్దాం!!

ఏదో ఆలోచిస్తూ తినడం అనేది మనకు తెలియకుండానే శరీరానికి చేటు చేస్తుంది. ఇలా ఏదో ఒక టైమ్‌పాస్ చేస్తూ తినేస్తుంటే ఎంత లోపలికి వెళ్తుందో తెలియదు. దీనివల్ల మొదట బరువు పెరుగుతాం. ఆపైన దాంతోపాటు వచ్చే అనారోగ్యాల సంగతి ప్రత్యేకంగా చెప్పేదేముంది? అంతేకాదు, ఇలా అటూ ఇటూ చూస్తూ పూర్తిగా నమలకుండానే ముద్ద మింగేస్తుంటే.. ఆ ఆహారాన్ని జీర్ణించుకోవడానికి శరీరం చిన్నసైజు కుస్తీ పడుతోంది. అసంపూర్తిగా అరిగిన తిండి వల్ల కడుపుబ్బరం, ఇబ్బందిగా అనిపించడం, ఇతర సమస్యలు.. ఒక్కటేమిటి!

ఏదో ఒకటి చూస్తూ తినడం వల్ల మనకు తెలియకుండానే నీరు కూడా ఎక్కువగా తాగేస్తున్నాం. నిజానికి ఆహారం తీసుకునే సమయంలో వీలైనంత తక్కువ నీరు తాగాలనేది నిపుణుల సూచన. ఏ షోనో, క్రికెట్ మ్యాచో చూస్తుంటే ఆ ఎగ్జైట్‌మెంట్, దానివల్ల రక్తపోటులో వచ్చే హెచ్చు తగ్గులు సైతం మన తిండి మీద ప్రభావం చూపిస్తున్నాయి. సాధారణంగా మనకు ఆకలి వేస్తుందని ఎలా తెలుస్తుంది? మెదడు సంకేతాలు పంపడం ద్వారానే కదా.. అలాగే పొట్ట నిండిన విషయం కూడా ఆ మెదడు చెబితేనే తెలిసేది. కానీ శ్రద్ధ అంతా ఎక్కడో ఉంటుంటే పాపం పిచ్చిమెదడు ఏ సంకేతాలు ఇవ్వాలో తెలియక గందరగోళంలో పడిపోతోంది. దీనివల్ల మరీ ఎక్కువగా తినేసి తర్వాత అబ్బా, అమ్మా, పొట్ట ఫుల్ అనుకుంటున్నాం.

గంటలు గంటలు

ఇలా టీవీ, మొబైల్ చూస్తూ తినడం వల్ల మనం ఆహారం తీసుకునే సమయం కూడా ఎక్కువవుతుంది. అంతసేపు పళ్లెం ముందు కూర్చోవడం అంత మంచి పద్ధతి కాదని అప్పట్లో పెద్దలు చెప్పినట్టే, ఇప్పటి ఆహార నిపుణులు సూచిస్తున్నారు. ఎక్కువ సమయం కంచం ముందు ఉంటున్నాం అంటే ఎక్కువ తింటున్నాం అని అర్థం. అలా కెలొరీలు లోపలికి వెళ్లడం పెరిగేకొద్దీ, ఆరోగ్యం 'నేనుండలేను బ్రో, సారీ' అని చెప్పి బయటకు వెళ్లడం మొదలుపెడుతుంది. అలాగే ఎక్కువసేపు తినడం వల్ల తెలియకుండానే గాలిని అధికంగా లోపలికి తీసుకుంటాం. దీని వల్ల కూడా పొట్టభారమవుతుంది. అందుకే చక్కగా నములుతూ, శ్రద్ధపెట్టి తినాలంటున్నారు నిపుణులు.



ఆహారం ఆరోగ్యానికి పరమౌషధం. ఈ ప్రపంచంలో ఆరోగ్యాన్ని మించిన లగ్జరీ లేదు. ఇంతగా టైమ్‌తో ఉరుకులు పరుగులు పెడుతున్నాం కదా, ఒక్కసారి ఆరోగ్యం బాలేక రెండు రోజులు ఇంట్లో ఉండాల్సి వస్తే మన అసలైన ప్రయారిటీ ఏమిటో అర్థమవుతుంది. అందుకే ఇంత ప్రాధాన్యం ఉన్న మన ఆహారపళ్లెం విషయంలో శ్రద్ధపెడదాం. దాన్ని ప్రేమిద్దాం. ఎందుకంటే ప్రేమిస్తే ఆటోమేటిక్‌గా ఫోకస్ పెడతాం కాబట్టి! మొత్తంగా ఓ సినిమాలో చెప్పినట్లు.. అదేదో గోడ కట్టినట్టు, గులాబీ మొక్కకు అంటు కట్టినట్టు, ఒక పద్ధతిగా శ్రద్ధగా తినేద్దాం!!

చిన్నపిల్లల విషయంలోనూ..

'డిస్ట్రాక్షన్ ఈటింగ్' అనేది పెద్దల్లోనూ మరీ ముఖ్యంగా ఇప్పుడు చిన్నారుల్లోనూ చూస్తున్నాం. త్వరగా తినిపించేయాలి అనే కంగారుతో ఇంట్లోవారు పిల్లల చేతికి మొబైల్, టీవీ రిమోట్ ఇస్తున్నారు. దీనికి బదులుగా ఏవైనా బొమ్మలు ఇవ్వొచ్చు. అప్పుడు వారి ఫోకస్ భోజనం మీద కూడా ఉంటుంది. లేదంటే ఏం తింటున్నారో, ఎలా తింటున్నారో కూడా తెలియదు. ఏడాది వయసు నుంచే ఒకచోట కూర్చోపెట్టి స్వయంగా తినడం అలవాటు చేయాలి. ఆహారాన్ని ఆకర్షణీయంగా వడ్డించాలి. ఇంట్లోనే టిక్కా, కబాబ్, పాప్‌కార్న్ వంటివి చేయొచ్చు. స్నాక్స్ అనగానే బయట నుంచి తీసుకురాకుండా కూరగాయలు, పండ్లతోనే ఏవైనా వెరైటీలు చేసేందుకు ప్రయత్నించాలి. పట్టీ, పాన్‌కేక్స్, మిల్క్‌షేక్స్, ఫ్రూట్ జ్యూస్ వంటివి ఇవ్వొచ్చు. పెద్దలు కూడా ఇతరులతో కలిసి తినడం అలవాటు చేసుకుంటే డిస్ట్రాక్షన్ తగ్గుతుంది. ఇంట్లో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులతో, ఆఫీసులో తోటి ఉద్యోగులతో తినడం వల్ల మన ఆరోగ్యంతోపాటు సంబంధాలు మెరుగుపడతాయి.



– వీణ పారుపల్లి, డైటీషియన్.

స్వీటు తింటే కానీ ఆగలేం. కానీ బరువు గురించి, షుగర్ గురించి బెంగ. ఇలాంటి వారికోసం సరికొత్తగా మార్కెట్‌లోకి వచ్చాయి స్టీవియా ఆకులు. స్టీవియా రిబాండియానా అనే మొక్క ఆకులను ఎండబెట్టి, చూర్ణంగానూ అమ్ముతున్నారు.

చక్కెర ఆకులు



ఇందులో సహజమైన చక్కెరలుగా పిలుచుకునే స్టీవియల్ గ్లైకోసైడ్స్ ఉంటాయట. ఎటువంటి కెలొరీలు ఉండని ఈ ఆకులు... పంచదార కంటే తియ్యగా ఉంటున్నాయట. వీటిని కాఫీ, టీ వంటి పదార్థాల్లో మోతాదుకు మించకుండా వాడటం చక్కెరకు ప్రత్యామ్నాయం. వినియోగించిన తర్వాత బ్లడ్ షుగర్ స్థాయుల్లో పెద్దగా మార్పులు ఉండవట. అయితే స్వీట్లలో అవసరమయ్యేంత ఎక్కువ మోతాదులో వాడొచ్చా అనేదానిపై పరిశోధనలు జరుగుతున్నాయి.

- తొలుత ఉత్తర అమెరికాలో ఈ మొక్క ఆకులను వంటల్లోనూ, మందుల్లోనూ ఉపయోగించేవారు. తర్వాత మెల్లగా ఇతర దేశాలకు విస్తరించింది. చక్కెర వల్ల దంతాల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది కదా... కానీ ఈ ఆకులతో ఆ సమస్య ఉండదట. సాధారణంగా వీటిని వాడటం మంచిదే అయినా కొందరిలో అలెర్జీలు వచ్చే అవకాశం ఉంది. అజీర్తి సమస్యలూ తలెత్తవచ్చు.





ఆగాకరకాయలు...

వీటినే కొన్ని ప్రాంతాల్లో బోడకాకరకాయలని కూడా అంటారు. సరిగ్గా వండాలే కానీ మాంసాహారానికి ఏమాత్రం తీసిపోని రుచి వీటి సొంతం. మరి ఇప్పుడు ఎటూ సీజన్ కదా! మార్కెట్లో ఓ కేజీ కొని తెచ్చేసి... రొటీన్‌గా గ్రేవీ, ఫ్రై కాకుండా కాస్త వెరైటీగా ట్రై చేద్దామా!

అదిరే ఆగాకర

మటన్‌తో మస్తీ



కావాల్సినవి: ఆగాకరకాయలు-కప్పు, మటన్-కప్పు, ఉల్లిపాయలు-4, పచ్చిమిర్చి-4, అల్లంవెల్లుల్లి ముద్ద -2 టీస్పూన్లు, పసుపు - చిటికెడు, కారం - తగినంత, ఉప్పు - తగినంత, ధనియాల పొడి- అర టీస్పూన్, గరంమసాలా - అర టీస్పూన్, ఒకటి లేదా రెండు బిర్యానీ ఆకులు, ఒక చెక్క నిమ్మరసం, కొత్తిమీర - ఒక కట్ట, పుదీనా - నాలుగైదు రెబ్బలు.

తయారీ విధానం: మటన్ ముక్కల్లో కొంచెం నూనె, ఉప్పు, కారం, అల్లంవెల్లుల్లి ముద్ద, పసుపు, బిర్యానీ ఆకులు, నిమ్మరసం వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. తరువాత కడాయిలో నూనె పోసి వేడయ్యాక సన్నగా తరిగిన ఉల్లిపాయలు ముక్కలు బంగారు రంగు వచ్చేవరకు వేయించుకొని పక్కకు తీసిపెట్టాలి. అందులోనే ఆగాకరకాయ ముక్కలను కూడా వేసి కాస్త మగ్గించాక వాటినీ ఒక బౌల్‌లోకి తీసుకోవాలి. తరువాత అదే కడాయిలో మరికొంచెం నూనె పోసుకొని ముందుగా కలిపి పెట్టుకున్న మటన్ ముక్కల మిశ్రమం వేసి కొద్దిసేపు వేపి, ఆపైన మూతపెట్టి ఉడికించాలి. అవసరం అయినప్పుడు కలుపుతూ ఉండాలి. కొంచెం మగ్గాక తగినన్ని నీళ్లు పోసి ఉడకనివ్వాలి. తరవాత పక్కకు పెట్టుకున్న ఉల్లిపాయలు, ఆగాకరకాయలు వేసి కాస్త మగ్గనివ్వాలి. పూర్తిగా ముక్క ఉడికింది అనుకున్నాక గరంమసాలా, ధనియాల పొడి వేసి చివరగా కొత్తిమీర, పుదీనా వేసి దించేయాలి.

క్రిస్పీ పకోడా

కావాల్సినవి : ఆగాకరకాయలు - అర కప్పు, తోటకూర - ఒక కట్ట, ఉల్లిపాయలు - 5, పచ్చిమిర్చి - 4, జీలకర్ర - చిటికెడు, వాము - చిటికెడు, వెల్లులిముద్ద - ఒక టీస్పూన్, శనగపిండి - అరకప్పు, బియ్యంపిండి - అరకప్పు, కరివేపాకు - కొత్తిమీర తరుగు - అరకప్పు, కారం - రుచికి తగినంత, ఉప్పు - తగినంత, గరంమసాలా - చిటికెడు.

తయారీ విధానం: తోటకూర, ఆగాకరకాయలు, ఉల్లిపాయలను పకోడా వేసేందుకు వీలుగా సన్నగా పొడుగ్గా తరిగి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో శనగపిండి, బియ్యంపిండి, కారం, ఉప్పు, జీలకర్ర, వాము, తరిగి పెట్టుకున్న తోటకూర, ఆగాకరకాయలు, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీర, గరంమసాలా వేసి మొత్తం కలిసేలా బాగా కలపాలి. తరవాత కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ పకోడా వేయడానికి వీలుగా పిండిని కలపాలి. కడాయిలో నూనె బాగా వేడయ్యాక కావాల్సిన ఆకారంలో పకోడా వేసుకుని, బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించుకుంటే వేడి వేడిగా రెడీ అయిపోతుంది.

అచ్చ తెలుగు సూపు

పప్పు లేదా, కూరగాయలు, మాంసం, చేపల్ని నీటిలో మరిగించి తయారు చేసే ద్రవాహారం సూపు. ఇది ఆంగ్ల పదం కాదు! సంస్కృత సూపం (పప్పు) లోంచి ఏర్పడి, ప్రపంచం అంతా వ్యాపించింది. సూపు తక్షణ శక్తిదాయిని కాబట్టి, ఒక ఇంజను హార్స్ పవర్ పెంచటాన్ని 'సూప్ అప్' అన్నారు ఇంగ్లీషువాళ్లు. పప్పు జీవశక్తినిచ్చే ద్రవ్యం. మన ప్రాచీనులు పెళ్లెప్పుడు అనే అర్థంలో పప్పన్నం ఎప్పుడు? అని అడిగే వాళ్లు. పద ప్రయోగంలో పరిపక్వత ఇది!



యోగరత్నాకరం అనే ఆయుర్వేద గ్రంథం ఇంచుమించు 15వ శతాబ్దంలో రూపొందింది. అందులో అష్టగుణమండం అనే సూపు గురించి ఉంది. ఆయుర్వేద పరిభాషలో బియ్యాన్ని మెతుకు గుజ్జుగా అయిపోయేంతదాకా ఉడికిస్తే దాన్ని 'మండ' అని పిలుస్తారు. దీని ప్రకారం 'అష్టగుణమండం' తయారీ చెప్తున్నారీ శ్లోకంలో:

'తండులై ర్ధ ముద్గాంశ్చై కించిద్భృష్టై సుపాచితైః /హింగు సిన్ధూత్థ ధనికా తైల త్రికటు సంస్కృతః'

- రెండు కప్పుల బియ్యాన్ని తీసుకుని దోరగా వేయించాలి. ఒక కప్పు పెసరపప్పుని కూడా వేయించి ఈ రెండింటినీ ఒక పాత్రలోకి తీసుకుని 14 రెట్లు నీళ్లు పోసి మెతుకు కనిపించకుండా ఉడికించాలి. ఉప్పు, ధనియాలు, శొంఠి, పిప్పళ్లు, మిరియాలను కూడా మెత్తగా దంచి తడిపి ముద్దగా చేస్తే దాన్ని 'ఖల' అంటారు. ఈ ముద్దని కూడా ఇందులో కలిపి ఇంకొంచెం ఉడికించి ఇంగువ తాలింపు పెట్టిన సూపు 'అష్టగుణమండం'.

- దీన్ని పప్పు, బియ్యంతోపాటు కొన్ని కూరగాయల ముక్కలు కూడా కలిపి కాచుకోవచ్చు. ఇది అచ్చతెలుగు సూపు. దీన్నే 'పప్పుకట్టు' అనీ అంటున్నాం. మన పూర్వ కవులు ఇంకాస్త నాజూకుగా 'పడిదెం' అన్నారు. వెన్నతో నంజుకుంటే అది 'వెన్నపడిదెం'.


- '....జ్వరదోషత్రయాపహః రక్త క్షుద్వర్ధనః ప్రాణప్రదో వస్తివిశోధనః' అనే సూత్రం ప్రకారం అకస్మాత్తుగా జ్వరం వచ్చినప్పుడు ఇది తాగి పడుకుంటే తగ్గుతుంది. పేగుల్లోనూ, మూత్రాశయంలోనూ ఉండే దోషాలను పోగొట్టి శుద్ధి చేస్తుంది.

- రాత్రిపూట డైటింగ్ చేసేవాళ్లు దీన్ని రోజూ తాగితే పొట్టకు హాయిగా ఉంటుంది. షుగరు, బీపీ, స్థూలకాయం తగ్గుతాయి.



–డా॥ జి.వి.పూర్ణచందు, తెలుగు ఆహార చరిత్ర పరిశోధకులు

మై డియర్ బిర్యానీ..



బిర్యానీ, నా గుండె దేవయాని.. ఎలా చెప్పను నాకు సర్వం నీవేనని? గాలిలో ఘుమఘుమల విరిబోణి.. కనులకు విందులు చేసే మందాకిని... నీకు తెలుసా నాకు నీవే ప్రాణసఖివని? నీవే లేకుంటే ఆదివారాల ఆనందం ఆవిరైపోనని? బ్యాచిలర్ల పార్టీలు బోరు కొట్టునని?

పొట్ట వచ్చినా పొట్లం బిర్యానీ, కళ్లనిండుగా కుండ బిర్యానీ... అసలు నీలో ఎన్ని రకాలని? బకెటులో నీవే, బొంగులో నీవే, బుట్టలో నీవే, వెదురుతట్టలోనూ నీవే. నీవున్న చాలు గడిచిపోవు వీకెండులు, నీవులేని చోట క్షణమైనా నిలువవు నా కాళ్లు, నిన్ను ఆరగించకుంటే ఆగిపోవు లోకాలు, తిన్నవెంటనే అంటాం బ్రేవ్‌బ్రేవ్‌లు.

మాటిస్తావుగా మళ్లీ వారం వస్తావని, మటన్ ముక్కతోనూ చికెన్‌తొక్కతోనూ కలిసి పలకరిస్తావని... నోరూరిస్తావని, రారమ్మంటావని... ఓ నా బిర్యానీ!

- బిర్యానీ లవర్ బుల్లబ్బాయ్

స్విగ్గీ నివేదిక ప్రకారం మన దేశంలో సెకనుకు 2 బిర్యానీలు ఆర్డర్ అవుతున్నాయట! అంటే ఏడాదికి 8.3 కోట్ల బిర్యానీలు. ఇది కేవలం స్విగ్గీ ఆర్డర్ల లెక్క అయితే... ఇక మొత్తం సంఖ్య ఏ రేంజులో ఉంటుందో!



సమోసా, జిలేబీ అంత చెడ్డవా?

తాజాగా ఓ వార్త తెగ వైరల్ అయిపోతోంది. 'సమోసా, జిలేబీలు తినడం మహా డేంజరస్. తరచూ తిన్నారంటే మీ ఆరోగ్యం కూడా ఆయిల్‌లో డీప్ ఫ్రై అయిపోతుంది' అంటూ సమాచారం చక్కర్లు కొడుతోంది.

అరె మన సమోసా, జిలేబీ ఆయె! వాటిని అంత మాట అంటారా అయ్ః అంటూ కొంతమంది అర్జెంటుగా కన్నెర్ర చేశారు. మరికొందరేమో 'ఏం, మీ పిజ్జా, బర్గర్లు చేటు చేయవా?' అంటూ ప్రశ్నించారు. మొత్తానికి మన సంప్రదాయ వంటకాలను ఇలా బోనులో నిలబెట్టడం స్ట్రీట్‌ఫుడ్ ఈటర్లకు సుతరామూ నచ్చలేదు.

అందుకే అసలు ఈ విషయం ఏమిటో వివరణ తెలుసుకుందామని 'ఆహా!' డాక్టర్లను అడిగేసింది. వారేమో.. 'కేవలం సమోసా, జిలేబీనే కాదండీ, నూనెలో స్నానం చేసి ప్లేట్లోకి చేరి నోరూరించే ఏ డిష్ అయినా మన ఒంటికి మంచిది కాదు. వాటిలో ఉండేది ట్రాన్స్‌ఫ్యాట్స్, హైషుగర్స్, కెలొరీలు మాత్రమే. జీరో న్యూట్రిషన్ అంటే నమ్మండి. అలా అని విదేశీ స్నాక్స్ ఏమీ శుద్ధపూసలు కావు. అసలు అవి ఫుడ్డే కాదు, అలా మిమిక్ చేసే పదార్థాలు మాత్రమే. మరి ఏవీ తినకూడదా అంటే తినొచ్చు! నెలకు ఒకటి లేదా రెండుసార్లు అంతే. అవి కూడా ఇంట్లో చేసుకున్నవైతే మరీ మేలు. బయట మళ్లీ మళ్లీ మరిగించే నూనెల్లో శరీరానికి హాని చేసే కారకాలు కుప్పలుతెప్పలుగా విడుదలవుతాయి. అవి హాయిగా పలుచగా ప్రవహించే మన రక్తాన్ని మరీ చిక్కగా అయ్యేలా చేసి, దాన్ని పంప్ చేయడం గుండెకు కష్టంగా మార్చేస్తాయి. పంపు కొట్టీ కొట్టీ విసుగొచ్చేసిన గుండె 'ఇక నా వల్ల కాద'ని చేతులెత్తేస్తే వాల్వ్ బ్లాక్ అవ్వడం జరుగుతుంటుంది. కాలేయం మీదా ఒత్తిడి పెరిగి కొవ్వు పేరుకుంటుంది. అందుచేత ఎప్పుడైనా ఒకసారి ఓకే, తరచూ నాట్ ఓకే అని తేల్చారు.



కొన్నాళ్లుగా ఎక్కడ చూసినా చిట్టి ముత్యాల బియ్యంతో చేసిన పులావుల ఘుమఘుమలే. అలా అని మనమూ రెస్టారెంట్ స్టైల్‌లో చేద్దాం అంటే వాళ్లంత బాగా కుదరదు ఏంటో. అందుకే ఆ తయారీ కిటుకులేంటో వారితోనే చెప్పించుకుందాం పదండి!

ఆ చిట్టి కిటుకేంటి?



'నిజానికి చిట్టి ముత్యాల చికెన్ పులావ్ చేయడం బిర్యానీల కంటే సులభం. ఎందుకంటే ముందుగా చికెన్‌ను మారినేట్ చేయాల్సిన అవసరం లేదు. ముక్కలు ఎటూ కర్రీ కట్‌లో ఉంటాయి కాబట్టి చక్కగా మసాలాలు పట్టేస్తాయి. కొన్ని చిన్న చిన్న చిట్కాలతో దీన్ని అద్భుతంగా వండి వడ్డించవచ్చు.

కేజీ బియ్యానికి కేజీ చికెన్ తీసుకోవాలి. దళసరి పాత్రను పొయ్యి మీద పెట్టి 200 గ్రాముల నెయ్యి, 50 గ్రాముల నూనె పొయ్యాలి. కాస్త కాగాక, మసాలా దినుసులు అంటే... 8 లవంగాలు, 4 చిన్న దాల్చినచెక్క ముక్కలు, 10 యాలకులు, 4 మరాఠీ మొగ్గలు, ఒక అనాసపువ్వు వేసి వేయించాలి. అవి కాస్త వేగాక నాలుగైదు బిర్యానీ ఆకులు వేయాలి. ఇక్కడే అసలు మజా వచ్చేది. ఈ స్టేజ్‌లో కేవలం తొక్కతీసి, కట్ చేయకుండా ఉన్న రెండు గుప్పిళ్ల ఉల్లిపాయలు వేయాలి. ఈ చిన్న ఉల్లిపాయల్లోనే పులావ్ రుచి అంతా దాగేది. అవి కాస్త ఉడికినట్టు కనిపించగానే 4 చెంచాల అల్లంవెల్లుల్లి పేస్ట్, 6 పచ్చిమిర్చి వేసి ఒకసారి బాగా కలపాలి. 2 చెంచాల కశ్మీరీ కారం, 2 చెంచాల మామూలు కారం వేసి ఒక్కొక్క చెంచా చొప్పున ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా పొడి వేసేయాలి. వంట సోంపు పొడి ఈ పులావ్‌లోని ఓ స్పెషల్ పదార్థమని చెప్పొచ్చు. దాన్ని ఒక చెంచా వేయాలి. తరిగిన కొత్తిమీర, పుదీనా ఆకులు గుప్పెడు చొప్పున జతచేర్చి... 150 గ్రాముల పెరుగును వేసి కలపాలి. ఇప్పుడు శుభ్రంగా కడిగిపెట్టుకున్న చికెన్‌ను వేసేయాలి. మొత్తం ఒక 10 నిమిషాలపాటు సన్నని సెగ మీద వేయించాలి. ఈ స్టేజ్‌లో చికెన్‌లోంచి నీరు రావడం మొదలవుతుంది. అది ఏమాత్రం ఉందో చూసుకుని, ఆ నీటిని కూడా లెక్కవేసుకుని ఒకటికి రెండు కప్పుల చొప్పున బియ్యానికి నీరుపోయాలి. నీళ్లు వేసేచోట జాగ్రత్తగా లేకపోతే గింజ జావైపోతుంది. రుచికి సరిపడా ఉప్పు వేసి, నీళ్లపైన కొద్దిగా నెయ్యి, రెండు చెంచాల రోజ్‌వాటర్, రెండు చెక్కల నిమ్మరసం పిండాలి. నెమ్మదిమీద ఉడికిస్తే అద్భుతంగా కుదురుతుంది.



ఇదే పద్ధతిలో కుక్కర్‌లో కూడా చేసేయొచ్చు. వడ్డనలోనూ ఇందులో ఒక విషయం పాటించాలి. ఈ పులావ్‌ను స్టవ్ ఆఫ్ చేశాక కనీసం అరగంటపాటు మూత కాస్త పక్కకి తీసి వదిలేయాలి, వడ్డించకూడదు. ఆ సమయంలో ఫ్లేవర్స్ అన్నీ సర్దుకుంటాయి. నిజానికి వేడివేడిగా అంటారు కానీ ఇది చల్లారేకొద్దీ రుచి పెరుగుతుంది. ఓ అరగంట తర్వాత గోరువెచ్చగా ఉన్నప్పుడు రైతా, గ్రేవీతో వడ్డిస్తే.. తిన్నవాళ్లు వహ్వా అనడం గ్యారెంటీ!



– తలారి రఘు, షెఫ్

మీకు తెలుసా?

వంట చేస్తూ కిచెన్‌లోనే ఎక్కువ సమయం గడపడం వల్ల వివిధ ఊపిరితిత్తుల వ్యాధులబారిన పడుతున్నారు గృహిణులు. వేడి ఆవిర్లు, వాసనలు అధికంగా పీల్చడం ఆరోగ్యానికి అంత మంచిది కాదని ఇప్పటికే అనేక పరిశోధనల్లో తేలింది. అందుకే వంట చేస్తున్నప్పుడు వీలైనన్నిసార్లు కిచెన్ నుంచి బయటకు వెళ్లడం.. కిటికీలు తెరిచి ఉంచడం, చిమ్నీ వాడటం వంటివి తప్పనిసరిగా చేయాలి.



చెబుతా వినండి!

'దాంపత్యమూ దప్పళమూ మరిగేకొద్దీ రుచి అన్నది సామెత మాత్రమే కాదు! పులుసులు, చారులు, నీళ్లు పోసి మరిగించేవి - ఉడికించేవి ఏవైనా సన్నని సెగ మీద నెమ్మదిగా చేస్తేనే రుచి. కాస్త సమయం ఉందన్నప్పుడు పెద్దపెద్ద మంటలు పెట్టి మాడ్చేయకుండా సరిపడా నీళ్లు మాత్రమే పోసి నెమ్మది మీద మరిగించండి. అదే మీకు టైము తక్కువ ఉన్నప్పుడు.. అవసరమైన దానికంటే కాసిన్ని ఎక్కువ నీళ్లు పోసి పెద్దమంట పెడితే త్వరగా ఉడికిపోవడం, మరిగిపోవడం జరుగుతుంది. ఈసారి ఈ చిట్కా పాటించి చూడండి.'

భారతదేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొని ఉంది. ఇక్కడ ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక పాత్ర పోషిస్తోంది. ఇది చట్టాలను, రాజ్యాంగ సూత్రాలను కచ్చితంగా అమలు చేస్తూ.. న్యాయాధికారాలను చెలాయించే స్వయంప్రతిపత్తి ఉన్న రాజ్యాంగబద్ధ సంస్థ. ఎన్నికల్లో సంస్కరణల కోసం ఏర్పాటైన కమిటీలు, అవి చేసిన సిఫార్సులు మొదలైన అంశాలపై పోటీపరీక్షార్థికి అవగాహన అవసరం.



ప్రజాస్వామ్యంలో చట్టసభలే అధికారానికి కేంద్రాలు!

కేంద్ర ఎన్నికల సంఘం
భారతదేశం - ఎన్నికల వ్యవస్థ పాత్ర

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

ఆధునిక ప్రజాస్వామ్య దేశాల్లోని రాజకీయ వ్యవస్థలకు ఎన్నికల నిర్వహణ అత్యంత ప్రధానం. ముఖ్యంగా ప్రజా ప్రాతినిధ్య ప్రభుత్వాల్లో నిర్ణీత కాలవ్యవధిలో జరిగే ఎన్నికల ద్వారా ప్రజలే తమకు నచ్చిన ప్రతినిధులను ఎన్నుకుని, పాలనలో భాగస్వాములవుతారు. తద్వారా చట్టసభలకు తమ తరఫున నాయకులను పంపిస్తారు.

✦ ఎన్నికైన ప్రతినిధులు ప్రజల పక్షాన ఉంటూ రాజ్య కార్యకలాపాలను నిర్వర్తిస్తారు. అందుకే ప్రజాస్వామ్య దేశాల్లో ఎన్నికలకు విశిష్టమైన ప్రాధాన్యం ఉంటుంది.

✦ ప్రాచీన గ్రీకు నగర రాజ్యాలు ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి మంచి ఉదాహరణగా చెప్పవచ్చు.

ఎన్నికలు - ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అంతర్భాగం. అవి ప్రభుత్వాలకు ముఖ్యం. నిర్ణీత కాల వ్యవధిలో జరుగుతూ, కచ్చితంగా నాయకత్వాన్ని నిర్ధరిస్తాయి. రాజ్యాంగ నిబంధనలు, చట్టాలకు అనుగుణంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అధికారాన్ని చేపడతారు.

▌ పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి ప్రాదేశిక నియోజకవర్గాలకు ఒకేరకమైన ఓటరు జాబితా ఉంటుంది.

▌ ఓటరు జాబితాలో పేరు నమోదుకు మతం, జాతి, కులం, లింగ వివక్ష లేదా ఇతర కారణాలను చూపి అభ్యంతరం తెలపడానికి వీల్లేదు.

▌ పార్లమెంట్‌లోని లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు వయోజన ఓటుహక్కు ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తారు.

▌ నియోజకవర్గాల పునర్విభజన లేదా నియోజకవర్గాల వారీగా సీట్ల కేటాయింపునకు సంబంధించిన చట్టాలను ఏ న్యాయస్థానంలోనూ సవాలు చేయకూడదని మన రాజ్యాంగం నిర్దేశించింది.

ఎన్నికల సంస్కరణలు

ప్రపంచంలోని ఏ ప్రజాస్వామ్య వ్యవస్థ అయినా స్వేచ్ఛగా, స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే యంత్రాంగం ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తుంది. 75 ఏళ్ల అనుభవం ఉన్న ఎన్నికల వ్యవస్థ మనది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన యంత్రాంగం, ఎన్నికల ప్రక్రియను పరిశీలించి వివిధ సంస్కరణలను ప్రతిపాదించేందుకు భారత ప్రభుత్వం అనేక కమిటీలు, కమిషన్‌లను నియమించింది. అవి:

☛ 1974లో తార్కుండే కమిటీని నియమించింది. ఇది 1975లో తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ కమిటీ ఓటుహక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించాలని సూచించింది.

☛ 1990లో ఎన్నికల సంస్కరణల కోసం దినేష్ గోస్వామి కమిటీని నియమించింది.

☛ రాజకీయాలు, నేరాల మధ్య సంబంధాల అధ్యయనం కోసం 1993లో ఓహ్రా కమిటీ ఏర్పాటైంది.

☛ ఎన్నికల్లో రాజకీయ నిధుల అధ్యయనం కోసం 1998లో ఇంద్రజిత్ గుప్తా కమిటీని నియమించింది.

☛ భారత రాజ్యాంగం పనితీరుపై సమీక్ష కోసం ఎం.ఎన్.వెంకటాచలయ్య అధ్యక్షతన కమిటీని నియమించింది. అది 2000-2002 మధ్య కొన్ని ఎన్నికల సంస్కరణలను సూచించింది.

☛ వీరప్ప మొయిలీ అధ్యక్షతన 2007లో కమిటీని నియమించగా, రెండు పాలనాపరమైన సంస్కరణలను సిఫార్సు చేసింది.

అమలవుతున్న ముఖ్య సంస్కరణలు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు): మన దేశంలో ఈవీఎంలను 1980లో ఎం.బి.హనీఫా రూపకల్పన చేశారు. ఈ యంత్రాలను బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్), హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో తయారవుతున్నాయి.

❖ 1989-90 ఎన్నికల్లో మొదటిసారి మన దేశంలో ఈవీఎంలను వినియోగించారు. రాజస్థాన్ (5), మధ్యప్రదేశ్ (5), దిల్లీ (6) శాసనసభ ఎన్నికల కోసం ప్రయోగాత్మకంగా వీటిని ఉపయోగించారు.

❖ మొదటిసారిగా 1999లో గోవా అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో వీటిని వినియోగించారు. 2004లో 14వ లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోని అన్ని నియోజకవర్గాల్లో ఈవీఎంలతోనే ప్రజాభిప్రాయం నమోదైంది.

❖ ఎన్నికల్లో ఓటు వినియోగించుకున్నట్లు వేలిపై రాసే సిరా రసాయన నామం సిల్వర్ నైట్రేట్. దీన్ని మైసూర్ వార్నిష్ ప్రైవేట్ లిమిటెడ్‌లో (బెంగళూరు) తయారు చేస్తారు.

మద్యం అమ్మకాలపై నిషేధం: ప్రభుత్వ, ప్రైవేట్ ప్రదేశాల్లో పోలింగ్ ప్రారంభానికి 48 గంటల ముందు నుంచి మద్యం లేదా ఇతర మత్తు పానీయాలు విక్రయించడం, పంపిణీ చేయడం, ఓటర్లకు అందజేయడం చేయకూడదు. ఈ నిబంధనను అతిక్రమించినవారికి 6 నెలల జైలుశిక్ష లేదా రూ.2 వేల జరిమానా లేదా రెండూ కలిపి విధించవచ్చు.

రెండు నియోజకవర్గాల్లోనే పోటీకి పరిమితం: సాధారణ ఎన్నికలు లేదా ఉప ఎన్నికల్లో పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాల్లో ఒకేసారి రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో అభ్యర్థులు పోటీ చేయడానికి వీల్లేదు.

ఎన్నికల ప్రచార సమయం కుదింపు: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాల ఉపసంహరణ గడువు నుంచి పోలింగ్ తేదీ మధ్య ఉన్న కనీస వ్యవధిని 20 రోజుల నుంచి 14 రోజులకు తగ్గించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్: 1999 నుంచి కొంతమందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు.

ప్రవాస భారతీయులకు ఓటుహక్కు: అనేక కారణాల వల్ల విదేశాల్లో నివసించే భారతీయులకు 2010 నుంచి ఓటుహక్కును వినియోగించుకునే వీలు కల్పించారు.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

ఎన్నికల వ్యవస్థ - ముఖ్య లక్షణాలు

ప్రజా ప్రతినిధుల ప్రత్యక్ష ఎన్నిక: ప్రజలే స్వయంగా తమ ప్రజాప్రతినిధులను ప్రత్యక్షంగా ఎన్నుకునే హక్కును భారత రాజ్యాంగం కల్పించింది. పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర శాసనసభలు, పట్టణ - నగరపాలక సంస్థలు, గ్రామపంచాయతీ సభ్యులను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు.

● మన ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలే ప్రజా అధికారానికి ముఖ్య కేంద్రాలుగా వ్యవహరిస్తాయి.

పరోక్ష ఎన్నికలు: రాజ్యాంగం ప్రకారం రాజ్యసభ, రాష్ట్రాల విధాన మండలి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు పరోక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తారు.

● ఈ ఎన్నికలు పరోక్షంగా నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు పద్ధతిలో ఉంటాయి.

ఓటరు జాబితా సవరణ: దేశంలో ప్రతి పదేళ్లకోసారి ఓటర్ల నమోదు, ఓటరు జాబితాల సవరణ, తయారీ ప్రక్రియ ఉంటుంది. దీన్ని భారత ఎన్నికల సంఘం చేపడుతుంది.

రహస్య బ్యాలెట్ పద్ధతి: ఓటర్లు తమ నిర్ణయం మేరకు ఓటుహక్కు వినియోగించుకునేందుకు రహస్య ఓటింగ్ పద్ధతికి వీలు కల్పించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ఈ విధానం తోడ్పడుతుంది.

ఓటింగ్ యంత్రాలు: ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు, ఓట్ల లెక్కింపు సులభంగా ఉండేందుకు ఎన్నికల సంఘం ఓటింగ్ యంత్రాలను ప్రవేశపెట్టింది. వీటినే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) అంటారు.

● ఓట్ల లెక్కింపును.. ఓటింగ్ సిబ్బంది, ఆయా పార్టీల అభ్యర్థుల సమక్షంలో ఎన్నికల అధికారి పర్యవేక్షణలో నిర్వహిస్తారు. ఓటర్లు ఏ అభ్యర్థికీ ఓటు వేయడం ఇష్టం లేకపోతే ఓటింగ్ యంత్రాల్లో నోటా అనే బటన్‌ను ఎంచుకునే అవకాశాన్ని ఇటీవలి కాలంలో కల్పించారు.

స్వయం ప్రతిపత్తి కలిగిన యంత్రాంగం: ఆర్టికల్ 324 ప్రకారం, దేశంలో ఎన్నికల నిర్వహణ బాధ్యతలను భారత ఎన్నికల సంఘం చూసుకుంటుంది. గత 75 ఏళ్లలో దేశంలో 18 సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలైన అస్సాం, పంజాబ్, జమ్మూకశ్మీర్‌లోనూ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసి, ఎన్నికలు నిర్వహించారు.

723 Word of the Day

Devotion

Telugu meaning: విధేయత, ఆరాధన

English meaning: The word 'devotion' (డివోషన్) is a noun that describes strong loyalty, love, or dedication to a person, cause, or duty.

Synonyms: Loyalty, Faithfulness

Antonyms: Apathy, Indifference

Usage: 1. Her devotion to her family was evident in every decision she made.
2. The soldiers displayed great devotion to their country even in the face of danger.

Current Affairs



Prime Minister Narendra Modi, on 25 July 2025, completed 4,078 days in office, surpassing former Prime Minister late Indira Gandhi's record of 4,077 consecutive days as Prime Minister of the country from January 24, 1966, to March 24, 1977.

✦ With this milestone, PM Modi becomes the second longest consecutively serving Prime Minister in India's history, behind only the country's first Prime Minister Jawaharlal Nehru.

✦ He is the only leader in India, among all Prime Ministers and Chief Ministers, to win six consecutive elections as the leader of a party - Gujarat (2002, 2007, 2012), Lok Sabha polls (2014, 2019, 2024).



India has successfully carried out flight trials of UAV Launched Precision Guided Missile (ULPGM)-V3 in the National Open Area Range (NOAR), a test range in Kurnool, Andhra Pradesh on 25 July 2025. The missile is an enhanced version of the ULPGM-V2 missile developed and delivered by DRDO earlier.


✦ Designed, developed and tested by DRDO, the ULPGM-V3, also referred to as ULM-ER (extended-range variant), is an advanced version of DRDO's UAV-launched precision munition, and features passive homing using an imaging infrared (IR) seeker, allowing for accurate engagement in both day and night conditions.

For more Current Affairs: Scan QR code

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

విజ్ఞాన ఆధారిత పరిశ్రమ

ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగం దినాదినాభివృద్ధి చెందుతోంది. ఆర్థిక వ్యవస్థలో ఈ రంగం ప్రముఖపాత్ర పోషిస్తోంది. సమాచార సాంకేతిక పరిశ్రమ (ఐటీ పరిశ్రమ) సమాచారాన్ని నిక్షిప్తం, విస్తరింపజేయడంలో తోడ్పడుతోంది. ప్రస్తుతం ఈ పరిశ్రమ విశ్వవ్యాప్తమైంది. దీనికి కారణం సాంకేతిక, రాజకీయ, సాంఘిక - ఆర్థికపరమైన సంఘటనల్లో ఐటీని విరివిగా ఉపయోగించడమే.



సమాచార సాంకేతిక రంగం

ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో సమాచార సాంకేతిక రంగం కీలకంగా వ్యవహరిస్తుంది. సమాచారాన్ని గిగాబైట్ల వేగంతో పంపించడాన్ని ఐటీ పరిశ్రమ సుసాధ్యం చేసింది.

■ ఈ పరిశ్రమ ఎక్కువగా వ్యక్తిగత నైపుణ్యాలు, అవస్థాపన సౌకర్యాలపై ఆధారపడి ఉంటుంది. ఈ కారణాలతోనే సాంకేతిక పరిశ్రమలన్నీ భారత్‌లో దిల్లీ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, పుణె లాంటి నగర ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి.

ఐటీలో పెట్టుబడులు

భారతీయ ఐటీ పరిశ్రమలోని కీలక సామర్థ్యాలు, బలాలు పెద్ద దేశాల నుంచి గణనీయమైన పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి.

భారత్‌లో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ

మన దేశంలో సమాచార సాంకేతిక విజ్ఞాన రంగానికి అతి ముఖ్యమైన రంగాల్లో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఒకటి.

ఐటీ, ఐటీ ఆధారిత సేవల పరిశ్రమ - మార్కెట్ పరిమాణం, NSPS, ISPR మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సీఆర్‌పీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం

జులై 27
చరిత్రలో ఈనాడు

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ఏర్పాటుకు గుర్తుగా ఏటా జులై 27న 'సీఆర్‌పీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం'గా (CRPF Foundation Day) నిర్వహిస్తారు. సీఆర్‌పీఎఫ్ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేసే సాయుధ పోలీసు దళం. దేశంలో అంతర్గత భద్రతను కాపాడటం దీని బాధ్యత. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగి శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు వాటిని అణచడంలో.. దేశంలో ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో ఇది కీలకంగా వ్యవహరిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్థానిక యంత్రాంగంతో కలిసి ఇది ప్రజలకు సాయం చేస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఇది నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటోంది. అంతేకాక దేశంలోని ప్రముఖ వ్యక్తులకు రక్షణ కల్పించడం, విమానాశ్రయాలు - రైల్వే స్టేషన్లు - అణు విద్యుత్ కేంద్రాలు - ప్రముఖ దేవాలయాల సెక్యూరిటీతోపాటు సరిహద్దు ప్రాంతాల్లో ఉగ్రవాద, తిరుగుబాటు నిరోధ కార్యక్రమాల్లోనూ ఇది ప్రముఖంగా పాల్గొంటోంది. ఇంతటి విశిష్ట దళం - దాని ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.



✦ 246 బెటాలియన్లు, 3,13,634 క్రియాశీల సిబ్బందితో కేంద్ర సాయుధ పోలీసు దళాల్లోనే సీఆర్‌పీఎఫ్ అతిపెద్దదిగా ఉంది. ప్రస్తుతం జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ దీనికి డైరెక్టర్ జనరల్‌గా (2025, జనవరి నుంచి) ఉన్నారు.

చారిత్రక నేపథ్యం:

నాటి బ్రిటిష్ ప్రభుత్వం 1939, జులై 27న 'క్రౌన్ రిప్రజెంటేటివ్ పోలీస్' పేరుతో ఒక సాయుధ దళాన్ని ఏర్పాటు చేసింది. స్వాతంత్ర్య ఉద్యమకారులను అణచడం, స్వయం పాలన కోసం పోరాడే ప్రజా సంస్థల కార్యక్రమాలను ఎదుర్కొని.. రాచరిక రాష్ట్రాలకు సాయం చేయడం దీని ముఖ్య ఉద్దేశం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1949, డిసెంబరు 28న భారత ప్రభుత్వం సీఆర్‌పీఎఫ్ చట్టాన్ని ఆమోదించి, దీని పేరును అధికారికంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌గా మార్చింది.

ముఖ్యమైన మిషన్స్:

భారత్, పాక్ విడిపోయాక దాయాది దేశం నుంచి గుజరాత్, రాజస్థాన్ మీదుగా మన దేశంలోకి ప్రవేశించే అక్రమ వలసదారులను అరికట్టడంలో ఇది కీలకంగా వ్యవహరించింది.

▌ 1962లో అరుణాచల్ ప్రదేశ్‌లో చైనాతో జరిగిన యుద్ధంలో; 1965, 1971లో ఇండో-పాక్ వార్‌లో సీఆర్‌పీఎఫ్ భారత సైన్యానికి సాయం చేసింది.

▌ 1980 దశకంలో పంజాబ్‌లో ఉగ్రవాదాన్ని, 1990 కాలంలో త్రిపురలో తిరుగుబాటును అణచడంలో ముఖ్యపాత్ర పోషించింది.

▌ 2001, డిసెంబరు 13న పార్లమెంట్‌పై దాడిని, 2005, జులైలో అయోధ్యపై దాడిని అడ్డుకుంది.

▌ 1999లో ఒడిశాలో సంభవించిన తీవ్ర తుపాను, 2001 గుజరాత్ భూకంపం, 2004 సునామీ, 2005 జమ్మూకశ్మీర్ భూకంపం లాంటి ప్రకృతి విపత్తుల సమయాల్లో సీఆర్‌పీఎఫ్ సహాయ చర్యలు అందించింది.

▌ 2020 జులై 1 నుంచి 2025 జూన్ 30 వరకు సీఆర్‌పీఎఫ్ 775మంది నక్సలైట్స్/ ఉగ్రవాదులను మట్టుబెట్టింది. 7282 మందిని అరెస్ట్ చేసింది.

నోటిఫికేషన్స్

అప్రెంటిస్ పోస్టులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్), నాసిక్ డివిజన్‌లో ఇంజినీరింగ్, డిప్లొమా, నాన్‌టెక్నికల్ గ్రాడ్యుయేట్ల కోసం అప్రెంటిస్ శిక్షణ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 278. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 10 ఆగస్టు 2025.

సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) గోరఖ్‌పుర్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 50. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 7, 8 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జులై 27) చివరి తేదీ

❖ ఇండియన్ కోస్ట్ గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్ రిక్రూట్‌మెంట్ - 170 పోస్టులు. గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులు అర్హులు.

❖ తెలంగాణ మెడికల్ & హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ - 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు. బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (బీడీఎస్) లేదా సమానమైన అర్హత కలిగి ఉన్నవారు అర్హులు.

❖ రైట్స్ లిమిటెడ్‌లో 18 మేనేజర్ ఉద్యోగాలు. డిగ్రీ (సివిల్ ఇంజినీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Coding - Decoding

Railway Exams
Reasoning

1. In a certain code language, BOND is coded as 2965 and NODE is coded as 9653. What is the code for B?
A) 2 B) 3 C) 5 D) 9

2. In a certain code language, 'travel long distance' is coded as 'xr ml zp' and 'distance makes memories' is coded as 'zp qt hu'. How is 'distance' coded in the given language?
A) xr B) zp C) qt D) ml

3. In a certain code language, SING is coded as 4197 and GAIN is coded as 7914. What is the code for G?
A) 9 B) 1 C) 7 D) 4

4. In a certain code language, HAND is coded as 3475 and HEAD is coded as 3415. What is the code for N?
A) 3 B) 4 C) 5 D) 7

5. In a certain code language, 'Books are my passion' means '4126', 'Reading is my hobby' means '8396', 'My passion' means '26', and 'Books reading' means '41'. What number is the code for 'passion'?
A) 1 B) 2 C) 4 D) 6

6. If in a certain code, 'jum fer pok' means 'milk is white'; 'pok sel mer' means 'white and pure'; 'fer sel lon' means 'is and fresh'. Which of the following means 'milk is pure' in that code?
A) lon mer jum B) mer fer pok
C) jum mer sel D) jum fer mer

7. If in a certain code, 'ran sop tik' means 'flowers are pretty'; 'sop hal kin' means 'are very bright'; 'tik hal mok' means 'pretty very garden'. Which of the following means 'are very pretty' in that code?
A) tik hal sop B) ran hal sop
C) sop tik mok D) kin tik hal

8. If in a certain code, 'pen lik tor' means 'book is new'; 'lik tor sel' means 'is new copy'; 'pen sel dok' means 'book copy old'. Which of the following means 'book is copy' in that code?
A) pen lik sel B) pen tor sel
C) dok lik sel D) pen sel lik

9. In a certain code language, 'mina kala toro zari' means 'John plays cricket daily', 'kala zari mona' means 'cricket daily fun', and 'zari fula nimo toro' means 'John has cricket bat'. What is the code for John?
A) toro B) kala
C) zari D) mina

10. In a certain code language, 'luto rami jeko tan' means 'Sara eats fresh fruit', 'jeko tan siro' means 'fruit is fresh', 'tan como rami jenk' means 'Sara likes red fruit'. What is the code for fruit?
A) jeko B) rami
C) tan D) luto

11. In a certain code language, "mira selo jita pom" means "Ankit drives fast car", "selo pom tika" means "car is fast", "pom mira nopa jenk" means "Ankit has red car". What is the code for Ankit?
A) mira B) selo
C) pom D) jita

12. In a certain code language, "copa diri jeno tula" means "Priya reads science books", "diri tula mavo" means "science is books", "juno copa mika tula" means "Priya writes good books". What is the code for Priya?
A) tula B) copa
C) jeno D) diri

13. In a certain code language, "nita ramo kilo juti" means "Shyam cooks tasty food", "ramo juti sola" means "food is tasty", "juti vako kilo nita" means "Shyam makes spicy food". What is the code for tasty?
A) ramo B) juti
C) kilo D) nita

14. In a certain code language: 7365 means "Birds fly in sky". 6249 means "Sky is very blue". What is the code for the word "sky"?
A) 6 B) 2 C) 4 D) 9

15. In a certain code: "zen tor lak" means "cold and sweet", "mur lak sin" means "water is sweet", "mur zen kin" means "cold is pure". Which code represents "water is cold"?
A) mur tor sin B) mur zen sin
C) mur lak kin D) mur zen lak

16. "lom pix nar" means "tree has flowers", "lom dar tik" means "tree gives shade", "nar tik zen" means "flowers gives fragrance". Which code means "tree gives flowers"?
A) lom nar tik B) lom pix zen
C) tik nar dar D) lom dar nar

17. "raj tok mip" means "sun is hot", "vok tok lam" means "weather is sunny", "raj vok pin" means "sun and weather". What is the code for "hot sunny weather"?
A) lam raj tok
B) vok mip lam
C) lam mip raj
D) vok raj mip

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

సైనికుల ధైర్యసాహసాలకు సెల్యూట్: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: దేశ రక్షణలో ధైర్యసాహసాలు ప్రదర్శిస్తున్న వీర సైనికులకు సెల్యూట్ చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా తెలిపారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళి అర్పించారు. కార్గిల్ విజయం భారత కీర్తి ప్రతిష్ఠల్ని విశ్వవ్యాప్తం చేసిందని, ప్రతి భారతీయుడిలో స్ఫూర్తి నింపిందని కొనియాడారు.

‘ఫ్యాప్టో నేత సురేష్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి’

ఈనాడు, అమరావతి: ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) తిరుపతి జిల్లా ఛైర్మన్ సురేష్‌పై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఫ్యాప్టో రాష్ట్ర ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, చిరంజీవి డిమాండ్ చేశారు. ‘బదిలీల సందర్భంగా చిత్తూరు జిల్లా విద్యాధికారి ఉపాధ్యాయులను మానసికంగా వేధించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ఉన్న డీఈవోలు ఉత్తర్వులను అమలు చేస్తే చిత్తూరు డీఈవో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. ఈ విషయాన్ని పాఠశాల విద్యా డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. పైగా ఉపాధ్యాయుల వేధిస్తున్నారని ప్రశ్నించిన ఫ్యాప్టో తిరుపతి జిల్లా ఛైర్మన్ సురేష్‌ను సస్పెండ్ చేశారు’ అని విమర్శించారు.

విద్యారంగం అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కృషి

కేంద్ర మంత్రి బండి సంజయ్

హుస్నాబాద్, న్యూస్‌టుడే: విద్యారంగం అభివృద్ధికి మోదీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. తెలంగాణలోని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పదో తరగతి విద్యార్థులకు ‘మోదీ కానుక’ పేరిట సైకిళ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. భాజపా ప్రభుత్వం 11 ఏళ్లలో విద్యారంగానికి రూ.8 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు విద్య, వైద్య రంగాల్లో సహకారం అందించాలని ప్రధాని సూచించారని, అందుకే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ‘ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి-సైకిళ్లను బహుమతిగా పొందండి’ అనే నినాదంతో తాను ఎంపీగా ఉన్నంతకాలం ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తానని పేర్కొన్నారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు అందించే సీఎస్సార్ నిధులతో ఈ సైకిళ్లు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో నర్సరీ నుంచి 6వ తరగతి వరకు చదివే విద్యార్థులకు స్కూల్‌బ్యాగు, నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్టీల్ సీళ్ల బాటిళ్లతో కూడిన మోదీ కిట్లు అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నీటిశుద్ధి ప్లాంటు, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు.



స్వల్పకాల సంభాషణలూ శాశ్వత ముద్ర వేస్తాయ్

మనతో ఎక్కువ సమయం గడిపే వ్యక్తులే మనపై అత్యధిక ప్రభావం చూపుతారనుకోవడం పొరపాటు. కొన్నిసార్లు స్వల్పకాల సంభాషణలు, నిమిషాల భేటీలు, తాత్కాలిక స్నేహాలు కూడా మన గుండెలపై శాశ్వత ముద్ర వేస్తాయి. వాటి ప్రాముఖ్యతను చెప్పేందుకు కాలాన్ని కొలమానంగా తీసుకోలేం.

- అనుష్కాసోహం బత్వాల్, వ్యాపారవేత్త

శాసనసభ, మండలి సంయుక్త కమిటీలు ఇవే

ఈనాడు, అమరావతి: శాసనమండలి, శాసనసభ ఉభయ సభల సంయుక్త కమిటీలు తొమ్మిది, శాసనమండలికి ప్రత్యేకంగా ఏడు కమిటీలను శనివారం ప్రకటించారు.

ఉభయ సభల సంయుక్త కమిటీలు

సదుపాయాల కమిటీ

ఛైర్మన్: శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు

సభ్యులు: శాసనసభ నుంచి ఎన్.అమరనాథరెడ్డి, గుమ్మనూరు జయరాం, నిమ్మకాయల చినరాజప్ప, పంచకర్ల రమేష్‌బాబు, పంతం వెంకటేశ్వరరావు, యరపతినేని శ్రీనివాసరావు, వెంగళ్రెడ్డి రామకృష్ణబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, శాసనమండలి నుంచి చంద్రగిరి ఏసురత్నం, దువ్వారపు చిన్నగోవిందరెడ్డి, వంకా రవీంద్రనాథ్.

వన్యప్రాణులు - పర్యావరణ పరిరక్షణ కమిటీ

ఛైర్మన్: శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు

సభ్యులు: శాసనసభ నుంచి నందమూరి బాలకృష్ణ, ఆరణి శ్రీనివాసులు, కురుగొండ్ల రామకృష్ణ, గొండు శంకర్‌రావు, చింతమనేని ప్రభాకర్, పులపర్తి వెంకట మణిప్రసాద్, బుడ్డా రాజశేఖరరెడ్డి, వేగేశన నరేంద్రవర్మరాజు, శాసనమండలి నుంచి దేవసాని చిన్న గోవిందరెడ్డి, బి.తిరుమలనాయుడు, పాలవలస విక్రాంత్.

ఎస్సీ సంక్షేమ కమిటీ

ఛైర్మన్: వర్ల కుమార్‌రాజా

సభ్యులు: శాసనసభ నుంచి కొండ్రు మురళీమోహన్, కొలికపూడి శ్రీనివాసరావు, తాటిపర్తి చంద్రశేఖర్, దేవ వరప్రసాద్, బొనెల విజయచంద్ర, ఎంఎస్ రాజు, ఎస్.శ్రావణ్‌కుమార్, బీవీఎ విజయ్‌కుమార్, శాసనమండలి నుంచి కావలి గ్రీష్మ, బొమ్మి ఇజ్రాయెల్, మేరిగ మురళీధర్.

గిరిజన సంక్షేమ కమిటీ

ఛైర్‌పర్సన్: మిరియాల శిరీషాదేవి

సభ్యులు: శాసనసభ నుంచి కె.ఆదిమూలం, చిర్రి బాలరాజు, నిమ్మక జయకృష్ణ, జి.జయసూర్య, బడేటి రాధాకృష్ణయ్య, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, కె.మురళీమోహన్, రేగం మత్స్యలింగం, శాసనమండలి నుంచి అనంత సత్య ఉదయభాస్కర్, డాక్టర్ కుంభా రవిబాబు, పేరాబత్తుల రాజశేఖరం

మైనారిటీ సంక్షేమ కమిటీ

ఛైర్మన్: మహ్మద్ నజీర్ అహ్మద్

సభ్యులు: దగ్గుపాటి ప్రసాద్, ప్రత్తిపాటి పుల్లారావు, బొజ్జల సుధీర్‌రెడ్డి, బోడే ప్రసాద్, సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, బి.విరూపాక్షి, షాజహాన్ బాషా, సుందరపు విజయ్‌కుమార్, శాసనమండలి నుంచి కాంట్రాక్టర్ ఇసాక్ బాషా, మహ్మద్ రుహుల్లా, సి.రామచంద్రయ్య

బీసీ సంక్షేమ కమిటీ

ఛైర్మన్: బీద రవిచంద్ర

సభ్యులు: శాసనసభ నుంచి చదలవాడ అరవింద బాబు, ఆదిరెడ్డి శ్రీనివాస్, కందికుంట వెంకట ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, కొణతాల రామకృష్ణ, బగ్గు రమణమూర్తి, మద్దులూరి మాలకొండయ్య, వనమాడి వెంకటేశ్వరరావు, కేఈ శ్యామ్‌కుమార్, శాసనమండలి నుంచి నర్తు రామారావు, సిపాయి సుబ్రహ్మణ్యం

స్త్రీ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ

ఛైర్‌పర్సన్: గౌరు చరితారెడ్డి

సభ్యులు: శాసనసభ నుంచి గల్లా మాధవి, డాక్టర్ దాసరి సుధ, నెలవల విజయశ్రీ, పరిటాల సునీతమ్మ, పల్లె సింధూరారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, లోకం నాగ మాధవి, వరుపుల సత్యప్రభ.. మండలి నుంచి టి.కల్పలత, కావలి గ్రీష్మ ప్రసాద్, డాక్టర్ ఎ.మధుసూదన్

సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ

ఛైర్మన్: తోట త్రిమూర్తులు

సభ్యులు: డాక్టర్ ఎం.ఉగ్ర నరసింహారెడ్డి, గాలి భానుప్రకాశ్, కన్నా లక్ష్మీనారాయణ, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, బండారు శ్రావణిశ్రీ, మండలి బుద్ధప్రసాద్, శాసనమండలి నుంచి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి

గ్రంథాలయ కమిటీ

ఛైర్మన్: పొన్నపురెడ్డి రామసుబ్బా రెడ్డి,

సభ్యులు: జేసీ అస్మిత్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, వెనిగండ్ల రాము, కేఈ శ్యామ్‌కుమార్, సుందరపు విజయ్‌కుమార్, శాసన మండలి నుంచి వంకా రవీంద్రనాథ్, సోము వీర్రాజు

శాసనమండలి కమిటీలు

సభానియమాల కమిటీ

ఛైర్మన్: కొయ్యే మోషేనురాజు

సభ్యులు: ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, దేవసాని చిన్నగోవిందరెడ్డి, బి.తిరుమలనాయుడు, మురుగుడు హనుమంతరావు, యల్లారెడ్డిగారి శివరామిరెడ్డి, బీద రవిచంద్ర

తెలుగు భాష, సంస్కృతి అభివృద్ధిపై కమిటీ

ఛైర్మన్: కొయ్యే మోషేనురాజు

సభ్యులు: చంద్రగిరి ఏసురత్నం, టి.కల్పలత, తూమాటి మాధవరావు, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎస్.మంగమ్మ, సోము వీర్రాజు

ప్రివిలేజెస్ కమిటీ

ఛైర్మన్: బి.తిరుమలనాయుడు

సభ్యులు: కృష్ణ రాఘవ జయేంద్ర భరత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పి.రవీంద్రబాబు, తలశిల రఘురామ్, ఆర్.రమేశ్‌యాదవ్

నైతిక విలువల (ఎథిక్స్) కమిటీ

ఛైర్మన్: భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

సభ్యులు: దేవసాని చిన్నగోవిందరెడ్డి, బొర్రా గోపిమూర్తి, మురుగుడు హనుమంతరావు, యల్లారెడ్డిగారి శివరామిరెడ్డి

ప్రభుత్వ హామీల కమిటీ

ఛైర్మన్: కాంట్రాక్టర్ ఇసాక్‌బాషా

సభ్యులు: ఆలపాటి రాజేంద్రప్రసాద్, కవురు శ్రీనివాస్, ఎంవీ రామచంద్రారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి

అర్జీల కమిటీ

ఛైర్‌పర్సన్: మయాన జకియాఖానం

సభ్యులు: ఆలపాటి రాజేంద్రప్రసాద్, గాదె శ్రీనివాసులునాయుడు, తూమాటి మాధవరావు, పి.రవీంద్రబాబు, ఎం.మురళీధర్

సభాసమక్షంలో ఉంచే పత్రాల కమిటీ

ఛైర్మన్: పి.రవీంద్రబాబు

సభ్యులు: కుడుపూడి సూర్యనారాయణరావు, పాలవలస విక్రాంత్, పేరాబత్తుల రాజశేఖరం

ఒక్క టీకా.. తప్పిస్తుంది పెద్ద ముప్పు


ఏటా దేశంలో 1.23 లక్షల సర్వైకల్ క్యాన్సర్ కేసులు



ఈనాడు, హైదరాబాద్: అవగాహన లేమి.. బిడియం.. నిర్లక్ష్యం.. మహిళల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. పూర్తిగా నియంత్రించే వీలున్న గర్భాశయ ముఖద్వార(సర్వైకల్) క్యాన్సర్‌తో ఏటా 77 వేల మంది అతివలు మృత్యువాత పడుతున్నారు. ఏటా దేశవ్యాప్తంగా 1.23 లక్షల సర్వైకల్ క్యాన్సర్లు నమోదవుతున్నాయి. ఎన్ని ఆధునిక సేవలు అందుబాటులోకి వచ్చినా మహిళల ఆరోగ్యం ప్రమాదంలో ఉన్నట్లు ఈ గణాంకాలే చాటిచెబుతున్నాయి. దీనికి హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) కారణం. హెచ్‌పీవీలో వందకుపైగా రకాలుండగా కొన్ని ప్రమాదకరమైనవి. ఇవే సర్వైకల్‌తోపాటు నోరు, గొంతు, పురుషాంగం, పాయువు.. తదితర క్యాన్సర్లకూ హేతువులు. ఈ వైరస్ నియంత్రణకు ప్రస్తుతం పూర్తిస్థాయి టీకా అందుబాటులో ఉంది. దీన్ని 9 నుంచి 16 ఏళ్లలోపువారికి రెండు డోసులు ఇవ్వడం ద్వారా హెచ్‌పీవీ కారణంగా వచ్చే అన్నిరకాల క్యాన్సర్లను నియంత్రించవచ్చని చెబుతున్నారు వైద్యులు. ప్రస్తుతం 15 శాతం మంది మాత్రమే ఈ టీకా తీసుకుంటున్నారు. గతేడాది హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆసుపత్రిలో 1,262 కేసులు నమోదయ్యాయి. ఇక్కడకు వచ్చే బాధితుల్లో 70-80 శాతం మంది మహిళలకు వ్యాధి బాగా ముదిరిపోయే దశలో ఉంటోంది. దీంతో వైద్యులూ ఏమి లేకపోతున్నారు. ‘చిన్నప్పుడు తీసుకోకపోతే మహిళలు 40 ఏళ్లలో కూడా టీకా తీసుకోవచ్చు. తొలుత హెచ్‌పీవీ పరీక్షలు చేసి టీకా ఇస్తారు. సర్వైకల్ క్యాన్సర్ సోకిన తర్వాత తీవ్రత పెరగడానికి 10 ఏళ్లు పడుతుంది. ఈలోపే అప్రమత్తమై చికిత్స తీసుకోవాలి. దీన్ని జాతీయ టీకా కార్యక్రమంలో చేరిస్తే ప్రతి ఒక్కరికి ఉచితంగా అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది’ అని కిమ్స్ గైనిక్ విభాగాధిపతి డా.ఎం.త్రిపుర సుందరి అభిప్రాయపడ్డారు.

మోసాలే పెట్టుబడి

- ఆ పేరుతో పేట్రేగుతున్న సైబర్ కేటుగాళ్లు
- ఆరు నెలల్లో రూ.681 కోట్లు కొల్లగొట్టారు



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొత్తు రూ.681 కోట్లు. అంటే సగటున రోజుకు రూ.3.78 కోట్లు. అమాయకులను ఏ స్థాయిలో దోచుకుంటున్నారో చెప్పే గణాంకాలివి. కేవలం పెట్టుబడి పేరిట మోసాలే రోజుకు సగటున 50 వరకు నమోదవుతున్నాయి. ఫలానా సంస్థలో పెట్టుబడి పెడితే కొద్ది రోజుల్లోనే రెట్టింపు లాభాలు వస్తాయని ఆశపెట్టి రూ.కోట్లలో కొల్లగొడుతున్నారు. ఇటీవల ఒక విశ్రాంత ఉద్యోగి నుంచి ఏకంగా రూ.12 కోట్లు లాగేసుకున్నారు. రూ.కోటిపైన పోగొట్టుకున్న వారి సంఖ్య పదుల్లో ఉంది. అందుకే గతంతో పోల్చితే సైబర్ నేరాల సంఖ్య తగ్గినట్లు కనిపిస్తున్నా దోచుకుంటున్న సొమ్ము మాత్రం భారీగా పెరుగుతోంది.

గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది తగ్గిన సైబర్ నేరాలు

మోసం రకం	2024 (జనవరి-ఏప్రిల్)	2025 (జనవరి-జూన్)	తగ్గింపు (శాతంలో)
క్రెడిట్‌కార్డు రివార్డులు	1735	459	74
పార్సిల్ వచ్చింది			
పన్ను కట్టాలని	642	258	60
కేవైసీ పేరిట	1398	566	60
డిజిటల్ అరెస్టులు	1631	905	45
సెక్స్‌టార్షన్	954	560	41
కస్టమర్ కేర్	7958	5212	35
ఓఎల్ఎక్స్	860	605	30
పెట్టుబడి	10,722	8,866	18

◆ అన్నీ తగ్గినప్పటికీ రుణాలు ఇప్పిస్తామని చేసే మోసాలు నిరుడు 5,999 జరిగితే ఈసారి 6,951 జరిగి 14% పెరుగుదల నమోదైంది.

■ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రంలో సైబర్‌నేరాలకు సంబంధించి 37,958 ఫిర్యాదులు వచ్చాయి.

◆ వీటిలో పెట్టుబడి మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు 8,866, రుణాలు ఇప్పిస్తామని డబ్బు కొట్టేసినవి 6,951 ఉన్నాయి.

◆ మొత్తం ఫిర్యాదుల్లో ఈ రెండు మోసాలకు సంబంధించినవే 42% ఉండటం గమనార్హం.

విద్యావంతులే బలి పశువులు

మిగతా సైబర్ నేరాల్లో అమాయకులు బలవుతుంటారు. ఉదాహరణకు కేవైసీ పరిశీలన పేరుతో బ్యాంకు అధికారులమని చెప్పి ఫోన్ చేసినప్పుడు దాని గురించి తెలియనివారు ఖాతా వివరాలు చెప్పి బుట్టలో పడుతుంటారు. పెట్టుబడి మోసాల్లో బాగా చదువుకున్న వారు, స్టాక్ మార్కెట్ మీద అవగాహన ఉన్నవారే బాధితులవుతున్నారు. రాత్రికిరాత్రి రెట్టింపు లాభాలు ఎప్పుడూ రావని తెలిసినా అత్యాశకుపోయి మోసపోతున్నారు.

సరోగసీ ముసుగులో దారుణం

- డీఎన్ఏ పరీక్షతో మోసం వెలుగులోకి
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

ఈనాడు, హైదరాబాద్; రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: పిల్లల కోసం ఎదురుచూస్తున్న దంపతుల్ని సరోగసీ పేరుతో మోసగించిన సంతాన సాఫల్య కేంద్రం బాగోతం రాజధానిలో బయటపడింది. దీనిపై సికింద్రాబాద్‌లోని గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసులు వైద్యురాలిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేసు వివరాలివీ.. రాజస్థాన్‌కు చెందిన దంపతులు నాలుగేళ్లుగా సికింద్రాబాద్‌లో ఉంటున్నారు. సంతానలేమితో మూడేళ్ల క్రితం సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాన్ని సంప్రదించారు. సరోగసీ ద్వారా పిల్లలకు అవకాశం ఉందని నిర్వాహకురాలైన డాక్టర్ నమ్రత వారికి చెప్పారు. రూ.30 లక్షల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. గతేడాది ఆగస్టులో మొత్తం డబ్బు చెల్లించారు. బిడ్డ జన్మించిన తర్వాత తమతో పాటు సరోగసీకి అంగీకరించిన మహిళ డీఎన్ఏ నమూనాలు సేకరించి.. పోల్చాలని దంపతులు షరతు విధించారు. ఈ ఏడాది బిడ్డ జన్మించింది. షరతు ప్రకారం డీఎన్ఏ పరీక్షలు చేయించాలని భార్యాభర్తలు నమ్రతను కోరగా ఆమె తరచూ వాయిదాలు వేస్తున్నారు. దిల్లీలో డీఎన్ఏ పరీక్షలు చేయించుకోగా.. తల్లిదండ్రుల డీఎన్ఏతో బిడ్డ డీఎన్ఏ సరిపోలలేదు. జూన్ రెండోవారంలో ఆ వైద్యురాలిని సంప్రదించి బిడ్డ తమకు జన్మించలేదని.. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు ఇవ్వాలని చెప్పారు. తప్పును అంగీకరించిన వైద్యురాలు.. సమస్యను పరిష్కరించేందుకు సమయం ఇవ్వాలని అడిగారు. కానీ తర్వాత నుంచి ఆచూకీ లేకుండా పోయారు. తాము మోసపోయామని భావించి దంపతులు గోపాలపురం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదైంది.

హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడల్లో సోదాలు

యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రంలో శనివారం ఉత్తర మండలం డీసీపీ సాధనరష్మి పెరుమాళ్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వీర్య సేకరణ, ఐవీఎఫ్, సరోగసీ విధానం తదితర అంశాలను అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఇదే సమయంలో విశాఖపట్నం, విజయవాడల్లోనూ సోదాలు చేపట్టారు. ఏపీ, తెలంగాణ, ఒడిశా, కోల్‌కతాలలో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీవారు బ్రాంచీలు నిర్వహిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఆసుపత్రి నిర్వాహకులపై గతంలో కేపీహెచ్‌బీ, గోపాలపురం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

కాపాడమంటూ.. కన్నీళ్లు పెడుతూ..

- రోడ్డు ప్రమాదానికి గురై..నరకయాతన అనుభవించిన తండ్రీకుమార్తెలు
- ఆసుపత్రికి చేర్చేలోపే మృత్యువాత

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ఒక్కగానొక్క కుమార్తె.. అమ్మకు టాటా చెప్పి నాన్నతో కలిసి సంతోషంగా కళాశాలకు బయలుదేరింది. గమ్యం చేరేలోపే మృత్యువు లారీ రూపంలో వారిద్దరినీ కబళించింది. మరణానికి ముందు ఆ తండ్రీకుమార్తెలు కాపాడండి అంటూ చేసిన ఆర్తనాదాలు చూపరులను కలచివేశాయి. ఈ హృదయవిదారక ఘటన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ కూడలిలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం పెద్దషాపూరుకు చెందిన మచ్చేందర్(48) స్థిరాస్తి వ్యాపారి. భార్య లావణ్య, కుమార్తె మైత్రి(21)లతో కలిసి ఫరూక్‌నగర్‌లోని శ్రీనివాసకాలనీలో నివాసం ఉంటున్నారు. శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న కుమార్తెను బస్సెక్కించడానికి ఆయన ఉదయం 7 గంటలకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈ క్రమంలో పట్టణ కూడలి వద్ద వాహనాన్ని మలుపు తిప్పి ఓ ట్యాంకర్‌ను దాటి వెళుతుండగా అది ప్రమాదవశాత్తు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన తండ్రి దూరంగా పడిపోగా.. కుమార్తె లారీ చక్రాల కింద ఇరుక్కుపోయింది. ఓవైపు క్షతగాత్రుడైన తండ్రి...మరోవైపు చక్రాల కింద నలిగిపోయి ఆర్తనాదాలు పెడుతున్న కుమార్తె.. ఇద్దరూ కాపాడండి..కాపాడండి అంటూ వేడుకోవడం స్థానికుల్ని కలచివేసింది. ఈ పరిస్థితుల్లో మైత్రి తమ ఇంటికి సమాచారం ఇవ్వాలంటూ అక్కడున్న ఓ వ్యక్తిని కోరగా ఆయన ఫోన్ చేశారు. అందరూ కలిసి వారిని బయటకు తీసి ఆసుపత్రికి చేర్చేలోపే ఇద్దరూ మరణించారు. భర్త, కుమార్తెలను ఒకేసారి కోల్పోయిన లావణ్య గుండెలవిసేలా రోదించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని.. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



మచ్చేందర్




మైత్రి

తెలంగాణలో రెండో విడత కౌన్సెలింగ్‌కు

30,941 బీటెక్ సీట్లు

- తొలి విడతలో 59,980 సీట్లు భర్తీ



ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్‌కు 30,941 సీట్లు అందుబాటులో ఉన్నాయి. తొలి విడతలో 59,980 సీట్లు భర్తీ కాగా... దాదాపు 23 వేల సీట్లు మిగిలిపోయాయి. తాజాగా అదనపు సీట్లను మంజూరు చేయడంతో భర్తీకాని సీట్ల సంఖ్య పెరిగింది. రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు ఆదివారం వరకు మాత్రమే గడువుంది. తొలి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారు అంతకంటే మెరుగైన కళాశాల/బ్రాంచి కోసం ఆప్షన్లు ఇచ్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రెండో విడతలో కొత్త సీటు దక్కితే... తొలి విడతలో వచ్చిన సీటు ఉండదు. ఆ సీటు మరొకరికి కేటాయిస్తారని అధికారులు తెలిపారు. రెండో విడత సీట్లను ఈ నెల 30న, లేదంటే ఆలోపు కేటాయిస్తారు.

మొత్తం 48 కోర్సులు: ఇప్పటివరకు 47 ఇంజినీరింగ్ కోర్సులుండగా తాజాగా వాటి సంఖ్య 48కి చేరింది. ఈసారి ఒక ప్రముఖ కళాశాలలో రోబోటిక్స్ అండ్ ఏఐ అనే కోర్సును ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో కన్వీనర్, బీ-కేటగిరీ కలిపి మొత్తం 1,16,877 బీటెక్ సీట్లున్నాయి. తొలి విడతలో ఆ సంఖ్య 1,07,444 మాత్రమే.

తాజాగా కన్వీనర్ కోటాలో వివిధ బ్రాంచీల్లో అందుబాటులో ఉన్న సీట్లు

కోర్సు	సీట్లు	కోర్సు	సీట్లు
సీఎస్ఈ	9,281	ఏఐ అండ్ డేటా సైన్స్	417
ఐటీ	930	ఈసీఈ	4,501
సీఎస్ఈ(ఏఐ-ఎంఎల్)	4,42	ఈఈఈ	2,511
సీఎస్ఈ(డేటా సైన్స్)	2,595	సివిల్	1,719
సీఎస్ఈ(సైబర్)	612	మెకానికల్	1,878

జలపాతం చూసేందుకు వెళ్లి అభయారణ్యంలో చిక్కుకున్న విద్యార్థులు

సురక్షితంగా బయటికి తీసుకొచ్చిన అధికారులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపురం-వాజేడు మండలాల సరిహద్దు అభయారణ్యంలోని బొల్లారం (మహితాపురం) సమీప గడిచెరువు జలపాతం సందర్శనకు వెళ్లిన విద్యార్థులు దట్టమైన అటవీ ప్రాంతంలో దారితప్పారు. ఆందోళన చెంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమై అటవీశాఖ అధికారులతో కలిసి గాలింపు చేపట్టి సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. వరంగల్ నిట్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు యువతులు, నలుగురు యువకులు గడిచెరువు జలపాతం చూసేందుకు శనివారం వచ్చారు. మహితాపురం వద్ద కారును నిలిపి సుమారు 6 కి.మీ దూరంలోని అటవీ ప్రాంతానికి కాలినడకన వెళ్లారు. సాయంత్రం 4:30 గంటలకు అక్కడికి చేరుకున్నారు. చీకటి పడ్డాక తిరుగు ప్రయాణంలో అడవిలో దారి తప్పి గుట్టపైకి వెళ్లారు. దీంతో వారు రాత్రి 8 గంటలకు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అటవీ అధికారులు సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. సెక్షన్ అధికారి దేవయ్య, బీట్ అధికారులు ప్రణవి, సరళ, బేస్ క్యాంపు సిబ్బంది రెండు గంటల పాటు అటవీ ప్రాంతంలో గాలించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా విద్యార్థుల వద్దకు చేరుకుని అక్కడి నుంచి వారిని బొల్లారం గ్రామానికి చేర్చారు. నిషేధించిన జలపాతం సందర్శనకు రావడంపై వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావులు వారిని ప్రశ్నించారు. అల్పాహారం, మంచినీళ్లు అందించారు.

తెలంగాణకు నష్టం చేసే బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణకు నష్టం చేసే బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే జాగృతి ఊరుకోబోదని అన్నారు. శనివారం జాగృతి ఆధ్వర్యంలో ‘లీడర్’ పేరిట కొంపల్లిలో నిర్వహించిన రాజకీయ శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. ‘మారుతున్న కాలానికి అనుగుణంగా జాగృతి తన పంథా మార్చుకుంటోంది. ఎవరూ నాయకత్వ లక్షణాలతో పుట్టరు.. నేర్చుకుంటూ, మార్చుకుంటూ ముందుకెళ్లేవాడే నాయకుడు. సామాజిక స్పృహ కలిగిన రాష్ట్రాల్లో మన రాష్ట్రం 11వ స్థానంలో ఉన్నట్లు ఒక సర్వేలో తేలింది. సామాజిక నేపథ్యం లేకుండా ఏ జాతి మనుగడ సాధించలేదు. సాంస్కృతిక నేపథ్యం లేని జాతి.. పునాది లేని భవనం లాంటిది. దాన్ని పరిరక్షించడమే ఆలోచనగా జాగృతి పని చేస్తోంది’ అని అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టామని, జాగృతి ద్వారా రాష్ట్రంలో చురుకైన నాయకత్వాన్ని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

మందకృష్ణ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాకారం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశంస

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాల కిందట మారుమూల గ్రామంలో ఉదయించిన పోరాటం తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలకూ పాకడంతో ఎస్సీ వర్గీకరణ కల సాకారమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. భాజపా కూకట్‌పల్లి ఇన్‌ఛార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో శనివారం న్యూబోయిన్‌పల్లిలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ‘అలయ్-బలయ్’ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ‘‘నేను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చ జరిగేది. మందకృష్ణ చేస్తున్న పోరాటాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లా. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన ‘విశ్వరూప మహాసభ’కు ప్రధాని మోదీ హాజరైన సందర్భంలో ‘మీ ఉద్యమంలో నేనూ ఒక కార్యకర్తను అవుతాను’ అని ఆయన హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఎస్సీ వర్గీకరణ కోసం ప్రత్యేకంగా మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించారు’’ అని పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మందకృష్ణను ప్రధాని మోదీ అక్కున చేర్చుకున్నారని గుర్తుచేశారు. వర్గీకరణ పోరాటం ముగియడంతో ఇప్పుడు దివ్యాంగులకు పింఛన్ల అమలు కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టి అలుపెరగని పోరాటయోధుడిగా నిలిచారని అభినందించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, ఈటల, భాజపా నేతలు, కవులు, కళాకారులు మందకృష్ణ మాదిగను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద తదితరులు పాల్గొన్నారు.



మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి, చిత్రంలో ఈటల రాజేందర్ తదితరులు

భారత్‌లో యూపీఐ డిజిటల్ విప్లవం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో యూపీఐ ద్వారా భారత్ డిజిటల్ విప్లవం సాధించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ‘ఎక్స్’లో ఈ మేరకు పోస్టు చేశారు. భారత్ ఆర్థిక స్వావలంబన సాధించిందని, ఈ ఏడాది జూన్‌లో 1,839 కోట్ల యూపీఐ లావాదేవీల ద్వారా రూ.24 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయని వెల్లడించారు. దేశంలో దాదాపు 85 శాతం డిజిటల్ చెల్లింపులకు యూపీఐ ఆధారమన్నారు. రోజూ జరిగే 64 కోట్లకు పైగా లావాదేవీల్లో ‘వీసా’ కంటే యూపీఐ ముందంజలో ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

అనిశా వలకు చిక్కినట్లే చిక్కి!

రూ.50 వేలు తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి పరార్



పంచాయతీ కార్యదర్శి సురేందర్

నందిగామ, న్యూస్‌టుడే: అది శంషాబాద్‌లోని ఓ హోటల్ సమీపంలోని రద్దీ కూడలి. అక్కడ ఓ వ్యక్తి నుంచి పంచాయతీ ఉద్యోగి ఒకరు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (అనిశా) అధికారులు అతడిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. వెంటనే అతడు లంచం డబ్బుతో పరారయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఫిర్యాదుదారు ఓ భవనం నిర్మిస్తున్నాడు. దీనికి సంబంధించి నోటీసులు జారీ చేయకుండా ఉండేందుకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.సురేందర్ లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేశాడు. శంషాబాద్‌లోని ఓ హోటల్ దగ్గరికి ఆ సొమ్మును తీసురావాలని సూచించాడు. దీంతో బాధితుడు అనిశా అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం రంగంలోకి దిగిన అనిశా బృందం శుక్రవారం మధ్యాహ్నం శంషాబాద్‌లోని హోటల్ దగ్గర మాటువేసింది. ఈ సమయంలో కారులో వచ్చిన పంచాయతీ కార్యదర్శి.. ఫిర్యాదుదారు నుంచి రూ.50 వేలు తీసుకున్నాడు. ఇదంతా గమనిస్తున్న అనిశా అధికారులు సురేందర్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించగా.. అతను తాను వచ్చిన కారులోనే పరారయ్యాడు. కొద్దిసేపు అనిశా బృందం అతడిని వెంబడించింది. నేరుగా సురేందర్ ఇంటికి వెళ్లగా అక్కడ లేడు. స్థానికుల సమాచారంతో అతడి బంధువుల ఇంటి వద్ద ఆరా తీయగా అక్కడా కనిపించలేదు. కానీ అదే ఇంట్లో అతను ప్రయాణించిన కారు, సొమ్ము లభ్యమైంది. శనివారం కొత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో నిందితుడి ఆచూకీ లభ్యంకాలేదు. అతనికోసం గాలిస్తున్నట్లు అనిశా అధికారులు తెలిపారు.